సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

'నేను కలలుగన్న మరో ప్రపంచానికి మహిళలే మూలస్తంభాలు'

పేజీలు: 14+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 7.00 | సంపుటి: 16 సంచిక: 273

SUNDAY Special | ఆదివారం | 24-12-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | MUMBAI | BANGALORE | CHENNAI | DELHI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



ఆస్ట్రేలియా 233/5

భారత మహిళలతో జరుగుతున్న ఏకైక టెస్టులో ఆసీస్ తమ రెండో ఇన్నింగ్స్‌లో 5 వికెట్లకు 233 పరుగులు చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో 406 పరుగులకు ఆలౌటైన భారత్‌కు 187 పరుగుల ఆధిక్యం దక్కింది.

- వివరాలు 12లో



సగానికిపైగా ఓట్లు మనకే పడాలి

వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో విస్తృత ప్రచారం చేసి, ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించి మరిన్ని ఓట్లను ఒడిసిపట్టాలని బీజేపీ పదాధికారుల సమావేశంలో ప్రధాని పార్టీ నేతలకు దిశానిర్దేశం చేశారు.

- వివరాలు 6లో

న్యూస్‌రీల్


నేడు కలెక్టర్లు, ఎస్పీల సదస్సు



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో ఆదివారం కలెక్టర్లు, ఎస్పీలు, జాయింట్ కలెక్టర్ల సదస్సు నిర్వహించనున్నారు. ధరణి సహా ప్రభుత్వ ప్రాధాన్యతలు, ఆరు హామీల అమలుకు తీసుకోవాల్సిన చర్యలపై ఈ భేటీలో సీఎం దిశానిర్దేశం చేయనున్నారు.

- వివరాలు 2లో

అడ్వొకేట్ జనరల్‌గా ఎ.సుదర్శన్‌రెడ్డి



రాష్ట్ర హైకోర్టు అడ్వొకేట్ జనరల్ (ఏజీ)గా సీనియర్ న్యాయవాది ఎ.సుదర్శన్‌రెడ్డిని నియమించాలని ప్రభుత్వం శనివారం నిర్ణయించింది. ఆయన పేరును సూచిస్తూ రాజ్‌భవన్‌కు సమాచారం అందించింది. గవర్నర్ ఆమోదంతో అధికారిక జీవో విడుదల కావాల్సి ఉంది. వివాదరహితుడైన సుదర్శన్‌రెడ్డికి.. కేసుల్లో సమర్థ వాదనలు వినిపిస్తారన్న పేరు ఉంది.

- వివరాలు 3లో

ఎక్కడంటే అక్కడ ఆపాలంటూ!




మహిళలకు ఎక్స్‌ప్రెస్, ఆర్డినరీ బస్సుల్లో ఉచిత ప్రయాణ వసతి అందుబాటులోకి వచ్చాక, ఆర్టీసీకి కొత్త చిక్కులొచ్చి పడ్డాయి. తాము ఎక్కడ ఆపమంటే బస్సును అక్కడ ఆపాలంటూ మహిళలు ఒత్తిడి చేస్తున్నారు. ఆ బస్సులకు స్టాప్ లేని చోట్ల, సాధారణ పాయింట్ల వద్ద ఆపాలంటూ డ్రైవర్, కండక్టర్‌తో వాగ్వాదానికి దిగుతున్నారు.

- వివరాలు 14లో



రాక్రే ట్రాన్స్‌ఫర్

పార్టీ తెలంగాణ ఇన్‌చార్జిని మార్చిన కాంగ్రెస్ అధిష్టానం



మాణిక్‌రావ్ ఠాక్రే



దీపాదాస్ మున్షీ

- గోవా రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జిగా నియామకం
- దీపాదాస్ మున్షీకి కేరళ, లక్షద్వీప్‌ల ఇన్‌చార్జి పదవితోపాటు అదనంగా తెలంగాణ బాధ్యతలు
- రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన 20 రోజులకే ఠాక్రేను తప్పించడంపై పార్టీ నేతల విస్మయం
- శనివారం గాంధీభవన్‌లో నేతలతో సమీక్షిస్తున్న సమయంలో ఆయనకు సమాచారం
- వెంటనే అక్కడి నుంచి వెళ్లిపోయిన నేత.. 'మార్పు'పై అసంతృప్తి!
- ఠాక్రేను రాష్ట్రానికి పంపిన 'అసెంబ్లీ టార్గెట్' పూర్తయిందన్న టీపీసీసీ వర్గాలు
- త్వరలోనే పూర్తిస్థాయిలో కొత్త ఇన్‌చార్జిని నియమించే అవకాశం
- పార్టీ కీలక సమావేశాలు జనవరి తొలి వారానికి వాయిదా

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జిగా ఉన్న మాణిక్‌రావ్ ఠాక్రేను ఆ బాధ్యతల నుంచి పార్టీ అధిష్టానం తప్పించింది. అసెంబ్లీ ఎన్నికల్లో విజయం, ప్రభుత్వ ఏర్పాటుతో ఉత్సాహంగా ఉన్న కాంగ్రెస్ పార్టీలో ఇది కలకలం రేపింది. పార్టీ బాధ్యతల మార్పు అంశం మామూలే అయినా.. ఏడాది పాటు శ్రమించి తెలంగాణలో పార్టీని అధికారంలోకి తెచ్చేందుకు కృషిచేసిన ఠాక్రేను.. అధికారం దక్కిన తర్వాత 20 రోజులకే తప్పించడం, వేరే రాష్ట్రానికి పంపడంపై టీపీసీసీ నేతల్లో చర్చ జరుగుతోంది. మరోవైపు రాష్ట్ర ఇన్‌చార్జిని మార్చడంతో.. పార్టీకి సంబంధించి కీలక సమావేశాలన్నీ వాయిదాపడ్డాయి.

టార్గెట్ పూర్తయిందనే..!

ఠాక్రే మార్పు వెనుక ప్రత్యేక కారణమేమీ లేదని గాంధీభవన్ వర్గాలు చెప్తున్నాయి. ఆయనను తెలంగాణకు పంపిన టార్గెట్ అయిపోయిందని, అందుకే ఇప్పుడు మరో రాష్ట్రానికి పంపారని.. అది కూడా ఆయన సొంత రాష్ట్రమైన మహారాష్ట్రకు దగ్గరగా ఉండే గోవాకు పంపారని అంటున్నాయి. అయితే ఠాక్రే మాత్రం ఆవేదనతో గాంధీభవన్ నుంచి వెళ్లిపోయినట్టు సమాచారం. శనివారం సాయంత్రం అధిష్టానం ఈ నిర్ణయం ప్రకటించిన సమయంలో ఠాక్రే గాంధీభవన్‌లోనే ఉన్నారు. డిసెంబర్ 28న పార్టీ వ్యవస్థాపక దినోత్సవం నేపథ్యంలో నాగ్‌పూర్‌లో జరిగే సభకు జనసమీకరణపై మంత్రి పొన్నం ప్రభాకర్, టీపీసీసీ నేతలతో చర్చిస్తున్నారు. ఇన్‌చార్జి మార్పు విషయం తెలియడంతో ఉన్నట్టుండి సమావేశం నుంచి వెళ్లిపోయారని.. దీంతో నేతలు ఆందోళనకు గురయ్యారని తెలిసింది.

కీలక సమయంలో మార్పు ఏమిటి?

ఠాక్రే స్థానంలో దీపాదాస్‌మున్షీకి బాధ్యతలు అప్పగించారు. ఆమెను కేరళ, లక్షద్వీప్‌లకు పూర్తిస్థాయి ఇన్‌చార్జిగా నియమించగా.. అదనంగా తెలంగాణ బాధ్యతలు ఇస్తున్నట్టు ఏఐసీసీ

మిగతా 2వ పేజీలో ▶



క్యాబ్ డ్రైవర్లు, ఫుడ్ డెలివరీ బాయ్‌లతో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

రూ.5 లక్షల ప్రమాద బీమా.. రూ. 10 లక్షల ఉచిత వైద్యం

- ఫుడ్ డెలివరీ బాయ్స్, క్యాబ్ డ్రైవర్లతో భేటీలో సీఎం రేవంత్‌రెడ్డి హామీ
- వారి సంక్షేమం కోసం రాజస్తాన్ తరహాలో ప్రత్యేక చట్టం తీసుకువస్తామని హామీ

3లో

ఈనెల 28 నుంచి రేషన్ దరఖాస్తుల స్వీకరణ!

కొత్త రేషన్‌కార్డుల జారీ ప్రక్రియకు సర్కారు శ్రీకారం

- నేటి కలెక్టర్ల సమావేశంలో విధి విధానాల ప్రకటన?
- ఇప్పటికే పెండింగ్‌లో 11 లక్షల దరఖాస్తులు
- రాష్ట్రంలో ప్రస్తుతం 90.14 లక్షల ఆహార భద్రత కార్డులు
- లబ్ధిదారుల సంఖ్య 2.83 కోట్లు



- వివరాలు 5లో

నీళ్లివ్వండి.. కరెంట్ ఇస్తాం!

కృష్ణా జలాలపై మహారాష్ట్రకు విజ్ఞప్తి చేయనున్న రాష్ట్ర సర్కారు



- ఆ రాష్ట్రంలో కృష్ణా ఉపనదిపై ఉన్న కోయినా డ్యామ్ నుంచి నీటి విడుదల కోరాలని నిర్ణయం
- కోయినాలో కోల్పోయే మేర కరెంట్‌ను రాష్ట్రం నుంచి ఇస్తామనే ప్రతిపాదన
- శ్రీశైలం, సాగర్‌లలో నిల్వలు అడుగంటిపోవడంతో సర్కారు ఆలోచన... మహారాష్ట్ర, కర్ణాటక ప్రభుత్వాలు అంగీకరిస్తేనే సాధ్యం

10లో

రిజిస్ట్రేషన్లకే పరిమితం



కొత్త ప్రభుత్వంలో కదలిక లేని రెవెన్యూ కార్యకలాపాలు

- రిజిస్ట్రేషన్లు మినహా ధరణి లావాదేవీల్లో స్తబ్దత
- సర్టిఫికెట్ల జారీ, క్రిస్మస్ తోఫాకే తహసీల్ ఆఫీసులు పరిమితం
- ఫైళ్లన్నీ పక్కన పెట్టేసిన కలెక్టర్లు... పట్టించుకోని సీసీఎల్‌ఏ
- భూముల సమస్యలకు సంబంధించిన 2.3 లక్షల దరఖాస్తులు పెండింగ్... ప్రభుత్వ ఆదేశాల కోసం కలెక్టర్లు, రెవెన్యూ యంత్రాంగం, ప్రజల ఎదురుచూపులు
- నేడు కలెక్టర్ల సదస్సులో సీఎం స్పష్టతనిస్తేనే లక్షలాది అర్జీలకు పరిష్కారం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 15 రోజుల తర్వాత కూడా రెవెన్యూ కార్యకలాపాల్లో కదలిక కనిపించడం లేదు. వాస్తవానికి ఎన్నికలకు ముందే (షెడ్యూల్ వెలువడి ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పుడే) రెవెన్యూ లావాదేవీలు నిలిచిపోయాయి. ఎన్నికల విధుల్లో నిమగ్నమైన జిల్లాల కలెక్టర్లు కీలకమైన ధరణి పోర్టల్‌తో పాటు ఇతర కార్యకలాపాలన్నింటినీ పక్కన పెట్టేశారు. ఎన్నికల ఫలితాలు వెలువడి పక్షం దాటినా వాటిని పట్టించుకోకపోవడంతో రెవెన్యూ వ్యవస్థ సుప్తచేతనావస్థకు చేరిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. కొత్త ప్రభుత్వం అధికారం చేపట్టిన నేపథ్యంలో ఆ ప్రభుత్వ విధానాలు ఎలా ఉంటాయోనన్న ఆలోచనతో కలెక్టర్లు తమ దగ్గరకు వచ్చిన ఫైళ్లపై ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా పక్కన పెట్టేయడం, భూపరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్‌ఏ) కూడా పట్టించుకోకపోవడంతో తహసీల్దార్ కార్యాలయాల సిబ్బంది రెవెన్యూ పనులు తప్ప మిగిలిన పనులతో కాలం వెళ్లదీస్తుండటం గమనార్హం.

ధరణిపై సమీక్షించినా...

వాస్తవానికి కాంగ్రెస్ అధికారంలోకి రాగానే సీఎం రేవంత్‌రెడ్డి ధరణి పోర్టల్‌పై సమీక్షించి 10 రోజుల్లో సమగ్ర నివేదిక ఇవ్వాలని రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిత్తల్‌ను ఆదేశించారు. కానీ రెవెన్యూ ఫైళ్ల పరిష్కారం అంశం ఈ సమావేశంలో చర్చకు రాలేదు. ధరణి పోర్టల్ కింద 2.3 లక్షల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని సమావేశంలో భాగంగా రెవెన్యూ అధికారులు సీఎంకు వివరించారు. ఈ సమస్యల పరిష్కారంపైన ఆయన ఎలాంటి ఆదేశాలివ్వకపోవడం గమనార్హం. దీనికితోడు రాష్ట్రంలో భూముల

మిగతా 5వ పేజీలో ▶



భద్రాచలం పుణ్యక్షేత్రంలో శనివారం ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వారం నుంచి భక్తులకు దర్శనమిచ్చిన శ్రీసీతాలక్ష్మణసమేత రామచంద్రస్వామి

- వివరాలు 2లో

లోక్‌సభ ఎన్నికలపై బీఆర్‌ఎస్ ఫోకస్!



- ఓవైపు ఎన్నికల సన్నద్ధత.. మరోవైపు అభ్యర్థుల ఎంపిక
- సిట్టింగ్‌లలో కొందరికే మళ్లీ టికెట్లు.. కొత్త వారికి చాన్స్
- ఒక్కసారి కూడా గెలవని స్థానాలపై ప్రత్యేక దృష్టి
- ఎమ్మెల్సీ కవిత, వినోద్, నగేశ్‌లకు కేసీఆర్ గ్రీన్‌సిగ్నల్?
- ఎక్కువ సీట్లు గెలుచుకుని కాంగ్రెస్, బీజేపీలపై పైచేయి సాధించాలనే యోచన

సాక్షి, హైదరాబాద్: శాసనసభ ఎన్నికల్లో ఎదురైన ప్రతికూల ఫలితాలను అన్ని కోణాల్లో పోస్టుమార్టం చేస్తున్న భారత రాష్ట్ర సమితి త్వరలో జరిగే లోక్‌సభ ఎన్నికల ప్రణాళికపై దృష్టి సారించింది. శస్త్రచికిత్స అనంతరం హైదరాబాద్‌లోని తన నివాసంలో కోలుకుంటున్న పార్టీ అధినేత కె.చంద్రశేఖర్‌రావు లోక్‌సభ ఎన్నికల కార్యాచరణపై నేతలకు దిశానిర్దేశం చేస్తున్నారు. లోక్‌సభ ఎన్నికలను కాంగ్రెస్, బీజేపీ ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్న నేపథ్యంలో మెజారిటీ సీట్లను కైవసం చేసుకోవడం ద్వారా రెండు జాతీయ పార్టీలపై పైచేయి సాధించాలని కేసీఆర్ భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఓ వైపు ఎన్నికల సన్నద్ధతను వేగవంతం చేస్తూనే, మరోవైపు అభ్యర్థుల ఎంపిక ప్రక్రియపైనా దృష్టి సారించారు.

సిట్టింగ్‌లలో కొందరికే టికెట్లు

ప్రస్తుతం లోక్‌సభలో బీఆర్‌ఎస్‌కు తొమ్మిది మంది సభ్యులు ఉన్నారు. అందులో దుబ్బాక ఎమ్మెల్యేగా

మిగతా 2వ పేజీలో ▶

బీఆర్‌ఎస్ 'స్వేద పత్రం' నేటికి వాయిదా

2లో


భద్రాచలంలో ఉత్తర ద్వార దర్శనం చేసుకుంటున్న భక్తజనం


తిరుమలలో స్వర్ణ రథంపై ఊరేగుతున్న మలయప్పస్వామిని దర్శించుకుంటున్న భక్తులు


యాదాద్రిలో ఉత్తర రాజగోపురం ద్వారా గరుడ వాహనంపై వైకుంఠనాథుడిగా భక్తులకు దర్శనమిస్తున్న శ్రీలక్ష్మీనరసింహస్వామి


శనివారం రాజ్‌భవన్‌లో చిన్నారుల మధ్య క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న గవర్నర్ తమిళి సై

క్లుప్తంగా...

ఆక్రమిత ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుంటాం

స్పష్టం చేసిన మంత్రి పొంగులేటి


సమావేశంలో మాట్లాడుతున్న ఉత్తమ్. చిత్రంలో పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

హుజూర్‌నగర్: రాష్ట్రంలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూములను తిరిగి స్వాధీనం చేసుకుంటామని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ నియోజకవర్గంలో గృహనిర్మాణ కార్యక్రమంపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. సమావేశంలో రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కూడా పాల్గొన్నారు. అనంతరం పొంగులేటి మాట్లాడుతూ స్వాధీనం చేసుకున్న భూములను అర్హులైన పేదలకు అందించి ఇందిరమ్మ రాజ్యం తెస్తామన్నారు. 'గతంలో బీఆర్ఎస్ సీఎం ఇళ్లు నిర్మించి ఇస్తామని వాగ్దానాలు చేశారు. ఆర్భాటంగా టెండర్లు పిలిచి, కమీషన్లు దండుకుని వాటిని గాలికి వదిలేశారు' అని ఆరోపించారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ ఓటర్లు చరిత్రాత్మక తీర్పునిచ్చారని మంత్రి ఉత్తమ్ అన్నారు. గత పాలకుల నియంతృత్వ, అవినీతి, దుర్మార్గపు పాలనతో యావత్ సమాజాన్ని అణగదొక్కేందుకు ప్రయత్నించారని ఆరోపించారు. ప్రజలు నిశ్శబ్ద విప్లవం ద్వారా కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తెచ్చారని పేర్కొన్నారు. 'మా ప్రభుత్వం సమాజంలో అట్టడుగున ఉన్నవారి, నిరుపేదల వాణిని వినబోతుంది' అని ఉత్తమ్ అన్నారు. గత ప్రభుత్వం పంపిణీ చేయకుండా విస్మరించిన ఇళ్లను రాజకీయాలకు అతీతంగా అర్హులకు ఇస్తామని చెప్పారు.

బీఆర్ఎస్‌కు భోజారెడ్డి రాజీనామా

సాక్షి, ఆదిలాబాద్: ఆదిలాబాద్ డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి బీఆర్ఎస్‌కు రాజీనామా చేశారు. ఏ పార్టీలో చేరేది త్వరలో స్పష్టం చేస్తానని ఆయన వెల్లడించారు. ఆయన శనివారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు వివరించారు. భోజారెడ్డి అధికార కాంగ్రెస్ పార్టీలో చేరనున్నట్లు ప్రచారం జరుగుతోంది.

ఎక్కువ ఎంపీ సీట్లు గెలవాలి

కమలనాథుల కార్యాచరణ

- రాష్ట్రంలో 9 లేదా 10 ఎంపీ స్థానాల్లో గెలిచే అవకాశాలపై ధీమా
- లోక్‌సభ ఎన్నికల నాటికి ఇక్కడ అనుకూల వాతావరణం
- ఢిల్లీలో జరిగిన జాతీయ పదాధికారుల సమావేశంలో చర్చ



సాక్షి, హైదరాబాద్ / న్యూఢిల్లీ: వచ్చే లోక్‌సభ ఎన్నికలకు పూర్తిస్థాయిలో సన్నద్ధమై తెలంగాణ నుంచి అత్యధిక ఎంపీ స్థానాలు గెలుచుకునే దిశగా పటిష్టమైన కార్యాచరణ ప్రణాళికతో ముందుకెళ్లాలని రాష్ట్ర పార్టీకి బీజేపీ జాతీయనాయకత్వం దిశానిర్దేశం చేసింది. ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలపై సమీక్ష సందర్భంగా...కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌లను బీజేపీ కైవసం చేసుకోవడం, పార్టీ అధికారంలో ఉన్న మధ్యప్రదేశ్‌ను నిలబెట్టుకోవడం జాతీయ రాజకీయాల్లో శుభ పరిణామమని పేర్కొంది. కేంద్రంలో మోదీ పదేళ్ల పాలనపై దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో సానుకూల పవనాలు వీచే అవకాశాలున్నందున, వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో మరోసారి విజయకేతనం ఎగరవేసి వరుసగా మూడోసారి గెలిచి హ్యాట్రిక్ విజయాన్ని బీజేపీ సొంతం చేసుకుంటుందనే ధీమా వ్యక్తం చేసింది. లోక్‌సభ ఎన్నికల కల్లా తెలంగాణలోనూ అనుకూల ఫలితాలు వచ్చే అవకాశాలున్నాయనే అభిప్రాయం వ్యక్తం చేసినట్టు తెలిసింది.

అసెంబ్లీ ఎన్నికల్లో సీట్లు రాకపోయినా ఓటింగ్ శాతం పెరగడంతో..

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ముందు నుంచి పార్టీ ఆశించిన స్థాయిలో కాకపోయినా 8 సీట్లలో గెలిచి 30 లక్షలకు పైగా ఓట్లతో 14 శాతం ఓటింగ్ సాధించడం సానుకూల పరిణామం అనే అభిప్రాయాన్ని ఢిల్లీ నాయకత్వం వ్యక్తం చేసినట్టు సమాచారం. లోక్‌సభ ఎన్నికల్లో ఈ 14 శాతం ఓటింగ్‌ను గణనీయంగా పెంచుకుని, తొమ్మిది లేదా పది ఎంపీ సీట్లు గెలుచుకునే దిశలో పకడ్బందీ వ్యూహాలతో ముందుకెళ్లాలని జాతీయనాయకత్వం సూచించినట్టు తెలుస్తోంది. శుక్ర, శనివారాల్లో ఢిల్లీలో జరిగిన జాతీయ పదాధికారుల సమావేశంలో ఆయా అంశాలు చర్చకు వచ్చినట్టు పార్టీ వర్గాల సమాచారం

లోక్‌సభ ఎన్నికల్లో మెరుగైన ఫలితాలు సాధిస్తామన్న కిషన్‌రెడ్డి

ఈ భేటీలో తెలంగాణ నుంచి కేంద్రమంత్రి, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి, బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు డా.కె.లక్ష్మణ్, జాతీయ కార్యవర్గ సభ్యుడు, తమిళనాడు సహ ఇన్‌చార్జి పొంగులేటి సుధాకరరెడ్డి, పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేసి.. పార్టీని బూత్ స్థాయిలో బలోపేతం చేసే దిశగా జరిగిన చర్చా కార్యక్రమంలో కిషన్‌రెడ్డి ప్రసంగించారు. వచ్చే ఏడాది జరుగనున్న సార్వత్రిక ఎన్నికల కోసం అన్ని విధాలుగా సమాయత్తమవుతున్నామని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. బూత్ స్థాయిలో పార్టీ బలోపేతం కోసం చర్యలు కొనసాగిస్తున్నామని, అవసరమైన చోట్ల సమీక్షలు నిర్వహిస్తున్నామని ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా జాతీయనాయకత్వానికి కిషన్‌రెడ్డి ఓ నివేదిక సమర్పించినట్టు పార్టీవర్గాల సమాచారం

బీసీ నినాదం ఫలించకపోవడంపై విశ్లేషణ జరగాలంటూ..

అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా పార్టీ తీసుకున్న బీసీ నినాదం, అధికారంలోకి వస్తే బీసీ నేతను సీఎం చేస్తామనడం, ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు జాతీయనాయకత్వంతో పాటు కేంద్ర ప్రభుత్వం మద్దతు తెలిపినా పార్టీకి ఓట్లు, సీట్ల పరంగా ప్రయోజనం చేకూరకపోవడంపై లోతైన విశ్లేషణ జరగాల్సి ఉందనే అభిప్రాయం వ్యక్తం చేసినట్టు తెలిసింది. పార్టీ బలంగా ఉందని భావించిన గ్రేటర్ హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా, తదితర చోట్ల ఊహించని విధంగా బీజేపీకి ఎదురుదెబ్బ తగలడం వల్లనే 8 సీట్లకే పరిమితం కావాల్సి వచ్చిందని పేర్కొన్నట్టు తెలిసింది.

28న రాష్ట్రానికి అమిత్ షా!



లోక్‌సభ ఎన్నికలకు రాష్ట్రపార్టీని పూర్తిస్థాయిలో సన్నద్ధం చేసి దిశానిర్దేశం చేసేందుకు ఈ నెల 28న బీజేపీ అగ్రనేత, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా రాష్ట్రానికి రానున్నట్టు పార్టీవర్గాల సమాచారం. రాష్ట్రంలోని పార్టీ మండల శాఖ అధ్యక్షులు మొదలు రాష్ట్రస్థాయి నేతల వరకు హాజరయ్యే కీలక సమావేశానికి ఆయన రానున్నట్టు తెలిసింది. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల సమీక్షతో పాటు, వచ్చే లోక్‌సభ ఎన్నికలకు ఎలా సన్నద్ధం కావాలి, ఏయే అంశాలపై దృష్టి కేంద్రీకరించాలి, ఎలాంటి వ్యూహాలు, కార్యాచరణ ప్రణాళికలతో ముందుకెళ్లాలనే దానిపై రాష్ట్ర పార్టీ నేతలకు అమిత్‌షా స్పష్టమైన ఆదేశాలు ఇవ్వనున్నట్టు తెలుస్తోంది.

విశ్వవిరాట్ వైభవం

సాక్షి, తిరుమల / భద్రాచలం / యాదగిరిగుట్ట: తెలుగు రాష్ట్రాల్లోని పలు దేవాలయాల్లో వైకుంఠ ఏకాదశి వేడుకలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయాలకు పోటెత్తారు. వేకువ జాము నుంచే ఆలయాలకు భారీగా భక్తులు తరలివచ్చారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రాల్లో స్వామి వారి వైకుంఠ ద్వార దర్శనం కనుల పండువగా జరుగుతోంది.

ఉత్తరద్వారం నుంచి దర్శనమిచ్చిన భద్రాద్రి రామయ్య

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని భద్రాచలం పుణ్యక్షేత్రం శనివారం ముక్కోటి ఏకాదశి సందర్భంగా భూలోక వైకుంఠంగా మారింది. శ్రీసీతాలక్ష్మణసమేతుడైన రామచంద్రస్వామి ఉత్తరద్వారంలో భక్తులకు దర్శనమిచ్చారు. రాష్ట్ర నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తజనంతో భద్రగిరి పులకించింది. వేదపండితుల మంత్రోచ్చారణలు, ధూపదీపాల మధ్య వైకుంఠ రాముడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జగదభి రాముడు గరుడ వాహనంపై, సీతమ్మవారు గజవాహనంపై, లక్ష్మణస్వామి హనుమత్ వాహనంపై ఆసీనులై ఉత్తర ద్వారం నుంచి భక్తులకు దర్శనమిచ్చారు.

వైకుంఠనాథుడిగా దర్శనమిచ్చిన యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి

యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానంతో పాటు అనుబంధంగా కొనసాగుతున్న పాతగుట్ట (పూర్వగిరి) శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం ముక్కోటి ఏకాదశి వేడుకలు ఘనంగా జరిగాయి. వేకువజామునే ప్రధానాలయంలో శ్రీస్వామి అమ్మవార్లకు ఆచార్యులు సుప్రభాతం, ఆరాధన, బాలభోగం, తిరుప్పావై చేపట్టి అలంకార సేవలు ఏర్పాట్లు చేశారు. ఉదయం శ్రీస్వామి వారు గరుడ వాహనంపై లక్ష్మీనృసింహస్వామి అలంకారంలో వేంచేసి ఆలయ ఉత్తర ద్వారం వద్ద వైకుంఠనాథుడిగా భక్తులకు కనువిందు చేశారు. సాయంత్రం శ్రీస్వామిని విష్ణుమూర్తిగా అలంకరణ చేసి మత్స్యావతారంలో మాడవీధిలో సేవను ఊరేగించారు. ఈ వేడుకల్లో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, అనిరుధ్‌రెడ్డి, అదనపు జిల్లా జడ్జి మారుతీదేవి, సబ్ జడ్జి దశరథరామయ్య తదితరులు పాల్గొన్నారు.

తిరుమలలో..

తిరుమలలో వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. వైకుంఠం నుంచి వచ్చిన వేంకటేశుడి దర్శనానికి ఉత్తర ద్వారం స్వాగతం పలికింది. అలాగే.. శ్రీవారి ఆలయంలో స్వర్ణ రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. శ్రీదేవి భూదేవి సమేత శ్రీ మలయప్ప స్వామి వారు స్వర్ణ రథంపై మాడ వీధుల్లో ఊరేగారు. రథోత్సవాన్ని గ్యాలరీల్లొంచి భక్తులు దర్శించి తరించారు.

చంద్రబాబు ముందస్తు బెయిల్‌పై తీర్పు రిజర్వ్

సాక్షి, అమరావతి: ఇన్నర్ రింగ్ రోడ్డు భూ కుంభకోణం కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు దాఖలు చేసిన పిటిషన్‌లో ఏపీ హైకోర్టు శనివారం తీర్పును రిజర్వ్ చేసింది. ఈమేరకు న్యాయమూర్తి జస్టిస్ తల్లాప్రగడ మల్లికార్జునరావు ఉత్తర్వులు జారీ చేశారు. చంద్రబాబు దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌లో ఇప్పటికే వాదనలు ముగిశాయి. రాత పూర్వక వాదనలు సమర్పించాలంటూ న్యాయమూర్తి విచారణను శుక్రవారానికి వాయిదా వేశారు. శుక్రవారం ఈ వ్యాజ్యం విచారణకు రాగా.. సీఐడీ అధికారులు కోర్టు ముందు ఓ మెమో దాఖలు చేశారు. ఇన్నర్ రింగ్ రోడ్డు కేసులో నిందితునిగా ఉన్న నారా లోకేశ్ ఇటీవల పలు మీడియా ఛానళ్లకు ఇంటర్వ్యూలు ఇచ్చి దర్యాప్తు అధికారులను, సాక్షులను బెదిరించారంటూ ఆ ఇంటర్వ్యూల వివరాలను కోర్టు ముందుంచారు. బాబు ముందస్తు బెయిల్ పిటిషన్‌పై నిర్ణయం వెలువరించే ముందు ఈ అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. ఈ మెమోను పరిశీలించిన న్యాయమూర్తి దీనిపై రాతపూర్వకంగా అభ్యంతరాలు దాఖలు చేయాలని బాబు తరపు న్యాయవాదులను ఆదేశించారు. దీంతో చంద్రబాబు తరపు న్యాయవాదులు సీఐడీ మెమోను వ్యతిరేకిస్తూ మెమో దాఖలు చేశారు. సీఐడీ మెమోను తిరస్కరించాలని కోరారు. అనంతరం తీర్పును రిజర్వ్ చేస్తున్నట్టు న్యాయమూర్తి ప్రకటించారు.

రాక్రే ట్రాన్స్‌ఫర్

▶ మొదటి పేజీ తరువాయి

ప్రకటించింది. దీనిపై టీపీసీసీ నేతల్లో విస్మయం వ్యక్తమవుతోంది. ''రాష్ట్రంలో ఇటీవలే అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో పార్టీ నేతల మధ్య సమన్వయం చేయాల్సిన, అధిష్టానానికి ఎప్పటికప్పుడు సమాచారం ఇవ్వాల్సిన బాధ్యతలు రాష్ట్ర ఇన్‌చార్జికి ఉంటాయి. ఇలాంటి కీలక సమయంలో ఇన్‌చార్జి బాధ్యతలను అదనంగా వేరే రాష్ట్ర ఇన్‌చార్జులకు అప్పగించడం వెనుక ఆంతర్యం ఏమిటన్నది అంతుపట్టడం లేదు..'' అని వారు పేర్కొంటున్నారు. అయితే త్వరలోనే రాష్ట్రానికి కొత్త రెగ్యులర్ ఇన్‌చార్జిని నియమిస్తారని టీపీసీసీ ముఖ్య నేత ఒకరు వెల్లడించారు.

కీలక సమావేశాలు వాయిదా!

పార్టీ ఇన్‌చార్జి మార్పు నేపథ్యంలో రాష్ట్ర కాంగ్రెస్ కీలక సమావేశాలు వాయిదాపడ్డాయి. నిజానికి శనివారమే పార్టీ సమావేశాలను నిర్వహించాలని నిర్ణయించింది. వాటికి హాజరుకావాల్సిన నేతలకు సమాచారం ఇచ్చింది. కానీ వైకుంఠ ఏకాదశి నేపథ్యంలో ఆదివారం ఉదయం రెండు సమావేశాలు జరుగుతాయని.. వాటికి సీఎం రేవంత్, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కూడా హాజరవుతారని టీపీసీసీ నుంచి నేతలకు సమాచారం వెళ్లింది. కానీ కలెక్టర్లతో సీఎం కాన్ఫరెన్స్ నేపథ్యంలో సమయం మార్చారు. ఆదివారం సాయంత్రం 3.30 గంటలకు గాంధీభవన్‌లోని ప్రకాశం హాల్‌లో మండల, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుల సమావేశం జరుగుతుందని.. డీసీసీ అధ్యక్షులు, అనుబంధ సంఘాల కార్యవర్గాలు, అధికార ప్రతినిధులు ఈ సమావేశానికి హాజరుకావాలని సూచించారు. ఇక సాయంత్రం 4:30 గంటలకు ఇందిరా భవన్‌లో టీపీసీసీ విస్తృత కార్యవర్గ సమావేశం ఉంటుందని.. రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ), ప్రదేశ్ ఎన్నికల కమిటీ (పీఈసీ) సభ్యులు, టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షులు, ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, డీసీసీ అధ్యక్షులు, రాష్ట్ర మంత్రులు, ఎన్ఎస్‌యూఐ, యూత్, మహిళా, ఎస్సీ సెల్ అధ్యక్షులు హాజరుకావాలని కోరారు. కానీ ఠాక్రే మార్పు నేపథ్యంలో ఈ సమావేశాలు వాయిదా పడ్డాయి. జనవరి మొదటి వారంలో వీటిని నిర్వహిస్తామని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్ వెల్లడించారు.

ఏడాది కూడా కాకుండానే..

కాంగ్రెస్ అధిష్టానం పార్టీ తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జిగా మాణిక్‌రావ్ ఠాక్రేను ఈ ఏడాది జనవరి 4న నియమించింది. వెంటనే రంగంలోకి దిగిన ఠాక్రే అలుపెరగకుండా పని చేశారు. పూర్తిగా హైదరాబాద్‌లోనే మకాం వేసిన ఆయన.. తన సహ కార్యదర్శులతో కలసి టీపీసీసీ నాయకత్వాన్ని సమన్వయం చేసుకుంటూ, అధిష్టానంతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతూ ముందుకెళ్లారు. ఎన్నికల ఎపిసోడ్‌ను విజయవంతంగా ముగించారు. తాను ఇన్‌చార్జిగా ఉన్న రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో హుషారుగా ఉంటున్నారు. ఇలాంటి సమయంలో తెలంగాణ బాధ్యతల నుంచి తప్పించడంతో ఆయన అసంతృప్తికి గురైనట్టు తెలిసింది. గతంలో రాష్ట్ర ఇన్‌చార్జిగా ఉన్న మాణిక్యం ఠాగూర్‌ను అధిష్టానం గోవాకు ఇన్‌చార్జిగా పంపింది. ఇప్పుడు ఠాక్రేను కూడా గోవా ఇన్‌చార్జిగానే నియమించడం గమనార్హం. గోవా ఇన్‌చార్జిగా ఉన్న ఠాగూర్‌కు ఆంధ్రప్రదేశ్ బాధ్యతలను అప్పగించారు.

కొత్త ప్రభుత్వం అప్పులు రూ.1,400 కోట్లు

- ఈ నెల 12న రూ.500 కోట్లు, 19న రూ.900 కోట్ల రుణ సమీకరణ
- ఆర్బీఐ బాండ్ల వేలం ద్వారా తెచ్చుకున్న రేవంత్ సర్కార్



సాక్షి, హైదరాబాద్: గత బీఆర్ఎస్ ప్రభుత్వం నుంచి అధికార పగ్గాలు అందుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం తొలిసారిగా అప్పుల రూపంలో ప్రభుత్వ ఖజానాకు నిధులు సమీకరించుకుంది. ఈ నెలలో రాష్ట్ర ప్రభుత్వం రూ.1,400 కోట్ల మేర రుణ సమీకరణ చేసింది. ఆర్బీఐ ఆధ్వర్యంలో సెక్యూరిటీ బాండ్లను వేలం వేయడం ద్వారా ఈ నెల 12న రూ.500 కోట్లు, ఈ నెల 19న రూ. 900 కోట్ల మేర అప్పు తెచ్చుకుంది. ఇందులో రూ. 500 కోట్ల అప్పును 7.70 శాతం వడ్డీకి 15 ఏళ్ల కాలవ్యవధిలో చెల్లించేలా, రూ. 900 కోట్లను 7.58 శాతం వడ్డీకి 18 ఏళ్లలో చెల్లించేలా సమకూర్చుకుంది.

గత ప్రభుత్వ హయాంలోనే రుణ షెడ్యూల్..

వాస్తవానికి బహిరంగ మార్కెట్‌లో రుణాలు తీసుకొనే ప్రక్రియలో భాగంగా ఆర్బీఐ ద్వారా బాండ్లను వేలం వేసేందుకు రాష్ట్ర ప్రభుత్వాలు మూడు నెలలకోసారి షెడ్యూల్ సమర్పిస్తాయి. గత ప్రభుత్వ హయాంలోనే ఈ ఆర్థిక సంవత్సరంలోని మూడో త్రైమాసికానికి చెందిన షెడ్యూల్‌ను ఆర్బీఐ ఖరారు చేసింది. ఈ షెడ్యూల్ మేరకు డిసెంబర్‌లో రెండు దఫాలుగా ప్రభుత్వం రూ. 1,400 కోట్లు సమకూర్చుకుందని ఆర్థిక వర్గాలు వెల్లడించాయి.

నేడు కలెక్టర్లు, ఎస్పీల సదస్సు

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన కీలక భేటీ

- పాల్గొననున్న డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు, ఉన్నతాధికారులు
- ఆరు గ్యారంటీల అమలుపై స్పష్టమైన ఆదేశాలివ్వనున్న సర్కార్

సాక్షి, హైదరాబాద్: అధికారంలోకి రాగానే ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం దాన్ని క్షేత్రస్థాయికి తీసుకెళ్లాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా తొలిసారిగా ఆదివారం సచివాలయంలో కలెక్టర్లు, ఎస్పీలు, జాయింట్ కలెక్టర్ల సదస్సు నిర్వహించనుంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతోపాటు మంత్రులు, ఉన్నతాధికారులు పాల్గొననున్నారు. ధరణి సహా ప్రభుత్వ ప్రాధాన్యతలు, ఆరు హామీల అమలుకు తీసుకోవాల్సిన చర్యలపై ఈ భేటీలో ప్రధానంగా సీఎం దిశానిర్దేశం చేయనున్నారు. ప్రజాసమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యల గురించి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వనున్నారు. ఇప్పటికే హైదరాబాద్‌లో ప్రారంభించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రతి మంగళ, శుక్రవారాల్లో నిర్వహిస్తుండగా అదే విధానాన్ని జిల్లా, డివిజన్, మండల, గ్రామ స్థాయికి తీసుకెళ్లాలని ముఖ్యమంత్రి స్పష్టం చేయనున్నారు.

కలెక్టర్ల నుంచి ఫీడ్‌బ్యాక్ సేకరణ..

వంద రోజుల్లో ఆరు గ్యారంటీల హామీని అమలు చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలతోపాటు పాలనను ప్రజల ముంగిటకు ఎలా తీసుకెళ్లాలన్న అంశాన్ని కూడా ఈ సమావేశంలో సీఎం రేవంత్ వివరించనున్నారు. ఆరు గ్యారంటీల్లో భాగంగా మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, పేదలకు కల్పిస్తున్న ఆరోగ్యశ్రీ వైద్య సదుపాయాన్ని రూ. 5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచగా వాటికి సంబంధించి కలెక్టర్ల నుంచి ప్రభుత్వం ఫీడ్‌బ్యాక్ తీసుకొనే అవకాశం ఉంది.

28 నుంచి జనవరి 6 వరకు ప్రజాపాలన గ్రామ సభలు..

నిరుపేదలు, అట్టడుగు వర్గాలకు ప్రభుత్వ ఫలాలు దక్కేలా పాలనా యంత్రాంగాన్ని గ్రామస్థాయికి తీసుకెళ్లడంతోపాటు ప్రభుత్వ పనితీరును మరింత మెరుగుపరచడం, అధికార యంత్రాంగంలో జవాబుదారీతనాన్ని పెంపొందించేందుకు ప్రజాపాలన కార్యక్రమాన్ని చేపట్టనుండటంతో ఈ సమావేశానికి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లను కూడా ప్రభుత్వం ఆహ్వానించింది. హైదరాబాద్‌లోని ప్రజా భవన్‌లో వారానికి రెండు రోజులపాటు నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ఇళ్లు, భూ సమస్యలు, ఉద్యోగాలు, ధరణి, పెన్షన్లకు సంబంధించి ఎక్కువగా ఫిర్యాదులు వస్తున్నందున వాటిని క్షేత్రస్థాయిలో పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రజాపాలన పేరిట గ్రామ సభలకు మొగ్గు చూపిందని చెబుతున్నారు. ఈ నెల 28 నుంచి జనవరి 6 వరకు (ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు.. తిరిగి మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు) ప్రజాపాలన కార్యక్రమాన్ని ఎలా నిర్వహించాలి? ప్రజల నుంచి తీసుకోవాల్సిన దరఖాస్తులు, అర్హుల ఎంపిక.. అందుకు అనుసరించాల్సిన మార్గదర్శకాలను సీఎం రేవంత్‌రెడ్డి ఈ సందర్భంగా కలెక్టర్లకు వివరించనున్నట్లు సమాచారం. కాగా, ప్రజలు తమ సమస్యలను ఆన్‌లైన్ ద్వారా సైతం ఫిర్యాదు చేసేందుకు వీలుగా ఈ నెల 27న ప్రజావాణి వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తేవాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. అలాగే ప్రతి 4 నెలలకోసారి గ్రామ సభలను నిర్వహించాలన్నారు.

ప్రజాప్రతినిధులంతా పాల్గొనేలా..

గ్రామ సభల్లో భాగంగా అన్ని గ్రామ పంచాయితీలు, మున్సిపల్ వార్డులలో రోజుకు రెండు చోట్ల అధికార బృందాలు పర్యటిస్తాయి. ప్రజాపాలన కార్యక్రమానికి స్థానిక సర్పంచ్ / కార్పొరేటర్ / కౌన్సిలర్లను ఆహ్వానించడంతోపాటు సంబంధిత ప్రజాప్రతినిధులందరూ విధిగా పాల్గొనేలా ప్రభుత్వం చర్యలు తీసుకోనుంది. గ్రామ సభల్లో వచ్చిన ప్రతి దరఖాస్తును పరిశీలించడానికి ప్రత్యేకమైన నంబర్ ఇవ్వడంతోపాటు దరఖాస్తులను కంప్యూటరీకరించనుంది.

లోక్‌సభ ఎన్నికలపై బీఆర్ఎస్ ఫోకస్!

▶ మొదటి పేజీ తరువాయి

ఎన్నికైన కొత్త ప్రభాకర్‌రెడ్డి తన మెదక్ ఎంపీ పదవికి రాజీనామా చేశారు. మిగతా ఎనిమిది మందిలో తిరిగి ఎందరికి టికెట్ దక్కుతుందనే అంశంపై పార్టీలో చర్చ జరుగుతోంది. సిట్టింగ్ ఎంపీల్లో రంజిత్‌రెడ్డి (చేవెళ్ల), నామా నాగేశ్వర్‌రావు (ఖమ్మం) మినహా మిగతా ఆరుగురు.. పి.రాములు (నాగర్‌కర్నూల్), ఎం.శ్రీనివాస్‌రెడ్డి (మహబూబ్‌నగర్), దయాకర్ (వరంగల్), కవిత మాలోత్ (మహబూబాబాద్), బీబీ పాటిల్ (జహీరాబాద్), వెంకటేశ్ నేత (పెద్దపల్లి)లలో ఎవరికి టికెట్ కచ్చితంగా దక్కుతుందని కచ్చితంగా చెప్పలేమని బీఆర్ఎస్ వర్గాలు చెప్తున్నాయి. వారిని మార్చే క్రమంలో కొత్తగా ఎవరికి అవకాశం ఇవ్వాలనే కోణంలో కసరత్తు జరుగుతోందని అంటున్నాయి.

గత ఎన్నికల్లో ఓడిన సీట్లపై పరిశీలన

గత లోక్‌సభ ఎన్నికల్లో పోటీచేసి ఓటమిపాలైన కల్వకుంట్ల కవిత (నిజామాబాద్), బోయినపల్లి వినోద్‌కుమార్ (కరీంనగర్), గోడెం నగేశ్ (ఆదిలాబాద్)లకు వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో అవకాశం దక్కడం ఖాయంగా కనిపిస్తోంది. కవిత, వినోద్‌కుమార్ ఇప్పటికే ఎన్నికల కోసం సన్నద్ధతను ప్రారంభించారు. గత ఎన్నికల్లో పోటీచేసి ఓటమి పాలైన బూర నర్సయ్యగౌడ్ (భువనగిరి) బీజేపీలో చేరడంతో.. అక్కడ జిట్టా బాలకృష్ణారెడ్డి, దూదిమెట్ల బాలరాజు యాదవ్‌ల పేర్లు తెరమీదకు వస్తున్నాయి. మల్కాజిగిరి లోక్‌సభ స్థానం నుంచి గతంలో పోటీచేసి ఓటమి పాలైన మర్రి రాజశేఖర్‌రెడ్డి ఇటీవల మల్కాజిగిరి ఎమ్మెల్యేగా గెలిచారు. ఈ నేపథ్యంలో మల్కాజిగిరి లోక్‌సభ అభ్యర్థిగా బీఆర్ఎస్ ఎవరికి చాన్స్ ఇస్తుందన్నది ఆసక్తిగా మారింది. సికింద్రాబాద్ సీటు నుంచి గత ఎన్నికల్లో పోటీచేసిన మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ కుమారుడు సాయి కిరణ్‌కు మళ్లీ అవకాశం దక్కే సూచనలు కనిపిస్తున్నాయి. నల్లగొండ నుంచి శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఆయన కుమారుడు గుత్తా అమిత్‌రెడ్డి పోటీకి ఆసక్తి చూపుతున్నారు.

ఒక్కసారీ గెలవని స్థానాలపై నజర్

బీఆర్ఎస్ ఆవిర్భావం నుంచి ఇప్పటివరకు నల్గొండ, మల్కాజిగిరి, సికింద్రాబాద్, హైదరాబాద్ లోక్‌సభ స్థానాల్లో ఒక్కసారి కూడా గెలవలేదు. హైదరాబాద్‌లో మిత్రపక్షమైన ఎంఐఎంతో స్నేహపూర్వక పోటీచేస్తూనే మిగతా చోట్ల గెలుపు అవకాశాలను బీఆర్ఎస్ బేరీజు వేసుకుంటోంది. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో మల్కాజిగిరి లోక్‌సభ స్థానం పరిధిలోని ఏడు సెగ్మెంట్లలోనూ బీఆర్ఎస్ అభ్యర్థులే గెలిచారు. సికింద్రాబాద్ లోక్‌సభ పరిధిలోనూ నాంపల్లి మినహా మిగతా ఆరు చోట్ల బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఉన్నారు. ఈ నేపథ్యంలో ఈ రెండు చోట్ల బలమైన అభ్యర్థులను బరిలోకి దింపాలని బీఆర్ఎస్ అధినేత భావిస్తున్నట్టు పార్టీ వర్గాలు చెప్తున్నాయి.

జాతీయ పార్టీల నేతలు పోటీ చేస్తే?

రాష్ట్రం నుంచి ప్రధాని మోదీని పోటీ చేయాల్సిందిగా బీజేపీ.. సోనియాను పోటీ చేయాల్సిందిగా కాంగ్రెస్ కోరుతున్నాయి. ఈ నేపథ్యంలో జాతీయ పార్టీల అగ్రనేతలు రాష్ట్రం నుంచి బరిలోకి దిగితే ఎదురయ్యే పరిణామాలు, ఎదుర్కొనేందుకు అవసరమైన వ్యూహంపై బీఆర్ఎస్ పరిశీలన జరుపుతోందని పార్టీ వర్గాలు చెప్తున్నాయి. మరోవైపు పార్టీ ఎంపీలతో విడివిడిగా భేటీ అవుతున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్.. వచ్చే ఎన్నికల్లో పోటీకి ఎవరెవరు ఎంతమేర సన్నద్ధంగా ఉన్నారనే వివరాలు సేకరిస్తున్నారని అంటున్నాయి.

బీఆర్ఎస్ 'స్వేదపత్రం' నేటికి వాయిదా

సాక్షి, హైదరాబాద్: గత పదేళ్లలో తెలంగాణ ఆర్థిక స్థితిగతులు, అప్పులు, ఆస్తులు తదితరాలపై బీఆర్ఎస్ రూపొందించిన 'స్వేదపత్రం' విడుదల నేటి(ఆదివారం)కి వాయిదా పడింది. శనివారం ఉదయం 11 గంటలకు తెలంగాణ భవన్ వేదికగా స్వేదపత్రం విడుదల చేస్తామని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు తొలుత ప్రకటించారు. అయితే పీవీ వర్ధంతి కార్యక్రమం, మాజీ సీఎం కేసీఆర్‌తో సమావే శం కారణంగా స్వేదపత్రం విడుదలను వాయి దా వేసినట్లు బీఆర్ఎస్ వర్గాలు వెల్లడించాయి. ఆదివారం ఉదయం 11 గంటలకు నిర్వహించే స్వేదపత్రంపై ప్రజెంటేషన్ కార్యక్రమంలో మాజీమంత్రులు కేటీఆర్, హరీశ్‌రావుసహా బీఆర్ఎస్ ముఖ్యనేతలు పాల్గొననున్నారు.

క్లుప్తంగా...



ఆకర్షణకు రాష్ట్రపతి అభినందన

- గ్రంథాలయాల ఏర్పాటుపై ద్రౌపదీ ముర్ము సంతోషం

సాక్షి, హైదరాబాద్: నిరుపేద చిన్నారుల కోసం ఎనిమిది గ్రంథాలయాలను ఏర్పాటు చేయడంలో చొరవ తీసుకున్న హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ విద్యార్థిని ఆకర్షణ సతీశ్‌ను రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అభినందించారు. రాష్ట్రపతి హైదరాబాద్ పర్యటన సందర్భంగా తనకు కొంత సమయం ఇవ్వాలంటూ ఆకర్షణ సతీశ్ గతంలో రాసిన లేఖకు ద్రౌపదీ ముర్ము స్పందించారు. ఈ మేరకు శుక్రవారం బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో సమయం ఇచ్చారు. రాష్ట్రపతి నిలయంలో రాష్ట్రపతి ముర్ము ఆ చిన్నారితో కాసేపు మాట్లాడారు. గ్రంథాలయ కార్యక్రమాలపై ఆకర్షణ సతీశ్‌ను అభినందిస్తూ, సాధ్యమైనంత వరకు సమాజానికి తిరిగి అందించాలని ఆమెకు సూచించారు. రాష్ట్రపతి ముర్ము తన జీవిత చరిత్ర పుస్తకంతో పాటు, ఆకర్షణ సతీశ్‌కు డెయిరీ మిల్క్ చాక్లెట్ ఇచ్చి అభినందించారు. నిరుపేద విద్యార్థుల కోసం ఆకర్షణ సతీశ్ ఎనిమిది గ్రంథాలయాల స్థాపనకు చొరవ తీసుకోవడాన్ని.. ప్రధాని నరేంద్ర మోదీ తన 105వ మన్ కీ బాత్ కార్యక్రమంలో ప్రస్తావించారు.

ఈనెల 27న రాష్ట్రానికి ఉపరాష్ట్రపతి జగదీప్

- ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించిన సీఎస్ శాంతికుమారి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రానికి తొలిసారిగా ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ ఈనెల 27న హైదరాబాద్ రానున్నారు. ఈ మేరకు శనివారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అన్ని విభాగాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో డీజీపీ రవిగుప్తా, అగ్నిమాపకశాఖ డీజీ నాగిరెడ్డి, ప్రభుత్వ కార్యదర్శి రాహుల్‌బొజ్జా, జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రోస్, ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ క్రిస్టినా చొంగ్తు, సెక్రటరీ ఆర్‌అండ్‌బీ శ్రీనివాస్‌రాజు, సీఎండీ టీఎస్‌ఎస్‌పీడీసీఎల్ ముషారఫ్, ఇతర ఉన్నతాధికారులు ఈ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ ఉప రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో అధికారులందరూ సమన్వయంతో పని చేయాలని, తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. పోలీసు బందోబస్తుతో పాటు పోలీసు బ్యాండ్ ఏర్పాటుకు ఆదేశించారు. బ్లూ బుక్ ప్రకారం తగిన భద్రత, ట్రాఫిక్, బందోబస్తు ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఉప రాష్ట్రపతి పర్యటన సజావుగా సాగేందుకు ఆరోగ్య, రోడ్లు, భవనాలు, జీహెచ్‌ఎంసీ, విద్యుత్, సంబంధిత శాఖలు సమన్వయంతో పని చేయాలని సీఎస్ తెలిపారు.

ఏసీబీ డీజీగా ఆనంద్ బాధ్యతల స్వీకరణ

సాక్షి, హైదరాబాద్: అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) డీజీగా సీనియర్ ఐపీఎస్ అధికారి సీవీ ఆనంద్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు బంజారాహిల్స్‌లోని ఏసీబీ కేంద్ర కార్యాలయంలో బాధ్యతల స్వీకరణ అనంతరం ఆనంద్ ఏసీబీ అధికారులతో సమీక్ష నిర్వహించారు. 1991 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి సీవీ ఆనంద్‌ను ప్రభుత్వం ఇటీవలే ఏసీబీ డీజీగా బదిలీ చేయడం తెలిసిందే.

'తబ్లిగీ జమాతే'తో సమాజానికి చేటు

- సమావేశాలకు అనుమతి రద్దు చేయాలని డీజీపీకి వీహెచ్‌పీ వినతి

సాక్షి, హైదరాబాద్: జనవరి 6 నుంచి 8వ తేదీ వరకు వికారాబాద్ జిల్లా పరిగి సమీపంలో నిర్వహించే తబ్లిగీ జమాతే సమావేశాలకు అనుమతి రద్దు చేయాలని విశ్వహిందూ పరిషత్ తెలంగాణ రాష్ట్ర విభాగం డీజీపీ రవిగుప్తాను కోరింది. ఈ మేరకు శనివారం డీజీపీ కార్యాలయంలో రవిగుప్తాను వీహెచ్‌పీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి పండరీనాథ్, సహకార్యదర్శులు గణపురం రాజేశ్వర్‌రెడ్డి, భానుప్రసాద్, ప్రచార ప్రముఖ్ పగడాకుల బాలస్వామి, బజరంగ్‌దళ్ రాష్ట్ర కన్వీనర్ శివ రాములు, తిరుపతి నాయక్ కలిసి వినతి పత్రం ఇచ్చారు. 'సమాజంలో అలజడులు సృష్టించి, హిందూ సంస్కృతిపై నేరుగా దాడి చేసే ఇలాంటి సంస్థల వల్ల సమాజానికి చేటు కలుగుతుంది తప్ప ఎలాంటి ప్రయోజనం లేదు. 2020 సంవత్సరంలో ఢిల్లీలో నిర్వహించిన తబ్లిగీ జమాతే సమావేశాల వల్ల దేశంలో కరోనా వ్యాపించిన విషయం తెలిసిందే. హిందూ సంస్కృతి సంప్రదాయాలను విచ్ఛిన్నం చేయడమే లక్ష్యంగా శిక్షణ ఇచ్చే ఇలాంటి సంస్థలను నిషేధించాల్సిందే' అని వారు వినతి పత్రంలో కోరారు. ఈ సమావేశాల కోసం విడుదల చేసిన నిధులను వెంటనే రాష్ట్ర ప్రభుత్వం వెనక్కు తీసుకోవాలని వారు వినతి పత్రంలో పేర్కొన్నారు. లేదంటే విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేస్తామని స్పష్టం చేశారు.

రాష్ట్రపతికి ఘనంగా వీడ్కోలు

సాక్షి, హైదరాబాద్: శీతాకాల విడిది ముగించుకుని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఢిల్లీకి తిరిగి వెళ్లారు. రాష్ట్రపతికి శనివారం హకీంపేట ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌లో గవర్నర్ తమిళిసై సౌందర రాజన్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, సీతక్క, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఘనంగా వీడ్కోలు పలికారు. డిసెంబర్ 18న శీతాకాల విడిది కోసం బొల్లారంలోని రాష్ట్రపతి నిలయానికి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము రావడం తెలిసిందే. పర్యటనలో భాగంగా ఆమె పోచంపల్లిలో థీమ్ పెవిలియన్ పార్క్‌లో చీరల తయారీ యూనిట్‌ను సందర్శించి అక్కడి కార్మికులతో ముచ్చటించారు. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ శతాబ్ది ఉత్సవాల్లో పాల్గొన్నారు. బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో పర్యాటకులను ఆకర్షించేందుకు చేపట్టిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలను ముర్ము ప్రారంభించారు. శీతాకాల విడిది ముగించుకుని శనివారం ఢిల్లీకి ప్రత్యేక విమానంలో తిరిగి వెళ్లారు.



రాష్ట్రపతికి వీడ్కోలు పలుకుతున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో గవర్నర్ తమిళిసై, మంత్రులు సీతక్క, శ్రీధర్‌బాబు, పొంగులేటి, కోమటిరెడ్డి

5 లక్షల ప్రమాద బీమా.. 10 లక్షల ఉచిత వైద్యం

ఫుడ్ డెలివరీ బాయ్స్, క్యాబ్ డ్రైవర్లతో భేటీలో సీఎం రేవంత్‌రెడ్డి హామీ

- వారి సంక్షేమం కోసం రాజస్తాన్ తరహాలో ప్రత్యేక చట్టం
- వచ్చే బడ్జెట్ సమావేశాల్లో బిల్లు ప్రవేశపెడతామని వెల్లడి
- త్వరలో టీ–హబ్ ఆధ్వర్యంలో ప్రత్యేక యాప్



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి తమ సమస్యను తెలుపుతున్న అర్బన్ కంపెనీ ఉద్యోగి

సాక్షి, హైదరాబాద్: ఉబర్, ఓలా, జొమాటో, స్విగ్గీ, అర్బన్ కంపెనీ లాంటి యాప్ ఆధారిత సంస్థల్లో పనిచేస్తున్న డ్రైవర్లు, బాయ్‌లకు రూ. 5 లక్షల ప్రమాద బీమా సౌకర్యంతోపాటు రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా రూ. 10 లక్షల వరకు ఉచిత వైద్య సాయం కల్పిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. కొన్ని నెలల క్రితం హైదరాబాద్‌లో ఫుడ్ డెలివరీ కోసం వెళ్లినప్పుడు కుక్క తరమడంతో కంగారులో భవనం పైనుంచి పడి మరణించిన ఓ డెలివరీ బాయ్ కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ. 2 లక్షలు అందించాలని అధికారులను ఆదేశించారు. క్యాబ్ సంస్థలు నిర్వహిస్తున్న తరహాలో ఓ యాప్‌ను టీ–హబ్ ద్వారా సిద్ధం చేసి అవకాశం ఉన్న వారికి ఉపాధి కల్పించనున్నట్లు తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా రాహుల్ గాంధీ తెలంగాణలో పర్యటించినప్పుడు నవంబర్ 27న కొందరు ఫుడ్ డెలివరీ బాయ్‌లతో భేటీ కావడం తెలిసిందే. అప్పుడు వారి సమస్యలను అడిగి తెలుసుకున్న రాహుల్... తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కాగానే ఆయా సమస్యల పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఏఐసీసీ ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ చైర్మన్ ప్రవీణ్ చక్రవర్తిని ఈ మేరకు ఆదేశించారు. దీంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం సాయంత్రం నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఓలా, ఉబర్ ద్వారా పనిచేసే ఆటో డ్రైవర్లతోపాటు క్యాబ్ డ్రైవర్లు, ఫుడ్ డెలివరీ బాయ్‌ల సమస్యలను తెలుసుకోవడానికి ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఆయా సంస్థల్లో పనిచేస్తున్న బాయ్‌లతో స్వయంగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. సామాజిక బాధ్యతలో భాగంగా ఆయా సంస్థల్లో పనిచేస్తూ రక్షణ లేకుండా ఇబ్బందులు పడుతున్న వారికి రక్షణ కల్పించేందుకు చర్యలు తీసుకోనున్నామని వెల్లడించారు. అసంఘటిత రంగ కార్మికుల ఉపాధి, సామాజిక భద్రతకు చర్యలు తీసుకుంటామని రాహుల్ గాంధీ మాట ఇచ్చారని... ఆ క్రమంలో విధాన నిర్ణయం తీసుకుంటామన్నారు. ఇందుకోసం రాజస్తాన్‌లో చేసిన చట్టాన్ని అధ్యయనం చేసి వచ్చే బడ్జెట్ సమావేశాల్లో అంతకంటే మెరుగైన విధంగా చట్టం తయారీకి బిల్లు ప్రవేశపెడతామని చెప్పారు.

కార్మికుల సంక్షేమంపై దృష్టిపెట్టని సంస్థలపై చర్యలు..

'సంస్థలు కూడా లాభాపేక్ష మాత్రమే చూడకుండా కార్మికులు, ఉద్యోగుల సంక్షేమంపై దృష్టి పెట్టాలి. సిబ్బంది సంక్షేమాన్ని విస్మరించే ఎంత పెద్ద సంస్థలపైనైనా చర్యలు తీసుకోవడానికి వెనుకాడబోం. నాలుగు నెలల క్రితం ఓ స్విగ్గి డెలివరీ బాయ్ కుక్క తరిమితే భవనం పైనుంచి పడి మృతి చెందాడు. అప్పటి ప్రభుత్వం నుంచి ఏదైనా సాయం అందుతుందేమోనని చూశా. కానీ ఆ ప్రభుత్వం ఏమీ చేయలేదు. ప్రభుత్వాలు ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు మానవత్వంతో వ్యవహరించాలి. అందుకే ఆ కుటుంబం వివరాలు సేకరించి సీఎం సహాయనిధి నుంచి మృతుని కుటుంబానికి రూ. 2 లక్షలు అందించాలని అధికారులకు ఆదేశాలు ఇస్తున్నా' అని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ నెల 28 నుంచి జనవరి 6 వరకు నిర్వహించే ప్రజాపాలన గ్రామసభల్లో పూర్తి వివరాలతో దరఖాస్తు చేసుకోవాలని క్యాబ్ డ్రైవర్లు, ఫుడ్ డెలివరీ బాయ్‌లకు సీఎం సూచించారు. డిజిటల్, మాన్యువల్ రూపంలోనైనా దరఖాస్తులు ఇవ్వొచ్చన్నారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను అన్నింటినీ పరిష్కరిస్తామని సీఎం హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు, ఏఐసీసీ సెక్రటరీలు రోహిత్ చౌదరి, మన్సూర్ అలీఖాన్, మధుయాష్కీ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్ గౌడ్ పాల్గొన్నారు.

ఆటోవాలాలు ఆందోళన పడొద్దు

మంత్రి పొన్నం ప్రభాకర్

ఆరు గ్యారంటీల అమల్లో భాగంగా మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో కల్పించిన ఉచిత ప్రయాణ సౌకర్యం వల్ల తమ ఉపాధి దెబ్బతింటోందని ఆటోవాలాలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ఆటోవాలాలతోనూ త్వరలో చర్చించి వారికి ఇబ్బంది లేని రీతిలో తీసుకోవాల్సిన చర్యలపై నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. క్యాబ్, ఫుడ్ డెలివరీ బాయ్స్‌తో సమావేశం అనంతరం పొన్నం ప్రభాకర్ విలేకరులతో మాట్లాడారు. ఈ పథకం వల్ల ఆటోవాలాల ఉపాధి పడిపోదని, బస్సులు దిగాక ఇతర ప్రాంతాలకు వెళ్లాలంటే ప్రయాణికులు మళ్లీ ఆటోలనే కదా ఆశ్రయించాల్సిందని అన్నారు.

అడ్వొకేట్ జనరల్‌గా ఎ.సుదర్శన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర హైకోర్టు అడ్వొకేట్ జనరల్ (ఏజీ)గా సీనియర్ న్యాయవాది ఎ. సుదర్శన్‌రెడ్డిని నియమించాలని రాష్ట్ర ప్రభుత్వం శనివారం నిర్ణయించింది. ఈ మేరకు ఆయన పేరును సూచిస్తూ రాజ్‌భవన్‌కు సమాచారం అందించింది. గవర్నర్ ఆమోదంతో అధికారిక జీవో విడుదల కావాల్సి ఉంది. ఆమె అందుబాటులో లేకపోవడంతో ఇంకా విడుదల కాలేదు. పదేళ్ల తరువాత కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో తొలుత చాలా మంది సీనియర్ల పేర్లు వినిపించాయి. అయితే అన్ని పేర్లను పరిశీలించిన తర్వాత గతంలో ఏజీగా పనిచేసిన సుదర్శన్‌రెడ్డికి ప్రభుత్వం మరోసారి అవకాశం ఇచ్చింది. 2011లో ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి హయాంలో ఉమ్మడి హైకోర్టులో సుదర్శన్‌రెడ్డి ఏజీగా విధులు నిర్వహించారు. అడ్వొకేట్ జనరల్ పదవి చేపట్టిన తొలి తెలంగాణ న్యాయవాది ఆయనే కావడం గమనార్హం. 2014లో కాంగ్రెస్ ప్రభుత్వ పదవీకాలం ముగిసే నాటికి ఏజీగా సుదర్శన్ రెడ్డి పనిచేశారు. వివాద రహితుడైన సుదర్శన్‌రెడ్డికి.. కేసుల్లో సమర్థ వాదనలు వినిపిస్తారన్న పేరు ఉంది.

సుదర్శన్‌రెడ్డి నేపథ్యం...

ఎ.సుదర్శన్‌రెడ్డి 1959 మే 25న జగిత్యాల జిల్లా రాచేపల్లిలో జన్మించారు. 1985లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్‌లో న్యాయవాదిగా ఎన్‌రోల్ అయ్యారు. రాజ్యాంగ, సివిల్, కార్పొరేట్, ఆర్బిట్రేషన్, క్రిమినల్, సర్వీస్ లాకు సంబంధించిన కేసుల్లో హైకోర్టు, సిటీ సివిల్ కోర్టు, రంగారెడ్డి జిల్లా కోర్టు సహా ఇతర కోర్టుల్లో వాదనలు వినిపించారు. ఇండియన్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియాకు ప్యానెల్ అడ్వొకేట్‌గా పనిచేశారు. ఆంధ్రప్రదేశ్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఏపీ విద్యావిధాన్ పరిషత్‌కు న్యాయవాదిగా విధులు నిర్వహించారు. 2011లో ఏజీ బాధ్యతలు చేపట్టిన ఆయన తెలంగాణ రాష్ట్రంలో తొలిసారి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పాటయ్యాక రాజీనామా చేశారు.

పారిశ్రామిక ప్రగతిలో మరో మైలురాయి

వైఎస్సార్ జిల్లాలో 'సెంచరీ' ప్యానెల్స్ పరిశ్రమ ఉత్పత్తితో పాటు పలు అభివృద్ధి పనులకు ఏపీ సీఎం జగన్ శ్రీకారం



వైఎస్సార్ జిల్లా బద్వేలు వద్ద సెంచరీ ప్యానల్స్ సంస్థను ప్రారంభిస్తున్న సీఎం వైఎస్ జగన్

సాక్షి ప్రతినిధి, కడప : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శనివారం వైఎస్సార్ జిల్లాలో అనేక అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. బద్వేలు నియోజకవర్గం గోపవరం మండల పరిధిలోని ఇండస్ట్రియల్ పార్కులో రూ.956 కోట్ల పెట్టుబడితో ఏర్పాటైన సెంచరీ ప్యానెల్స్ లిమిటెడ్ (సీపీఎల్) పరిశ్రమ ఉత్పత్తిని ఆయన ప్రారంభించి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అలాగే, కడప రిమ్స్ ప్రాంగణంలో అత్యాధునిక మౌలిక వసతులతో నిర్మించిన డా.వైఎస్సార్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, డా. వైఎస్సార్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్, డా.వైఎస్సార్ క్యాన్సర్ కేర్ సెంటర్లతో పాటు ఎల్వీ ప్రసాద్ ఐ హాస్పిటల్ భవనాలకు ముఖ్యమంత్రి వేర్వేరుగా ప్రారంభోత్సవం చేశారు. ఆ తర్వాత.. ఆధునీకరించిన వైఎస్సార్ జిల్లా కలెక్టరేట్ భవనాన్ని, రూ.56.70కోట్లతో నిర్మించిన అంబేడ్కర్ సర్కిల్–వై జంక్షన్ రోడ్డును, 15వ ఆర్థిక సంఘం, 'కుడా' సహకారంతో నిర్మించిన కోటిరెడ్డి సర్కిల్‌ను ఆయన ప్రారంభించారు. కలెక్టరేట్ ప్రాంగణంలోనే జిల్లాలోని అర్హులైన 50 మంది దివ్యాంగులకు ముఖ్యమంత్రి జగన్ రెట్రో ఫిట్టెడ్ మోటరైజ్డ్ స్కూటర్లను ఉచితంగా పంపిణీ చేయడంతోపాటు అగ్నిమాపక విభాగం కొనుగోలు చేసిన రెస్క్యూ పరికరాలను ప్రారంభించారు. సెంచరీ ప్యానెల్స్ పరిశ్రమ జిల్లా పారిశ్రామిక ప్రగతిలో మరో మైలురాయి అని సీఎం జగన్ అభివర్ణించారు. అన్ని మౌలిక సదుపాయాలతో సహా ఎకరా రూ.15 లక్షల రాయితీ ధరతో ఏపీఐఐసి ద్వారా రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన 100 ఎకరాల విస్తీర్ణంలో సెంచరీ ప్యానెల్స్ లిమిటెడ్ (సీపీఎల్) పరిశ్రమ ఏర్పాటైందన్నారు. లాంజ్ రూమ్‌లో కంపెనీకి సంబంధించిన వీడియోను తిలకించారు. సెంచరీ సంస్థ చైర్మన్ సజ్జన్ బజంకా, మేనేజింగ్ డైరెక్టర్ సంజయ్ అగర్వాల్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేశవ్ బజంకా సంస్థ గురించి సీఎంకు వివరించారు. అనంతరం.. ప్రజలకు మెరుగైన వైద్య సేవలతో పాటు ఆరోగ్యకర సమాజం కోసం ఎంతోమంది వైద్యులను అందిస్తున్న రిమ్స్ (రాజీవ్‌గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్).. మెడికల్ హబ్‌గా రాయలసీమకే తలమానికంగా మారిందని సీఎం జగన్ ప్రశంసించారు.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

సకల హంగులతో హైకోర్టు నిర్మిస్తాం: కోమటిరెడ్డి

- వ్యవసాయ వర్సిటీ పరిధిలో వంద ఎకరాల భూమి కేటాయింపు
- మంత్రి శ్రీధర్‌బాబు, న్యాయమూర్తులతో కలిసి పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రులు, న్యాయమూర్తులు

సాక్షి, హైదరాబాద్/ఏజీ వర్సిటీ: రాష్ట్ర హైకోర్టు నూతన భవన నిర్మాణానికి కావాల్సిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని, సకల హంగులతో నిర్మిస్తామని ఆర్ అండ్‌బీ, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలో హైకోర్టు భవనానికి కేటాయించిన వంద ఎకరాల స్థలాన్ని ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ అభినంద్ కుమార్ శావిలి, జస్టిస్ టి.వినోద్‌కుమార్, జస్టిస్ లక్ష్మణ్, జస్టిస్ విజయసేన్‌రెడ్డితో కలసి ఆయన శనివారం పరిశీలించారు. సంబంధిత అధికారులను పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం దీనిపై ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్నారు. కోమటిరెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రజలకు సత్వరన్యాయం అందించడానికి అవసరమైన మౌలికవసతుల కల్పనలో నిర్లక్ష్యంగా వ్యవహరించిందని, ఇది తీరని ఇబ్బందులు కలిగించిందన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో న్యాయ సౌకర్యాల కల్పనలో రాజీపడకుండా కక్షిదారులు, న్యాయమూర్తులు, న్యాయవాదుల అవసరాలకు సరిపడేలా, సకల సౌకర్యాలతో హైకోర్టును నిర్మిస్తామని చెప్పారు. కార్యక్రమంలో రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిత్తల్, పంచాయతీరాజ్ కార్యదర్శి ఎం.రఘునందన్‌రావు, న్యాయశాఖ కార్యదర్శి ఆర్.తిరుపతి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ భారతీ హోళికెరితోపాటు ఇతర న్యాయమూర్తులు, అధికారులు పాల్గొన్నారు. కాగా, హైకోర్టు నిర్మాణం కోసం వ్యవసాయ వర్సిటీలో భూమి కేటాయించడాన్ని వ్యతిరేకిస్తూ వర్సిటీ నాన్ టీచింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ సభ్యులు తీర్మానించారు. వర్సిటీ భూములు రైతులకు విజ్ఞానాన్ని అందించడానికే తప్ప, ఇతర నిర్మాణాలకు కాదన్నారు.

ప్రజలకు చేరువలో రెవెన్యూ పాలన: కోదండరామ్



సాక్షి,హైదరాబాద్: ప్రజలకు చేరువలో రెవెన్యూ పాలన ఉంటుందని తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్ ఆశాభావం వ్యక్తం చేశారు. తూంకుంటలో శనివారం తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ సర్వీసెస్ అసోసియేషన్ (ట్రెసా) ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్ర రెవెన్యూ ఉద్యోగుల సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. గత పదేళ్లలో అస్తవ్యస్తమైన భూ రికార్డుల నిర్వహణలో సమూల మార్పులు తీసుకురావాలని పిలుపునిచ్చారు. రెవెన్యూ ఉద్యోగులు, వీఆర్ఏ, వీఆర్‌ఓలు, ఆపరేటర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ట్రెసా రాష్ట్ర అధ్యక్షుడు వంగా రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ...కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో రెవెన్యూ శాఖ పూర్వవైభవం సాధిస్తుందన్న నమ్మకం ఉందన్నారు. ఉద్యోగులందరూ ప్రజలకు సేవలందించి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలని కోరారు. పాత్రికేయుడు మన్నె నర్సింహారెడ్డి మాట్లాడుతూ రెవెన్యూ ఉద్యోగులు ఎల్లవేళలా ప్రజాసేవలో ముందుంటారని పేర్కొన్నారు. సమావేశంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పడిగెల రాజ్‌కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు బాణాల రాంరెడ్డి, దేశ్య, నిరంజన్ పాల్గొన్నారు.



ఆయన బాధపడువాని బాధను తృణీకరింపలేదు.
దానిని చూచి ఆయన అసహ్యపడలేదు. అతనికి తన ముఖమును దాచలేదు.
వాడాయనకు మొఱ్ఱపెట్టగా ఆయన ఆలకించెను.
– క్రైస్తవ ధర్మం

ఫోకస్

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, మార్గశిర మాసం,
తిథి: శు.ద్వాదశి ఉ.6.35 వరకు, తదుపరి త్రయోదశి తె.5.31 వరకు (తెల్లవారితే సోమవారం), **నక్షత్రం:** కృత్తిక రా.9.45 వరకు, తదుపరి రోహిణి, **వర్జ్యం:** ఉ.9.59 నుండి 11.31 వరకు, **దుర్ముహూర్తం:** ప.4.05 నుండి 4.53 వరకు, **అమృతఘడియలు:** రా.7.06 నుండి 9.0.1 వరకు, హనుమద్వ్రతం.

సూర్యోదయం : 6.31
సూర్యాస్తమయం : 5.28
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

ఎల్.కె. అద్వానీ (బీజేపీ అగ్రనేత)

రాయని డైరీ

మాధవ్ శింగరాజు

ఇన్విటేషన్ ఇవ్వడం కోసం ఇల్లు వెతుక్కుంటూ వస్తారు ఎవరైనా! ఇన్విటేషన్ ఇవ్వకుండా ఉండటం కోసం ఢిల్లీలోని '30, పృథ్వీరాజ్ రోడ్డు'లో నేనుంటున్న ఇంటిని వెతుక్కుంటూ వచ్చారు చంపత్ రాయ్! రామజన్మభూమి తీర్థక్షేత్రం ట్రస్టు ప్రధాన కార్యదర్శి ఆయన. వీహెచ్‌పీ లీడర్.

లోపల హాల్లో ఉన్నాన్నేను.

"నాన్నగారూ! చంపత్ అంకుల్ వచ్చారు..." అంటూ, చంపత్‌ని నేనున్న చోటుకు నడిపించుకుని వచ్చింది ప్రతిభ.

నిజానికి నడిపించుకుని రావడానికి ఆయనేమీ నడవలేని స్థితిలో లేరు. నా 96 ఏళ్ల వయసులో నేను నడవలేని స్థితిలో ఉండి ఉంటానని ఆయన ప్రగాఢంగా విశ్వసిస్తూ ఉండటం వల్లనో ఏమో, నా స్థితికి తగినట్లుగా తన స్థితిని మార్చుకోవడం కోసం నా దగ్గరికి వస్తున్నప్పుడు తన నడక వేగాన్ని తన 77 ఏళ్ల వయసుకు తగని విధంగా బాగా ఎక్కువగా తగ్గించుకున్నట్లున్నారు! విశ్వహిందూ పరిషత్ నుండి వచ్చేవాళ్లు ఇలా 'మార్గదర్శక్ మండల్' పెద్దల్ని గౌరవించడం మామూలే. బతికుండగా



అటల్ బిహారి వాజ్‌పేయిని కూడా వారు తరచూ ఇలాగే గౌరవిస్తుండేవారు. ఇప్పుడు నా దగ్గర్నుంచి '6, రైసినా రోడ్డు'లోని మురళీ మనోహర్ జోషీ ఇంటికి వెళ్లాక అక్కడ ఆయన్ని కూడా ఇలాగే గౌరవిస్తారు.

"రండి చంపత్‌జీ! కూర్చోండి" అన్నాను.

చంపత్ చేతుల్లో పసుపు రాసిన ఎరుపు రంగు కవర్లు ఉన్నాయి. వెంటనే వాటిల్లోంచి ఒక కార్డు తీసి నాకేమీ ఇవ్వలేదు ఆయన.

"పంచాల్సిన కార్డులు ఇంకా చాలా ఉన్నాయి అద్వానీజీ! జనవరి 16న ప్రాణ ప్రతిష్ఠ పెట్టుకున్నాం..." అన్నారు!

పెట్టుకోవడమా!!

ప్రాణ ప్రతిష్ఠను ఆయన శ్రీరాముడికి, వీహెచ్‌పీకి... లేదా శ్రీరాముడికీ, శ్రీ నరేంద్ర మోదీజీకి మధ్య మాత్రమే జరిగే వంశవృక్ష మహోత్సవంలా నిర్వహించదలచినట్లున్నారు!

"మీరు అంత దూరం రాగలిగితే మంచిదే కానీ, రాకపోవడమే మంచిదేమో అద్వానీజీ. పైగా ఎముకలు కొరికే ఈ చలిగాలులొకటీ..!" అన్నారు చంపత్.

నాకర్థమైంది. ఆయన నన్ను రావద్దని అనడం లేదు. రావాల్సిందేననీ అనడం లేదు.

నవ్వుతూ ఆయన వైపు చూశాను.

"నాకెప్పుడూ ఒకటి అనిపిస్తుంటుంది అద్వానీజీ... గొప్పవాళ్లంతా ఒక వరుసలో జన్మిస్తారని! మీరు నవంబర్‌లో జన్మించారు. వాజ్‌పేయి డిసెంబర్‌లో జన్మించారు. జోషీజీ జనవరిలో జన్మించారు..." అన్నారు చంపత్!

"మంచి పరిశీలన..." అన్నాను నవ్వుతూ.

"వస్తాను అద్వానీజీ! ఇంకా అమితాబ్ బచ్చన్, రజనీకాంత్, మాధురీ దీక్షిత్, రామ్‌దేవ్ బాబా, అంబానీ బ్రదర్స్ మరికొంత మంది నా వాటాగా మిగిలిపోయారు..." అన్నారు చంపత్ రాయ్, పైకి లేస్తూ!

మరి నేను, జోషి ఎవరి వాటాలో ఉన్నట్లు?!

"చంపత్‌జీ! నాకైదేనా చెప్పాలని వచ్చి చెప్పకుండా వెళ్లిపోతున్నారా? అని అడిగాను చంపత్‌ని... ఇవ్వాలని వచ్చి ఇవ్వకుండా పోతున్నారా అని అడిగితే బాగోదని!

"అదే చెప్పబోతున్నా అద్వానీజీ! నేను వెళ్లాక ఎవరైనా మిమ్మల్ని వెతుక్కుంటూ వచ్చి ఇన్విటేషన్ ఇస్తే తీసుకోండి కానీ, రాలేనని మాత్రం చెప్పకండి. ట్రై చేస్తానని చెప్పండి. ఇది చెప్పడానికే వచ్చాను..." అని కార్డులు లెక్క చూసుకుంటూ నడక వేగం పెంచారు చంపత్.

చంపత్ చెప్పినట్లే వీహెచ్‌పీ నుంచి అలోక్ కుమార్, రామ్‌లాల్, కృష్ణగోపాల్ వచ్చి, కార్డులు ఇచ్చి వెళ్లారు! వాళ్లటు వెళ్లగానే జోషీకి ఫోన్ చేశాను.

"జోషీజీ! కార్డు ఇవ్వకుండా రమ్మని చెప్పడం, రమ్మని చెప్పకుండా కార్డు ఇవ్వడం.. రెండిట్లో ఏది మన 'మార్గదర్శక్ మండల్'లోని వారికి గొప్ప గౌరవం?" అని అడిగాను.

జోషీ నవ్వారు. "అది అడగడానికే మీకు ఫోన్ చేయబోతున్నాను అద్వానీజీ... ఈలోపు మీరే నాకు ఫోన్ చేశారు..." అన్నారాయన.

పీకే అండ్ పీకే ఫార్ములా!

జనతంత్రం



వర్ధెల్లి మురళి

ముసుగు జారిపోయింది. ఇప్పుడంతా తేటతెల్లం. చంద్రబాబు కోసం పవన్ కల్యాణ్ చేత చంద్రబాబే ఏర్పాటు చేయించిన 'స్పెషల్ పర్పస్ వెహికిల్' (ఎస్‌పీవీ) జనసేన. అది ప్యాకేజీ ఫీజుతో కాంట్రాక్టుపై పనిచేస్తున్నదని వైఎస్సార్‌సీపీ నాయకులు చాలాకాలంగా విమర్శలు చేస్తున్నారు. ఏడెనిమిదేళ్లుగా జనసేన కోసం జీవితాలను ధారబోసి ఇప్పుడిప్పుడే బయటకు వస్తున్న యువకులు ఇంకో అడుగు ముందుకు వేసి చెబుతున్న మాట – 'చంద్రబాబు సినిమాలో... జనసేన ఓ ఐటమ్ సాంగ్ మాత్రమే!'

కొద్ది రోజులుగా పవన్ కల్యాణ్ చెబుతున్న మాటలు జనసేన కార్యకర్తల్లోని అనుమానాలను బలపరుస్తున్నాయి. 'రాజకీయ వ్యూహం నాకు వదిలేయండి. నేనేం చేసినా ప్రశ్నించవద్దు. తెలుగుదేశం పార్టీతో పొత్తును వ్యతిరేకించేవాళ్లు పార్టీలో ఉండనవసరం లేదు. తెలుగుదేశం పార్టీతో పొత్తు పదేళ్లు కొనసాగవలసిన అవసరం ఉన్నది'. ఈ రకమైన సుభాషితాలు విశదం చేస్తున్న విషయమేమిటి? తెలుగుదేశంతో ఇంకో పదేళ్లపాటు పొత్తుకు డీల్ కుదిరిందనే కదా!

ఈ డీల్ వల్ల జనసేనకు ఒనగూరే ప్రయోజనమెంత? ఎన్ని అసెంబ్లీ సీట్లు దక్కనున్నాయి. ముఖ్యమంత్రి పదవి జనసేనకు ఎన్నేళ్లు... టీడీపీకి ఎన్నేళ్లు? ఇటువంటి ప్రశ్నలు అడగొద్దనే ఉద్దేశంతోనే సొంత పార్టీ అభిమానుల ముందరి కాళ్లకు పవన్ ముందుగానే బంధనాలు వేశారు. దాటవేత పద్ధతిలో సొంత పార్టీ వారిని ఏమార్చుతూ వచ్చారు. 'ముందుగా సీట్లు గెలవాలి. ఎక్కువ సీట్లు గెలిస్తేనే కదా ముఖ్యమంత్రి పదవిని అడగగలం... ముందు ఎక్కువ సీట్లలో జనసేనను గెలిపించండ'ని కార్యకర్తల పైనే పవన్ ఎదురుదాడి చేస్తూ వచ్చారు. సరే, పొత్తులో భాగంగా మనం ఎన్ని సీట్లలో పోటీ చేయబోతున్నామని కార్యకర్తల ప్రశ్న. ముఖ్యమంత్రి పదవి దక్కేంతగా మెజారిటీ సీట్లు తీసుకోబోతున్నామా? పోనీ హరిరామజోగయ్య వంటి శ్రేయోభిలాషులు చెబుతున్నట్టుగా కనీసం 60 సీట్లు?

జనసేనకు అంత సీన్ లేదని తెలుగుదేశం పార్టీ కో-పైలట్‌గా భావించుకుంటున్న లోకేశ్‌బాబు కుండబద్దలు కొట్టారు. గత ఎన్నికల్లో లోకేశ్ ఒక్క సీట్లోనే ఓడిపోతే పవన్ రెండుచోట్లా ఓడిపోయారు. అందువల్ల ఆ మాత్రం చులకన భావం లోకేశ్‌కు సహజం. కచ్చితంగా 150 సీట్లలో తెలుగుదేశం అభ్యర్థులే ఉంటారని తాజాగా ఒక వెబ్ చానల్ ఇంటర్వ్యూలో లోకేశ్ వెల్లడించారు. ముఖ్యమంత్రి పదవి షేరింగ్ అనే సమస్యే రాదనీ, అటువంటి ప్రస్తావనే రాలేదనీ, చంద్రబాబే తమ ముఖ్యమంత్రి అభ్యర్థనీ లోకేశ్ ఆ ఇంటర్వ్యూలో స్పష్టం చేశారు. అనుభవజ్ఞుడైన చంద్రబాబే ముఖ్యమంత్రిగా ఉండాలని పవన్ కూడా అంగీకరించినట్టు లోకేశ్ వెల్లడించారు.

లోకేశ్‌బాబు ఇంటర్వ్యూ సారాంశం ప్రకారం గరిష్ఠంగా 25 అసెంబ్లీ సీట్లను జనసేనకు కేటాయించే అవకాశం ఉన్నది. అందులో కూడా సగంమంది అభ్యర్థులకు కొత్తగా జనసేన తీర్థమిచ్చి టీడీపీ సమకూర్చుతుందని విశ్వసనీయ సమాచారం. మిగిలిన పది, పన్నెండుమంది ఎంపికను కూడా టీడీపీ నాయకత్వం ఆమోదించవలసి ఉంటుంది. ఇంత అవమానకరమైన ఒప్పందానికి ఏ రాజకీయ పక్షమైనా ఒప్పుకుంటుందా? ఇంకేదో మనకు తెలియని కోణం ఉన్నందువల్లనే ఇటువంటి పొత్తులు సాధ్యమవుతాయి. ఏమిటా కోణం? అదో సింగపూర్ రహస్యమంటారు జనసేన వ్యవహారాలు బాగా తెలిసినవాళ్లు. చిదంబర రహస్యం గురించి విన్నాం గానీ ఈ సింగపూర్ రహస్యం ఏమిటో అంతుపట్టడం లేదు. చంద్రబాబుకు సింగపూర్‌తో వ్యాపార సంబంధాలు చాలాకాలం నుంచి ఉన్నాయనేది బహిరంగమే. బహుశా రాజకీయ లావాదేవీలను కూడా అక్కడి నుంచి నరుక్కొస్తారేమో!

ఈ కోణాల సంగతీ, కుంభకోణాల సంగతీ పక్కన పెడదాం. వైసీపీ, టీడీపీలకు ప్రత్యామ్నాయంగా ఎదుగుతామని చెప్పుకొని, రాష్ట్రంలో ఉన్న మరో బలమైన సామాజికవర్గపు ఆకాంక్షలతో ఊపిరిపోసుకున్న పార్టీ నిజస్వరూపం ఇలా వెల్లడైతే దాన్ని నమ్ముకున్న వారి పరిస్థితి ఏమిటి? జనసేన నాయకత్వాన్ని గుడ్డిగా నమ్ముకుంటూ వస్తున్న క్షేత్రస్థాయి జనసేన కార్యకర్తల్లో చాలామందికి లోకేశ్‌బాబు తాజా ఇంటర్వ్యూ కళ్లు తెరిపించి ఉండాలి. వారి మనోభావాలనే హరిరామ జోగయ్య లేఖ రూపంలో పవన్ కల్యాణ్‌కు చేరవేశారు. 'లోకేశ్



> లోకేశ్‌బాబు ఇంటర్వ్యూ సారాంశం ప్రకారం గరిష్ఠంగా 25 అసెంబ్లీ సీట్లను జనసేనకు కేటాయించే అవకాశం ఉన్నది. అందులో కూడా సగం మంది అభ్యర్థులకు కొత్తగా జనసేన తీర్థమిచ్చి టీడీపీ సమకూర్చుతుందని విశ్వసనీయ సమాచారం. మిగిలిన పది, పన్నెండుమంది ఎంపికను కూడా టీడీపీ నాయకత్వం ఆమోదించవలసి ఉంటుంది. ఇంత అవమానకరమైన ఒప్పందానికి ఏ రాజకీయ పక్షమైనా ఒప్పుకుంటుందా? ఇంకేదో మనకు తెలియని కోణం ఉన్నందువల్లనే ఇటువంటి పొత్తులు సాధ్యమవుతాయి. ఏమిటా కోణం? అదో సింగపూర్ రహస్యమంటారు జనసేన వ్యవహారాలు బాగా తెలిసినవాళ్లు. చిదంబర రహస్యం గురించి విన్నాం గానీ ఈ సింగపూర్ రహస్యం ఏమిటో అంతుపట్టడం లేదు. చంద్రబాబుకు సింగపూర్‌తో వ్యాపార సంబంధాలు చాలాకాలం నుంచి ఉన్నాయనేది బహిరంగమే. బహుశా రాజకీయ లావాదేవీలను కూడా అక్కడి నుంచి నరుక్కొస్తారేమో!

చెప్పిన మాటలకు మీ ఆమోదం ఉన్నదా' అని లేఖలో జోగయ్య ప్రశ్నించారు. 'మీరు ముఖ్యమంత్రి కావాలనీ, అధికారం చేపట్టడం ద్వారా బడుగు బలహీన వర్గాలు యాచించే స్థితి నుంచి శాసించే స్థాయికి రావాలనీ కలలు కంటున్న జనసైనికుల కలలు ఏం కావాలనుకుంటున్నార'ని కూడా ఆయన ప్రశ్నించారు. చివరకు 60 సీట్లకు తగ్గకుండా పొత్తులో భాగంగా దక్కించుకోవాలని పవన్ కల్యాణ్‌కు ఆయన సూచించారు.

పవన్ కల్యాణ్‌తో వ్యవహరించే తీరుపై పెదబాబు, చినబాబుల అభిప్రాయాల్లో కొద్దిగా తేడాలున్నాయట! కనీసం 30 సీట్లన్నా ఇవ్వకపోతే జనసైనికులకు సర్దిచెప్పడం కష్టమన్న పవన్ వైఖరి పట్ల చంద్రబాబు ఒకింత సానుభూతిగా ఉన్నట్టు సమాచారం. అయితే ఆ సీట్లు 20 దాటకూడదని లోకేశ్‌బాబు గట్టి పట్టుదలతో ఉన్నారు. చంద్రబాబు జైలుకెళ్లిన సందర్భంలో అరెస్టు భయంతో చినబాబు ఢిల్లీలో తలదాచుకున్న విషయం తెలిసిందే. ఆ సమయంలో ప్రశాంత్ కిశోర్‌తో (పీకే) స్నేహం కుదిరింది. ఎన్నికల్లో ఈసారి తమకు వ్యూహకర్తగా పనిచేయాలని పీకేను లోకేశ్ అడిగారట! ఇప్పటికే పీకే టీమ్‌లో పనిచేసిన రాబిన్‌సింగ్ తెలుగుదేశం వ్యూహకర్తగా పనిచేస్తున్నారు.

ఢిల్లీలో జరిగిన భేటీ సందర్భంగానే పవన్ కల్యాణ్‌ను అతిగా ఊహించుకోవద్దనీ, అతనికి కాపు సామాజికవర్గంలో కూడా పెద్దగా బలం లేదనీ పీకే లోకేశ్‌కు చెప్పినట్టు తెలిసింది. జనసేనకు ఎన్ని ఎక్కువ సీట్లిస్తే అంత ఎక్కువ నష్టం జరుగుతుందని తన అభిప్రాయంగా చెప్పారట! అయితే వ్యూహకర్తగా పనిచేయడానికి తన నిస్సహాయతను వ్యక్తం చేస్తూ, తన సమాచారం ప్రకారం వైసీపీ మరోసారి గెలిచే అవకాశాలున్నట్టు చెప్పారట! అప్పటినుంచీ పీకేను వ్యూహకర్తగా ఒప్పించడం కోసం లోకేశ్ రకరకాలుగా ప్రయత్నిస్తున్నారు.

పీకే సలహా మేరకు 20 లోపు స్థానాలకే జనసేనను పరిమితం చేయాలని లోకేశ్ పట్టుదలగా ఉండడంతో విషయం తెలిసిన పవన్ కల్యాణ్ పాదయాత్ర ముగింపు సభకు తాను రానని బెట్టు చేసిన సంగతి తెలిసిందే. అంతకుముందు సభకు రావడానికి అంగీకరించిన పవన్ మొండికేయడంతో చంద్రబాబు స్వయంగా పవన్ ఇంటికి వెళ్లి అనునయించారట! ఇతరత్రా ఒప్పందాల సంగతి తెలియదు గానీ, అసెంబ్లీ సీట్ల సంఖ్యను 25కు పెంచి ఇస్తామని బాబు హామీ ఇచ్చినట్టు తెలిసింది. జనసైనికుల నుంచి వ్యతిరేకతను ఎదుర్కోవలసి వస్తుందని భయపడినప్పటికీ ఆ సంఖ్యకు ఒప్పుకోక తప్పలేదు. ఆ బాడీ లాంగ్వేజ్‌లో కూడా అప్పటి వాతావరణ ప్రభావం కనిపించింది. చంద్రబాబును సాగనంపడానికి బయటకొచ్చిన పవన్ దూరంగా నిలబడి ఉండగా నాదెండ్ల మనోహర్ మాత్రం చిరునవ్వులు చిందిస్తూ బాబుకు వీడ్కోలు చెప్పడం కనిపించింది.

ఎట్టకేలకు లోకేశ్ పాదయాత్ర ముగింపు సభకు పవన్ కల్యాణ్ హాజరయ్యారు. ఆ సభకు పెట్టుకున్న పేరు విజయోత్సవ సభ. లైవ్‌లో కార్యక్రమాన్ని చూసిన వారంతా ఏకగ్రీవంగా చెప్పిన మాట ఏమిటంటే – అది విజయోత్సవ సభ కాదు, సంతాప సభలా ఉన్నదని! పోనీ పాదయాత్ర తొలి రోజున చనిపోయిన తారకరత్న సంతాప సభగా దాన్ని మార్చారా అంటే అదీ లేదు. అతని పేరు తల్చుకున్నవారే లేరు. కానీ వేదిక మీదున్న నాయకుల ముఖాలు మాత్రం దీనంగా వేలాడుతూ కనిపించాయి. అందుకు సభ ఫెయిల్యూర్ ఒక కారణం కావచ్చు. ఆరు లక్షలమందిని సమీకరించి ఒక బలమైన ముద్ర వేయాలని టీడీపీ గట్టిగా సంకల్పించింది. అందుకు అవసరమైన ఏర్పాట్లన్నీ చేసింది. ఏం జరిగిందో తెలియదు. సభకు నలభై నుంచి యాభైవేల మంది వరకు వచ్చి ఉంటారని తేలింది. చంద్రబాబు ప్రసంగించే సమయంలో పట్టుమని పదివేల మంది లేరు. ఇదీ రాష్ట్రంలో తెలుగుదేశం – జనసేనల ఉమ్మడి ప్రభావం. ఇక సంతాప వాతావరణానికి రెండో కారణం – పొత్తులో కత్తుల వ్యవహారం కావచ్చు.

జనసేన శ్రేణుల్లో ఒకపక్క అసంతృప్తి రాజుకుంటున్న తరుణంలోనే హఠాత్తుగా ఎన్నికల వ్యూహకర్తగా పేరుగాంచిన ప్రశాంత్ కిశోర్ ఊడిపడ్డారు. బీజేపీ తరఫున రాజ్యసభలో ఉన్న సీఎమ్ రమేశ్‌కు చెందిన ప్రైవేట్ విమానంలో లోకేశ్, కిలారు రాజేశ్‌లతో కలిసి ఆయన విజయవాడకు వచ్చారు. చంద్రబాబును కలుసుకున్నారు. రకరకాల వార్తలు ప్రచారంలోకి వచ్చాయి. ఈ భేటీపై ఢిల్లీ నుంచి అందుతున్న సమాచారం రెండు రకాలుగా ఉన్నది. తెలుగుదేశం – జనసేన కూటమి మాత్రమే వైసీపీతో తలపడటానికి సరిపోదనీ, ఇండియా కూటమిలో చేరి కాంగ్రెస్ – కమ్యూనిస్టులను కూడా కలుపుకొని వెళ్లాలని చెప్పడానికే చంద్రబాబును పీకే కలిశారని ఒక సమాచారం. ఒకవేళ ఇదే నిజమైతే ఇంతకంటే వింత ఇంకోటి

> జనసేన శ్రేణుల్లో ఒకపక్క అసంతృప్తి రాజుకుంటున్న తరుణంలోనే హఠాత్తుగా ఎన్నికల వ్యూహకర్తగా పేరుగాంచిన ప్రశాంత్ కిశోర్ ఊడిపడ్డారు. బీజేపీ తరఫున రాజ్యసభలో ఉన్న సీఎమ్ రమేశ్‌కు చెందిన ప్రైవేట్ విమానంలో లోకేశ్, కిలారు రాజేశ్‌లతో కలిసి ఆయన విజయవాడకు వచ్చారు. చంద్రబాబును కలుసుకున్నారు. రకరకాల వార్తలు ప్రచారంలోకి వచ్చాయి. ఈ భేటీపై ఢిల్లీ నుంచి అందుతున్న సమాచారం రెండు రకాలుగా ఉన్నది. తెలుగుదేశం – జనసేన కూటమి మాత్రమే వైసీపీతో తలపడటానికి సరిపోదనీ, ఇండియా కూటమిలో చేరి కాంగ్రెస్ – కమ్యూనిస్టులను కూడా కలుపుకొని వెళ్లాలని చెప్పడానికే చంద్రబాబును పీకే కలిశారని ఒక సమాచారం. ఒకవేళ ఇదే నిజమైతే ఇంతకంటే వింత ఇంకోటి ఉండదు. వచ్చింది బీజేపీ ఎంపీ విమానంలో! రాచకార్యం కాంగ్రెస్ కోసం!!
>
> ఇప్పటికే టీడీపీ కోసం పనిచేస్తున్న రాబిన్‌సింగ్ టీమ్ పూర్వాశ్రమంలో ప్రశాంత్ కిశోర్ నేతృత్వంలోనే పనిచేసినందున... వారితో మాట్లాడి సలహాలిచ్చేందుకు రావలసిందిగా లోకేశ్ చేసిన విజ్ఞప్తి మేరకు వచ్చాడని మరో సమాచారం. చంద్రబాబు ఇంట్లో జరిగిన సమావేశానికి రాబిన్‌సింగ్ టీమ్ కూడా హాజరైంది. గతంలో వైసీపీ విజయం కోసం పనిచేసిన ప్రశాంత్ కిశోర్ ఇప్పుడు తమవైపున పనిచేస్తున్నాడని మైండ్ గేమ్ ఆడేందుకే ఈ భేటీని ఏర్పాటు చేసినట్టు వినపడుతున్నది. ఎన్నికల వ్యూహకర్తగా పనిచేయడం మానేశానని ప్రశాంత్ కిశోర్ గతంలోనే చెప్పారు. కానీ పేరు వాడుకుని మైండ్ గేమ్ ఆడాలనుకోవడం నదిలో కొట్టుకొనిపోయేవాడు గడ్డిపోచను చూసి ఆశపడిన చందం!

ఉండదు. వచ్చింది బీజేపీ ఎంపీ విమానంలో! రాచకార్యం కాంగ్రెస్ కోసం!!

ఇప్పటికే టీడీపీ కోసం పనిచేస్తున్న రాబిన్‌సింగ్ టీమ్ పూర్వాశ్రమంలో ప్రశాంత్ కిశోర్ నేతృత్వంలోనే పనిచేసినందున... వారితో మాట్లాడి సలహాలిచ్చేందుకు రావలసిందిగా లోకేశ్ చేసిన విజ్ఞప్తి మేరకు వచ్చాడని మరో సమాచారం. చంద్రబాబు ఇంట్లో జరిగిన సమావేశానికి రాబిన్ సింగ్ టీమ్ కూడా హాజరైంది. గతంలో వైసీపీ విజయం కోసం పనిచేసిన ప్రశాంత్ కిశోర్ ఇప్పుడు తమవైపున పనిచేస్తున్నాడని మైండ్ గేమ్ ఆడేందుకే ఈ భేటీని ఏర్పాటు చేసినట్టు వినపడు తున్నది. ఎన్నికల వ్యూహకర్తగా పనిచేయడం మానేశానని ప్రశాంత్ కిశోర్ గతంలోనే చెప్పారు. కానీ పేరు వాడుకుని మైండ్ గేమ్ ఆడాలనుకోవడం నదిలో కొట్టుకొనిపోయేవాడు గడ్డిపోచను చూసి ఆశపడిన చందం! వ్యూహకర్తలే ఎన్నికల్లో గెలిపించేట్లయితే పార్టీలను మూసేసుకుని నాయకులు వ్యూహకర్తలనే ఆశ్రయించేవారు. అంబటి రాంబాబు చెప్పినట్టు మెటీరియల్ మంచిది కానప్పుడు మేస్త్రీ ఏం చేస్తాడు?

ఈ పీకే భేటీ సంగతేమోగానీ, ఈ పరిణామం మన పీకే (పవన్ కల్యాణ్) పీకకు చుట్టుకుంటుందేమో చూడాలి. అసలే పార్టీ నుంచి వరసగా జారుకుంటున్నారు. కీలకమైన కాపు సామాజికవర్గం నేతలే తాము ఈ పార్టీలో ఇమడగలిగే పరిస్థితి లేదని బహిరంగంగానే కామెంట్లు చేస్తున్నారు. పాతిక సీట్లతోనే పార్టీ నేతలను ఒప్పించలేని పరిస్థితి ఉన్నది. ఇప్పుడు కాంగ్రెస్, లెఫ్ట్ కూడా తోడైతే వాళ్లకిచ్చే నాలుగు సీట్లు కూడా తన ఖాతా లోంచే కోత పడతాయి. పైగా బీజేపీ మీద అపారమైన అభిమానాన్ని కురిపిస్తూ ఎన్డీఏ కూటమి సభ్యుడిగా చేరిన పవన్ 'ఇండియా' కూటమిని అంగీకరిస్తారా? ఆ పరిస్థితి ఎదురైతే తెగతెంపులు చేసుకుని బీజేపీతో కలిసి పోటీ చేస్తారా? తెగతెంపులు చేసుకునేంత సాధారణమైన సంబంధమే తెలుగుదేశంతో ఉన్నదా? ఇవన్నీ సందేహాలే. తెలుగుదేశం పార్టీ 'ఇండియా' కూటమిలో చేరే అవకాశం లేదనే అనుకుందాం. ఎందుకంటే కేంద్రంలో మళ్లీ ఎన్డీఏనే వస్తుందని బాబుతో పీకే చెప్పినట్టు సమాచారం. అసలే బీజేపీ అంటేనే బాబు ఝడుసుకుంటున్నారు. మరో దారి లేకపోతే తప్ప 'ఇండియా' కూటమిలో చేరే నిర్ణయాన్ని బాబు తీసుకోలేరు. కేవలం సలహాలు ఇవ్వడానికే పీకే బాబును కలిశాడనుకుందాము. ఆయన సలహా మేరకు కుదించిన సీట్లతో జనసైనికులను మన పీకే సంతృప్తిపరచగలరా? పదేళ్లుగా పార్టీని నమ్ముకొని ఉన్న ఆశావహుల ఆగ్రహాన్ని అదుపు చేయగలరా? తనకు ముఖ్యమంత్రి పదవి అవసరం లేదనీ, చంద్రబాబే ముఖ్యమంత్రి కావాలనీ బహిరంగంగా ప్రకటించి కాపు సామాజికవర్గం ఆకాంక్షలపై నీళ్లు చల్లి పార్టీని నిలబెట్టుకోగలరా?

vardhelli1959@gmail.com

ఈ – కామర్స్ వర్తక శకంలో...

సందర్భం



దాసరి ఇమ్మానియేలు

వస్తువులు లేదా సేవలు కొనుగోలు చేసే విపణిలో ఉన్న ప్రతి ఒక్కరూ వినియోగదారులే. మారుతున్న కాలాన్ని బట్టి నేడు సామాన్యుడు సైతం అంతర్జాలంలో వస్తువులు, సేవలు కొనుగోలు చేస్తున్నారు. డిజిటల్ రూపంలో నగదు చెల్లింపుల లావాదేవీలు పెరుగుతున్నాయి. ఇది ఎంతో ఉపయుక్తంగా ఉన్నా.. నేరస్థులకు నగదు దోచుకునేందుకు దగ్గరిదారిగా మారింది. గత ఏడాది మనదేశంలో 14 లక్షల సైబర్ నేరాలు జరగడం దీనికి తార్కాణం.

'వినియోగదారుల రక్షణ చట్టం –2019'లో 'ఈ-కామర్స్' లావాదేవీలను స్పష్టంగా నిర్వచించడం జరిగింది. 'డిజిటల్ లేదా ఎలక్ట్రానిక్ నెట్‌వర్క్ ద్వారా డిజిటల్ ఉత్పత్తులతో సహా వస్తువులు లేదా సేవలను కొనుగోలు చేయడం లేదా విక్రయించడం' ఈ-కామర్స్‌గా నిర్వచించబడింది.

'మీకు లాటరీలో బహుమతి వచ్చింద'నీ; 'కారు, టీవీ, మోటార్ సైకిల్ గెలుచుకున్నార'ంటూ తప్పుడు ప్రకటనల ద్వారా సైబర్ నేరస్థులు రెచ్చిపోతున్నారు. నిరుద్యోగులే కాదు ఇందులో ఉన్నత చదువులు చదువుకున్న వైద్యులు, ఇంజనీర్లు సైతం చిక్కుకుంటున్నారు. ఇటీవల హైదరాబాదుకు చెందిన యువ వైద్యునికి రోజుకు రూ. 5 వేలు సంపాదించవచ్చంటూ రూ. 20 లక్షల రూపాయలు కాజేసిన ఘటన తెలిసిందే. గ్యాస్ ఏజెన్సీలు ఇస్తా మనీ; హోటళ్లకు, సినిమాలకు రేటింగ్ ఇస్తామనీ, వ్యాపారంలో భాగస్వామ్యం అనే ప్రకటనలతో కోట్లాది రూపాయలు వసూలు చేస్తున్నారు. జాతీయ నేర గణాంక సంస్థ (ఎన్‌సీఆర్‌బీ) నివేదిక–2021 ప్రకారం చూస్తే, గత ఐదేళ్లలో సైబర్ నేరాల సంఖ్య 141 శాతం పెరిగింది.

న్యాయమైన వాణిజ్య పద్ధతుల్లో ఆర్థికంగా నష్టం చేకూర్చడం, వినియోగదారులను మోసం చేయడం ద్వారా వినియోగదారుల హక్కులకు ఆటంకం కలిగించే సంస్థలు/కంపెనీలు/వ్యాపారుల గురించి ప్రజలకు తెలియజెప్పడం కోసం భారత్ 1986 డిసెంబర్ 24న 'వినియోగదారుల రక్షణ చట్టా'న్ని తెచ్చింది. ఆ రోజును ప్రతి ఏడాదీ 'జాతీయ వినియోగదారుల హక్కుల దినం'గా పాటిస్తున్నారు. భద్రత హక్కు, ఎంచుకునే హక్కు, సమాచారం పొందే హక్కు, వినే హక్కు, పరిహారం కోరుకునే హక్కు, వినియోగదారుల విద్య హక్కులను పరిరక్షించడానికీ, వినియోగదారుల ప్రయోజనాలకు హాని కలిగించే లేదా తప్పుదారి పట్టించే ప్రకటనలకు సంబంధించిన విషయాలను నియంత్రించడానికీ 2020 జూలై 20 నుండి 'సెంట్రల్ కన్స్యూమర్ ప్రొటెక్షన్ అథారిటీ' (సీసీపీఏ) స్థాపించబడింది. చెల్లుబాటు అయ్యే ఇండియన్ స్టాండర్డ్స్ (ఐఎస్ఐ) మార్క్ లేని వస్తువులను కొనుగోలు చేయకుండా వినియోగదారులను హెచ్చరిస్తూ ఈ సంస్థ రెండు భద్రతా నోటీసులను కూడా జారీ చేసింది.

ఆన్‌లైన్ షాపింగ్ చేసే చాలా మంది వ్యక్తులు తప్పుడు లేదా తప్పుదారి పట్టించే ప్రకటనలు, లోపభూయిష్ఠ ఉత్పత్తులు, ఉత్పత్తుల నకిలీ డెలివరీలు, అసురక్షిత ఉత్పత్తులు, చెల్లింపు సమస్యలు, భద్రత- గోప్యతా సమస్యలు, ఏకపక్ష ఒప్పందాలు వంటి వాటి కారణంగా బాధితులుగా మారారు. కానీ, అధికార పరిధుల సమస్యల కారణంగా చట్టాలను సరిగా అమలు చేయకపోవడం వల్ల బాధిత వినియోగదారులను రక్షించడంలో చట్టాలు విఫలమవుతున్నాయి. ఆన్‌లైన్ లావాదేవీలతో వ్యవహరించేటప్పుడు నేటి జనాభా ఎదుర్కొంటున్న సవాళ్లను ఎదుర్కోవడానికి ఎలక్ట్రానిక్ ఒప్పందాలను నియంత్రించేందుకు వినియోగదారుల రక్షణ చట్టం –2019లో అనేక అంశాలు చేర్చారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వినియోగదారుల రక్షణ చట్టం- 2019ని బలోపేతం చేసేందుకు పాఠశాలలో విద్యార్థులతో సుమారు 6,000 వినియోగదారుల క్లబ్బుల ఏర్పాటు చేయడం జరిగింది. వినియోగదారుల వ్యవహారాలపై, ఆహార, పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో వారికి అవగాహన కల్పించేందుకు ఉపాధ్యాయులకు ఈ చట్టంపై శిక్షణ ఇచ్చారు. విద్యార్థి దశ నుండే చట్టంపై అవగాహన కలిగించేందుకు 'మేము సైతం' అనే పుస్తకాన్నీ, సుమారు 10 రకాలైన గోడపత్రాలను పౌర సరఫరాల శాఖ రూపొందించింది. తూనికలు కొలతల శాఖ వారు 3 రకాలైన గోడపత్రాలను రూపొందించడం జరిగింది. గోడపత్రాలనూ పాఠశాలతో పాటు గ్రామ/వార్డు సచివాలయాలలో, పెట్రోలు బంకులలో కూడా ఏర్పాటు చేస్తున్నారు. మరింతగా ఈ చట్టం పట్ల అవగాహన ప్రజలలో కల్పించేందుకు 'మేలుకొలుపు' అనే మాస పత్రికను కూడా పౌర సరఫరాల శాఖ అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ చట్టం పట్ల ప్రజలందరికీ అవగాహన ఉంటే కొనుగోలు చేసే వస్తువులు / సేవలు / ఆన్‌లైన్ లావాదేవీలలో జరిగే నష్టాలకు పరిహారం పొందే అవకాశం ఉంటుంది.

వ్యాసకర్త ఏపీ వినియోగదారుల సంఘాల సమాఖ్య చైర్మన్ ।
90599 90345 (నేడు జాతీయ వినియోగదారుల దినోత్సవం)

జ్యోతిర్గముడు

చుక్కల దివిలోపల ఎం
చక్కగ పూచిన సుమంపు చుక్కలొ యనగా
దిక్కుల జీవన వర్షపు
చుక్కలొ యన రాలె దూత చుక్కలు భువిలోన్

పరలోకం తోటలో చక్కగా పూచిన చుక్కలేమో అన్నట్టుగా... నాలుగు దిక్కుల్నీ పోషించడానికై కురిసిన వర్షపు చుక్కలేమో అన్నట్టుగా... దివినుండి భువిపైకి దూతలు చిన్నగా దిగారు అనేది ఇందులోని భావం.

ప్రభువు పుట్టిన సందర్భంలో జరిగిన దూతల రాక, అటు పారమార్థిక భూషణాల్నీ, ఇటు సంబంధ పోషణాల్నీ ముడేసుకొని ఉంది. దైవ మానుష స్వరూపుడైన ప్రభువు అవతార రహస్యం కూడా ఇందులో ధ్వనిస్తూ ఉంది.

ఇంతకూ ప్రభువు దేవుడా? మానవుడా? ఆయనలో ఇద్దరూ ఉన్నారు. అంటే రెండు స్వభావాలూ ఉన్నాయి. దైవ పుత్రుడు. మానవకన్య మరియమ్మ. మానవుణ్ణి దేవునిగా తనలా మార్చేయ డానికై వచ్చాడు. ఆయన చూస్తే గుణ త్రయ స్వభావుడు. (త్రిమూర్తి స్వరూపుడు)

'ట్రినిటీ' త్రిత్వైక స్వభావం... తండ్రి, కుమార, పరిశుద్ధాత్మ దేవునిగా క్రైస్తవులు నమ్ముతారు. ఆయన అద్భుతాలు చేసినపుడు దైవ స్వభావం, హింసింపబడి మరణించినపుడు మానవ స్వభావాలు కనిపిస్తాయి. రెండూ ఎందుకయ్యా అంటే, మానవ జీవితాల్ని మహోన్నతంగా తీర్చిదిద్దడానికి ఒక ఆదర్శ ప్రయోగం చేసి చూపిన మహనీయుడు క్రీస్తు ప్రభువు. ఆయన పలికిన ప్రతి పలుకూ ఒక వెలుగుల వర్షమే! ఆయన ప్రసంగం వింటే అమృతం త్రావిన చిరంజీవులే! ఆయన చేసి చూపిన మార్గం మానవాళికి ఒక మహోన్నత సత్య మార్గం. తమస్సును చీల్చుకొంటూ లోకానికి ఉషస్సు పంచిన జ్యోతిర్గముడు ప్రభువు.

– బెర్నార్డ్ రాజు



కరుణోదయం

డిసెంబర్ ఇరువది ఐదున
ప్రియ బాల యేసు పుట్టె
పశువుల పాక తొట్టెలోన!

నవ జాత శిశువులోని
దివ్య తేజమును కాంచి
మేరీమాత మరి మరీ మురిసె!

మానవ రూపాన ధరణిలో
కరుణామయుడు జన్మించాడని
దేవ దూతలు దివ్యవాణిని పలికిరి!

తార చూపిన దారిలో యోజనాలు నడిచి
జ్ఞానులు వచ్చిరి నజరేయుడు దరికి!

– జి. సూర్యనారాయణ

28 నుంచి రేషన్ దరఖాస్తుల స్వీకరణ!

- కొత్త రేషన్‌కార్డుల జారీ ప్రక్రియకు సర్కారు శ్రీకారం
- నేటి కలెక్టర్ల సమావేశంలో విధివిధానాల ప్రకటన?
- ఇప్పటికే 11 లక్షల కార్డులు పెండింగ్‌లో
- రాష్ట్రంలో ప్రస్తుతం 90.14 లక్షల ఆహార భద్రత కార్డులు
- లబ్ధిదారుల సంఖ్య: 2.83 కోట్లు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రజలు చాలా ఏళ్లుగా ఎదురు చూస్తున్న కొత్త ఆహార భద్రత కార్డుల (రేషన్ కార్డులు) జారీకి ప్రభుత్వం సన్నద్ధమైంది. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలో భాగంగా అర్హులైన వారికి కొత్త రేషన్ కార్డుల జారీకి సంబంధించి ఈ నెల 28వ తేదీ నుంచి దరఖాస్తులు స్వీకరించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఈ మేరకు దరఖాస్తుల నమూనాలను ప్రభుత్వం ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచింది. మీ–సేవ కార్యాలయాల ద్వారా ఆన్‌లైన్‌లోనే దరఖాస్తులు స్వీకరించి, అర్హులైన లబ్ధిదారుల ఎంపికకు గ్రామ, బస్తీ సభలను నిర్వహించనున్నట్లు సమాచారం. అయితే రేషన్‌కార్డుల జారీకి దరఖాస్తుల ఆహ్వానానికి సంబంధించి విధివిధానాలు ఆదివారం జరిగే జిల్లా కలెక్టర్ల సమావేశం తరువాత వెలువడే అవకాశం ఉంది.

కొత్త ప్రభుత్వం కొలువు తీరగానే..

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువు తీరిన వెంటనే మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఉన్నతాధికారులతో నిర్వహించిన సమావేశంలో రాష్ట్రంలోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటి వరకు జారీ చేసిన రేషన్‌కార్డుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2004లో మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మొదలైన తెలుపు, గులాబీ కార్డుల జారీ ప్రక్రియ భారీ ఎత్తున సాగింది. ఈ లెక్కన రాష్ట్రంలో తెలుపు, గులాబీ కార్డులు తెలంగాణ ఏర్పాటయ్యే నాటికే 83 లక్షలకు పైగా జారీ అయ్యాయి. తెలంగాణ ఆవిర్భవించిన తరువాత జాతీయ స్థాయిలో జరిగిన మార్పుల వల్ల తెలుపు, గులాబీ కార్డుల స్థానంలో ఆహారభద్రత కార్డులు మంజూరు అయ్యాయి. తెలంగాణ ప్రభుత్వం పదేళ్లలో కొత్తగా 6.50 లక్షల కార్డులు మంజూరు చేసింది. ఇవి కాకుండా 11 లక్షలకు పైగా రేషన్ కార్డుల దరఖాస్తులు రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్నాయి.

ప్రభుత్వ పథకాలకు కార్డు తప్పనిసరి కావడంతో...

రేషన్ బియ్యం కన్నా రాష్ట్ర ప్రభుత్వం అందించే పలు పథకాలకు ఆహార భద్రత కార్డు తప్పనిసరిగా మారింది. ఆరోగ్యశ్రీతో పాటు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలలో మహిళలకు రూ.2,500 ఆర్థిక సాయం, రూ.500కే గ్యాస్ సిలిండర్, పేదల గృహ నిర్మాణం వంటి అనేక పథకాలకు ఆహార భద్రత కార్డు తప్పనిసరైంది. ఆరోగ్యశ్రీ పరిమితిని రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలే రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచిన నేపథ్యంలో పేద, మధ్య తరగతి వర్గాలకు రేషన్‌కార్డుల అవసరం తప్పనిసరైంది. గతంలో తొమ్మిది లక్షల దరఖాస్తులు పెండింగ్‌లో ఉంటే 2021లో చివరిసారిగా 3 లక్షల కార్డులు జారీ చేశారు. కొత్త రేషన్‌కార్డులతో పాటు ఇప్పటికే ఉన్న కార్డుల్లో పిల్లలు, కుటుంబసభ్యుల పేర్లు మార్పులు , చేర్పులు చేయడం వంటి ప్రక్రియ కూడా కొన్నేళ్లుగా నిలిపివేయడంతో ఈసారి డిమాండ్ పెరిగింది. కొత్త కార్డుల ప్రక్రియకు సంబంధించి విధి విధానాలు వస్తే అర్హులైన వారంతా దరఖాస్తులు చేసుకునే అవకాశం ఉంది. కొత్త దరఖాస్తుదారులు ఆధార్, అడ్రస్ ప్రూఫ్‌తో పాటు గ్యాస్ కనెక్షన్ వివరాలను కూడా పొందుపరచాల్సి ఉంటుంది. ప్రభుత్వ ఉద్యోగులు, ఉన్నత వర్గాల వారికి కార్డులు జారీ చేయకుండా నిబంధనలు విధించనున్నారు. అదే సమయంలో ఇప్పటికే కార్డులు పొందిన వారిలో అనర్హులను గుర్తించే ప్రక్రియ కూడా చేపట్టే అవకాశం ఉన్నట్లు ఓ పౌరసరఫరాల శాఖ అధికారి తెలిపారు.

ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న కార్డుల వివరాలు	
రాష్ట్రవ్యాప్తంగా ఇప్పుడున్న కార్డుల సంఖ్య	:90,14,263
ఇందులో జాతీయ ఆహారభద్రత చట్టం (ఎన్ ఎఫ్ ఎస్) కింద జారీ చేసిన కార్డులు:	54,48,170
రాష్ట్ర ఆహారభద్రత కార్డులు:	35,66,093
ఈ కార్డుల లబ్ధిదారులు:	2,83,39,478

‘ఎమ్మెల్యేలకు ఎర’పై దర్యాప్తు కొనసాగుతోంది

- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌పై హత్యాయత్నం కేసు కూడా..
- సైబరాబాద్ పోలీసు కమిషనర్ అవినాశ్ మహంతి



సాక్షి, హైదరాబాద్: సంచలనం సృష్టించిన ‘ఎమ్మెల్యేలకు ఎర’కేసులో నలుగురు బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలపై వచ్చిన ఆరోపణలకు సంబంధించి దర్యాప్తు కొన సాగుతుందని సైబరాబాద్ పోలీసు కమిషనర్ అవినాశ్ మహంతి తెలిపారు. త్వరలోనే దీనికి సంబంధించి పూర్తి వివరాలను వెల్లడిస్తామన్నారు. ప్రస్తుతం ఈ కేసు సుప్రీంకోర్టులో ఉందని చెప్పారు. గతేడాది అక్టోబర్‌లో నాటి బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు పైలట్ రోహిత్‌రెడ్డి, రేగ కాంతారావు, గువ్వల బాలరాజు, బీరం హర్షవర్ధన్‌రెడ్డిలతో మొయినాబాద్ అజీజ్‌నగర్‌లోని ఫాంహౌస్‌లో ముగ్గురు బీజేపీ రాయబారులు మంతనాలు జరపడం తెలిసిందే. దీనిపై అందిన విశ్వసనీయ సమాచారం మేరకు సైబరాబాద్ పోలీసులు ఫాంహౌస్‌పై దాడి చేసి ఢిల్లీలోని ఫరీదాబాద్‌కు చెందిన పురోహితుడు రామచంద్రభారతి అలియాస్ సతీష్ శర్మ, హైద రాబాద్‌కు చెందిన వ్యాపారి నందకుమార్, తిరుపతికి చెందిన సింహయాజీ స్వామిలను అరెస్టు చేశారు. మరోవైపు మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌పై హత్యాయత్నం కేసు దర్యాప్తు కూడా కొనసాగుతుందని సీపీ అవినాశ్ మహంతి తెలిపారు. గతేడాది ఫిబ్రవరిలో శ్రీనివాస్ గౌడ్‌పై హత్యాయత్నం కేసులో రాఘవేందర్ రాజు, నాగరాజు, యాదయ్య, విశ్వనాథ్, మున్నూరు రవి, మధుసూదన్ రాజును పోలీసులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే.

వారంతా విచారణకు రావాల్సిందే..: మాదక ద్రవ్యాల కేసుల్లో సినీ పరిశ్రమకు చెందిన వాళ్లను వదిలిపెడుతున్నా మనేది ఆరోపణ మాత్రమేనని సీపీ అవినాశ్ మహంతి స్పష్టం చేశారు. కబాలీ తెలుగు సినిమా నిర్మాత సుంకర కృష్ణ ప్రసాద్ చౌదరి (కేపీ చౌదరి) కేసు దర్యాప్తులో ఉందని, ఈ కేసులో ఎవరినీ వదలిపెట్టబోమన్నారు. విచారణలో కేపీ చౌదరి వెల్లడించిన పేర్లలో ప్రతి ఒక్కరూ విచారణకు రావాల్సిందేనని చెప్పారు. గోవా నుంచి హైదరాబాద్‌కు 82.75 గ్రాముల కొకైన్‌ను తరలిస్తుండగా కేపీ చౌదరిని అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. ఈ కేసులో చౌదరిని విచారించగా.. డ్రగ్స్ కింగ్‌పిన్ ఎడ్విన్ న్యూన్స్‌తోపాటు తెలుగు సినీ పరిశ్రమకు చెందిన సుమారు 900 మందితో సత్సంబంధాలు ఉన్నట్లు విచారణలో తేలింది. ఇందులో ఓ ప్రముఖ దర్శకుడు, ఇద్దరు హీరోయిన్లు, నలుగురు మహిళా ఆర్టిస్టులున్నారు.

క్లుప్తంగా...

సింగరేణి ఎన్నికలు బహిష్కరించండి

ఇల్లెందు: సింగరేణిలో జరగనున్న గుర్తింపు సంఘం ఎన్నికలను కార్మికులు బహిష్కరించి మిలిటెంట్ పోరాటాల ద్వారా హక్కులు సాధించుకోవాలని మావోయిస్టు సింగరేణి కోల్‌బెల్ట్ కమిటీ కార్యదర్శి ప్రభాత్ పిలుపునిచ్చారు. ఈమేరకు ఆయన పత్రికలకు లేఖ విడుదల చేశారు. ఇప్పటివరకు గెలిచిన గుర్తింపు సంఘాలు.. అణచివేత, పనిభారం, ప్రైవేటీకరణ, ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్, ఒప్పంద కార్మికుల దోపిడీపై పెదవి విప్పలేదని ఆరోపించారు. దశాబ్దాల చరిత్ర కలిగిన జాతీయ కార్మిక సంఘాల నేతలు చేసిన మోసం కంటే.. టీబీజీకేఎస్ నేతలు పదేళ్లలో రెట్టింపు అవినీతికి పాల్పడ్డారని పేర్కొన్నారు.

పత్తి కొనుగోలుకు తగిన ఏర్పాట్లు చేయండి

అధికారులకు మంత్రి తుమ్మల ఆదేశం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పత్తి సాగు, ఉత్పత్తి గణనీయంగా పెరిగినందున పత్తి కొనుగోలుకు తగిన ఏర్పాట్లు చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. ఆయా మార్కెట్ యార్డుల్లో రైతులకు కావాల్సిన సదుపాయాలు కల్పించాలని సూచించారు. ఈ మేరకు శనివారం మార్కెటింగ్ శాఖపై తుమ్మల సమీక్ష నిర్వహించారు. సమీక్షలో మార్కెటింగ్ శాఖ పరిధిలో ఉన్న మార్కెట్లు, ఉపయోగంలో ఉన్నవి, నిరుపయోగంగా ఉన్నవి ఎన్ని అన్నది విచారించారు. అలాగే ఖమ్మం జిల్లా కేంద్రంలోని మిర్చి మార్కెట్టును పూర్తి సౌకర్యాలతో అత్యంత ఆధునికంగా తీర్చిదిద్దాలని అధికారులను ఆదేశించారు. అలాగే ఉపయోగంలో లేని భవనాలు, ఇతర మౌలిక సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని, భవనాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఖాళీగా ఉంచవద్దని సూచించారు.

ఎగ్జిబిషన్ సొసైటీ అధ్యక్షుడిగా శ్రీధర్‌బాబు బాధ్యతల స్వీకరణ



అబిడ్స్(హైదరాబాద్): నాంపల్లిలోని ఎగ్జిబిషన్ సొసైటీ నూతన అధ్యక్షుడిగా రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి డి.శ్రీధర్‌బాబు శనివారం బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు ఆయన ఎగ్జిబిషన్ సొసైటీ కార్యాలయంలో నియామకపత్రాలను అందుకున్నారు.

అక్రమ పదోన్నతిని అడ్డుకోండి

- సీఎస్ శాంతికుమారికి ఐ అండ్ పీఆర్ ఎంప్లాయీస్ వినతి

సాక్షి, హైదరాబాద్: నిబంధనలకు విరుద్ధంగా పొందిన పదోన్నతిని రివర్షన్ చేయాలని ఐ అండ్ పీఆర్(ఇన్ఫర్మేషన్ అండ్ పబ్లిక్ రిలేషన్స్) శాఖ ఎంప్లాయీస్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఐఅండ్ పీఆర్ ఉద్యోగులు, ఆఫీసర్స్ అసోసియేషన్ సభ్యులు రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతికుమారికి లేఖ రాశారు. తెలంగాణ స్టేట్ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(టీఎస్ఎఫ్‌డీసీ) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎల్ఎల్ఆర్ కిశోర్‌బాబు ఐ అండ్ పీఆర్ విభాగానికి రావడానికి ప్రయత్నిస్తున్నారని అసోసియేషన్ సభ్యులు ఆరోపించారు. ఏపీలోని గుంటూరుకు చెందిన కిశోర్‌బాబు సమైక్య రాష్ట్రంలోని వరంగల్ జోన్‌లో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా ఎంపికయ్యారని, రాష్ట్ర విభజన తర్వాత పునర్వ్యవస్థీకరణ చట్టానికి విరుద్ధంగా తెలంగాణలో కొనసాగుతున్నారని పేర్కొన్నారు. అయితే ఐ అండ్ పీఆర్ జాయింట్ డైరెక్టర్‌గా ఉన్న నాగయ్య కాంబ్లేపై కిశోర్‌బాబు సీనియారిటీ క్లెయిమ్ చేసి గతంలో పదోన్నతులు పొందారని ఆరోపించారు. కిశోర్‌బాబు తనకున్న పరిచయాలతో ఐ అండ్ పీఆర్ విభాగానికి తిరిగి రావడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. ఆయన రాక తెలంగాణ ఉద్యోగుల మనోధైర్యాన్ని దెబ్బతీస్తుందని, ఉద్యోగులకు న్యాయం చేయాలని వారు లేఖలో పేర్కొన్నారు.

రిజిస్ట్రేషన్లకే పరిమితం

▶ మొదటి పేజీ తరువాయి

క్రమబద్ధీకరణ ప్రక్రియ కూడా నిలిచిపోయింది. జీవో 58, 59తోపాటు ఇతర జీవోల ద్వారా జరగాల్సిన ఈ ప్రక్రియ కూడా ఎన్నికల కారణంగానే ఆగిపోయింది. ఎన్నికల తర్వాత తమ విన్నపాలకు పరిష్కారం లభిస్తుందని దరఖాస్తుదారులు ఎదురుచూస్తున్నప్పటికీ ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు రాకపోవడంతో ఆ దరఖాస్తులను కూడా కలెక్టర్లు పరిష్కరించడం లేదు. అటు ధరణి పోర్టల్, ఇటు భూముల క్రమబద్ధీకరణ నిలిచిపోయిన నేపథ్యంలో కేవలం ధరణి పోర్టల్ ద్వారా భూములను రిజిస్ట్రేషన్ చేసేందుకు, ఆదాయ, కుల తదితర ధ్రువీకరణ పత్రాలు ఇవ్వడానికి, క్రిస్మస్ తోఫాను పంపిణీ చేయడానికే పరిమితమయ్యామని, భూ సంబంధిత సమస్యలపై తమ కార్యాలయాలకు వచ్చే వారికి సమాధానం చెప్పుకోలేక పోతున్నామని తహసీల్ కార్యాలయాల సిబ్బంది వాపోతున్నారు. అటు ధరణి పోర్టల్ సమస్యల పరిష్కారంతోపాటు భూముల క్రమబద్ధీకరణ విషయంలో ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రాలేదని, కేవలం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఉన్నతాధికారులు మౌఖిక ఆదేశాలిచ్చారనే కారణంతోనే వ్యవస్థ స్తంభించిందని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం జరగనున్న కలెక్టర్ల సదస్సులో రెవెన్యూ వ్యవహారాలపై స్పష్టతనివ్వాలని, అప్పుడే భూ సంబంధిత సమస్యలు పరిష్కారమవుతాయని కలెక్టర్ల నిర్ణయాల కోసం ఎదురుచూస్తున్న లక్షలాది మంది రైతులు, ప్రజలు కోరుతున్నారు.

భవిష్యత్ జాగ్రత్తలపై నివేదిక ఇవ్వండి

- జీహెచ్ఎంసీకి హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరా బాద్: భవిష్యత్‌లో వర్షాలు, వరదలు వచ్చినప్పుడు ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లకుండా ఏం చర్యలు చేపట్టారో పూర్తి నివేదిక అందజేయాలని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ)ని హైకోర్టు ఆదేశించింది. రెండు వారాల్లోగా ఈ నివేదిక ఇవ్వాలని స్పష్టం చేస్తూ, విచారణను వాయిదా వేసింది. ఐదు నెలల క్రితం హైదరాబాద్‌లో కురిసిన భారీ వర్షాలకు కళాసిగూడలో తొమ్మిదేళ్ల మౌనిక ఓపెన్ మ్యాన్‌హోల్‌లో పడి కొట్టుకుపోగా, జూబ్లీహిల్స్‌లో వివేక్ అనే ఆరేళ్ల బాలుడు ప్రమాదవశాత్తు గుంతలో పడి మునిగిపోయాడు. జీహెచ్ఎంసీ నిర్లక్ష్యంవల్లే మౌనిక ప్రాణాలు కోల్పోయిందని, దీనిపై విచారణ జరిపి భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టేలా జీహెచ్ఎంసీకి ఆదేశాలు ఇవ్వాలని హైకోర్టుకు ఓ ఈ మెయిల్ అందింది. దీన్ని టౌకెన్ అప్ పిల్‌గా న్యాయస్థానం విచారణకు స్వీకరించింది. మరోసారి దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ ధర్మాసనం విచారణ చేపట్టింది. వాదనలు విన్న ధర్మాసనం.. వర్షాలు, వరదలు సంభవించినప్పుడు ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లకుండా ఏం చర్యలు తీసుకున్నారో చెప్పాలని ఆదేశిస్తూ, విచారణను వాయిదా వేసింది.

ట్రాక్టర్-బస్సు ఢీ... నలుగురి దుర్మరణం

- ఒకరికి గాయాలు
- అనంతపురం జిల్లా కల్లూరు వద్ద ఘటన

గార్లదిన్నె: ట్రాక్టర్‌ను ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొనడంతో నలుగురు దుర్మరణం చెందారు. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదం అనంతపురం జిల్లా గార్లదిన్నె మండలం కల్లూరు వద్ద 44వ జాతీయ రహదారిపై శనివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. గుత్తి మండలం మాముడూరు గ్రామానికి చెందిన కండ్లపల్లి చిన్న తిప్పయ్య(47), పసులోరు శ్రీరాములు (42), కండ్లపల్లి నాగార్జున(32), మామిళ్లపల్లి శ్రీనివాసులు(27), పసులోరు హరికృష్ణ సమీప బంధువులు. కల్లూరు నుంచి బియ్యం బస్తాలను ట్రాక్టర్‌లో స్వగ్రామానికి తీసుకొచ్చేందుకు బయలుదేరారు. పామిడి పెన్నానది బ్రిడ్జి సమీపంలోకి రాగానే బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు



ట్రాక్టరును ఢీకొని దెబ్బతిన్న బస్సు

ముందు వాహనాన్ని తప్పించబోయి ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవింగ్ చేస్తున్న శ్రీనివాసులుతో పాటు బియ్యం బస్తాలపై కూర్చొన్న చిన్నతిప్పయ్య, శ్రీరాములు, నాగార్జున కుడివైపు పడడంతో వారి మీదుగా బస్సు వెళ్లింది. శరీరాలు నుజ్జునుజ్జు అయ్యి అక్కడికక్కడే మృతి చెందారు. ఎడమవైపు పడిన హరికృష్ణ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. గాయపడిన హరికృష్ణను 108 వాహనంలో అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రమాదంలో మృతి చెందిన వారికి బస్సు యజమాని పరిహారం చెల్లించే వరకు ఊరుకునేది లేదని మృతుల బంధువులు ఆందోళన చేపట్టారు. అనంతరం వారికి పోలీసులు సర్దిచెప్పారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన నలుగురి కుటుంబాలకు వైఎస్ఆర్ బీమా పథకం ద్వారా రూ.5లక్షలు అందించనున్నట్టు తహసీల్దార్ ఉషారాణి తెలిపారు.

ఆ నిధులు ఇవ్వాలా.. వద్దా?

- దళితబంధు మంజూరుపై ఎస్సీ కార్పొరేషన్ తర్జనభర్జన
- రెండో విడతలో 230 యూనిట్లకు పచ్చజెండా ఊపిన యంత్రాంగం
- ఒక్కో లబ్ధిదారు బ్యాంకు ఖాతాకు ప్రారంభ నిధి జమ
- ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో మిగులు నిధుల విడుదలకు బ్రేక్
- కోడ్ ముగిసినప్పటికీ పథకం కొనసాగింపుపై అయోమయం



సాక్షి, హైదరాబాద్: దళితబంధు పెండింగ్ చెల్లింపులపై రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల ఆర్థిక సహకార సంస్థ తర్జనభర్జన పడుతోంది. దళితబంధు పథకం రెండో విడతలో భాగంగా ఎంపికైన పలువురు లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో ఆర్థిక సాయం చేయలేదు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో తీవ్ర జాప్యం జరగడం... తీరా అరకొరగా అర్హులను ఎంపిక చేసి వారికి శిక్షణ ఇచ్చే నాటికి ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి రావడంతో ఆ ప్రక్రియ నిలిచిపోయింది. ప్రస్తుతం ఎన్నికల కోడ్ తొలగిపోయినా.. ఆయా లబ్ధిదారులకు పూర్తి స్థాయి సాయం పంపిణీపై సందిగ్ధం నెలకొంది. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం రావడం, గత ప్రభుత్వ ప్రాధాన్యతల కంటే మెరుగైన విధంగా కొత్త పథకాల రూపకల్పనకు సన్నద్ధమవుతుండడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. దీంతో రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ వద్ద నిధులు అందుబాటులో ఉన్నప్పటికీ వాటిని అర్హులకు ఇవ్వాలా? వద్దా? అనే అయోమయం అధికారులను కలవరపెడుతోంది.

అన్నీ పక్కన పెట్టినా గ్రేటర్‌కు మాత్రం మినహాయింపు

తెలంగాణ దళితబంధు పథకం రెండో విడత కింద అప్పటి ప్రభుత్వం ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి వెయ్యి చొప్పున యూనిట్లు మంజూరు చేసింది. ఈమేరకు క్షేత్రస్థాయి నుంచి శాసనసభ్యులు రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్‌కు ప్రతిపాదనలను పంపారు. అప్పట్లో ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు రాకపోవడంతో వాటన్నింటినీ పక్కన పెట్టారు. అయితే గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో మురుగు వ్యర్థాల సేకరణ(సిల్ట్ కార్టింగ్ వెహికల్స్) వాహనాలకు డిమాండ్ ఉండడంతో 2023–24 వార్షిక సంవత్సరంలో 162 యూనిట్లను మంజూరు చేసి యుద్ధప్రాతిపదికన లబ్ధిదారులకు అందించారు. ఈ వాహనాలను జీహెచ్ఎంసీలో వినియోగించుకోనున్నారు. ఇందుకు సంబంధించి జలమండలి(హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ) ఒప్పందం కుదుర్చుకుంది.

ఇంకా ఇవ్వాల్సింది 230 యూనిట్లకు మాత్రమే..: అదేవిధంగా హైదరాబాద్ పరిధిలో ఇతర కేటగిరీలకు సంబంధించి మరో 230 యూనిట్లకు మంజూరు తెలిపిన ప్రభుత్వం అర్హుల ఖాతాల్లో తొలివిడతలో భాగంగా రూ.లక్ష నుంచి రూ.3 లక్షల వరకు నిధిని జమ చేసింది. మిగతా నిధులను జమచేయాల్సి ఉండగా ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. దీంతో ఆ నిధులు ఎస్సీ కార్పొరేషన్ వద్దే ఉండిపోయాయి. ప్రస్తుతం కోడ్ పూర్తి కాగా... నిధులను మాత్రం అధికారులు లబ్ధిదారుల ఖాతాకు విడుదల చేయడం లేదు. ఈమేరకు అనుమతి కోరుతూ ఎస్సీ కార్పొరేషన్ అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ సమర్పించినట్లు తెలిసింది. అయితే ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు అందలేదు. మరోవైపు కొంత మేర ఆర్థిక సాయం పొందిన లబ్ధిదారులు మిగతా సాయం కోసం ఎదురు చూస్తున్నారు. పూర్తిస్థాయిలో సాయం అందితే నిర్దేశించుకున్న యూనిట్‌లు తెరవాలని ఆశపడుతున్నారు.

అంకుర ఆసుపత్రిలో అగ్నిప్రమాదం

- రోగులు, సహాయకులు సురక్షితం
- ఇన్‌పేషెంట్లను బంజారాహిల్స్ ఆస్పత్రికి తరలించిన ఆస్పత్రి సిబ్బంది

గోల్కొండ (హైదరాబాద్): గుడిమల్కాపూర్‌లోని అంకుర ఆసుపత్రిలో శనివారం అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. సాయంత్రం ఆరు గంటల సమయంలో భవనంలోని 8వ అంతస్తు నుంచి భారీగా మంటలు చెలరేగాయి. నిమిషాల్లోనే ఆ ప్రాంతమంతా దట్టమైన పొగతో నిండిపోయింది. షార్ట్ సర్క్యూట్ కారణంగానే మంటలు చెలరేగాయని పోలీసులు చెప్పారు. అగ్నిమాపక శాఖ డీజీపీ జీ.వి.నారాయణరావు, సౌత్, వెస్ట్ జోన్ డీసీపీ బాలస్వామి తెలిపిన వివరాల ప్రకారం.. గుడిమల్కాపూర్‌లో 9 అంతస్తులో ఉన్న భవనంలో అంకుర ఆసుపత్రి కొనసాగుతోంది. గ్రౌండ్ ఫ్లోర్‌తో పాటు 3వ ఫ్లోర్ వరకు మాత్రమే ఆసుపత్రి నిర్వహిస్తున్నారు. 4వ అంతస్తు నుంచి 9వ అంతస్తు వరకు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. 8, 9 అంతస్తులో ఆసుపత్రికి చెందిన హోర్డింగ్స్, ఫ్లెక్సీలు భారీ సంఖ్యలో నిల్వ చేశారు. షాట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగడం, భారీ సంఖ్యలో ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు ఉండటంతో వాటికి కూడా మంటలు అంటుకున్నాయని చెప్పారు. మొత్తం ఐదు ఫైరింజన్లతో మంటలు అదుపులోకి తెచ్చామని అగ్నిమాపక శాఖ డీజీపీ నారాయణరావు తెలిపారు. ఆసుపత్రిలో ఉన్న 30 మంది ఇన్‌పేషెంట్లను అంబులెన్స్‌లలో బంజారాహిల్స్‌లోని అంకుర ఆసుపత్రికి తరలించారు. కాగా, అంకుర ఆస్పత్రిలో అగ్నిప్రమాదంపై రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆరా తీశారు. వైద్యారోగ్యశాఖ సెక్రటరీ, హెల్త్ డైరెక్టర్లతో ఘటనపై విచారణకు ఆదేశించారు.



మంటలతో దగ్ధమవుతున్న ఆస్పత్రి భవనం

నౌకపై డ్రోన్ దాడి

21 మంది భారత సిబ్బంది క్షేమం

న్యూఢిల్లీ: సౌదీ అరేబియా నుంచి మంగళూరుకు ముడి చమురుతో వస్తున్న వాణిజ్య నౌకపై డ్రోన్ దాడి జరిగింది. భారత్‌లోని వేరావల్‌కు నైరుతి దిశలో 200 నాటికల్ మైళ్ల దూరంలో అరేబియా సముద్రంలో శనివారం ఈ ఘటన చోటుచేసుకుంది. నౌకలోని 22 మంది సిబ్బందిలో 21 మంది భారతీయులే. ఘటన కారణంగా నౌకకు ఎలాంటి ప్రమాదం వాటిల్లలేదని, సిబ్బంది అంతా క్షేమంగా ఉన్నారని భారత మిలటరీ వర్గాలు తెలిపాయి. నౌకపై డ్రోన్ దాడి జరిగిందన్న సమాచారం ముందుగా యునైటెడ్ కింగ్‌డమ్ మారిటైమ్ ట్రేడ్ ఆపరేషన్స్(యూకేఎంటీవో)కు అందింది. ఆ మేరకు భారత నేవీని అప్రమత్తం చేయడంతో ఆ ప్రాంతానికి పి–81 గస్తీ విమానాన్ని పంపించారు. డ్రోన్ దాడితో నౌకలో పేలుడు సంభవించి మంటలు చెలరేగాయి. సిబ్బందికి హాని జరగలేదని సైనిక వర్గాలు తెలిపాయి.

చొరబాటుయత్నం భగ్నం.. కశ్మీర్లో ఉగ్రవాది హతం

జమ్మూ: జమ్మూకశ్మీర్‌లోని అంతర్జాతీయ సరిహద్దుల వెంబడి(ఐబీ) జరిగిన చొరబాటు యత్నాన్ని తిప్పికొట్టినట్లు ఆర్మీ తెలిపింది. అఖ్నూర్ సెక్టార్‌లోని ఖౌర్ వద్ద శుక్రవారం అర్ధరాత్రి దాటాక సరిహద్దు కంచెను దాటి భారత్‌లోకి ప్రవేశించేందుకు నలుగురు సాయుధ ఉగ్రవాదులు ప్రయత్నించారు. నిఘా వ్యవస్థల ద్వారా విషయాన్ని గుర్తించిన బలగాలు అప్రమత్తమై కాల్పులు జరిపాయి. ఈ కాల్పుల్లో ఒక ఉగ్రవాది హతమయ్యాడు. మిగతా వారు మృతదేహాన్ని లాక్కెళ్లినట్లు అక్కడ లభించిన ఆనవాళ్లను బట్టి తేలిందని ఆర్మీ తెలిపింది.

కుటుంబాన్ని కూల్చేశారు

ఇజ్రాయెల్ దాడిలో పాలస్తీనాలో 76 మంది సజీవసమాధి

రఫా(గాజా స్ట్రిప్): హమాస్ మెరుపుదాడికి ప్రతీకారంగా మెల్లగా దాడులు మొదలెట్టిన ఇజ్రాయెల్ రోజురోజుకూ రెచ్చిపోతోంది. అమాయక పాలస్తీనియన్లను పొట్టనబెట్టుకుంటోంది. శనివారం ఇజ్రాయెల్ సేనల నిర్దయ దాడులకు ఒక ఉమ్మడి కుటుంబం నిట్టనిలువునా కుప్పకూలింది. గాజా సిటీలో జరిపిన దాడుల్లో ఐక్యరాజ్యసమితి డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ మాజీ ఉద్యోగి 'అల్–మగ్‌రాబీ' ఉమ్మడి కుటుంబంలో ఏకంగా 76 మంది కుటుంబసభ్యులు ప్రాణాలు కోల్పోయారు. నుసేరాత్ పట్టణ శరణార్థి శిబిరంపై జరిపిన దాడిలో స్థానిక టీవీ పాత్రికేయుడు మొహమ్మద్ ఖలీఫా ఉమ్మడి కుటుంబం బలైంది. ఈ దాడిలో 14 మంది కుటుంబసభ్యులు మరణించారు. మొత్తం దాడుల్లో 90 మందికి పైగా మరణించారని గాజా పౌరరక్షణ విభాగం అధికార ప్రతినిధి వెల్లడించారు.

కుమావత్‌కు కస్టడీ పొడిగింపు

న్యూఢిల్లీ: పార్లమెంట్‌లో అలజడి కేసు నిందితుడు మహేశ్ కుమావత్ కస్టడీని కోర్టు జనవరి 5వ తేదీ వరకు పొడిగించింది. ఢిల్లీ పోలీసుల వినతి మేరకు స్పెషల్ కోర్టు జడ్జి హర్దీప్ కౌర్ శనివారం ఈ మేరకు ఆదేశాలిచ్చారు. ఈ కేసులో మిగతా నిందితులు లలిత్ ఝా, మనోరంజన్, సాగర్ శర్మ, అమోల్ ధన్‌రాజ్ షిండే, నీలమ్ దేవి కస్టడీని ఇప్పటికే పొడిగించడం తెలిసిందే.

752 కరోనా కేసులు

న్యూఢిల్లీ: దేశంలో 24 గంటల వ్యవధిలో కొత్తగా 752 కేసులు నమోదు కాగా కరోనా బారినపడిన నలుగురు మృత్యువాతపడ్డారు. ఈ ఏడాది మే 21వ తేదీ తర్వాత ఒకే రోజుల్లో 752 కొత్త కేసులు వెలుగు చూడటం ఇదే మొదటిసారని శనివారం కేంద్ర ఆరోగ్య శాఖ తెలిపింది. అదేవిధంగా, యాక్టివ్ కేసుల సంఖ్య 3,420కు చేరుకుంది. 24 గంటల వ్యవధిలో కేరళలో ఇద్దరు, రాజస్తాన్, కర్ణాటకలో ఒక్కరు చనిపోయారు.

ట్రంప్‌కు ఊరట

వాషింగ్టన్: 2020 అధ్యక్ష ఎన్నికల ఫలితాలను తారుమారు చేయడానికి మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రయత్నించినట్లు వచ్చిన ఆరోపణలపై విచారణ జరిపే అంశాన్ని త్వరగా తేల్చాలంటూ వచ్చిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. ఇప్పటికిప్పుడు దీనిపై విచారణ జరపలేమని తేల్చిచెప్పింది. 2024 ఎన్నికల్లో మళ్లీ పోటీ చేసేందుకు ట్రంప్ తన ప్రయత్నాలు వేగవంతం చేశారు. తనపై ఉన్న క్రిమినల్ కేసుల విచారణను వాయిదా వేయాలని పదేపదే కోర్టుల్లో పిటిషన్లు వేస్తున్నారు. ఇలాంటి తరుణంలో కీలకమైన ఈ పరిణామం చోటుచేసుకుంది. వచ్చే ఏడాది మార్చి 4వ తేదీన కోర్టు చేపట్టే కీలకమైన విచారణపైనా దీని ప్రభావం ఉంటుందని భావిస్తున్నారు.

యూపీ ఎమ్మెల్యేపై వేటు

లఖ్‌నవూ: అత్యాచార ఆరోపణలపై ఇటీవల 25 ఏళ్ల జైలు శిక్ష పడ్డ ఉత్తరప్రదేశ్ బీజేపీ ఎమ్మెల్యే రామ్‌దులార్ గోండ్‌పై అనర్హత వేటు పడింది. కోర్టు తీర్పు నేపథ్యంలో ఆయన శాసనసభ్యత్వాన్ని రద్దు చేసినట్టు అసెంబ్లీ వర్గాలు శనివారం వెల్లడించాయి. ప్రజా ప్రాతినిధ్య చట్టం ప్రకారం రెండేళ్ల, అంతకంటే ఎక్కువ జైలు శిక్ష పడ్డ ప్రజాప్రతినిధులు తమ పదవిని కోల్పోతారు. శిక్షా కాలం ముగిశాక మరో ఆరేళ్ల పాటు ఎన్నికల్లో పోటీకి అనర్హులవుతారు. రామ్‌దులార్ దుద్ధి అసెంబ్లీ స్థానానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

2 గర్భసంచులు 2 రోజులు 2 ప్రసవాలు

అమెరికా మహిళ అరుదైన రికార్డు



అద్భుతాలకే అద్భుతంగా చెప్పదగ్గ ఈ ఉదంతం అమెరికాలో జరిగింది. అలబామాకు చెందిన కెల్సీ హాచర్ అనే 32 ఏళ్ల మహిళ పురిటి నొప్పులతో డిసెంబర్ 19న యూనివర్సిటీ ఆఫ్ అలబామాలోని బర్మింగ్‌హాం ఆస్పత్రి (యూఏబీ)లో చేరింది. 10 గంటల పురిటి నొప్పుల తర్వాత సాధారణ కాన్పులో పండంటి ఆడపిల్లకు జన్మనిచ్చింది. కానీ పురిటి నొప్పులు మాత్రం అలాగే కొనసాగాయి. మరో 10 గంటల తర్వాత సిజేరియన్ ద్వారా మరో ఆడపిల్లకు జన్మనిచ్చి అబ్బురపరిచింది. కెల్సీకి రెండు గర్భసంచులుండటం, రెండింట్లోనూ ఒకేసారి గర్భధారణ జరగడం వల్ల ఈ అద్భుతం సాధ్యమైంది. మహిళల్లో ఇలా రెండు గర్భసంచులుండే ఆస్కారమే కేవలం 0.3 శాతమట! వారిలోనూ రెండింట్లోనూ ఒకేసారి గర్భం ధరించే ఆస్కారమైతే 10 లక్షల్లో ఒక్క వంతు మాత్రమేనట! అరుదైన ఈ జంట అద్భుతాలు రెండూ కలిసి రావడంతో కెల్సీ ఇలా అత్యంత అరుదైన రికార్డును సొంతం చేసుకుంది!!

కెల్సీకి రెండు గర్భసంచులు ఉన్నట్టు 17వ ఏట బయట పడింది. కానీ పెళ్లి తర్వాత తొలి కాన్పుల్లోనూ సాధారణంగా ఒక్కొక్కరే పుట్టారు. ఈసారీ అలాగే జరగనుందని నెల తప్పినప్పుడు కెల్సీ అనుకుందట. ''కానీ అల్ట్రా సౌండ్ చేయిస్తే రెండు గర్భసంచుల్లోనూ పిండాలున్నట్టు తెలిసి చెప్పలేనంత థ్రిల్‌కు లోనయ్యా. అసలలాంటిది సాధ్యమని మొదట నమ్మకమే కుదర్లేదు'' అని సంబరంగా చెప్పుకొచ్చిందామె! అక్కణ్నుంచి కెల్సీ తన అసాధారణ జంట గర్భధారణ గాథను ఇన్‌స్టాగ్రాంలో రెగ్యులర్‌గా ఎప్పటికప్పుడు పంచుకుంటూ వచ్చింది. చూస్తుండగానే నెలలు నిండటం, ఆస్పత్రిలో చేరడం, వరుసగా రెండు రోజుల్లో ఇద్దరు పాపాయిలకు జన్మనిచ్చి రికార్డులకెక్కడం చకచకా జరిగిపోయాయి. ఈ అరుదైన కాన్పుల కోసం ఆస్పత్రి డబుల్ ఏర్పాట్లు చేయడం విశేషం! డబుల్ మానిటరింగ్, డబుల్ చార్టింగ్ మొదలుకుని కాన్పు కోసం రెండింతల సిబ్బందిని నియమించడం దాకా అన్నీ 'రెట్టింపు స్పీడు'తో జరిగాయి. ఇద్దరు పాపాయిలూ గర్భంలో ఆరోగ్యంగా పెరిగినట్టు కాన్పు చేసిన వైద్య బృందానికి సహ సారథ్యం వహించిన ప్రొఫెసర్ రిచర్డ్ డేవిస్ తెలిపారు. ''ఒకే గర్భసంచిలో రెండు పిండాలు పెరిగిన బాపతు సాధారణ గర్భధారణ కాదిది. పిల్లలిద్దరూ ఒకే అపార్ట్‌మెంట్‌లో వేర్వేరు ఫ్లాట్లలో మాదిరిగా ఎవరి గర్భసంచిలో వారు స్వేచ్ఛగా ఎదిగారు'' అని చెప్పుకొచ్చారు. ''డిసెంబర్ 19న రాత్రి 7.45 గంటలకు తొలి పాప పుట్టింది. 10 గంటల పై చిలుకు పురిటి నొప్పుల తర్వాత డిసెంబర్ 20న ఉదయం 6.10 గంటలకు సిజేరియన్ చేసి రెండో పాపను బయటికి తీశాం. ఇంతటి అరుదైన ఘటనకు సాక్షులుగా నిలిచామంటూ మా వైద్య బృందమంతా కేరింతలు కొట్టాం'' అని వివరించారు.

తొలి మూడు కాన్పులు సాధారణమే...

– సాక్షి, నేషనల్ డెస్క్

పిల్లల బుల్లి రికార్డు...!


నవజాత శిశువులు కూడా రికార్డుల విషయంలో తమ తల్లికి ఏ మాత్రమూ తీసిపోలేదు. వేర్వేరు గర్భసంచుల్లో పెరగడమే గాక ఏకంగా వేర్వేరు పుట్టిన రోజులున్న అత్యంత అరుదైన కవలలుగా రికార్డులకెక్కారు. అంతేకాదు, వీరు ఎవరికి వారు వేర్వేరు అండం, వీర్య కణాల ఫలదీకరణ ద్వారా కడుపులో పడటం మరో విశేషం! ఇలాంటి కవలలను ఫ్రాటర్నల్ ట్విన్స్‌గా పిలుస్తారని ప్రొఫెసర్ రిచర్డ్ తెలిపారు. మొత్తానికి రికార్డులు సృష్టించడంలో తల్లికి తీసిపోమని పుట్టీ పుట్టగానే నిరూపించుకున్నారంటూ అంతా ముక్కున వేలేసుకుంటున్నారు!

బంగ్లా మహిళ బంపర్ రికార్డు!

ఇలాంటి అరుదైన 'జంట జననాలు' అత్యంత అరుదే అయినా అసలు జరగకుండా పోలేదు. 2019లో బంగ్లాదేశ్‌లో జరిగిన ఇలాంటి ఘటన దీన్ని తలదన్నేలా ఉండటం విశేషం! రెండు గర్భసంచుల్లోనూ గర్భం దాల్చిన ఓ మహిళ తొలి కాన్పు తర్వాత ఏకంగా నెల రోజుల తర్వాత రెండో పాపాయికి జన్మనిచ్చిందట! ఆ పురుళ్లు పోసిన వైద్యుడు అప్పట్లో ఈ వింతను బీబీసీతో పంచుకున్నాడు.

సగానికి పైగా ఓట్లు మనకే పడాలి

బీజేపీ పదాధికారుల సమావేశంలో నేతలకు మోదీ దిశానిర్దేశం



న్యూఢిల్లీ: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రధాని మోదీ పార్టీ పదాదికారులకు దిశానిర్దేశం చేశారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో విస్తృత ప్రచారం చేసి, ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించి మరిన్ని ఓట్లను ఒడిసిపట్టాలని పార్టీ సీనియర్ నేతలకు సూచించారు. శుక్రవారం ఢిల్లీలో జరిగిన బీజేపీ పార్టీ జాతీయ పథాధికారుల సమావేశం ఇందుకు వేదికైంది. రెండురోజులపాటు సాగిన ఈ సమావేశం శనివారం ముగిసింది. నేషనల్ ఆఫీస్ బేరర్స్, పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, రాష్ట్రాల ఇన్‌చార్జ్‌లు, రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు, ఇతర సంస్థాగత విభాగాల సారథులు ఈ సమావేశాలకు హాజరయ్యారు. ఈ సమావేశంలో చర్చకొచ్చిన ఇతరత్రా అంశాలను విశ్వసనీయ వర్గాలు శనివారం వెల్లడించాయి. ''త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికల సమరంలో సగానికిపైగా ఓట్లు బీజేపీకే దఖలుపడాల్సిందే. పోలింగ్‌లో పార్టీ ఓటు షేర్ కనీసం 10 శాతమైనా పెరగాల్సిందే. 2019లో బీజేపీ 37శాతానికిపైగా ఓటు షేరు సాధించింది. ఎన్‌డీఏ కూటమి దాదాపు 45 శాతం ఓటుషేరు సాధించింది. 2014 నుంచి చూస్తే కొన్ని రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికల్లో పోలైన ఓట్లలో 50 శాతం ఓట్లు ఒక్క బీజేపీకే పడ్డాయి. దృఢ కార్యదీక్షతో ఎన్నికల క్షేత్రంలో అవిశ్రాంతంగా పనిచేయండి. 2019 సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ 303 నియోజకవర్గాల్లో ఘన విజయం సాధించిన విషయం తెల్సిందే. అయితే ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో అంతకుమించిన చోట్ల మన పార్టీ విజయభేరీ మోగించాలి. ఆ బాధ్యత మీదే. జనం మెచ్చిన సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా చొచ్చుకుపొండి. తప్పుడు ఆరోపణలతో విష ప్రచారం చేసే విపక్ష పార్టీల ఆటకట్టించండి. అందుకోసం కేంద్ర ప్రభుత్వం పూర్తిచేసిన ప్రాజెక్టులు, పనులు, వాస్తవ గణాంకాలతో ప్రజలకు నిజానిజాలకు తెలియజెప్పండి'' అని బీజేపీ నేతలకు మోదీ సూచించారు.

నాలుగు 'కులాలను' కలుపుకొని పొండి

'దేశంలో నాలుగే కులాలున్నాయి. మహిళలు, యువత, రైతులు, పేదలు. ప్రచారంలో భాగంగా ఈ నాలుగు కులాలను కలిసి వారి కష్టాలకు పరిష్కారం కనుగొనేందుకు ప్రయత్నించండి. అద్భుత ఫలితాలు, ప్రజాదరణ పొందిన కేంద్ర ప్రభుత్వ పథకాలను మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లండి' అని మోదీ సూచించారు. కేంద్రంలో బీజేపీ హయాంలో అమలవుతున్న కేంద్ర పథకాలు, వాటి లబ్ధిదారుల విజయగాథలను తెల్పుకుంటూ, ప్రజల్లో పథకాల అవగాహన పెంచుతూ ముందుకు సాగుతున్న ' వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర'ను మరింతగా విజయవంతంగా చేయడంపైనా సమావేశంలో నేతలు చర్చించారు. ఇటీవల ముగిసిన ఐదు రాష్ట్రాల శాసనసభ ఎన్నికల ఫలితాలు, త్వరలో జరగబోయే అటల్ బిహారీ వాజ్‌పేయీ జయంతి వేడుకలను మరింత బాగా నిర్వహించడం, తదితరాలూ సమావేశంలో చర్చకొచ్చాయి. మూడు రాష్ట్రాల ఎన్నికల్లో నమోదైన విజయం.. సార్వత్రిక ఎన్నికల్లో నాలుగో విజయానికి శుభసూచకమని నేతలు ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారని వార్తలొచ్చాయి. బూత్ కమిటీలను పటిష్టవంతంచేస్తేనే ఎక్కువ మంది ఓటర్లను మనం చేరుకోగలమని నేతలు చెప్పినట్లు వార్తలొచ్చాయి. ''మూడు రాష్ట్రాల్లో గెలిచి హ్యాట్రిక్ కొట్టాం. ఇక సార్వత్రిక సమరంలోనూ హ్యాట్రిక్ కొట్టబోతున్నాం'' అని నేతల ముందు మోదీ విశ్వాసం వ్యక్తంచేశారని తెలుస్తోంది. ''మన ప్రదర్శన చూసి విపక్షాలు కంగుతినాలి'' అని కేంద్ర హోం మంత్రి అమిత్ షా వ్యాఖ్యానించారట. రాజస్తాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లో పార్టీ ఘన విజయంపై ఆ రాష్ట్రాల బీజేపీ అధ్యక్షులు పార్టీని పొగుడుతూ ప్రసంగించారు. వచ్చే నెలలో అయోధ్యలో భవ్య రామమందిరం ప్రారంభోత్సవం సార్వత్రిక ఎన్నికల్లో పార్టీకి బాగా కలిసొస్తుందని నేతలు ఆశాభావం వ్యక్తంచేశారు.

హిందూ ఆలయంపై విద్వేష రాతలు

- అమెరికాలోని నెవార్క్‌లో ఘటన
- విద్వేష నేరంగా కేసు నమోదు

న్యూయార్క్/గాంధీనగర్: అమెరికాలోని కాలిఫోర్నియా రాష్ట్రంలోని ప్రముఖ హిందూ ఆలయంపై దాడి జరిగింది. దుండగులు ఆలయ గోడపై భారత వ్యతిరేక అభ్యంతరకర చిత్రాలతోపాటు ఖలిస్తాన్ అంటూ కలర్ స్ప్రే చేశారు. పోలీసులు ఈ ఘటనను విద్వేష నేరంగా పేర్కొంటూ కేసు నమోదు చేశారు. నెవార్క్‌లోని స్వామి నారాయణ్ మందిర్ హిందూ ఆలయంపై అభ్యంతరకర చిత్రాలు(గ్రాఫిటీ) ఉన్నాయంటూ శుక్రవారం ఉదయం తమకు ఆలయ నిర్వాహకుల నుంచి ఫిర్యాదు అందినట్లు పోలీసులు తెలిపారు. పోలీసు అధికారులు వాటిని పరిశీలించారు. గ్రాఫిటీని రెచ్చగొట్టే చర్యగా ఆలయ పెద్దలు పేర్కొన్నారని పోలీసులు వెల్లడించారు. కావాలనే ఎవరో ఈ దుశ్చర్యకు పాల్పడినట్లు భావిస్తున్నామని చెప్పారు. విద్వేష నేరంగా కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నామన్నారు. సమీపంలోని సీసీటీవీ ఫుటేజీ తదితరాలతో ఆధారాలను సేకరిస్తున్నామని చెప్పారు. ఈ ఘటనను అమెరికా విదేశాంగ శాఖ, శాన్‌ఫ్రాన్సిస్కోలోని భారత్ కాన్సులేట్ కార్యాలయం తీవ్రంగా ఖండించాయి. గతంలోనూ భారత దౌత్య కార్యాలయాలపై ఇలాంటి దాడులు జరిగాయి. జులైలో శాన్‌ఫ్రాన్సిస్కోలోని కాన్సులేట్ కార్యాలయంపై ఖలిస్తాన్ మద్దతుదారులు దాడికి పాల్పడ్డారు. అమెరికా, కెనడాల పౌరసత్వమున్న ఖలిస్తాన్ ఉగ్రవాది పన్నూపై హత్యాయత్నం వెనుక భారత ప్రమేయముందన్న ఆరోపణల నేపథ్యంలో ఈ ఘటన చోటుచేసుకోవడం గమనార్హం.

ఉపేక్షించరాదు: జై శంకర్

ఈ ఘటనపై విదేశాంగ మంత్రి ఎస్.జై శంకర్ ఆందోళన వ్యక్తం చేశారు. భారత్ వెలుపల ఉగ్రవాదం, వేర్పాటువాదాలను ఉపేక్షించరాదని డిమాండ్ చేశారు.

● మానవ అక్రమ రవాణా ఆరోపణలు.. భారతీయులున్న విమానాన్ని ఆపేసిన ఫ్రాన్స్

పారిస్: మానవ అక్రమ రవాణా జరుగుతోందన్న ఆరోపణలపై ఫ్రాన్సు అధికారులు నిలిపివేసిన విమానంలోని భారతీయులకు కాన్సులర్ అనుమతి లభించిందని అక్కడి భారత దౌత్య కార్యాలయం తెలిపింది. యూఏఈలోని దుబాయ్ నుంచి 303 మంది భారతీయులతో నికరాగ్వా వైపు వెళుతోంది. ఆ విమానం గురువారం ఇంధనం కోసం ఫ్రాన్సులోని చలోన్స్–వట్రీ విమానాశ్రయంలో దిగింది. అప్పటికే మానవ అక్రమ రవాణా జరుగుతోందనే సమాచారం అందుకున్న అధికారులు ఆ విమానాన్ని దిగ్బంధించారు. అందులోని ప్రయాణికులందరికీ విమానాశ్రయంలోని టెర్మినల్ భవనంలో బస ఏర్పాట్లు చేశారు. వారందరి వద్దా ఉన్న ధ్రువీకరణ పత్రాలను పరిశీలిస్తున్నారు. వారంతా దుబాయ్‌లో ఏం చేస్తున్నారు? ఎక్కడికి వెళ్తున్నారు? నికరాగ్వా వెళ్లేందుకు అవసరమైన పత్రాలున్నాయా? వంటి విషయాలను ఆరా తీస్తున్నారు. విమానంలోని ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నారు. 21 నెలలు మొదలుకొని 17 ఏళ్ల వరకు వయస్సున్న 13 మంది మైనర్లు విమానంలో ఉన్నారని, వీరిలో కొందరు ఒంటరిగా ప్రయాణిస్తున్నట్లు గుర్తించారు. ప్రయాణికులందరికీ ఫ్రాన్సు ప్రభుత్వం కాన్సులర్ అనుమతి మంజూరు చేసిందని భారత దౌత్య కార్యాలయం వెల్లడించింది. మానవ అక్రమ రవాణాతో తమకు సంబంధం లేదని లెజెండ్ ఎయిర్‌లైన్స్ ప్రతినిధి పేర్కొన్నారు. ప్రయాణికులంతా దుబాయ్‌లో పనిచేస్తున్న వారేనని భావిస్తున్నట్లు చెప్పారు. తమ సంస్థ ఖాతాదారు కోసమే ఆ సర్వీసును నడిపినట్లు తెలిపారు. వీరంతా నికరాగ్వా చేరి, అక్కడ్నుంచి దొంగచాటుగా అమెరికా లేదా కెనడాలో ప్రవేశించేందుకే పథకం వేశారని భావిస్తున్నారు.

పైలట్‌కు 'ఛత్తీస్' బాధ్యతలు

ప్రధాన కార్యదర్శులు, ఇన్‌ఛార్జ్‌ల బాధ్యతల్లో మార్పు చేసిన ఏఐసీసీ



న్యూఢిల్లీ: సార్వత్రిక ఎన్నికల వేళ కాంగ్రెస్ పార్టీ రాజస్తాన్ మాజీ ఉపముఖ్యమంత్రి సచిన్ పైలట్‌కు పార్టీలో కీలక పదవి అప్పగించింది. ఛత్తీస్‌గఢ్ ఇన్‌చార్జ్ ప్రధాన కార్యదర్శిగా నియమిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ శనివారం ఒక ప్రకటనలో పేర్కొంది. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ సభ్యులుగా, మల్లికార్జున ఖర్గే నేతృత్వంలో సీడబ్ల్యూసీ భేటీ జరిగిన రెండు రోజులకే ఇలా పలువురు ప్రధాన కార్యదర్శులు, ఇన్‌చార్జ్‌ల బాధ్యతలను మార్చడం గమనార్హం. ఢిల్లీ, హరియాణా ఇన్‌చార్జ్ బాధ్యతలను దీపక్ బబారియాకు అప్పగించారు. కుమారి సెల్జాను ఉత్తరాఖండ్ ఇన్‌చార్జ్ ప్రధాన కార్యదర్శిగా నియమించింది. మాణిక్కం ఠాగూర్‌ను అండమాన్ అండ్ నికోబార్ వ్యవహారాల ఇంఛార్జ్‌గా నియమించారు. జార్ఖండ్ ప్రధాన కార్యదర్శి జీఏ మిర్‌కు పశ్చిమబెంగాల్ బాధ్యతలూ అప్పగించారు. జితేంద్ర సింగ్‌కు మధ్యప్రదేశ్ బాధ్యతలు కట్టబెట్టారు. మహారాష్ట్ర ఇన్‌చార్జ్‌గా రమేశ్ చెన్నితల, బిహార్ ఇన్‌చార్జ్‌గా మోహన్ ప్రకాశ్ నియమితులయ్యారు. మేఘాలయ, మిజోరం, అరుణాచల్ ప్రదేశ్‌లకు ఇన్‌చార్జ్‌గా చెల్లకుమార్ ఎంపికయ్యారు. అజయ్ కుమార్‌కు తమిళనాడు, పుదుచ్చేరి అదనపు బాధ్యతలు ఇచ్చారు. జమ్మూకశ్మీర్ ఇన్‌చార్జ్‌గా భరత్‌సిన్హ్ సోలంకీ, హిమాచల్, చండీగఢ్ ఇన్‌చార్జ్‌గా రాజీవ్ శుక్లా, రాజస్తాన్ ఇన్‌చార్జ్‌గా సుఖ్‌జీందర్ సింగ్ రణ్‌ధావా, పంజాబ్ ఇన్‌చార్జ్‌గా దేవేందర్ యాదవ్, గోవా, డామన్, డయ్యూ, దాద్రానగర్, హవేలా ఇన్‌చార్జ్‌గా మాణిక్‌రావు ఠాకరేను నియమించారు. త్రిపుర, సిక్కిం, మణిపూర్, నాగాలాండ్‌లకు గిరీశ్ చోదంకర్‌ను ఇన్‌చార్జ్‌గా నియమించారు. తెలంగాణ ఇంఛార్జ్‌గా దీపా దాస్‌మున్షీ, ఏపీకి మాణిక్కం ఠాగూర్‌ను నియమించారు.

ప్రియాంక చేజారిన యూపీ

ఉత్తర్‌ప్రదేశ్ ఇన్‌ఛార్జ్ బాధ్యతల నుంచి ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీని తప్పించడం గమనార్హం. ప్రియాంక గాంధీకి ప్రధాన కార్యదర్శి పదవి ఉన్నాసరే ఆమెకు ఎలాంటి పోర్ట్‌ఫోలియో కేటాయించలేదు. అవినాశ్ పాండేకు ఉత్తరప్రదేశ్ బాధ్యతలను కట్టబెట్టారు. అజయ్ మాకెన్ పార్టీ కోశాధికారిగా ఉంటారు.

ఆ చెక్కులు వెనక్కిచ్చేస్తాం

'ర్యాట్ హోల్' గని కార్మికుల నిరసన

డెహ్రాడూన్: ఉత్తరాఖండ్‌లోని సిల్కియారా వద్ద సొరంగంలో గత నెలలో 17 రోజుల పాటు చిక్కుబడిపోయిన 41 మంది కార్మికులను రక్షించడంలో కీలకమైన 12 మంది ర్యాట్–హోల్' గని కార్మికులు నిరసన తెలుపుతున్నారు. ''అన్ని రకాల యంత్రాలు విఫలమైన వేళ.. మేం ఎలాంటి షరతులు పెట్టకుండా ప్రాణాలనొడ్డి మార్గం తయారు చేశాం. సొరంగం లోపల చిక్కుకున్న వారిని సురక్షితంగా వెలుపలికి తెచ్చాం. ఇందుకుగాను ఉత్తరాఖండ్ ప్రభుత్వం కేవలం రూ.50 వేల చొప్పున చెక్కులిచ్చింది. మాకీ ప్రతిఫలం సరిపోదని చెప్పాం. అధికారుల నుంచి, ఇప్పటికీ జవాబులేదు. ఈ చెక్కులు మాకొద్దు. మేమందరం వాపసు చేస్తాం'' అని మైనర్లలో ఒకరైన వకీల్ హసన్ పీటీఐకి తెలిపాడు. ప్రభుత్వం తమకు శాశ్వత ఉద్యోగాలివ్వాలని డిమాండ్ చేశాడు.

ముగ్గురు పౌరుల అనుమానాస్పద మృతి

కశ్మీర్‌లో మళ్లీ ఉద్రిక్తతలు

- ఆర్మీయే చంపిందని ఆరోపణలు
- కుటుంబాలకు పరిహారం, ఉద్యోగాలు: ప్రభుత్వం

జమ్మూ: జమ్మూకశ్మీర్‌లోని సరిహద్దు జిల్లాలు పూంఛ్, రాజౌరీల్లో మళ్లీ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. విచారణ కోసమని తీసుకెళ్లి ముగ్గురు పౌరులను ఆర్మీ అధికారులు చంపేశారంటూ పార్టీల నేతలు, స్థానికులు నిరసనకు దిగారు. దీనిపై ప్రభుత్వం స్పందించింది. మృతుల కుటుంబాలకు పరిహారం అందజేస్తామని, ఉద్యోగాలు కల్పిస్తామని తెలిపింది. సమగ్ర దర్యాప్తు జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చింది. విచారణకు పూర్తిగా సహకరిస్తామని ఆర్మీ ప్రకటించింది. వదంతులు వ్యాపించకుండా పూంఛ్, రాజౌరీ జిల్లాల్లో మొబైల్ ఇంటర్నెట్ సేవలను నిలిపివేశారు. ఈ నెల 21న పూంఛ్ జిల్లాలో ఆర్మీ వాహనాలపై ఉగ్రవాదుల దాడిలో ఐదుగురు సైనికులు అసువులు బాయడం తెలిసిందే. అనంతరం ఆర్మీ అధికారులు 8 మందిని అదుపులోకి తీసుకున్నారు. వీరిలో ముగ్గురు శుక్రవారం రాత్రి శవాలై కనిపించారు. వారిని చిత్రహింసలు పెట్టిన వీడియోలు బహిర్గతమయ్యాయి. ఇది ఆర్మీ అధికారుల పనేనని స్థానికులు ఆరోపించారు. తీవ్ర గాయాలపాలైన నలుగురిని అధికారులు ఆస్పత్రికి తరలించారు.

హిజాబ్‌పై ఆలోచిస్తున్నాం

స్పష్టంచేసిన కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య

మైసూరు: రాష్ట్రంలోని విద్యాసంస్థల్లో హిజాబ్ ధారణపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేయడంపై మాత్రమే రాష్ట్ర సర్కార్ లోతుగా ఆలోచిస్తోందని కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య స్పష్టంచేశారు. రాష్ట్రస్థాయిలో విస్తృతస్థాయిలో సంప్రతింపులు జరిపిన తర్వాతే ఈ అంశంలో తుది నిర్ణయం తీసుకుంటామని ఆయన చెప్పారు. శనివారం మైసూరులో మీడియాతో ఆయ మాట్లాడారు. 'హిజాబ్‌పై నిషేధాన్ని ఇంకా అమల్లోకి తేలేదు. ఈ విద్యాసంవత్సరంలోనే అమలుచేయాలా వద్దా అనే దానిపై ఇంకా సంప్రతింపులు కొనసాగుతున్నాయి'' అని చెప్పారు. కర్ణాటకవ్యాప్తంగా విద్యాలయాల్లో మతపరమైన వస్త్రాలు ధరించడంపై ఎలాంటి ఆంక్షలు లేవుకదా. అయినా ఎలాంటి వస్త్రాలు ధరించాలి, ఎలాంటి ఆహారం తినాలి అనేది పూర్తిగా వ్యక్తిగతం'' అని శుక్రవారం వ్యాఖ్యలుచేసిన ఆయన మరుసటిరోజే ఇలా విరుద్ధంగా మాట్లాడటం గమనార్హం. మరోవైపు ప్రభుత్వ చర్యల ఫలితంగా విద్యాసంస్థల్లోని లౌకిక వాతావరణం దెబ్బతినే ప్రమాదముందని బీజేపీ ఆందోళనవ్యక్తంచేసింది. '' రాష్ట్రాల్లోని విద్యా వాతావరణాన్ని సీఎం చెడగొడుతున్నారు. లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఆయన బుజ్జగింపు రాజకీయలకు పాల్పడుతున్నారు'' అని కర్ణాటక బీజేపీ చీఫ్ బీవై విజయేంద్ర ఆరోపించారు.

తేజస్వీకి ఈడీ తాజా సమన్లు

న్యూఢిల్లీ: ఆర్జేడీ చీఫ్ లాలూ ప్రసాద్ యాదవ్ రైల్వేమంత్రిగా ఉన్నకాలంలో కొందరి భూములు రాయించుకుని వారికి రైల్వేలో గ్రూప్–డీ ఉద్యోగాలు ఇచ్చారన్న కేసులో ఆయన కుమారుడు, బిహార్ ఉపముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్‌కు పాత్ర ఉందంటూ ఆయనకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తాజాగా మరోసారి సమన్లు జారీచేసింది. జనవరి ఐదో తేదీన తమ ఆఫీస్‌కు రావాలని తేజస్వీకి సూచించింది. డిసెంబర్ 22వ తేదీనే రావాలని గతంలో సమన్లు జారీచేయగా ఆయన రాలేదు. దీంతో మళ్లీ సమన్లు ఇచ్చారు. ఇదే కేసులో డిసెంబర్ 27వ తేదీన హాజరుకావాలని లాలూకు సైతం ఈడీ సమన్లు పంపడం తెల్సిందే. ' సమన్లలో కొత్తదనం ఏదీలేదు. ఇప్పటికే ఎన్నోసార్లు ఈడీ ఆఫీస్‌కెళ్లాను. ఇదో రోటీన్ పనిలా తయారైంది' అని తేజస్వీ వ్యాఖ్యానించారు. యూపీఏ–1 హయాంలో 2004–2009 కాలంలో లాలూ రైల్వే మంత్రిగా ఉన్నారు. ఆ కాలంలో కొందరికి వేర్వేరు రైల్వేజోన్లలో గ్రూప్–డీ ఉద్యోగాలిచ్చి, లాలూ కుటుంబసభ్యుల, వారికి చెందిన ఏకే ఇన్ఫోసిస్టమ్స్ సంస్థ పేరు మీదకు ఆ లబ్ధిదారుల భూములను బదలాయించారని ఈడీ ఆరోపిస్తోంది. ఈ సంస్థకు డైరెక్టర్‌గా ఉన్న అమిత్ కాత్యాల్‌ను ఈడీ ఇటీవల అరెస్ట్‌చేసింది. ఈ సంస్థ రిజిస్ట్రేషన్ అడ్రస్‌లో ఉన్న ఇల్లు లాలూదేనని ఈడీ పేర్కొంది. లబ్ధిదారుల భూముల బదలాయింపు సంస్థలోకి జరిగాక ఆ వాటాలను 2014 ఏడాదిలో లాలూ కుటుంబసభ్యుల పేరు మీదకు బదిలీ చేశారని ఈడీ చెబుతోంది. ఈ ఉదంతంపై గతంలో సీబీఐ నమోదుచేసిన కేసును ఆధారంగా చేసుకుని ఈడీ కొత్తగా కేసు నమోదుచేసి దర్యాప్తుచేస్తోంది.

ఈడీ ఎదుటకు కార్తీ చిదంబరం

న్యూఢిల్లీ: 2011లో కొందరు చైనీయులకు వీసాల జారీకి సంబంధించిన మనీలాండరింగ్ ఆరోపణలపై కాంగ్రెస్ ఎంపీ కార్తీ చిదంబరం శనివారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) ఎదుట విచారణకు హాజరయ్యారు. ఆయన వాంగ్మూలాన్ని అధికారులు నమోదు చేశారు. ఈడీ అధికారులు ఈ నెల 12, 16వ తేదీల్లో కూడా కార్తీకి సమన్లు పంపారు. అయితే, అవసరమైన పత్రాల సేకరణకు సమయం కావాలంటూ ఆయన విచారణకు హాజరుకాలేదు. పంజాబ్‌లో ఏర్పాటవుతున్న ఒక విద్యుత్ ప్రాజెక్టు నిర్మాణ పనుల కాంట్రాక్టును చైనా కంపెనీ తీసుకుంది. ఈ కంపెనీ గడువులోగా పనులను పూర్తి చేయలేదు. దీంతో, 263 మంది చైనా సిబ్బందికి దేశంలో ఉండేందుకు అవసరమైన వీసాలను మళ్లీ మంజూరు చేయాల్సిన అవసరం ఏర్పడింది. వీసాల మంజూరు కోసం 2011లో కేంద్ర హోం మంత్రి పి.చిదంబరం కుమారుడు కార్తీ చిదంబరంకు రూ.50 లక్షలు ముట్టినట్లు సీబీఐ కేసు నమోదు చేసింది. ఈ కేసులో ప్రశ్నించేందుకే ఈడీ అధికారులు కార్తీకి నోటీసులు పంపారు. అయితే, కాంగ్రెస్ సీనియర్ నేత పి.చిదంబరంను వేధించే చర్యల్లో భాగంగానే తనపై కక్షగట్టారని కార్తీ ఆరోపిస్తున్నారు. ఒక్క చైనీయుడి వీసా మంజూరుకు కూడా తాను ఎన్నడూ సాయపడలేదన్నారు. కార్తీ చిదంబరంపై ఐఎన్‌ఎక్స్ మీడియా, ఎయిర్‌సెల్–మ్యాక్సిస్ కేసుల్లో మనీలాండరింగ్ ఆరోపణల కింద ఇప్పటికే ఈడీ దర్యాప్తు చేస్తోంది.

జనవరి ఆరున కక్ష్యలోకి ఆదిత్యఎల్1

ఇస్రో చైర్మన్ సోమనాథ్ అంచనా

అహ్మదాబాద్: భగభగమండే భానుడి వాతావరణం, సూర్యుడిలో సంభవించే స్వల్ప మార్పులు భూగోళంపై ఎలాంటి ప్రతికూల ప్రభావాలు చూపుతాయనే అంశాలను అధ్యయనం చేసేందుకు ఇస్రో ప్రయోగించిన అంతరిక్షనౌక ఆదిత్య ఎల్–1 జనవరి ఆరో తేదీన తన కక్ష్యలోకి చేరుకుంటుందని ఇస్రో చైర్మన్ సోమనాథ్ అంచనావేశారు. శుక్రవారం గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో ఒక ఎన్‌జీవో ఏర్పాటుచేసిన 'భారతీయ విజ్ఞాన్ సమ్మేళన్' కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. '' భూమి నుంచి సూర్యుడి వైపుగా 15 లక్షల కిలోమీటర్ల దూరంలో ఉన్న లాంగ్రాంజియాన్ పాయింట్(ఎల్) కక్ష్యలోకి ఆదిత్య ఎల్–1 జనవరి ఆరో తేదీన చేరుకుంటుందని భావిస్తున్నాం. ఆరో తేదీన ఎల్1 పాయింట్‌లోకి చేరగానే వ్యోమనౌక మరింత ముందుకు వెళ్లకుండా వ్యతిరేకదిశలో ఇంజిన్‌ను మండిస్తాం. దాంతో అది ఆ కక్ష్యలో స్థిరంగా కుదురుకుంటుంది. ఆ కక్ష్యలోనే తిరుగుతూ సూర్య వాతావరణ విశేషాలపై అధ్యయనం మొదలుపెడుతుంది. వచ్చే ఐదేళ్లపాటు సూర్యుడిపై సంభవించే పరిణామాలను విశ్లేషించనుంది. స్పేస్‌క్రాఫ్ట్ తన కక్ష్యలో కుదురుకున్నాక సౌరగాలులు, సౌర ఉపరితలంపై మార్పులు తదితరాల డేటాను ఒడిసిపట్టి భారత్‌కు మాత్రమేకాదు యావత్ ప్రపంచానికి పనికొచ్చే సమాచారాన్ని ఆదిత్య ఎల్1 అందించనుంది'' అని సోమనాథ్ చెప్పారు. '' ప్రధాని మోదీ ఉద్బోధించినట్లు అమృతకాలంలో భారత్ 'భారతీయ స్పేస్ స్టేషన్' పేరిట సొంత అంతరిక్ష కేంద్రాన్ని ఏర్పాటుచేసేందుకు కృషిచేస్తున్నాం' అని వివరించారు.

నితీశ్ చేతికి జేడీయూ పగ్గాలు!

పట్నా: బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ త్వరలో జనతాదళ్(యునైటెడ్, జేడీయూ) పార్టీ పగ్గాలు చేపడతారని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ప్రస్తుత అధ్యక్షుడు రాజీవ్ రంజన్ సింగ్ అలియాస్ లలన్ సింగ్‌ను తొలగించేందుకు ఆయన నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. ఢిల్లీలో ఈ నెల 29వ తేదీన జరిగే పార్టీ జాతీయ కార్యవర్గం సమావేశంలో దీనిపై తుది నిర్ణయం తీసుకోనున్నారు. లలన్ స్థానంలో కొత్త వారికి బాధ్యతలివ్వడం కంటే కూడా స్వయంగా అధ్యక్ష బాధ్యతలు చేపడితేనే పార్టీలో అంతర్గత సమస్యల పరిష్కారం సాధ్యమవుతుందని నితీశ్‌కు సన్నిహితులు సలహా ఇచ్చినట్లు భావిస్తున్నారు. లలన్ సింగ్ పనితీరు ముఖ్యంగా ఆయన ఆర్జేడీ సుప్రీం లాలూ ప్రసాద్ యాదవ్, డిప్యూటీ సీఎం తేజస్వీ యాదవ్‌తో సన్నిహితంగా ఉండటం నితీశ్‌కు రుచించడం లేదని చెబుతున్నారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో మళ్లీ ముంగేర్ స్థానం నుంచే ఈసారి ఆర్జేడీ టిక్కెట్‌పై పోటీకి దిగాలని లలన్ భావిస్తున్నట్లు కూడా ఊహాగానాలు వస్తున్నాయి. జాతీయ స్థాయిలో కీలకంగా ఉండాలని భావిస్తున్న నితీశ్..అందుకు తగ్గట్లుగా లలన్ సింగ్ ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాలతో సమన్వయం చేసుకోవడంలో విఫలమైనట్లు కూడా నితీశ్ అనుకుంటున్నట్లు సమాచారం. అందుకే, ఆయనకు ఉద్వాసన పలకాలనే నిర్ణయానికి నితీశ్ వచ్చినట్లుగా తెలుస్తోంది.

డార్క్‌వెబ్‌లో 'బీఎస్‌ఎన్‌ఎల్' యూజర్ల డేటా

చోరీ చేసిన హ్యాకర్ ● ఆన్‌లైన్‌లో పలు వివరాలు ప్రత్యక్షం

న్యూఢిల్లీ: బీఎస్‌ఎన్‌ఎల్ ల్యాండ్‌లైన్ వినియోగదారుల సమాచారాన్ని చోరీచేసిన ఓ హ్యాకర్ ఆ వివరాలను ఆన్‌లైన్‌లో విక్రయానికి పెట్టాడు. దీంతో ఆయా కస్టమర్ల గోప్యతకు విఘాతం కలిగింది. తనను 'పెరిల్'గా పేర్కొన్న ఓ హ్యాకర్.. డార్క్‌వెబ్‌లో ఆ సమస్త వివరాలను పొందుపరిచాడు. దీంతో యూజర్ల గుర్తింపు బహిర్గతమవడంతోపాటు వారి సమాచారం సాయంతో మరో ఆర్థిక మోసం, ఆన్‌లైన్‌మోసానికి ఆస్కారం ఏర్పడింది. దాదాపు 29 లక్షల వరుసల డేటాను సంపాదించానని హ్యాకర్ తన డార్క్‌వెబ్ పేజీలో పేర్కొన్నాడు. శాంపిల్‌గా మొదట 32,000 లైన్ల డేటాను అందరికీ కనిపించేలా పెట్టాడు. ఆయా బీఎస్‌ఎన్‌ఎల్ ఫైబర్, ల్యాండ్‌లైన్ యూజర్ల పేరు, ఈమెయిల్ ఐడీ, బిల్లుల సమాచారం, ఫోన్ నంబర్లు, ఇతర వ్యక్తిగత డేటాను వెబ్‌సైట్‌లో విక్రయానికి పెట్టాడు. కస్టమర్ ఇన్ఫర్మేషన్, నెట్‌వర్క్ వివరాలు, ఆర్డర్లు, హిస్టరీ అందులో ఉన్నాయి. డేటా చోరీతో వెంటనే అప్రమత్తమై తమ యూజర్ల డేటా రక్షణకు బీఎస్‌ఎన్‌ఎల్ చర్యలు తీసుకోవాలన్న డిమాండ్లు పెరిగాయి. ' ఇది బీఎస్‌ఎన్‌ఎల్‌కు, దాని వినియోగదారులపై విస్తృతస్థాయిలో దుష్పరిణామాలు చూపిస్తుంది' అని సైబర్ సెక్యూరిటీ నిపుణుడు, ఇండియా ఫ్యూచర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కనిష్క్ గౌర్ ఆందోళన వ్యక్తంచేశారు.

7

సాక్షి హైదరాబాద్

ఆదివారం । 24 । డిసెంబర్ । 2023





విల్లామేరీలో ఉల్లాసంగా..

సోమాజిగూడలోని విల్లామేరీ మహిళా కళాశాలలో శనివారం విల్లా ఫిస్టా పేరిట నిర్వహించిన ప్రి క్రిస్మస్ వేడుకలు వైభవంగా జరిగాయి. విద్యార్థినులు ఆటాపాటలు, కేరింతలతో హోరెత్తించారు. గుర్రాలు, ఒంటెలపై శాంటాక్లాజ్ వేషధారణతో ప్రదర్శనలు అబ్బురపర్చాయి. – పంజగుట్ట



ఆనంద క్షణాలు

మేడ్చల్– మల్కాజిగిరి జిల్లా హకీంపేట పరిధిలోని సీఐఎస్ఎఫ్‌కు చెందిన నేషనల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ అకాడమీ (ఎన్ఐఎస్ఏ)లో శనివారం ఇన్‌స్పెక్టర్ల పాసింగ్ అవుట్ పరేడ్ (దీక్షాంత్ పరేడ్) ఘనంగా జరిగింది. శిక్షణ పూర్తి చేసుకున్న ఇన్‌స్పెక్టర్లు కుటుంబ సభ్యులతో ఫొటోలు దిగారు.





ఎలక్ట్రానిక్ స్కూటీలపై ఆశలు

- మార్గదర్శకాల రూపకల్పనకు సర్కార్ కసరత్తు
- బీపీఎల్ గుర్తింపుగా రేషన్‌కార్డు
- అర్హతపై విద్యార్థినుల్లో అయోమయం

● తాళాలు చేతికొచ్చేదెన్నడో!

బండి ఇవ్వరాండి!!

గ్రేటర్ వ్యాప్తంగా 2 లక్షల మందికిపైగానే..

- తొలి ప్రాధాన్యతలో ప్రభుత్వ కాలేజీలకు వర్తింపు?
- ఒక్కో స్కూటీ ధర రూ.40 వేల నుంచి రూ.1.5 లక్షలు

కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరగానే మహాలక్ష్మి పథకం కింద ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం వెసులుబాటు కల్పించింది. కళాశాలల్లో చదువుతున్న విద్యార్థినులకు సైతం బస్సు చార్జీల నుంచి ఆర్థిక వెసులుబాటు లభించింది. మరోవైపు 18 సంవత్సరాలు నిండిన విద్యార్థినులకు ఎలక్ట్రానిక్ స్కూటీ పథకం వర్తించనుండటంతో వారికి మరింత పెద్దపీట వేస్తున్నట్లవుతుంది. దీంతో కాలేజీ విద్యార్థినులకు 'ఎలక్ట్రానిక్ స్కూటీ'లపై ఆశలు రేకెత్తిస్తున్నాయి. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుకు ఒక్కో అడుగు పడుతుండటంతో ఎలక్ట్రానిక్ స్కూటీల పథకానికి కూడా అంకురార్పణ జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. రాబోయే పార్లమెంట్ ఎన్నికలలోపు పథకాన్ని ప్రారంభించి కొత్త యువ ఓటర్లను ఆకర్షించే వ్యూహంతో కాంగ్రెస్ అడుగులు వేస్తుండటంతో ఎలక్ట్రానిక్ స్కూటీ పథకం కోసం అధికార యంత్రాంగం ముందస్తు ప్రయత్నాలు ముమ్మరం చేసినట్లు తెలుస్తోంది. దీంతో పథకం కోసం మార్గదర్శకాలు రూపకల్పనకు కసరత్తు సాగుతోంది. –సాక్షి, సిటీబ్యూరో

రెగ్యులర్ విద్యార్థినులకే..

పేద కుటుంబాలకు చెందిన 18 ఏళ్లు నిండి చదువుకునే అమ్మాయిలకు ఎలక్ట్రానిక్ స్కూటీలు పథకం కింద వాహనాలు పంపిణీ జరగనుంది. రెగ్యులర్‌గా కాలేజీలకు వెళ్లే వారికి మాత్రమే పథకం వర్తించేలా కార్యాచరణకు రంగం సిద్ధమవుతోంది. విద్యార్థిని కుటుంబం బీపీఎల్‌గా గుర్తింపునకు కుటుంబ రేషన్ కార్డు పరిగణనలోకి తీసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి.

రెండు లక్షల మందికిపైనే...

18 ఏళ్లు నిండిన అమ్మాయిలు ఎంతమంది ఉంటారనే దానిపై అధికార యంత్రాంగం గణాంకాలు సిద్ధం చేస్తోంది. రాష్ట్రం మొత్తం మీద వివిధ విశ్వవిద్యాలయాల పరిధిలో సుమారు 5,279 డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్, మెడికల్, వృత్తి, వివిధ మేనేజ్‌మెంట్ కాలేజీలు ఉండగా అందులో గ్రేటర్ పరిధిలోని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో సుమారు 1,784 కాలేజీలు ఉన్నాయి. మొత్తమ్మీద ఇంటర్మీడియట్ పూర్తి చేసి డిగ్రీ, ఇతరత్రా కోర్సులు చదువుతున్న పేదల విద్యార్థినులు సుమారు 5 లక్షల మంది వరకు ఉండగా.. వీరిలో 2 లక్షల మంది మహానగర పరిధిలో ఉన్నట్లు ప్రాథమిక గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. వీరిలో సైతం ప్రభుత్వ కాలేజీల్లో చదువుతున్న వారు 70 వేల మంది వరకు ఉండవచ్చని అంచనా. తొలి విడతలో సర్కారు కాలేజీలో చదువుతున్న విద్యార్థినులకు మాత్రమే ప్రాధాన్యమిచ్చేలా నిబంధనల రూపకల్పన జరుగుతున్నట్లు సమాచారం.

కొత్త ఓటర్లు 4.5 లక్షల పైనే..

గ్రేటర్ పరిధిలో సుమారు 1.08 కోట్ల వరకు ఓటర్లు ఉండగా అందులో 18 సంవత్సరాలు నిండిన నమోదైన కొత్త ఓటర్లు 4.5 లక్షల మంది ఉన్నారు. వీరిలో మహిళలు 3 లక్షల మంది వరకు ఉండగా.. అందులో కాలేజీ చదువుతున్న విద్యార్థినులు 2 లక్షల వరకు ఉండవచ్చని అంచనా. కాంగ్రెస్ ఎన్నికల హామీలో ఎలక్ట్రానిక్ స్కూటీ పథకం ప్రకటించడంతో కొత్తగా ఓటు హక్కు వినియోగించుకున్న విద్యార్థినుల్లో ఆశలు రేకెత్తిస్తున్నాయి.

పెద్ద మొత్తంలోనే ఖర్చు..

ఎలక్ట్రానిక్ స్కూటీల పథకం పెద్ద ఖర్చుతో కూడుకున్నదే. బహిరంగ మార్కెట్‌లో ఎలక్ట్రిక్ స్కూటీ సామర్థ్యం బట్టి రూ.40 వేల నుంచి రూ. 1.5 లక్షకు పైగా పలుకుతోంది. వాస్తవంగా కేంద్ర ప్రభుత్వం ఉత్పత్తి సంస్థలకు ఎలక్ట్రిక్ టు వీలర్లపై ఫేమ్ (ఫాస్టర్ అడాప్షన్ ఆఫ్ మాన్యుఫ్యాక్చరింగ్ ఆఫ్ ఎలక్ట్రిక్ వెహికిల్స్ ఇన్ ఇండియా)–2 పథకం కింద రాయితీ అందిస్తోంది. ఈ పథకం కింద ఒక్కో ఈవీ టు వీలర్‌కు దాని ఎక్స్–ఫ్యాక్టరీ ధరలో గరిష్టంగా 40 శాతానికి సమానంగా సబ్సిడీ అందిస్తోంది. కేంద్ర ప్రభుత్వం రాయితీలకు అనుగుణంగా ఈ పథకం అమలు కోసం అధికారులు విధివిధానాలు రూపొందిస్తున్నారు. తొలి విడతలో సర్కారు కాలేజీలో చదువుతున్న విద్యార్థినులకు ప్రాధాన్యమిస్తే సుమారు 70 వేల మంది వరకు లబ్ధి చేకూర్చే అవకాశాలు ఉన్నాయి. కనీసం ఒక్క స్కూటీకి సగటున రూ. 50 వేల చొప్పున ధర లెక్కిస్తే సుమారు రూ. 350 కోట్ల ఖర్చు అయ్యే అవకాశాలు ఉన్నాయి. సబ్సిడీ లేకుండా మాత్రం లెక్కిస్తే ఖర్చు రెట్టింపు కావచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.

ఇంజినీరింగ్ విద్యార్థినులే అధికం..

18 సంవత్సరాలకు పైబడిన వారు అంటే ఇంటర్మీడియట్ పూర్తి చేసుకొని డిగ్రీ, పీజీ, ఇతర మేనేజ్‌మెంట్ కోర్సులు, ఇంజినీరింగ్ విద్యార్థులే ఉంటారు. మహానగర పరిధిలో డిగ్రీ, పీజీ, వివిధ మేనేజ్‌మెంట్, వృత్తి కోర్సులు అభ్యసిస్తున్న వారికంటే ఇంజినీరింగ్ విద్య అభ్యసిస్తున్న విద్యార్థినులే అధికం. అందులో సైతం ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలల్లో చదువుతున్న పేద విద్యార్థినులు అధికంగా ఉన్నారు. ఎలక్ట్రిక్ స్కూటీ పథకం కింద కేవలం సర్కారు కాలేజీ విద్యార్థినులకు ప్రాధాన్యమిస్తే ప్రైవేటు ఇంజినీరింగ్ విద్యార్థినులు అర్హత కోల్పోయే అవకాశాలు ఉన్నాయి.

లైసెన్సులు కత్తిమీద సామే..

ఎలక్ట్రానిక్ స్కూటీలకు డ్రైవింగ్ లైసెన్స్‌లు తప్పనిసరి కానుంది. లైసెన్స్ తీయడం విద్యార్థినులకు కత్తి మీద సామే. చాలా మందికి వాహనం నడపడం వచ్చినప్పటికీ.. డ్రైవింగ్ లైసెన్సులు లేవు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండానే వాహనాలతో రోడ్లు ఎక్కుతున్నారు. వారికి రహదారి భద్రత గురించి అవగాహన తక్కువగా ఉండటంతో.. రోడ్డు ప్రమాదాల బారిన పడే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. ఇన్సూరెన్స్ వర్తించే అవకాశం సైతం ఉండదు. వాహనాలు నడిపే వారికి ట్రాఫిక్ సిగ్నళ్లు, డ్రైవింగ్ నిబంధనలు, రోడ్డు భద్రతా చర్యల గురించి అవగాహన అవసరం. డ్రైవింగ్ లైసెన్స్ కోసం ఆధార్, ఓటర్ ఐడీ, బ్యాంక్ పాస్ బుక్ లేదా పాస్‌పోర్ట్, అడ్రస్ ప్రూఫ్, టెన్త్ మెమో, పాన్ కార్డు అవసరం ఉంటుంది. డ్రైవింగ్ పరీక్షలో నెగ్గితే ముందుగా లెర్నింగ్ లైసెన్స్.. ఆ తర్వాత పర్మనెంట్ లైసెన్స్ ఇస్తారు.

ట్రాఫిక్‌జాం సమస్య మరింత..

మహా నగరంలో కోటిన్నర జనాభా ఉండగా.. నిత్యం 70 లక్షల వాహనాలు రోడ్డెక్కుతుంటాయి. అందులో ద్విచక్ర వాహనాలు 40 లక్షల వరకు ఉన్నాయి. ప్రధాన రోడ్లన్నీ ట్రాఫిక్‌తో కిటకిటలాడుతున్నాయి. ఇక స్కూల్స్, కాలేజీ సమయంలో వాహనాలు ముందుకు కదలని పరిస్థితి. ఇక విద్యార్థినులకు ఎలక్ట్రానిక్ స్కూటర్లు అందుబాటులో వస్తే మరింత ట్రాఫిక్ పెరిగే అవకాశముంది.

విద్యార్థినులకు ఎంతో ఉపయోగం



ఉచిత ఎలక్ట్రికల్ వెహికల్ విద్యార్థినులకు చాలా ఉపయోగకరంగా ఉంటుంది. పేద విద్యార్థులకు రోజువారీ రవాణా ఖర్చు ఇబ్బందులు తప్పుతాయి. పెట్రోల్ ఖర్చు ఉండనందున ఇంటి అవసరాలకు సైతం బైక్‌ను వాడుకోవచ్చు. – టి.శ్వేత–హబ్సిగూడ

సంక్రాంతి వరకు అందజేయాలి



ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన విధంగా ఎలక్ట్రికల్ స్కూటీలు అందించాలి. విద్యార్థినుల సమయం ఆదా అవుతుంది. ఎలాంటి ఖర్చు లేకుండా అనుకున్న గమ్యానికి త్వరగా చేరుకోవచ్చు. సంక్రాంతి వరకు బైకులను పంపిణీ చేయాలి – పుష్ప–ఓయూ పీజీ విద్యార్థిని

కాంగ్రెస్ మాట నిలబెట్టుకోవాలి..



అమ్మాయిలకు స్కూటీ రక్షణగా ఉంటుంది. ఏ సమయంలోనైనా బయటికి వెళ్లి రావచ్చు. ఎలక్ట్రికల్ స్కూటీలు పంపిణీ చేసి కాంగ్రెస్ మాట దనిలబెట్టుకోవాలి. – షేక్ తబస్సుమ్





ఇల.. 'వైకుంఠ' నగరిలో..

ఓం నమో నారాయణాయ నమః.. ఓం శ్రీనివాసాయ నమః.. భక్తుల దైవ నామస్మరణలతో ఆలయాలు మార్మోగాయి. శనివారం వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని దేవాలయాలకు భక్తులు పోటెత్తారు. శ్రీమన్నారాయణుడిని దర్శించుకుని పులకించిపోయారు. ముక్కోటి ఏకాదశి సందర్భంగా నగరంలో ఆధ్యాత్మికత వెల్లివిరిసింది.

మంచోడే.. కానీ.. దొంగోడు!

దోచిన సొమ్ము గ్రామాభివృద్ధికి



- జూబ్లీహిల్స్ ప్రాంతంలోనే చోరీలు
- సీసీ కెమెరాలకు చిక్కకుండా వ్యూహాలు
- ముంబై నుంచి రాకపోకలు
- పోలీసులకు చిక్కిన నేరగాడు రాబిన్‌హుడ్



మహ్మద్ ఇర్ఫాన్ అలియాస్ రాబిన్ హుడ్

దొంగలందు ఈ దొంగ వేరయా.. అన్నట్టు.. పెద్దలను దోచి పేదలకు పంచిపెడుతుంటాడు. చోరీ చేసిన సొత్తులో కొంత భాగాన్ని తన గ్రామాభివృద్ధికి ఖర్చు చేస్తాడు. కేవలం బంగారం, నగదు మాత్రమే తస్కరిస్తూ వెండి వస్తువుల జోలికి వెళ్లడు. సీసీ కెమెరాలకు చిక్కకుండా పక్కా ప్రణాళికతో ఒక ఇంటిపై నుంచి మరో ఇంటిపైకి దూకుతూ జారుకుంటాడు. జూబ్లీహిల్స్‌లోనే దొంగతనాలకు పాల్పడతాడు తప్ప నగరంలోని మరో ప్రాంతంపై దృష్టి పెట్టడు. పోలీసులకు ఏమాత్రం క్లూ దొరక్కుండా సెల్‌ఫోన్ సిమ్ వేసుకోకుండా కేవలం నెట్‌తో వాట్సాప్ కాల్స్ మాత్రమే వాడుతూ అత్యంత పకడ్బందీగా హైదరాబాద్, ముంబై మధ్య రాకపోకలు సాగిస్తున్నాడు. నాలుగేళ్లుగా బెంగళూరు, ఢిల్లీ, హైదరాబాద్ పోలీసులు గాలిస్తున్న ఈ అంతర్రాష్ట్ర దొంగను ఎట్టకేలకు జూబ్లీహిల్స్ క్రైం పోలీసులు అరెస్ట్ చేసి శనివారం రిమాండ్‌కు తరలించారు. వివరాలు ఇలా ఉన్నాయి. –బంజారాహిల్స్

సీసీ కెమెరాకు చిక్కి..

బిహార్‌కు చెందిన మహ్మద్ ఇర్ఫాన్ అలియాస్ రాబిన్‌హుడ్ అలియాస్ ఉజ్వల్ (33) ఢిల్లీ, బెంగుళూరు, హైదరాబాద్‌లలో దొంగతనాలకు పాల్పడుతూ పోలీసులకు చిక్కకుండా తప్పించుకు తిరుగుతున్నాడు. ఈ నెల 9న జూబ్లీహిల్స్ రోడ్ నంబరు 10సిలోని ఎంపీ ఎమ్మెల్యే కాలనీలో నివసించే ధ్రువ అనురాగ్‌రెడ్డి ఇంట్లో చోరీకి పాల్పడ్డాడు. బంగారు నగలు తస్కరించి అదే రోజు రాత్రి ఇక్కడి నుంచి ఉడాయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ క్రైం పోలీసులు కేసు నమోదు చేసుకొని రంగంలోకి దిగారు. ఎంపీ ఎమ్మెల్యే కాలనీలో నాలుగైదు రోజులపాటు 75కిపైగా సీసీ కెమెరాలను వడపోసినా ఎక్కడా ఇర్ఫాన్ ఆనవాళ్లు చిక్కలేదు. సీసీ ఫుటేజీలు పరిశీలిస్తూ వెళ్తుండగా వెంకటగిరి సమీపంలో ఓ ఇంటి ముందు ఏర్పాటు చేసిన కెమెరాకు చిక్కాడు.

లక్డీకాపూల్‌లోని హోటల్‌లో మకాం..

పాత నేరస్తుల ఫొటోలను, సీసీటీఎన్ఎస్ పరిశీలనలో రాబిన్‌హుడ్ మామూలోడు కాదని, కరడుగట్టిన అంతర్రాష్ట్ర దొంగ అని తేలింది. నగరానికి దొంగతనానికి వచ్చినప్పుడు తప్పనిసరిగా లక్డీకాపూల్‌లోని ఓ హోటల్‌లో తనకు అచ్చొచ్చిన గదిలో ఉంటున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో వారం రోజులపాటు ఆ హోటల్ వద్ద కాపు కాశారు. రాబిన్‌హుడ్ రాకను గుర్తించిన పోలీసులు అతన్ని అదే హోటల్ గదిలో అదుపులోకి తీసుకొన్నారు. విచారణ చేయగా ఈ నెల 8న దొంగతనానికి ఇక్కడికి వచ్చానని, ఓ ఖరీదైన కారులో జూబ్లీహిల్స్ ప్రాంతంలో తిరుగుతూ తనకు అనుకూలంగా ఏ ఇల్లు దొంగతనానికి సరిపోతుందో రెక్కీ నిర్వహించినట్లుగా చెప్పాడు.

ఓ ఇంటిపైనుంచి మరో ఇంటిపైకి దూకుతూ..

ఓ ప్రముఖ నటుడి ఇంటి పరిసర ప్రాంతాల్లో చూడగా అక్కడ ఏ మాత్రం అనుకూలంగా లేకపోవడంతో ఎంపీ ఎమ్మెల్యే కాలనీలో ధ్రువ అనురాగ్ రెడ్డి ఇంటిని లక్ష్యంగా చేసుకొని దొంగతనానికి పాల్పడినట్లు వెల్లడించాడు. అదే రోజు రాత్రి ముంబైలోని తన రెండో భార్య బార్ గర్ల్ గుల్షన్ ఇంటికి వెళ్లానని, మళ్లీ దొంగతనం చేయడానికి రెండు రోజుల క్రితం అదే హోటల్‌కు వచ్చినట్లు తెలిపాడు. ప్రముఖులు, బడాబాబులు నివసిస్తున్న జూబ్లీహిల్స్‌లోని దొంగతనాలు చేస్తుంటానని, సీసీ కెమెరాలకు చిక్కకుండా ఒక ఇంటిపై నుంచి మరో ఇంటిపైకి 15 నుంచి 20 ఇళ్ల పైకప్పులు దూకుతూ వెళ్తుంటానని చెప్పాడు. తాను చోరీ చేసిన సొత్తులో 50 శాతం పేదలకు ఆహారం, స్కూల్ ఫీజులు, దుస్తులు, ఆసుపత్రుల ఫీజులు కడుతుంటానని చెప్పాడు. అందుకే తనకు రాబిన్ హుడ్ పేరు వచ్చినట్లు వెల్లడించాడు.

ఇప్పటికే ముగ్గురు భార్యలు.. మరో యువతితో ప్రేమాయణం

చోరీ సొత్తుతో స్వగ్రామంలో వీధి దీపాలు ఏర్పాటు చేయడంతో ఉజ్వల్ అని పేరు పెట్టారని వెల్లడించారు. తన మొదటి భార్య పర్వీన్ బిహార్‌లో జెడ్పీ చైర్‌పర్సన్ అని.. రెండో భార్య ముంబైలో బార్‌గర్ల్ అని.. మూడో భార్య కోల్‌కతాలో ఉంటోందన్నాడు. ఇటీవలే పూజ అనే యువతితో ప్రేమలో పడ్డట్లు పోలీసులకు వెల్లడించాడు. నిందితుడిపై హైదరాబాద్‌లో నాలుగు కేసులు, బెంగళూరులో 7, న్యూఢిల్లీలో 4 కేసులు నమోదై ఉన్నాయి. ఇళ్ల తాళాలు పగులగొట్టి తనతో తీసుకెళ్లే స్క్రూడ్రైవర్లు, రాడ్లతో అల్మారాలు తెరుస్తుంటాడని వాటిని స్వాధీనం చేసుకున్నట్లు జూబ్లీహిల్స్ డీఐ వీరశేఖర్ తెలిపారు.



అ'పూర్వ' సంబురం..

కోఠి మహిళా విశ్వవిద్యాలయంలో శనివారం రాత్రి పూర్వ విద్యార్థినుల సమ్మేళనం (గ్లోబల్ అలుమ్నీ మీట్- 2023) కన్నులపండువగా జరిగింది. పూర్వ విద్యార్థినులు ఆటాపాటలతో సందడి చేశారు.

నృత్యం చేస్తున్న సినీనటి మధుమిత






అగ్ని ప్రమాదం..

గుడిమల్కాపూర్‌లోని అంకుర ఆసుపత్రిలో శనివారం సాయంత్రం అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. భవనంలోని 8వ అంతస్తు నుంచి భారీగా మంటలు చెలరేగాయి. వెంటనే ఫైరింజన్లను రప్పించి మంటలను ఆర్పివేసి.. ఇన్‌పేషెంట్లను బయటికి తరలించడంతో ప్రాణాపాయం తప్పింది.

వారంలో 36 కేసులు

గ్రేటర్‌లో మళ్లీ కోవిడ్ కలకలం



సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్‌లో కోవిడ్ కేసులు పెరుగుతున్నాయి. తెలంగాణ వ్యాప్తంగా కేవలం వారం రోజుల్లో 38 పాజిటివ్ కేసులు నమోదు కాగా, వీటిలో గ్రేటర్ పరిధిలోనే 36 కేసులు రికార్డు కావడం ఆందోళన కలిగిస్తుంది. హైదరాబాద్ జిల్లాలో 33 కేసులు నమోదు కాగా, రంగారెడ్డి జిల్లాలో మరో మూడు కేసులు నమోదయ్యాయి. మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ఈ కరోనా వైరస్ ఎప్పటికప్పుడు కొత్తగా రూపాంతరం చెందుతుంది. వైరస్ ఉధృతి నేపథ్యంలో వైద్య ఆరోగ్యశాఖ అప్రమత్తమైంది. చికిత్స కోసం గాంధీ కోవిడ్ ఐసోలేషన్ వార్డులో 50 ఆక్సిజన్, వెంటిలేటర్ పడకలను సిద్ధం చేసింది. నిలోఫర్ సహా ఇతర అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లోనూ అనుమానితులకు వైద్య పరీక్షలు చేయడంతో పాటు ఇన్‌పేషంట్ చికిత్సల కోసం పడకలు సిద్ధం చేసింది.

నిలోఫర్‌లో మరో చిన్నారికి..

నాంపల్లి: నవజాత శిశు సంరక్షణా కేంద్రం నిలోఫర్‌లో కోవిడ్ కేసులు క్రమంగా పెరుగుతున్నాయి. శనివారం 51 మంది చిన్నారులకు పరీక్షలు నిర్వహించగా వీరిలో ఆరు నెలల చిన్నారికి కోవిడ్ పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. ప్రస్తుతం చిన్నారి ఆరోగ్యం నిలకడగానే ఉన్నట్లు నిలోఫర్ సూపరింటెండెంట్ డాక్టర్ ఉషా రాణి పేర్కొన్నారు. ప్రస్తుతం నిలోఫర్‌లో కోవిడ్ పాజిటివ్ కేసుల సంఖ్య మూడుకు చేరుకుంది. వీరందరూ నిలోఫర్‌లోని కోవిడ్ వార్డు ఐసీయూలో చికిత్స పొందుతున్నారు. కోవిడ్ వ్యాప్తి దృష్ట్యా ఆసుపత్రిలో జాగ్రత్త చర్యలు చేపట్టారు. ఆసుపత్రిలో చేరేవారికి కోవిడ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. అంతేకాకుండా ప్రతి ఒక్కరికీ మాస్కును తప్పనిసరి చేశారు. ఆసుపత్రి పరిసరాలను శానిటైజ్ చేస్తున్నారు. వైరస్ వ్యాప్తి కాకుండా సూర్యరశ్మి ఆసుపత్రి ఆవరణలో ఉండేలా ఏపుగా పెరిగిన చెట్ల కొమ్మలను కత్తిరించారు.

శేరిలింగంపల్లిలో మరొకరికి..

గచ్చిబౌలి: శేరిలింగంపల్లిలో కోవిడ్ కేసుల సంఖ్య రెండుకు చేరింది. తాజాగా కోవిడ్ కేసు నమోదైనట్లు కొండాపూర్ జిల్లా ఆస్పత్రి సూరింటెండెంట్ డాక్టర్ అనురాగిని రెడ్డి తెలిపారు. లింగంపల్లికి చెందిన గర్భిణీ మహిళ(20) కొండాపూర్ ఆస్పత్రికి వచ్చింది. దగ్గు, జలుబు ఉండటంతో రాపిడ్ యాంటిజెన్ టెస్ట్ చేయగా పాజిటివ్‌గా నిర్ధారణ జరిగింది. ఆర్‌టీపీసీఆర్ శాంపిల్‌ను గాంధీ ఆస్పత్రికి పంపించారు. గర్భిణీని ఐసోలేషన్ వార్డులో చేర్చి చికిత్స అందిస్తున్నారు. శేరిలింగంపల్లి ప్రాథమిక ఆరోగ్యం కేంద్రంలో ఇప్పటికే ఓ వ్యక్తికి కోవిడ్ పాజిటివ్‌గా నిర్ధారణ అయిన విషయం తెలిసిందే.

సాక్షి సండే క్లాసిఫైడ్స్



ADMISSIONS
- M.Com, M.A English, Spot / M.Q Admissions Last Date: 29/12/2023. Ladies no Tution Fee, Gents 5,000/- PLNM Degree College, Opp: ANU, Gnt. 9177408565 [G-781740]

FREE TRAINING
- పేద అమ్మాయిలకు కూకట్‌పల్లిలో HR+ మీడియ +డిజి॥మా॥+కంప్యూటర్‌లో 120 డేస్ ఫ్రుల్‌టైమ్ శిక్షణ. ట్రైనింగ్ తర్వాత వర్క్ ఫ్రమ్‌హోమ్, డిగ్రీ + స్మార్ట్‌ఫోన్ మస్ట్. 9032944447. [H-2572]



- మీ పిల్లల బంగారు భవిత లేక మీ రిటైర్మెంట్ తర్వాత మంత్లీ ఇన్‌కం వచ్చే (షార్ట్/లాంగ్‌టర్మ్) ప్రాపర్టీస్ పెట్టుబడికై ఆలోచిస్తున్నారా?. ఫోన్: 9966235327. [H-788173]
- గుంటూరు చుట్టుపక్కల గోరంట్ల, లాం, నల్లపాడు, JKCరోడ్డు, వెనిగండ్ల, పెదకాకాని, నంబూరు, ఖాజా, కొప్పురావూరు,మంగళగిరి, తాడికొండ, రాజధానిలో అన్ని వెంచర్ ప్లాట్లు కొనబడును. 9948779955. [G-7979]
- వట్టినాగులపల్లి శంకర్‌హిల్స్ ప్లాట్లు, ఈదుల నాగులపల్లి గౌతమినగర్ ప్లాట్లు, పటాన్‌చెరువు దగ్గర ఐలాపురం రాజగోపాల్ నగర్ ప్లాట్లు కావలెను. రమేష్ 9866928587. [H-787855]
- గుంటూరు కార్పొరేషన్ లిమిట్స్ అనుకొని బుడంపాడు-తెనాలి హైవేకి 100మీ॥ దూరంలో అతి తక్కువ ధరలో నిర్మాణానికి అనుకూలమైన ప్లాట్స్ అమ్మకానికి కలవు. సంప్ర॥ 8374356055. [G-599]
- Wanted 1 Acre Commercial Land For Sale in Medchal, Gandi Maisamma, Shamshabad, Balapur, Sangareddy. Direct Owners Only. No Brokers Please. Ph: 9052130567. [HA-12578]

BUILDING & CONSTRUCTION
- ఇల్లు కట్టి ఇవ్వబడును. అతి తక్కువ Sft రేట్లతో (1599-1899) గుడ్ క్వాలిటీ మెటీరియల్స్, వాస్తు ప్రకారంగా వర్కింగ్ ప్లాన్స్‌తో & GHMC పర్మిషన్స్‌తో అతి తక్కువ సమయంలో కన్‌స్ట్రక్షన్ చేయబడును. 9676804219. [H-788031]

COMMERCIAL
- PRAGATHI NAGAR Commercial Plot For Sale. Grand 80 Feet Width. Prime Location on 1st Road From Pragathi Nagar 100ft Main Road. Call: 7207870725. [H-787856]

FLAT FOR SALE
- Near Kowkur, Yapral, Sec-Bad. Ready To Occupy 3BHK Flats - 1715 sft & 1945 sft. Gated Community Club House Near GHMC Park Must See. Call: 9246503300. [H-788042]

వ్యవసాయ భూమి అమ్మకం
- 22 ఎక॥ @ చింతపల్లి టౌన్ - సాగర్ రోడ్
- 15 ఎక॥ @ కొలనుపాక - వరంగల్ హైవే
- 13 ఎక॥ @ దబురేపల్లి - శ్రీశైలం హైవే
- 13 ఎక॥ @ తాండ్ర జంక్షన్ - కల్వకుర్తి

ఓపెన్ ప్లాట్స్ వెంచర్స్‌కు అనుకూలం
డైరెక్ట్ బయర్స్ మాత్రమే సంప్రదించండి
9963141319

- Mallapur Near Nacharam, Habsiguda, 3 BHK Premium Flats For Resale Gated Community, Club House Ready To Occupy Brand New 7702226063. [H-788041]
- Kukatpally 1&2 B/R & Pragathi nagar 200sqy, Commercial Flat, For Sale. Ph: 8099260229 / 9052603909 [H-193309]
- E/Facing 3BHK Flat 1900 Sft, Gardenia Towers Beside Deewan Dhaba, Pipe Line Road Near Suchithra Circle Ph: 7601098571 [H-189627]
- Banjarahills opp TV9, Aurora Colony, Peaceful Location Deluxe 3BHK Occupation 2 Months what's up 9396540794, 9391366899 [H-12579]
- 2BHK Flat 1000 Sft East Face 3rd Floor UDS 50 Yards Near MRO Office Saroornagar. Bank Loan Available. 9885202404 [HA-10968]

HOUSE FOR SALE
- House for sale G+3, 203 Sq yds, GR Ready 1st, 2nd & 3rd Floor Under construction, Suncity, Narsareddy Colony, Langar Houz, 2.2 Cr. Call: 9573273010 [HA-3504]
- House for Sale East face 40 feet Road 215 Sqyd G+2 New Nagole Road, Kothapet. Strictly No Brokers. PH: 8977621876. [HA-5736]
- Shivanandapuri Colony, Nagaram, ECIL, G+1 2BHK, +2BHK W/F. 150yds, 2400 Sft, 1.20cr. N/S 175yds, 2800 Sft, 1.40cr. 100%V. Ready to Occ. Ph: 9394837211, 9676621311 [HA-1828]
- Resort Villa 36 Lakhs only, in 900 sft/ 160 Sqyds@ middle of the Aleru Town. 12 km - Yadagirigutta, 6 km - Jain Temple, 1/2 km- Warangal H/W, 150. Meter -100 ft Road. Place 8500/sq yard only 9392556525 [HA-31233]
- YAPRAL : East Facing, G+1 House (4 BHK - 3200 S.ft. Build-up area), Constructed in 215 Sq yards. Nr. Shaili Garden. Ph: 8008976351 [H-788259]
- Narayanaguda Indp. House For Sale, W/F, 327 sq.yds, G+1, Near Shanthi Theatre & Metro Station Clear Title Ph: 9533563388 [H-793564]
- Adikmet to Vidyanagar Main Road New Commercial Building, 49 yds @ 49L, Shop at G.Floor, Resi 1BHK at 1st flr. 9618252324, 9440801748 [H-793563]

LAND FOR SALE
- కమర్షియల్ 100 ఫీట్ల మెయిన్ రోడ్ ఫేసింగ్‌కు అనుకుని 440 గజాల ప్లాటు అమ్మబడును. @ మహేశ్వరం. RS: 11500 గజం. ఫోన్: 9966521191. [H-788244]

BUILDING FOR SALE
Film Nagar, Road No:9, New Building For Sale
Each Floor one 3BHK East Facing Flat. Parking + 5 Floors, Total 12,500 Sft.
9394837900
9963593377

- శంషాబాద్ విమానాశ్రయం దగ్గర స్థలం అమ్మకం. 60 అడుగుల రోడ్డుకి ఆనుకుని ఉన్న /86 Sft. / హుడాలో ఉన్న యల్.ఐ.జి.లో స్థలం అమ్మకం. ✆ : 77609 49727 [R-1151384]
- ఊటీలో అగ్రికల్చర్ ల్యాండ్స్ కొనండి మరియు ప్రతి సంవత్సరం ఎకరానికి 10 లక్షలు, టాక్స్ లేని లీజు ఆదాయం పొందండి. www.ootylands.com. Ph: 9944131155 [HA-13232]
- Prime Rented Property For Sale. 10 Acres 1L sq.ft Built-up, Rs.8L Rent & 1100 Students Hostel Facility Rs. 32.5 Cr.Near Pharmacity, Yacharam, 20 Min from Ibrahimpatnam. 9030005128 [H-793559]

INDUSTRIAL SHED
- For Sale. Land Measuring 1550 Sq. Yds & Industrial Sheds with 74 HP Power in Industrial Estate, Visakhapatnam - 530007. Ph: 9505599910 [H-1018]

PLOT FOR SALE
- కేవలం 20,00,000లకే 160 Sq.Yds ప్లాట్‌ని కొత్తూరు, పెంజర్ల దగ్గర అమ్మకానికి కలవు వివరాలకు సంప్రదించండి. ఫోన్: 7989493073. [H-788243]
- ఊటీ (Ooty Tamilnadu) ఆహ్లాదకరమైన వాతావరణంలో 8 ఎకరాల భూమి, ఇల్లు గెస్ట్ హౌసెస్ మరియు విల్లాలు కట్టుటకు అమ్మబడును. 9500108888. [HA-31247]
- అబ్దుల్లాపూర్, ఇబ్రహీంపట్నం, ఘట్‌కేసర్, పోచంపల్లి, మల్కాపూర్, కొహెడ, బాటసింగారం, తూప్రాన్ పేట్, చౌటుప్పల్ లలో ప్లాట్లు కొనబడును. 8099205007 / 9441777976. [HA-10967]
- గజం కేవలం 3000/- మాత్రమే. రామోజీ ఫిలింసిటీ, ఇండస్ట్రియల్ పార్క్ దగ్గరలో అన్ని డెవలప్‌మెంట్స్‌తో ప్లాట్లు అమ్మకానికి కలవు. ఫోన్: 8919577389 [HA-8020]
- యాదగిరిగుట్టకి 6km, వరంగల్ హైవేకి 2km దూరంలో గజం 3,999 రామోజీ ఫిల్మ్ సిటీ 12 km దండుమైలారం 4km నరాలమైసమ్మ టెంపుల్ 1km DTCP గు॥ 4,989. 9394645599 [H-788032]
- కొంపల్లి గుండ్లపోచంపల్లి 18 ఎకరాల లేఅవుట్ HMDALP No: 005084/20HMDA/1073/23 మరియు Rera no: P02200006896 కలిగిన విల్లా ప్లాట్లు, 160, 200, 262 చ॥గ॥ ధర 35,000/- బ్యాంక్ లోన్. 60, 30, 40 BT రోడ్స్ ఫోన్: 8008881747 [HA-3530]
- విజయవాడ హైవే, వరంగల్ హైవే మరియు యాదగిరిగుట్టలలో HMDA, DTCP అప్రూవ్ లేఅవుట్‌లలో ఓపెన్ ప్లాట్లు అమ్మకానికి కలవు. ఫోన్: 7730884948 [H-793394]

PLOTS FOR SALE
Hyd - Vijayawada Highway
Just 6 Kms From Ramoji Film City
Highway Facing Venture
HMDA, TS RERA Approved Plots Available
SHILPI PROPERTIES ESTATES INFRA DEVELOPERS
7731 04 54 56
9346 24 14 15

- యాదగిరిగుట్ట Rs.6500/- గజము బైబ్యాక్ 6000x25 నెలలు @ ముంబాయి హైవే, బుడేర 605sq.y Rs.4700/- గు॥, 531sft ఇల్లు ఉచితము. 7674972466 [HA-95886]
- Nest Infra Developers బీబీ నగర్‌లో Hmda లేఅవుట్‌లో ప్లాట్లు అమ్మకానికి కలవు 18 Lakhsలో 170 Sq yds. ఫోన్: 7672099306. [H-788170]
- Chandanagar, HUDA Colony, Plot Area 400 sqyds South Facing Registered Plot Near BHEL, Hyderabad. Ph: 9110792312 / 8309781922 [HA-31464]
- Mallapur (Village), Vankatapur (GP), Saroornagar (M), RCI airport Road, R.R. W/F, Near Petrol Bunk. Plot No.3, 286 Sq yds Ph: 6300138100 [HA-954]
- Plot for Sale W/F 500sy LRS done, Doctors Colony, beside Mother dairy. Hayathnagar, Strictly No Brokers. PH: 8919175673. [HA-5737]
- HMDA Open plots 167, 200, 300, 400 Sq Yards for Sale with all developments near Ramoji Film City & ORR. Call: 9393183826, 9121774726 [H-788254]
- Prime Location Plot 200 Sq Yrd N/E Corner Plot Registered at Manikonda, near Golden Temple. Call: 7993775379 [HA-95874]
- Christmas Offer : Mumbai Highway Facing, DTCP & RERA Approved, Residential Villa Plots @ Sada shivpet,clear title,Resale Assurance, Agents welcome. Ph: 9959089972. [HA-969]



- బ్యాంక్/ప్రైవేట్ సంస్థలలో తాకట్టుపెట్టిన బంగారంను మా డబ్బుతో విడిపించి ఇతర సంస్థలలో తక్కువ(89పైసలు)వడ్డీకి,ఎక్కువగ్రాము (4500) రేటుకు తాకట్టు పెట్టించబడును.8977044454. [T-1177877]

FOR SALE
- తూముకుంటలో రోజుకి 22,000 నుండి 25,000 కౌంటర్ ఉన్న కర్రీ పాయింట్ అమ్మకమునకు ఉన్నది. ఫోన్: 8367626626. [H-793566]
- Coconut Milk Plant అమ్మబడును మరియు Milk Process Training ఇవ్వబడును. Cont: 9948615730/ 7396389843 [H-793548]
- Good Running Since 23 years Ladies Boutique For Sale at Habsiguda. Owner Going to Abroad. Contact: 9849651429 [H-793667]

BUSINESS SERVICE
- మీ బంగారం బ్యాంకుల్లో గానీ, మార్వాడి షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లలో ఉన్నా మా డబ్బు తో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును Ph: 9100329739. [H-788231]

GOLDEN BHOOMI INFRA PROJECTS
గోల్డెన్‌భూమి మీ లాభాలకు మా హామీ
అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న వరంగల్ హైవే - యాదాద్రికి అతి దగ్గరలో
DTCP APPROVED & FULL Development తో గజం కే 7499/-
మరియు ఆలేరులో మా 80 ఎకరాల గేటెడ్ కమ్యూనిటీ వెంచర్లో
కేవలం: 4 లక్షలకే 121 Sq.Yds ఫార్మ్ ప్లాట్లు కలవు
Note: Limited Offer Only
Ph: 9885855995, 9985855995

BUSINESS OFFER
- రిటైర్డ్ ఉద్యోగులకు శుభవార్త. మీ పెట్టుబడి 5 సం॥లలో డబుల్, సెక్యూరిటీగా ల్యాండ్ రిజిస్ట్రేషన్ చేయబడును. సంప్ర: 9989781888, 9959781888 [HA-95945]
- ద్వారకా ఎంటర్‌ప్రైజెస్: పేపర్ ప్లేట్స్ & LED మెషిన్స్‌పై ప్రతినెల అధిక ఆదాయం, అద్భుత అవకాశం, ఉచిత ముడి పదార్థాలు, 100% తిరిగి కొనుగోలు ఒప్పందం. 9310515624, 8800496710 [H-42904]
- శుభవార్త మీ పెట్టుబడికి 5yrs కు డబుల్ ఇస్తాము సెక్యూరిటీగా ల్యాండ్ రిజిస్ట్రేషన్ చేయబడును, రిటైర్డ్ ఉద్యోగస్తులకు ప్రత్యేక ఆఫర్ కలదు. ఫోన్: 7842227399. [H-787703]
- మా బిజినెస్‌లో ప్రతి 45 రోజులకి 10 లక్షల టర్నోవర్ కలదు. లక్ష నుండి పెట్టుబడులు కావలెను. మంత్లీ రిటర్న్స్. ఫోన్: 9381867282 [HA-14936]
- లక్కీ సీ ఫుడ్స్ హయత్‌నగర్‌ వద్ద ఆఫ్‌లో ఫోసిలిన్, రవ్వ, బొచ్చ, రొయ్యలు, కొర్రమీను మరియు సముద్రపు చేపల మంచి Qualityతో ఆర్డర్లపై హోల్‌సేల్ రేట్లకే సప్లై చేయబడును. Ph: 9885409786/ 8807392629 [H-793447]
- పెట్టుబడి పెట్టండి, అధిక లాభాలు పొందండి, మాది అతిపెద్ద రైస్, ఫుడ్ ఆయిల్, సూపర్ మార్కెట్ బిజినెస్, పార్ట్‌నర్స్ కావలెను. రోజూ లారీ రైస్ అమ్ముతు, 33 వేల లాభం, రిటైర్డైన వారు, ఫైనాన్స్ ఇన్వెస్ట్ వారు, కొత్తగా వ్యాపారం పెట్టే వారు, బిజినెస్‌లో ఆసక్తి గల వారు డైరెక్ట్. 8008251356 [HA-1515]
- Earn Daily 5 to 10K Invest 1 to 3L in ur Trading A/C Without Any Work Pressure Get Good Profits. Ph:9603198091. [H-788172]
- I, Need Good Investors for my Well Running dairy farm, Further Expansion Need Good Investors Interested. Call: 9866549820. [HA-31248]

INSURANCE
- కోటి రూ॥ల మొత్తం మెచ్యూరిటీ కొరకు, కోటి రూ॥ల తక్షణమే ఇన్సూరెన్స్ కొరకు ప్రతిరోజు 300/- రూ॥లు పొదుపు చేయండి. పెన్షన్, పిల్లల మనీబ్యాక్ LIC పాలసీల కొరకు, కరోనా ర్లక్ష్ హెల్త్ పాలసీ కొరకు, శ్రీరామ్ చిట్స్ & డిపాజిట్ కొరకు సంప్ర: 9246351657. WWW.LICSAMRAT.COM [HA-12595]

HOME NEEDS

PEST CONTROL
- వాసనలేని మరకలు పడని ISI కెమికల్స్ 5 సం॥ల వారంటీతో చెదలు (బొద్దింకలు, నల్లులు, బల్లులు) నివారించే సంస్థ, హిందుస్థాన్ పెస్ట్ కంట్రోల్. ఫోన్: 7981533849 / 9490179238. [HA-999]

PERSONAL CARE



CHANGE OF NAME
- I, Nashra Fatima W/o. Syed Waseem Ghori R/o. H.No.12-11-338/3/1, Warasiguda, Seethapal mandi, Secunderabad-500061, T.S., have changed my name as Sumaiya Fathima for all records purpose. [HA-95962]
- I, Mohammad Nooruddin F/o. Asif Hussain R/o.1-4-586/105, Indra nagar Bholakpur, Musheerabad, Hyderabad-20, T.S, Have Changed my name as Nooruddin F/o. Asif Hussain for all record Purpose. [HA-95966]

OLD AGE HOME
- వృద్ధులకు, బెడ్‌పేషెంట్స్‌కు, దీర్ఘ వ్యాధులతో ఉన్నవారికి, మానసిక, శారీరక వికలాంగులకు 24గం॥ వైద్య, భోజనం వసతి ఉప్పల్, ECIL, Hyd సంప్ర: 9849520296, 7981467036. [H-788103]
- పూజిత హోంకేర్: 24/7 గ॥ వృద్ధులు, పేషెంట్లు సేవకు, బేబికేర్ ఇంటి/వంట పని చేసుకునేందుకు మీ ఇంటి వద్దకే పంపబడును. 8801821210 [H-793562]
- నిఖిల్ వృద్ధాశ్రమం: టెలిఫోన్ కాలనీ, కొత్తపేట్, వృద్ధాప్యం, పక్షవాతం, వ్యాధులతో ఉన్న వారికి 24గం॥ ఆయా, అటెండర్, డాక్టర్ సదుపాయం. స్పెషల్ రూమ్స్ కలవు. 9182080282 [H-793560]

TOURS & TRAVELS



- సాయి టూర్స్: JAN-4 కర్ణాటక టూర్, JAN-29 ఉజ్జయిని, ఓంకారేశ్వర్, సోమనాథ్, ద్వారక FEB-8 కాశీ 9 నిద్రలు FEB-22 కేరళటూర్ మార్చ్-2 రామేశ్వరం, MAR-12 రాజస్థాన్. 9848664831. [H-1241961]
- 06/01/24- గాణగాపూర్, అకల్ కోట, కొల్హాపూర్, పండరీపూర్, తుల్జాపూర్ 5 రో॥; *21/01/24-8 జ్యోతిర్లింగాలు, 5 ద్వారకలు 17 రో॥; *29/02/24-రామేశ్వరం, కన్యాకుమారి 10 రో॥, 22 యా॥. భాస్కరరావు. Ph.9848486847. [HA-12590]
- 14/12 నేపాల్ యాత్ర 8రో 20,500/- 27/12 న్యూఇయర్ సెలబ్రేషన్స్ in Nepal 8 రో 28,500/- టి+భో+వ # మా టూర్స్ 9493652100, 6304230161 [H-193298]



- అన్నపూర్ణ హోమ్‌కేర్ పెద్దవారికి సేవ చేయుటకు, పేషెంట్ కేర్, కేర్ టేకర్స్, ఆయాలు, స్త్రీ/పురుషులు కావలెను. జీతం : 16000/- 30000/- రూమ్ + భోజన సౌకర్యం కలదు. ఫోన్: 9390427694 [H-788056]
- RTC లో పనిచేయుటకు ITI డీజిల్ & మోటార్ మెకానిక్ & ఎలక్ట్రీషియన్స్ కావలెను. Ph: 9246663777 / 9030001313 / 9290003999 [H-788115]
- ప్రముఖ హోమ్‌కేర్ సర్వీసెస్ హైదరాబాద్ లో వృద్ధులకు,పేషెంట్లకు సేవచేయుటకు, బేబీకేర్, ఇంటి/వంటపనికి స్త్రీ/పు కా॥. జీ: 17,000-25000/-రూం+భో॥ఫ్రీ. ఫోన్: 9390343765 [H-788117]
- రామకృష్ణ గ్రూప్ (A.P&న్యూఢిల్లీ No.1) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషెంట్ల సేవకు వంట/ఇంటి పని, బేబీకేర్‌కైM/Fవర్కర్లు కా.భో+వ+జీతం 15-21 వేలు. ఏజెంట్లకు5వేలుకమీషన్.9052671122/9133271122 [H-787758]
- బేబీకేర్, పేషెంట్ కేర్, ఇంటి పని, వంట పని చేయుటకు అర్జెంటుగా కావలెను. జీతం: 18-30 వేలు, రూం+మీల్స్ ఫ్రీ 24/7, 12,8 Hrs. 8019315552, 8019665845, 7702362998. [HA-31466]
- SST Food Plaza తట్టి అన్నారం (నాగోల్ - బండ్లగూడ) నందు పనిచేయుటకు Supervisors cum Cashiers (M/F) కావలెను. జీతం 15000/-. + మీల్స్ ఉచితం. Tel.No.7997666888 [H-801453]

EXCITING OPPORTUNITY!
WE ARE HIRING! BIKERS/DELIVERY BOYS IN HYDERABAD
SALARY: UP TO 35,000/- to 45,000/-
040-41892556

- జీవితాంతం ఎక్కువ సంపాదన ఏ పెట్టుబడి లేకుండా కావాలంటే LIC ఏజెంట్‌గా చేరండి. 10th పాస్ అయి ఆడ/మగ పార్ట్/ఫుల్ టైం పనిచేయుటకు సంప్ర: 9246351657 [HA-12594]
- బషీర్‌బాగ్ లోని ప్రముఖ జ్యువెలరీ షోరూంలో పనిచేయుటకు అనుభవము గల సేల్స్ మెన్స్, సేల్స్ గర్ల్స్ మరియు హెల్పర్స్ కావలెను. సంప్ర: Ph:9571077107 [H-787860]
- రామకృష్ణ గ్రూప్ (AP & న్యూఢిల్లీ No.1) శ్రీ మంతుల ఇండ్లలో వృద్ధుల / పేషెంట్ల సేవకు ఇంటి / వంట పని బేబీ కేర్‌కై MF వర్కర్లు కావలెను. భో+వ+జీతం 15-21 వేలు ఏజెంట్లకు 5 వేలు కమీషన్. ఫోన్: 9281452783/9988871122. [H-787759]
- పూజిత హోంకేర్: పేషెంట్లు, బేబికేర్, ఇంటి / వంట పని చేయుటకు స్త్రీలు, పురుషులు, కేర్ టేకర్స్ కావలెను. రూం+భోజనం ఫ్రీ. జీతం: 15-20 వేలు. ఫోన్: 8801821210. [H-793567]
- హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను & పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ: 18K. Ph: 9640258899/ 9640468899. [H-793665]
- ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీ యొక్క వరంగల్ హైవే జనగాం దగ్గర గల DTCP అప్రూవల్ ప్లాట్లు అమ్ముటకు 50 Nos టీం గల మార్కెటింగ్ ఏజెన్సీ కావలెను. మంచి కమీషన్ ఇవ్వబడును. Ph: 7032584555, 9515802999 [HA-3531]
- గేట్ వే హైస్కూల్లో పని చేయుటకు భార్యాభర్తలు అయిన పనివాళ్ళు కావలెను. వసతి సౌకర్యం కలదు. ఫోన్: 9849451588 / 8074813413. [HA-1000]
- వంట, ఇంటి పనికి, పిల్లలు, వృద్ధులు, పేషెంట్స్‌ని చూసుకోవడానికి, కేర్‌టేకర్స్, ఆయాలను మీ ఇంటి వద్దకు పంపబడును 20-40 సం. స్త్రీ/పు వర్కర్స్ కావలెను. ఫోన్: 6309807798, 9121099519 [H-788242]
- పనివారు కావలెను. హైదరాబాద్, బెంగళూరులో ఉండి ఇంటిపని, వంటపని, వృద్ధుల సేవ, పిల్లల పోషణకు స్త్రీలు, కావలెను. సంప్ర॥ 9391912949, 040-40123376. [H-788234]
- రామకృష్ణ గ్రూపు, (India No.1) న్యూ ఢిల్లీ, ముంబాయి, ఛైన్నై, కలకత్తా, అహ్మదాబాద్ బ్రాంచీల కొరకు 10th ఆపైన చదివిన 20-50 సం.ల వయస్సు గల వారు క్వాలిఫైడ్ కొరకు, టెలీకాలర్స్/ఆఫీస్ స్త్రీలు మాత్రమే కావలెను. భో+వ+మంచి జీతం. ఇంటర్వ్యూ: హైదరాబాద్. ✆ 92814 52836, 92814 52837. [H-1255486]
- Universal అనే సంస్థలో జాబ్స్‌కై M/F కావలెను. MEO-50, Mgr-5, ASM-20, Rec-2, Sal: 15-25K+inc, age limit 35y, Q: 10th-PG, Hyd. 04029346789/ 6301832397 [HA-95808]
- ప్రముఖ వి.ఐ. కంపెనీలో వర్క్ ఫ్రం హోమ్ అవకాశం 120 ఖాళీలు కలదు. ఇంటర్, డిగ్రీ, P.G స్టూడెంట్స్, వర్కింగ్, రిటైర్డ్ ఎంప్లాయిస్, గృహిణులు అర్హులు. సంప్ర ✆ 80082 09082 [B-1021]
- రామకృష్ణ గ్రూపు, (India No.1) న్యూ ఢిల్లీ, ముంబాయి, కలకత్తా, అహ్మదాబాద్, హైదరాబాద్, విజయవాడ బ్రాంచీల కొరకు AGM, GM, మేనేజర్స్, MM, DO, HR, PRO, సూపర్‌వైజర్స్, ఆఫీస్, ఫీల్డ్ ఆఫీసర్స్, టీమ్ లీడర్స్, అక్కౌంట్స్, అకౌంటెంట్స్, డ్రైవర్లు, టెలీకాలర్స్, PAPS, VRS, రిటైర్డ్, Ex. సర్వీస్‌మెన్ మొ॥ వారు M/F కావలెను. భో+ వ+ మంచిజీతం. ✆ 94916 51122, 9491821122 [H-1206490]
- మల్కాజ్‌గిరిలో జ్యూట్ / కాన్వాస్ బ్యాగులు కోసం అనుభవజ్ఞులైన లేడీ టైలర్లు కావాలి. శిక్షణ + నెలనెలా జీతం+ బస్‌పాస్.ఫోన్: 9063771065. [HA-95784]
- బంజారాహిల్స్, పంజాగుట్టలోని ప్రముఖ ఆయుర్వేదిక్ హస్పిటల్ నందు పనిచేయుటకు టెలీకాలర్, రిసెప్షనిస్ట్, డ్రైవర్, కుక్, ఆయాలు కావలెను.✆ 90590 42676 [B-6]

- ప్రముఖ ఇన్సూరెన్స్ కం॥లో పార్ట్ టైం అడ్వైజర్స్ కమిషన్ ఆధారంగా కావలెను. హౌ॥వైఫ్స్/ రిటైర్డ్, చిట్స్, ఏజెంట్స్. Age: 30-75. ఫోన్: 9849248282 [H-189632]
- Nest Infra Developers కొరకు మార్కెటింగ్ చేయుటకు ఏజెంట్స్ కావలెను, జీతం: 15,000/- మరియు కమీషన్, హబ్సిగూడ సంప్ర: 9505058151. [H-788169]
- మా ఫార్మాకి అనుభవం/ట్రైనీ టూరింగ్ చేయగల సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతం TA+DA లతో. ఫోన్: 7989823219. [HA-793398]
- Wanted Lady Telecaller. Ph: 9395559626, 9652334426 [HA-95955]
- Relationship Manager (M) business Development Executive a reputed DSA Company With Good Skill and Communication Cont: 9052254355. [H-788258]
- Wanted Workshop Manager & Technician (Exp) @ Yamaha Service Centre, Beeramguda, Near RC Puram # Raghavendra Motors. Cell: 76800 23348 / 9573526460 / 8886620108 [H-189635]
- Wanted Male and Female Non Teaching Staff Qualification Any Inter / Degree / P.G, Age Limit : 21 to 40 years working location: Dilshuknagar, Contact: 9100069434, 9246747481 [G-4909]
- School incharges (2) Female/Male bellow 40yrs Experinced preferred starting Salary 20k pm @S.R.Nagar & FatheNagar. Ph : 9985187777 [H-788039]
- Sr&Jr. Technicians, Helpers Fresher / Exp. Required For "Metro Elevators Lift Co. Walk in between 10 am to 1pm on 25,26 of December, 2023." Metro Elevators, H.No.3-4-130/1 to 5, Hima Apartments, Street No.5, Barkathpura, Lingampally, Hyderabad 500027, Ph: 9391393612/ 9391393692 [H-788239]
- Marketing Team Required For Rehabilitation Centre. Ph: 9346633032 [H-793558]

FACULTY TEACHERS
- Teachers (below 40yrs) Telugu & Maths (H.S), Social ST pre- primary, primary&clerks (Female/Male)@Fathe Nagar (Balanagar) Ph: 9985187777 [H-788038]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఆలయాల వద్ద పటిష్ట బందోబస్తు



ఆలయంలో పరిస్థితిని పర్యవేక్షిస్తున్న ఫిలింనగర్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ

ఫిలింనగర్: వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా జూబ్లీహిల్స్ టీటీడీ శ్రీ వారి ఆలయం వద్ద ఫిలింనగర్ పోలీసులు కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. రాష్ట్ర మంత్రులు, గవర్నర్ ఆలయానికి వస్తున్న నేపథ్యంలో పలుచర్యలు తీసుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఎప్పటికప్పుడు భక్తులను దర్శనానికి పంపిస్తూ దర్శనం పూర్తయిన వెంటనే భక్తులను బయటికి పంపించినట్లు ఫిలింనగర్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ తెలిపారు.

దివ్యాంగులకు ఉచిత హెయిర్ కట్



హెయిర్ కటింగ్ చేస్తున్న సంఘసేవకుడు రమేష్ కొడిచెర్ల

బంజారాహిల్స్: పర్వదినాలు, ప్రముఖుల జయంతి, వర్ధంతుల సందర్భంగా వారికి నివాళులు అర్పిస్తూ ప్రముఖ సంఘ సేవకుడు రమేష్ కొడిచెర్ల అనాధ పిల్లలు, దివ్యాంగులు, నిరాశ్రయులు, వృద్ధులకు ఉచితంగా హెయిర్ కట్ చేసి తన సామాజిక బాధ్యతను నెరవేర్చుకుంటున్నాడు. వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని హైదరాబాద్ చిల్డ్రన్స్ హోంలో ఆశ్రయం పొందుతున్న దివ్యాంగులైన పిల్లలకు ఉచితంగా హెయిర్ కట్ చేసి తన వంతు సేవను నిర్వహించారు. దేవుడు ఎక్కడో లేడని, పిల్లలోనూ, వృద్ధుల్లోనూ చూడవచ్చని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. సుమారు 25 మంది మతిస్థిమితం సరిగా లేని చిన్నారులకు ఈ సందర్భంగా ఆయన హెయిర్ కటింగ్ చేసి సామాజిక బాధ్యతను నిర్వహించారు.

మగువల మదిదోచే ఎగ్జిబిషన్



ప్రారంభోత్సవంలో బిగ్‌బాస్ ఫేమ్ ఇనయా సుల్తానా తదితరులు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నంబర్–1 లోని లేబుల్స్ పాప్ అప్ స్పేస్‌లో ది డెక్కన్ ఫ్లీ ఎగ్జిబిషన్‌ను శనివారం బిగ్ బాస్ ఫేమ్ ఇనాయ సుల్తానా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇనయ మాట్లాడుతూ... డెక్కన్ ఫ్లీ కేవలం ఫ్యాషన్‌లోనే కాకుండా నగలు, ఫాబ్రిక్, కొవ్వొత్తుల తయారీ, పాదరక్షలు, ఈవెంట్ డెకర్, ఆహారం, గృహాలంకరణ ఆలోచనతో ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. ఫ్యాషన్ డిజైనర్, ఫాబ్రిక్ స్టోర్స్ వ్యవస్థాపకురాలు రూపారెడ్డి మాట్లాడుతూ... రెండు వారాల గొప్ప ప్రయత్నం తర్వాత ఈ దక్కన్ ఫ్లీ లేబుల్స్–పాప్ అప్ స్పేస్‌లో దాని డిజైనర్లను ప్రదర్శిస్తున్నామని తెలిపారు.

జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో ఘనంగా క్రిస్మస్ వేడుకలు



జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో క్రిస్మస్ సంబరాలు

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో క్రిస్మస్ వేడుకలు శనివారం కనుల పండువగా నిర్వహించారు. క్రీస్తు నేపథ్యంగా క్రిస్మస్ పర్వదినాన్ని కళ్లకు కట్టేలా నాటికలు, శాంతాక్లాజ్‌లు, నృత్యాలు చేసి విద్యార్థులు పాఠశాలలో పండుగ వాతావరణాన్ని తీసుకొచ్చారు. ఈ సందర్భంగా స్కూల్ చైర్మన్ అరువేల శ్రవణ్‌కుమార్ రావు మాట్లాడుతూ క్రిస్మస్ వేడుకలను విద్యార్థులు ఘనంగా నిర్వహించారని కొనియాడారు. అనంతరం ప్రఖ్యాత గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామనుజన్ జయంతి వేడుకలను సైతం ఘనంగా నిర్వహించారు. ఆయన జీవిత విశేషాలను, సాధించిన విజయాలను వివరిస్తూ దైనందిన జీవితంలో గణితానికి ఉన్న ప్రాముఖ్యతను, చిక్కుముడులు ఫజిల్స్ ద్వారా సరదాగా బయటకు తీసుకొచ్చారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ కాంచనవల్లి తదితరులు పాల్గొన్నారు.

ప్రెస్‌క్లబ్‌లో సందడిగా సెమీ క్రిస్మస్



గీతాలు ఆలపిస్తున్న దృశ్యం

పంజగుట్ట: క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రెస్‌క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సోమాజిగూడ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ కార్యవర్గం కేక్ కట్ చేశారు. సంగీత బృందం క్రిస్మస్ పాటలు పాడారు. రెవరెండ్ బ్లెస్సింగ్ రాజ్‌కుమార్, రెవరెండ్ చిహంగం తమాంగ్‌లు క్రిస్మస్ సందేశం ఇచ్చారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు ఎల్.వేణుగోపాల్ రెడ్డి, ఉపాధ్యక్షురాలు వనజ, సంయుక్త కార్యదర్శి హరిప్రసాద్, కోశాధికారి రాజేష్, సభ్యులు బాపురావు, రాఘవేందర్, గోపరాజు, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ నగర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రవికిరణ్

రహమత్‌నగర్: తెలంగాణ రాష్ట్ర ఎమ్మార్పీఎస్ నగర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జవహర్‌నగర్‌కు చెందిన దళిత నాయకుడు బోడ రవికిరణ్ మాదిగ ఎన్నికయ్యారు. తెలంగాణ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నేత మేడి పాపయ్య మాదిగ, నగర అధ్యక్షుడు జైభీం మాదిగల ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో బోడ రవికిరణ్ ఎన్నికయ్యారు. నగర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎన్నికైన రవికిరణ్‌ను పలువురు దళిత సంఘాల నేతలు అభినందించారు.

నేడు పద్మశాలీ మహిళా విభాగం సమావేశం

కాచిగూడ: అఖిల భారత పద్మశాలీ మహిళా విభాగ సంఘం సర్వసభ్య సమావేశం ఆదివారం నారాయణగూడలోని పద్మశాలి భవన్‌లో నిర్వహించనున్నట్లు జాతీయ అధ్యక్షురాలు వనం దుశ్యంతల తెలిపారు. శనివారం నారాయణగూడలోని పద్మశాలీ భవన్‌లో అఖిల భారత పద్మశాలీ సంఘం జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామిని మహిళా ప్రతినిధులు కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా వనం దుశ్యంతల మాట్లాడుతూ... మహిళా విభాగం సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గం ఎన్నికతో పాటు ప్రమాణ స్వీకారం ఉంటుందని తెలిపారు. పద్మశాలీ మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆమె కోరారు.



బంజారాహిల్స్ రోడ్ నెం. 14 వెంకటేశ్వర స్వామి ఆలయంలో పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే దానం నాగేందర్...



శ్రీనగర్ కాలనీ శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో...



వైకుంఠం.. వైభోగం

- వైకుంఠ ద్వార దర్శనానికి పోటెత్తిన భక్తులు
- గోవింద నామస్మరణతో మార్మోగిన ఆలయాలు
- వేలాదిగా తరలివచ్చిన భక్తులు

బంజారాహిల్స్: ముక్కోటి ఏకాదశి సందర్భంగా వైకుంఠ ద్వార దర్శనం ద్వారా శ్రీవారిని దర్శించుకునేందుకు వైష్ణవాలయాలకు భక్తులు పోటెత్తారు. వైకుంఠ ఏకాదశి శనివారం రావడంతో ఏ ఆలయం వద్ద చూసినా భక్తులు బారులు తీరి కనిపించారు. శ్రీనగర్ కాలనీలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో తెల్లవారుజాము.. 2.30 గంటలకు తిరుప్పావై ప్రవచనాలతో పూజా కార్యక్రమాలను అర్చకులు నిర్వహించారు. ఉదయం 6 గంటల నుంచి సర్వ దర్శనానికి భక్తులను అనుమతిచ్చారు. జూబ్లీహిల్స్ టీటీడీ శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయానికి నగర నలుమూలల నుంచి వేలాదిగా భక్తులు పోటెత్తడంతో ఆలయ పరిసరాలు భక్తజనసందోహంతో కనిపించాయి. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఆయా ఆలయ కమిటీలు, పోలీసులు తగు చర్యలు తీసుకున్నారు. బంజారాహిల్స్ రోడ్ నెం. 12లోని శ్రీ లక్ష్మీవెంకటేశ్వర ఆలయానికి తెల్లవారుజాము నుంచే భక్తులు పోటెత్తారు. పంజగుట్ట దుర్గానగర్ కాలనీలోని కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయం, బంజారాహిల్స్ రోడ్ నెం. 14లోని శ్రీ వెంకటేశ్వర ఆలయం, జూబ్లీహిల్స్ రోడ్ నెం 17లోని శ్రీ సీతారామస్వామి ఆలయాల్లో ఉత్తర ద్వారం ద్వారా భక్తులకు దర్శనానికి ఏర్పాట్లు చేశారు. బంజారాహిల్స్ రోడ్ నెం. 14లోని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



జూబ్లీహిల్స్ టీటీడీ శ్రీ వారి దర్శనానికి బారులు తీరిన భక్తులు...

ఆలయాల్లో కోవిడ్ ఆంక్షలు



వెంకటేశ్వర స్వామి ఆలయంలో మాస్కులు ధరించి వచ్చిన భక్తులు

వెంకటేశ్వరకాలనీ: కరోనా కేసులు పెరుగుతున్న నేపథ్యంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా పలు ఆలయాల్లో కరోనా ఆంక్షలు విధించారు. మాస్కులు ధరించిన వారికే అనుమతించడంతో పాటు మాస్కులు లేని వారికి సైతం శ్రీనగర్ కాలనీ శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ అధికారులు మాస్కులు అందించారు. 20 వేల మంది భక్తులకు సరిపడా మాస్కులు తాము పంపిణీ చేసినట్లు ఆలయ ఈవో ఎస్. లావణ్య తెలిపారు.



బంజారాహిల్స్ రోడ్ నెం. 1లోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో...

టీటీడీ ఆలయంలో ప్రముఖులు



ఆలయం లోపలికి వెళ్తున్న భక్తులు

హిమాయత్‌నగర్: హిమాయత్‌నగర్‌లోని తిరుమల తిరుపతి దేవస్థానం భక్తులతో కిటకిటలాడింది. శనివారం తెల్లవారుజాము నుంచి రాత్రి వరకు భక్తులు పిల్లలు, కుటుంబ సభ్యులతో కలిసి వేంకటేశ్వర స్వామి వారిని ఉత్తర ద్వారం నుంచి దర్శించుకున్నారు. హరియాణా రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయ, కూతురు విజయలక్ష్మీతో కలిసి స్వామివారిని దర్శించుకున్నారు. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు చింతల రామచందర్ రెడ్డి తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు.



ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలి: హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ

ప్రజలంతా సంతోషంగా ఉండాలని హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా హిమాయత్‌నగర్ టీటీడీ ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగవంతుని ఆశీర్వాదంతో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నానన్నారు.



భక్తులతో కిటకిటలాడుతున్న ఆలయ ప్రాంగణం

వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్న గవర్నర్ తమిళిసై



జూబ్లీహిల్స్ టీటీడీ శ్రీవారి ఆలయంలో గవర్నర్ తమిళిసై సౌందర రాజన్...

బంజారాహిల్స్: వైకుంఠ ఏకాదశి సందర్భంగా శ్రీవారి ఆలయాలకు ప్రముఖులు క్యూ కట్టారు. జూబ్లీహిల్స్ టీటీడీ శ్రీవారిని దర్శించుకునేందుకు రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర రాజన్ శనివారం ఉదయం ఆలయానికి విచ్చేశారు. గవర్నర్ శ్రీవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సినీ హీరో నందమూరి కళ్యాణ్ రామ్ శ్రీనగర్‌కాలనీలోని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారిని దర్శించుకున్నారు. రాజ్యసభ సభ్యుడు కేశవరావు బంజారాహిల్స్ రోడ్ నెం–12 విరించి ఆస్పత్రి చౌరస్తాలోని శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయంలో పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రామేశ్వర్‌రావుకు గవర్నర్ అభినందన



రామేశ్వర్‌రావును అభినందిస్తున్న గవర్నర్ తమిళిసై

ఖైరతాబాద్: జేఎన్టీయూ హైదరాబాద్‌లో మొట్టమొదటి సారిగా నిర్వహించిన ప్రపంచ పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో భాగంగా తెలంగాణ రాష్ట్ర గవర్నర్ తమిళిసై ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ డాక్టర్ జి.రామేశ్వర్‌రావును సన్మానించారు. ఎస్కీలో విద్యా ప్రమాణాలను పెంచడంతో పాటు ఇంజినీరింగ్ రంగంలో విద్యార్థులను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకునేలా ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు రామేశ్వర్‌రావు తెలిపారు.

నియామకం



శ్రీనగర్‌కాలనీ: సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిలిం సర్టిఫికేషన్ అడ్వైజరీ ప్యానల్ మెంబర్‌గా శ్రీనగర్‌కాలనీకి చెందిన పోతురాజు హరికిషోర్ నియమితులయ్యారు. రెండు సంవత్సరాలపాటు ఈ పదవిలో కొనసాగుతారు. అడ్వైజరీ ప్యానల్ మెంబర్‌గా తనను ఎన్నుకున్నందుకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిలిం సర్టిఫికేషన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఆకట్టుకుంటున్న పెట్ కార్నివాల్

అలరించిన కుక్కలు, పిల్లుల విన్యాసాలు



పెట్ కార్నివాల్ దృశ్యాలు

ఖైరతాబాద్: పీపుల్స్ ప్లాజా వేదికగా పెట్ స్టార్ పేరుతో నిర్వహిస్తున్న పెట్ కార్నివాల్ ఆకట్టుకుంటోంది. వివిధ రకాల డాగ్స్, పిల్లులు, పక్షులు, గుర్రాలు, దున్నపోతులు ఇలా అరుదైన జాతులకు చెందిన వివిధ రకాల జంతువుల విన్యాసాలు కార్నివాల్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. తెలంగాణ కెనైన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పెట్ కార్నివాల్‌లో వివిధ రాష్ట్రాలకు చెందిన 600 మేలి జాతి డాగ్స్, 350 రకాల పిల్లులు, పక్షులు సందర్శకులు అలరించాయి. జంతు ప్రేమికుల కోసం పెట్ కార్నివాల్‌ను పీపుల్స్ ప్లాజా వేదికగా రెండు రోజుల పాటు నిర్వహించినట్లు కెనైన్ అసోసియేషన్ అధ్యక్షుడు చీకోటి ప్రవీణ్ తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం 12 నుంచి రాత్రి 10 గంటల వరకు పెట్ కార్నివాల్ ఉంటుందని తెలిపారు. మొదటి రోజు కార్నివాల్‌లో డాగ్స్ పోటీలు, గుర్రాల నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.







దళితులకు అక్బరుద్దీన్ క్షమాపణ చెప్పాలి



మాట్లాడుతున్న గజ్జెల కాంతం

పంజగుట్ట: ఒక దళిత ఎమ్మెల్యేను అసెంబ్లీలో కించపరిచేలా మాట్లాడిన ఎంఐఎం శాసనసభాపక్ష నేత అక్బరుద్దీన్ ఓవైసీ వెంటనే క్షమాపణ చెప్పాలని తెలంగాణ ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ గజ్జెల కాంతం డిమాండ్ చేశారు. అక్బరుద్దీన్‌పై దళితులు తిరగబడితే హైదరాబాద్ వదిలి పారిపోవాల్సి వస్తుందన్న విషయం మర్చిపోరాదని హెచ్చరించారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఒక విద్యావంతుడైన డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణపై అక్బరుద్దీన్ ఇష్టంవచ్చినట్లు మాట్లాడడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. మాట్లాడితే ముస్లింలందరికీ తామే పెద్ద అన్నట్లు మాట్లాడే ఎంఐఎం ఏడుగురు ఎమ్మెల్యేలు, ఒక ఎంపీ ఎప్పుడైనా పేద ముస్లింలకు సాయం చేశారా..? ఆర్థికంగా, సామాజికంగా ఎవరినైనా ఆదుకున్నారా అని ప్రశ్నించారు. బీజేపీ, బీఆర్ఎస్‌కు అమ్ముడుపోయి వేలకోట్లు సంపాదించుకుని, ఎప్పుడు ఏ పార్టీ అధికారంలోకి వస్తే ఆపార్టీకి చెంచాగిరీ చేసే వీరా ఒక దళిత ఎమ్మెల్యేపట్ల అసభ్యంగా మాట్లాడేది అని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిజమైన ముస్లింలు, ముస్లిం పెద్దలు ఎప్పుడూ ఓవైసీ బ్రదర్స్‌ను నమ్మరని కేవలం అక్కడి స్థానికులను భయభ్రాంతులకు గురిచేసి ఓట్లు వేయించుకుంటారని ఆరోపించారు. బీఆర్ఎస్, బీజేపీ ప్రభుత్వం కాదు ప్రస్తుతం ఉంది నిజమైన ప్రజా ప్రభుత్వం, ప్రజాస్వామ్యాన్ని గౌరవించే ముఖ్యమంత్రి ఉన్నారని ఇక మీ ఆటలు సాగవని హెచ్చరించారు.

పిల్లలు, మహిళలు, ట్రాన్స్‌జెండర్ల అంశాలపై... మీడియా అప్రమత్తంగా ఉండాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సంధ్య

పంజగుట్ట: పిల్లలు, మహిళలు, ట్రాన్స్‌జెండర్స్ తాము కూడా మనుషులమే, చట్టం పరిధిలో, చట్టం చెప్పినట్లు మనుషులుగా మీడియాలో తమను కూడా చిత్రీకరించాలని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో భూమిక ఉమెన్స్ కలెక్టివ్ ఆధ్వర్యంలో మీడియాలో పిల్లలు, మహిళలు, ట్రాన్స్‌జెండర్స్ పట్ల వ్యవహరించాల్సిన తీరుపై ఒకరోజు సెమినార్ నిర్వహించారు. భూమిక వ్యవస్థాపకురాలు సత్యవతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో పీవోడబ్ల్యు సంధ్య, దేవి, తాషి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... స్త్రీల శరీరాలు ఒక ప్రదర్శన వస్తువుల్లా ఫ్లడ్‌లైట్ వెలుతురులో చూపిస్తున్నా ఒక్క మీడియా కూడా దీనిపై చర్చించకపోవడం దారుణమన్నారు. టీవీలు వచ్చిన మొదట్లో మహిళల సమస్యలపై మాట్లాడేవారని కానీ కాలక్రమేనా అరగంట, గంట సమయం ఇచ్చేవారని... ఇప్పుడు టీఆర్‌పీ రేటింగ్ పేరుతో అదికూడా లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. వరకట్న వేధింపులు, వరకట్న హత్యలు, నిర్భయ తదితర అంశాల్లో తాము ముందుండి పోరాడినా వాటిని ప్రచారం చెయ్యడంలో మీడియా పాత్ర ప్రధానంగా ఉందన్నారు. గత 28 సంవత్సరాల క్రితం మహిళా బిల్లు పార్లమెంట్‌లో పెడితే ఎంతో ప్రచారం జరిగిందని, ఆ బిల్లు వీగిపోతే ఎంతో చర్చ జరిగిందని ఇప్పుడు బిల్లు నామమాత్రంగా ఉన్నా, అందులోఎన్నో లోపాలు ఉన్నప్పటికీ ఆమోదం పొందితే కనీసం ఏ చానల్‌లో చర్చకూడా లేకపోవడం బాధాకరమన్నారు.

పాఠశాలల్లో ఘనంగా క్రిస్మస్ వేడుకలు



క్రిస్మస్ వేడుకల్లో సాయిసరస్వతీ విద్యానికేతన్ చిన్నారులు

వెంగళరావునగర్: శ్రీకృష్ణానగర్‌లో ఉన్న శ్రీసాయిసరస్వతీ విద్యానికేతన్ హైస్కూల్‌లో శనివారం ఘనంగా క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు వేసిన క్రీస్తు జననం నాటిక అలరించింది. స్కూల్స్ మేనేజింగ్ కమిటీ డైరెక్టర్ జయంతి వెంకటరామన్, స్కూల్ చైర్మన్ శిరీష భవానీశంకర్, టీచర్లు పాల్గొన్నారు.



శ్రీనిధి స్కూల్‌లో...

శ్రీనిధి హైస్కూల్‌లో...

మధురానగర్‌లోని శ్రీనిధి హైస్కూల్‌లో శనివారం క్రిస్మస్ వేడుకలు అట్టహాసంగా జరిగాయి. చిన్నారులు వివిధ వేషధారణలతో హాజరై క్రైస్తవ భక్తి గీతాలు ఆలపిస్తూ పర్వదినాన్ని జరుపుకొన్నారు. డైరెక్టర్లు కొల్లి లక్ష్మణ్, సుకుమార్, ప్రిన్సిపాల్ గీత, వైస్ పిన్సిపాల్స్ విమల, రాజేశ్వరి, కో ఆర్డినేటర్ సాయి తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో ముక్కోటి ఏకాదశి



రామాంజనేయస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

వెంగళరావునగర్: వెంగళరావునగర్ ప్రధాన రహదారిలో ఉన్న శ్రీరామాంజనేయ స్వామి దేవస్థానంలో శనివారం ముక్కోటి ఏకాదశి వేడుకలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం 5 గంటలకు భక్తులకు ఉత్తర ద్వార దర్శన ప్రవేశం ఏర్పాటు చేశారు. 6:30కు ఆంజనేయస్వామి వారికి అభిషేకం, 9 గంటలకు ప్రత్యేకంగా లక్ష తులసీ పూజ, 12 గంటలకు మంగళ శాసనం, మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వితరణ జరిగాయి. ఆలయ కార్య నిర్వాహణాధికారి గోవాడ సత్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

లింగయ్య మృతి తీరని లోటు

రహమత్‌నగర్: తెలంగాణ వడ్డెర ఐక్య వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు గొలుసుల ఎల్లయ్య తండ్రి లింగయ్య(72) మృతి పట్ల ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల యాదయ్య సంతాపం వ్యక్తం చేశారు. దివంగత లింగయ్య వడ్డెర సంఘం కార్యక్రమాల్లో విరివిగా పాల్గొంటూ కులస్తుల మన్ననలు పొందారని గుర్తుచేశారు. లింగయ్య మృతి సంఘానికి తీరని లోటని అన్నారు. వడ్డెర ఐక్య వేదిక నగర అధ్యక్షుడు ముద్దంగులు శేఖర్, సురేష్, నాగమణి, ఓర్సు మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఈస్ట్ రహమత్‌నగర్‌లో అగ్ని ప్రమాదం

వెంగళరావునగర్: వెంగళరావునగర్ డివిజన్ ఈస్ట్ రహమత్‌నగర్ గల్లీలో శుక్రవారం అర్ధరాత్రి అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. షార్ట్ సర్క్యూట్ కారణంగా ఈ ప్రమాదం సంభవించిందని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. ప్రమాదంలో శ్రావణ్‌కుమార్ ఇంటిలోని ఫ్యాన్లు, లైట్లు, ఫ్రిజ్, టీవీ తదితర ఎలక్ట్రానిక్ వస్తువులు కాలిపోయాయి. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ దేదీప్య విజయ్ హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని బాధితులను పరామర్శించారు. ఏడీఈ ప్రేమ్‌ను పిలిపించి నూతనంగా ఆ గృహానికి ఉచితంగా విద్యుత్ మీటర్ ఏర్పాటు చేయాలని సూచించారు. బీఆర్ఎస్ సీనియర్ నేతలు విజయ్‌కుమార్, కిట్టు, జహంగీర్, పూజారి బాల్‌రాజ్ పాల్గొన్నారు.

టీడీపీ అక్రమాలపై చర్యలు తీసుకోండి

- ఓటర్ల జాబితాలో భారీ ఎత్తున అవకతవకలకు పాల్పడుతోంది
- కేంద్ర ఎన్నికల సంఘం అధికారులకు వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి పేర్ని నాని వినతి




మాట్లాడుతున్న పేర్ని నాని. పక్కన నాగార్జున, అబ్బయ్య చౌదరి, జోగి రమేశ్, లేళ్ల అప్పిరెడ్డి, గౌతమ్‌రెడ్డి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఓటర్ల జాబితాలో టీడీపీ భారీ ఎత్తున అవకతవకలకు పాల్పడుతోందని వైఎస్సార్‌సీపీ కృష్ణా జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి పేర్ని నాని కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసీ) అధికారుల బృందానికి ఫిర్యాదు చేశారు. మైపార్టీ డ్యాష్ బోర్డు.కామ్ వెబ్‌సైట్ ద్వారా ఓటర్ల వ్యక్తిగత వివరాలను టీడీపీ అక్రమంగా సేకరిస్తోందన్నారు. ఆ పార్టీకి మద్దతు తెలపని ఓటర్లను జాబితా నుంచి తొలగించేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఇందుకోసం తప్పుడు సమాచారంతో భారీ ఎత్తున ఫామ్–7లను ఎన్నికల సంఘానికి సమర్పిస్తోందన్నారు. పైగా దొంగే దొంగ అన్నట్లు టీడీపీ నేతలే ఓటర్ల జాబితాలో అక్రమాలకు పాల్పడుతూ తమపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో ఎన్నికల సన్నద్ధతపై విజయవాడలోని నోవాటెల్ హోటల్‌లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ, రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి, జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో సీఈసీ అధికారుల బృందం శనివారం కూడా సమీక్ష నిర్వహించింది. ఈ నేపథ్యంలో సీఈసీ బృందాన్ని మంత్రులు జోగి రమేశ్, మేరుగు నాగార్జున, ఎమ్మెల్యేలు పేర్ని నాని, కొఠారు అబ్బయ్య చౌదరి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, ఫైబర్ నెట్ చైర్మన్ గౌతం రెడ్డి, నవరత్న పథకాల అమలు వైస్ చైర్మన్ నారాయణమూర్తిలతో కూడిన వైఎస్సార్‌సీపీ బృందం కలిసింది. ఈ సందర్భంగా ఢిల్లీలో ఈ నెల 14న సీఈసీకి చేసిన ఫిర్యాదులను మరోసారి వైఎస్సార్‌సీపీ నేతలు సీఈసీ బృందం దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం పేర్ని నాని మీడియాతో మాట్లాడారు. ఓటర్ల జాబితాలో టీడీపీ అక్రమాలపై ఆధారాలతో సహా ఫిర్యాదు చేశామని చెప్పారు.

నీళ్లివ్వండి.. కరెంట్ ఇస్తాం!

కృష్ణా జలాలపై మహారాష్ట్రకు విజ్ఞప్తి చేయనున్న రాష్ట్ర సర్కారు

- ఆ రాష్ట్రంలో కృష్ణా ఉపనదిపై ఉన్న కోయినా డ్యామ్ నుంచి నీటి విడుదల కోరాలని నిర్ణయం
- కోయినాలో విద్యుదుత్పత్తి ద్వారా అరేబియా సముద్రంలోకి నీళ్లు
- అలా వృథా చేయకుండా దిగువన ఆల్మట్టికి విడుదల చేస్తే మేలు
- అక్కడి నుంచి నారాయణపూర్ మీదుగా జూరాలకు నీళ్లు వచ్చే చాన్స్
- కోయినాలో కోల్పోయే మేర కరెంట్‌ను రాష్ట్రం నుంచి ఇస్తామనే ప్రతిపాదన
- శ్రీశైలం, సాగర్‌లలో నిల్వలు అడుగంటిపోవడంతో సర్కారు ఆలోచన



మహారాష్ట్రలోని కోయినా డ్యామ్

సాక్షి, హైదరాబాద్: కృష్ణానది బేసిన్‌లోని శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాల్లో నీటి నిల్వలు అడుగంటిపోయిన నేపథ్యంలో.. యాసంగిలో సాగు, వేసవి తాగునీటి అవసరాల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తోంది. మహారాష్ట్రలో కృష్ణా ఉపనది అయిన కోయినాపై ఉన్న డ్యామ్ నుంచి కృష్ణానదికి నీటిని విడుదల చేయించుకోవడానికి ఉన్న సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తోంది. కృష్ణా బేసిన్‌లో ఎగువన ఉన్న తొలి మేజర్ ప్రాజెక్టు అది. 105.27 టీఎంసీల సామర్థ్యంతో కోయినా నదిపై నిర్మించిన ఈ డ్యామ్‌ను జలవిద్యుదుత్పత్తి అవసరాలకు మాత్రమే వినియోగిస్తున్నారు. 1,920 మెగావాట్ల భారీ సామర్థ్యం దీని సొంతం. ఇక్కడ విద్యుదుత్పత్తి చేయడం ద్వారా వదిలే నీళ్లు.. దిగువన నదిలోకి కాకుండా, మరో మార్గంలో పడమర వైపు వెళ్లి అరేబియా సముద్రంలో కలుస్తాయి. ప్రస్తుతం డ్యామ్‌లో 86.32 టీఎంసీల నిల్వలు ఉన్నాయి. విద్యుదుత్పత్తి కోసం నీటిని వృధాగా సముద్రం పాలు చేయడానికి బదులుగా.. దిగువన ఉన్న తెలంగాణ అవసరాల కోసం కృష్ణానదిలోకి విడుదల చేయాలని మహారాష్ట్రను కోరేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. బదులుగా ఆ నీటితో ఎంత మేర విద్యుత్ ఉత్పత్తి కాగలదో.. అంతమేర మహారాష్ట్రకు ఉచితంగా సరఫరా చేయాలని యోచిస్తోంది. దీనిపై త్వరలోనే మహారాష్ట్ర ప్రభుత్వానికి ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి స్వయంగా లేఖ రాసే అవకాశం ఉందని నీటిపారుదల శాఖ అధికారులు వెల్లడించారు. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి నిర్వహించిన సమీక్షలో ఈ అంశం చర్చకు వచ్చిందని, ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సీఎం ఆదేశించారని వివరించారు.

వందల కిలోమీటర్లు ప్రవహించి..

కోయినా డ్యామ్ నుంచి విడుదలయ్యే నీళ్లు సుమారు 118 కిలోమీటర్ల పొడవునా కోయినా నదిలో ప్రవహించి కృష్ణానదిలో కలుస్తాయి. అక్కడి నుంచి ప్రధాన పాయలో ప్రవహిస్తూ.. 518 కిలోమీటర్ల దూరంలోని ఆల్మట్టి రిజర్వాయర్‌కు చేరుకోవాల్సి ఉంటుంది. ఆల్మట్టి నుంచి దిగువన ఉన్న నారాయణపూర్ రిజర్వాయర్‌కు, అక్కడి నుంచి తెలంగాణ భూభాగంలోకి ప్రవేశించి జూరాల రిజర్వాయర్‌కు చేరుకోవాల్సి ఉంటుంది. మొత్తంగా దాదాపు 900 కిలోమీటర్ల మేర ప్రవహించాలి. ఇలా జూరాలకు చేరుకున్నాక.. అవసరాన్ని బట్టి శ్రీశైలం జలాశయానికి, అక్కడి నుంచి నాగార్జునసాగర్ రిజర్వాయర్‌కు విడుదల చేసుకోవచ్చు. సాగర్ వరకు చూస్తే.. 1,400 కిలోమీటర్లు ప్రవహించి రావాల్సి ఉంటుంది.

ఆ రెండు రాష్ట్రాల సమ్మతి ఉంటేనే..

కోయినా డ్యామ్ మహారాష్ట్రలో ఉండగా.. ఆల్మట్టి, నారాయణపూర్ కర్ణాటకలో ఉన్నాయి. అంటే ఈ రెండు రాష్ట్రాల సమ్మతి వస్తేనే కోయినా డ్యామ్ నుంచి నీళ్లను తెచ్చుకోవడం సాధ్యమవుతుంది. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి ఉండటంతో పెద్దగా ఇబ్బందులు ఉండవని ప్రభుత్వ వర్గాలు చెప్తున్నాయి. అయితే మహారాష్ట్రలోని బీజేపీ ప్రభుత్వం ఈ ప్రతిపాదనలకు ఎంతమేర అంగీకరిస్తుందన్నది సందేహమేనని అంటున్నాయి. గతంలో బీఆర్‌ఎస్ సర్కారు కూడా కోయినా డ్యామ్ నుంచి నీటిని విడుదల చేయించుకోవడానికి ప్రయత్నించినా.. మహారాష్ట్ర ప్రభుత్వం అంగీకరించలేదని వివరిస్తున్నాయి.

పొదుపుగా వాడుకుంటేనే నీళ్లు

శ్రీశైలం గరిష్ట నిల్వ సామర్థ్యం 215.81 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 52.42 టీఎంసీల నీళ్లే ఉన్నాయి. నాగార్జునసాగర్ సామర్థ్యం 312.05 టీఎంసీలుకాగా.. 154.43 టీఎంసీలే ఉన్నాయి. వీటిలో డెడ్ స్టోరేజీకిపైన వినియోగించుకోగల నీళ్లు తక్కువే. అందువల్ల పొదుపుగా వాడుకుంటే వచ్చే వేసవిలో హైదరాబాద్ జంట నగరాలతోపాటు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా తాగునీటి అవసరాలకు సరిపోతాయని నీటిపారుదల శాఖ అంచనా వేస్తోంది. అయితే ముందు జాగ్రత్త చర్యగా కోయినా డ్యామ్ నుంచి నీళ్లను విడుదల చేయించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. మహారాష్ట్ర అంగీకరిస్తే సాగునీటికి సైతం కొంత వరకు నీళ్లను విడుదల చేయవచ్చని ఆలోచిస్తున్నట్టు సమాచారం.


చాలా కాలం నుంచి కోరుతున్నా..

మహారాష్ట్రలోని పశ్చిమ కనుమల్లో పుట్టి.. కోయినా నది తూర్పు వైపు ప్రవహించి కృష్ణా నదిలో కలుస్తుంది. ఇలా కలిసేచోటు కన్నాపైన కోయినా నదిపై మహారాష్ట్ర భారీ డ్యామ్‌ను, జల విద్యుత్ కేంద్రాన్ని నిర్మించింది. అందులో విద్యుదుత్పత్తి చేశాక నీటిని పశ్చిమం వైపు విడుదల చేస్తోంది. ఆ నీళ్లు అటువైపే ప్రవహించి వృథాగా అరేబియా సముద్రం పాలవుతున్నాయి. కే–1 సబ్‌బేసిన్‌లోని ఈ కోయినా ప్రాజెక్టుకు గతంలో బచావత్ ట్రిబ్యునల్ 67.5 టీఎంసీల నీటిని కేటాయించగా.. బ్రిజేశ్ ట్రిబ్యునల్ 25 టీఎంసీలకు తగ్గించింది. కోయినా ప్రాజెక్టులో జలవిద్యుదుత్పత్తి చేయవద్దని దిగువన ఉన్న రాష్ట్రాలు చాలా కాలం నుంచి కోరుతున్నాయి. కానీ మహారాష్ట్ర పట్టించుకోవడం లేదు.

చంద్రబాబుతో ప్రశాంత్ కిశోర్ సమావేశం

సీఎం రమేష్ సొంత విమానంలో హైదరాబాద్ నుంచి తీసుకువచ్చిన లోకేశ్

- గన్నవరం నుంచి నేరుగా చంద్రబాబు ఇంటికి రాక
- పీకేపై గతంలో తీవ్ర విమర్శలు చేసిన బాబు
- ఇప్పుడు ఆయనతోనే ఎన్నికల వ్యూహాలకు సమావేశం





సాక్షి, అమరావతి/గన్నవరం: ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ (పీకే) శనివారం టీడీపీ అధినేత చంద్రబాబును కలిశారు. వారిద్దరూ మూడు గంటలకు పైగా సమావేశమైనట్లు సమాచారం. టీడీపీ నేత లోకేశ్‌తో కలిసి ప్రశాంత్ కిశోర్ శనివారం మధ్యాహ్నం ప్రత్యేక విమానంలో హైదరాబాద్ నుంచి నారా గన్నవరం విమానాశ్రయానికి వచ్చారు. అక్కడి నుంచి ఇద్దరూ కలిసి ఉండవల్లిలోని చంద్రబాబు నివాసానికి వెళ్లారు. ప్రశాంత్ కిశోర్‌తో చంద్రబాబు, లోకేశ్ రాజకీయ అంశాలపై చర్చించినట్లు టీడీపీ వర్గాలు తెలిపాయి. రాబోయే ఎన్నికల్లో టీడీపీ పరిస్థితి ఏమిటనే దానిపై వారు మాట్లాడినట్లు తెలిపాయి. అనంతరం సాయంత్రం ప్రశాంత్ కిశోర్ గన్నవరం విమానాశ్రయానికి చేరుకొని, అక్కడి నుంచి హైదరాబాద్‌కు తిరిగి వెళ్లిపోయారు. చంద్రబాబును మర్యాదపూర్వకంగానే కలిశానని సమావేశం తర్వాత ప్రశాంత్ కిశోర్ మీడియాకు తెలిపారు. ఆయన సీనియర్ నాయకుడని, అందుకే కలిశానని చెప్పారు. చంద్రబాబుతో ఏ అంశాలపై చర్చించారో వెల్లడించలేదు.

అప్పుడు ప్రశాంత్ కిశోర్ చేదు..

బిహార్ వాడికి ఇక్కడ పనేంటి అంటూ ప్రశాంత్ కిశోర్‌పై గత ఎన్నికల సమయంలో నానా రకాలుగా తూలనాడిన చంద్రబాబు.. ఇప్పుడు అదే ప్రశాంత్ కిశోర్‌తో సమావేశమవడం చర్చనీయాంశమైంది. వ్యక్తులను, పార్టీలను, సంస్థలను అవసరమైనప్పుడు అక్కున చేర్చుకోవడం, అవసరం తీరాక గిరాటెయ్యడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య. సీపీఐ, సీపీఎం, బీజేపీ, జనసేన పార్టీలతో ఆయన ఆడుతున్న ఆటలు, అవసరం తీరాక వాటిని గడ్డిపరక కింద జమకడతారు. మళ్లీ అవసరమైతే అదే వ్యక్తులను చేరదీస్తారు. ఇదంతా కళ్లకు కనిపిస్తున్నదే. ఎన్నికల్లో మిత్రపక్షాలనే మోసం చేయడం బాబు హాబీ. ఇప్పుడు ప్రశాంత్ కిశోర్ విషయంలోనూ బాబు ఇదే తీరుతో వ్యవహరిస్తున్నారు. 'ఆయనో పెద్ద వ్యూహకర్త' అంటూ 2019లో ప్రశాంత్ కిశోర్‌ను ఉద్దేశించి ఎద్దేవా చేశారు. బిహార్ నుంచి వచ్చిన ప్రశాంత్ కిశోర్ రాష్ట్రంలో ఓట్లు తొలగిస్తున్నారని ఆరోపించారు. దీనిపై ప్రశాంత్ కిశోర్ అప్పట్లో చంద్రబాబుకు సమాధానం ఇస్తూ.. 'కళ్ల ముందు ఓటమి కనిపిస్తుంటే సీజన్లకు అనుగుణంగా రాజకీయాలు చేసే చంద్రబాబు అలా మాట్లాడటం తనను ఆశ్చర్యపరచలేదు' అంటూ కౌంటర్ ఇచ్చారు. బిహార్‌కు వ్యతిరేకంగా, అభ్యంతరకరంగా మాట్లాడడం మానేసి, ఏపీ ప్రజలు మళ్లీ ఆయనకు ఓట్లు ఎందుకు వేయాలో చెప్పాలని చంద్రబాబుకు సూచించారు. అప్పట్లో ప్రశాంత్ కిశోర్‌పై ఆరోపణలు గుప్పించిన లోకేశ్ ఇప్పుడు దగ్గరుండి ప్రత్యేక విమానంలో తీసుకొని వచ్చారు.

బీజేపీ నేత సీఎం రమేష్ విమానంలో వచ్చిన ప్రశాంత్

ప్రశాంత్ కిశోర్‌ను విజయవాడ తీసుకురావడానికి చంద్రబాబు బీజేపీలో ఉన్న తన అనుచరుడు సీఎం రమేష్‌కి చెందిన విమానాన్ని వాడుకోవడం పైనా చర్చ జరుగుతోంది. రిత్విక్ గ్రీన్ పవర్ అండ్ ఏవియేషన్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన విమానంలో లోకేశ్, ప్రశాంత్ కిశోర్ హైదరాబాద్ నుంచి గన్నవరం ఎయిర్‌పోర్టుకు వచ్చారు. ఈ కంపెనీ సీఎం రమేష్‌దనే విషయం అందరికీ తెలిసిందే. ఆ విమానంలోనే ప్రశాంత్‌ను తీసుకువచ్చిన లోకేశ్ మళ్లీ అదే విమానంలో తిరిగి హైదరాబాద్ తీసుకెళ్లారు. దీన్నిబట్టి సీఎం రమేష్ బీజేపీలో ఉంటూనే చంద్రబాబు కోసం పని చేస్తున్నారనే విషయం మరోసారి స్పష్టమైంది.

మెటీరియల్ బాగోకపోతే మేస్త్రి ఏం చేస్తాడు : అంబటి

సాక్షి ప్రతినిధి, గుంటూరు: అసలు మెటీరియల్ బాగోకపోతే ఏ మేస్త్రి అయినా ఏం చేస్తాడని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు విమర్శించారు. ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్‌తో శనివారం చంద్రబాబు భేటీ కావడంపై అంబటి రాంబాబు మీడియాతో మాట్లాడుతూ.. ఎంతమంది పీకేలు వచ్చినా వైఎస్సార్‌సీపీని ఏమీ చేయలేరని అన్నారు. 'గత ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి వ్యూహకర్తగా పనిచేసిన బిహార్‌కు చెందిన ప్రశాంత్ కిశోర్ (పీకే) ఈ రోజు లోకేశ్‌ను, టీడీపీ పెద్దలను కలిశాడని.. ఆయన వారికి వ్యూహకర్తగా ఉండబోతున్నారన్న వార్త వచ్చింది. గతంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి వ్యూహకర్తగా పనిచేశారు. ఆయన వ్యూహకర్తగా పనిచేసిన రోజుల్లో ఇదే లోకేశ్, ఇదే చంద్రబాబు నాయుడు ఆయన గురించి ఏ మాట్లాడారో గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉంది. ఆయన పీకే కాదు.. బిహార్ డెకాయిట్ అని చంద్రబాబు అన్నారు. పీకే తోకలు కత్తిరిస్తాం. ఆయన ఏమైనా చేయగలడా అని కూడా అన్నారు' అని అంబటి గుర్తు చేశారు.

వైఎస్సార్‌సీపీతో కలిసి పనిచేస్తున్నాం

సీఎం జగన్ ఘనవిజయమే మా లక్ష్యం: ఐ–ప్యాక్

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో ఏడాది నుంచి వైఎస్సార్‌సీపీతో కలిసి పనిచేస్తున్నామని ఐ–ప్యాక్ వెల్లడించింది. 'రాష్ట్రంలో ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపర్చడానికి అనునిత్యం శ్రమిస్తున్న సీఎం వైఎస్ జగన్‌కు మా వంతు తోడ్పాటును అందిస్తాం. 2024 ఎన్నికల్లో సీఎం జగన్ తిరుగులేని విజయం సాధించడానికి కృషి చేస్తాం' అని ఐ–ప్యాక్ శనివారం ఓ ట్వీట్ ద్వారా స్పష్టం చేసింది.

నగర వార్తలు

టైమ్స్ హెల్త్ ఎక్సలెన్స్ అవార్డు



టైమ్స్ గ్రూప్ ఆధ్వర్యంలో సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ సర్వీస్ కేటగిరిలో టైమ్ హెల్త్ ఎక్సలెన్స్ తెలంగాణ - 2023 అవార్డు అందుకుంటున్న అరేటి హాస్పిటల్స్ వైద్యుడు డాక్టర్ ఎ.దినకర్ రెడ్డి

రేపు 'వెంకటయ్య బావి' నవల ఆవిష్కరణ

సాక్షి,సిటీబ్యూరో: నగరంలోని రవీంద్ర భారతిలో ఈనెల 25న సాయంత్రం 6 గంటలకు దాసరి మోహన్ రచించిన వెంకటయ్య బావి నవల ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలంగాణ రచయితల సంఘం జంట నగరాల ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ సంపత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ అధ్యక్షుడు నందిని సిధారెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు తెలిపారు.

ముసారాంబాగ్ బ్రిడ్జిపై ట్రాఫిక్ మళ్లింపు

అంబర్‌పేట: ముసారంబాగ్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టనుండడంతో ట్రాఫిక్ మళ్లింపు చర్యలు చేపట్టారు. ఆదివారం ఉదయం నుంచి బ్రిడ్జి ఒక వైపు నుంచే వాహనాలకు అనుమతి ఇవ్వనున్నట్లు ట్రాఫిక్ అధికారులు శనివారం పేర్కొన్నారు. ముసారాంబాగ్ నుంచి అంబర్‌పేట వైపు వచ్చే వాహనాలు గోల్నాక కొత్త బ్రిడ్జివైపు మళ్లించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

మొదటి రోజే లోకో పబ్‌పై కేసు

బంజారాహిల్స్: తెరిచిన మొదటి రోజే ఓ పబ్‌పై జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. జూబ్లీహిల్స్ రోడ్ నంబరు 36లో గతంలో కెమిస్ట్రీ పబ్ నడిచిన ప్రాంతంలో శుక్రవారం లోకో పేరుతో పబ్ ప్రారంభించారు. అర్ధరాత్రి 1 గంటకు మూసివేయాల్సి ఉండగా అత్యుత్సాహంతో రాత్రి 1.30 గంటల వరకు తెరిచి ఉంచారు. సమయం ముగిసిన తరువాత కూడా పబ్ తెరిచి ఉండటంతో జూబ్లీహిల్స్ పోలీసులు పబ్ మేనేజర్ హరిపై కేసు నమోదు చేశారు.

పోలీసు నినాదం నిలిచింది!

- ఈ ఏడాది స్త్రీలపై 2,356, ఎస్సీ/ఎస్టీలపై 133 నేరాలు
- సైబరాబాద్‌లో మొత్తం 29,156 కేసులు నమోదు
- వీటిలో 63.53 శాతం నేరాల నిరూపణ
- సైబరాబాద్ పోలీసు వార్షిక నివేదిక విడుదల

మహిళలు, బలహీన వర్గాలపై తగ్గిన నేరాలు



వార్షిక నివేదిక విడుదల చేస్తున్న సైబరాబాద్ సీపీ అవినాశ్ మహంతి

సాక్షి, సిటీబ్యూరో: మహిళల భద్రత, రక్షణ తొలి ప్రాధాన్యత అనే పోలీసు నినాదాన్ని ఆచరణలో నిజం చేశారు సైబరాబాద్ పోలీసులు. నేరాల విశ్లేషణ, వేగవంతమైన దర్యాప్తు, సమగ్ర కార్యాచరణ వంటి వాటితో ఈ ఏడాది కమిషనరేట్ పరిధిలో మహిళలపై నేరాలు తగ్గాయి. గతేడాది సైబరాబాద్‌లో స్త్రీలపై 2,489 నేరాలు జరగగా.. ఈ ఏడాది 2,356కు తగ్గాయి. అలాగే బలహీన వర్గాలపై (ఎస్సీ/ఎస్టీ) గతేడాది 158 నేరాలు జరగగా.. ఇప్పుడవి 133కి తగ్గాయి. సైబరాబాద్ పోలీసు వార్షిక నివేదికను కమిషనర్ అవినాశ్ మహంతి శనివారం విడుదల చేశారు.

ఏ నేరాలు ఎన్నంటే..

నేరం	సంఖ్య
హత్యలు	115
దోపిడీలు	130
దొంగతనాలు	2,353
ఇళ్లలో చోరీలు	411
నరహత్యలు	13
అల్లర్లు	5
కిడ్నాప్‌లు	616
అత్యాచారం	259
హత్యాయత్నాలు	116
మోసాలు	6,777

- ఈ ఏడాది సైబరాబాద్‌లో 29,156 కేసులు నమోదయ్యాయి. 63.53 శాతం కేసులు నిరూపితమయ్యాయి. 3,432 మంది నేరస్తులకు న్యాయస్థానం జైలు శిక్షలు విధించింది. వీటిలో జీవితకాలం జైలు శిక్ష పడిన నిందితులు 18 మంది ఉండగా.. 20 ఏళ్లు జైలు నలుగురికి, 10 ఏళ్లు 11 మందికి, ఏడేళ్లు 10 మంది నిందితులు పడ్డాయి. 52 మంది నేరస్తులపై పీడీ యాక్టులు నమోదు చేశారు. ఈ ఏడాది 2,904 ప్రాపర్టీ నేరాలు జరగగా.. బాధితులు రూ.24.90 కోట్లు నష్టపోయారు. వీటిలో 71.95 శాతం అంటే 1,845 కేసులు పరిష్కృతమయ్యాయి. రూ.17.91 కోట్లు రికవరీ జరిగింది.



2,587 మంది పోకిరీల అరెస్టు..

సైబరాబాద్ షీ టీమ్స్ పోలీసులు ఆకతాయిల ఆటకట్టిస్తున్నారు. ఈ ఏడాది కమిషనరేట్ పరిధిలో మహిళలను వేధిస్తున్న 2,587 మంది పోకిరీలను సాక్ష్యాధారాలతో సహా పట్టుకున్నారు. వీరిలో 88 మందిపై ఎఫ్‌ఐఆర్‌లు, 2,580 మందిపై ఈ–పెట్టీ కేసులు నమోదు చేశారు. మరో 3,032 మందికి కౌన్సిలింగ్ ఇచ్చారు. 9 బాల్య వివాహాలను అడ్డుకున్నారు. ఆన్‌లైన్‌లో మహిళలను వేధిస్తున్న పోకిరీలను డెకాయ్ ఆపరేషన్లు చేసి మరీ 11 మందిని అరెస్టు చేసి కటకటాల్లోకి పంపారు.

సైబర్ నేరాలలో రూ.232 కోట్ల నష్టం

- ఈ ఏడాది బాధితులు పోగొట్టుకున్న మొత్తమిదీ..
- సైబరాబాద్‌లో 5,342 సైబర్ కేసులు నమోదు
- 567 మంది డ్రగ్స్ నిందితుల అరెస్టు
- ఇందులో ఇద్దరంటే ఇద్దరే సప్లయర్లు

సాక్షి, సిటీబ్యూరో: ఏటేటా సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. ఈ ఏడాది సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో ఏకంగా రూ.232.34 కోట్లకు పైగానే కొట్టేశారు. మొత్తం 5,342 సైబర్ కేసులు నమోదు కాగా.. 339 మందిని అరెస్టు చేశారు. 168 కేసులు నిరూపితమయ్యాయి. గతేడాది 4,850 కేసులలో బాధితులు రూ.66.66 కోట్లు మాత్రమే నష్టపోగా.. ఈసారి సుమారు మూడింతలు పెరిగింది. ఈ ఏడాది బ్యాంకు ఖాతాలలోని రూ.46 కోట్ల నగదును సీజ్ చేశారు.

డ్రగ్ సప్లయర్లు దొరకట్లే..

మాదక ద్రవ్యాలపై ఉక్కుపాదం మోపుతున్నామని పోలీసులు పదేపదే చెబుతున్నా.. ఆచరణలో మాత్రం ఆమడదూరంలో ఉంది. ఈ ఏడాది సైబరాబాద్‌లో 277 మాదక ద్రవ్యాల కేసులు నమోదయ్యాయి. రూ.27.82 కోట్ల విలువైన డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 567 మంది నిందితులను అరెస్టు చేయగా.. ఇందులో ఇద్దరు మాత్రమే డ్రగ్స్ సరఫరాదారులు, మిగిలిన 550 మంది మధ్యవర్తులు, 15 మంది వినియోగదారులు ఉన్నారు. కేవలం ఇద్దరిపై మాత్రమే పీడీ యాక్ట్ నమోదు చేశారు. ఇక, ఈ ఏడాది 6,676 కిలోల గంజాయి, 13 లీటర్ల హాష్ ఆయిల్, 507 గ్రాముల కొకైన్, 261 గ్రాముల ఎండీఎంఏ, 1,750 గ్రాముల మెథాక్వలోన్, 120 గ్రాముల అల్ప్రాజోలామ్, 26 కిలోల చరాస్ స్వాధీనం చేసుకున్నారు.

ట్రాఫిక్ జరిమానాలు రూ.104 కోట్లు..

సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు జరిమానాలతో వాహనదారులను బెంబేలెత్తిస్తున్నారు. సిగ్నల్ జంప్, ట్రిబుల్ రైడింగ్, అతివేగం వంటి ఇతరత్రా ట్రాఫిక్ ఉల్లంఘనలలో సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు వాహనదారులకు వేసిన జరిమానా అక్షరాల రూ.104 కోట్లపైమాటే. వీటిలో 6,01,396 స్పాట్ చలాన్లు కాగా.. 20,41,388 ఈ–చలాన్లు ఉన్నాయి.

టీఎన్‌జీఓ నగర శాఖ నూతన కార్యవర్గం ఏకగ్రీవం



నాంపల్లి: తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం నగర శాఖకు నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. ఏకగ్రీవంగా ఎన్నికైన ఈ కార్యవర్గం మూడేళ్ళ పాటు కొనసాగుతుందని ఎన్నికల అధికారి టి.రాజీవ్‌చంద్ తెలిపారు. అధ్యక్షుడుగా కె.శ్రీకాంత్, సహాధ్యక్షులుగా ఎం.నాగిరెడ్డి, ఉపాధ్యక్షులుగా బి.బాబు శంకర్, ఎస్.ప్రవీణ్‌కుమార్, డి.ఎన్.మహేష్ గౌడ్, కె.వరలక్ష్మి, కార్యదర్శిగా పి.హరికృష్ణ, సంయుక్త కార్యదర్శులుగా పి.మోహన్ రావు, బి.విజయ్‌కుమార్, జె.అపరంజని, కె.స్వరూప, కోశాధికారిగా సి.అమరేందర్, కార్యనిర్వాహక కార్యదర్శిగా ఎ.రాజు, ప్రచార కార్యదర్శిగా పి.లక్ష్మి నరసింహస్వామి, కార్యవర్గ సభ్యులుగా పి.ప్రభాకర్‌రెడ్డి, బి.అవినాష్, డి.బాలోజి, ఎ.భరణిరాణి ఏకగ్రీవంగా ఎన్నికైన వారిలో ఉన్నారు.

బదిలీ కోసం నిరీక్షణ!

- ఆర్టీఏలో ఏళ్లతరబడి ఒకే చోట పనిచేస్తున్న అధికారులు
- వివిధ విభాగాల్లో పెరుగుతున్న డిమాండ్

సాక్షి, సిటీబ్యూరో: ఆర్టీఏలోని వివిధ విభాగాల్లో ఏళ్ల తరబడి ఎలాంటి బదిలీలకు నోచక ఉన్నచోటే పని చేస్తున్న అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది ఇప్పటికైనా తమకు స్థానచలనం లభించాలని కోరుకుంటున్నారు. చాలాకాలంగా రెగ్యులర్ బదిలీలతో పాటు పదోన్నతులు కూడా నిలిచిపోవడంతో కొత్త సర్కార్ స్పందన కోసం ఎదురు చూస్తున్నారు. జేటీసీలు, డీటీసీలు, డీటీవోలు వంటి ఉన్నతాధికారులు మొదలుకొని ప్రాంతీయ రవాణా అధికారులు, మోటారు వాహన ఇన్‌స్పెక్టర్‌లు, పౌర సేవల విభాగంలో పని చేసే మినిస్టీరియల్ ఉద్యోగుల వరకు చాలామంది ఒకేచోట విధులు నిర్వహిస్తున్నారు. దీంతో కొంతమందికి పదోన్నతులు లభించడం లేదు. మరోవైపు సుమారు 80 మంది ఎంవీఐలు, ఏఎంవీఐలు డిప్యూటేషన్‌పైన వివిధ ప్రాంతాల్లో పని చేస్తున్నట్లు సమాచారం. ప్రాంతీయ రవాణా కేంద్రాల్లో పౌరసేవలను అందజేయవలసిన వాళ్లు చెక్‌పోస్టుల్లో ఉన్నారు. చెక్‌పోస్టుల్లో విధులు నిర్వహించవలసిన వాళ్లు స్టేషన్ డ్యూటీల్లో ఉన్నారు.

ఉదాహరణకు నగరంలోని ఒక డ్రైవింగ్‌ట్రాక్‌లో పని చేసే ఓ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ ఆన్ డెప్యుటేషన్‌పై ఆలంపూర్ చెక్‌పోస్టులో పని చేస్తున్నారు. ఒక్క డ్రైవింగ్ ట్రాక్‌లోనే కాకుండా పలు ప్రాంతీయ రవాణా కార్యాలయాలు, యూనిట్ కేంద్రాల్లోను ఇదే పరిస్థితి. మరోవైపు జిల్లాస్థాయి అధికారులు విధులు నిర్వహించవలసిన చోట కొందరు సీనియర్ ఎంవీఐలే డీటీవో (జిల్లా రవాణా అధికారి)లుగా కొనసాగుతున్నారు.అలాగే ఒకే అధికారి కనీసం రెండు, మూడు చోట్ల ఇంచార్జీగా అదనపు విధులను నిర్వహిస్తున్నారు.

అదనపు కమిషనర్ పోస్టు ఉన్నట్లా లేనట్లా..

రవాణా కమిషనర్ కార్యాలయంలో గతంలో కమిషనర్ 'అదనపు రవాణా కమిషనర్' పోస్టు ఉండేది. రవాణా కమిషనర్ తరువాత అదనపు కమిషనరే కీలకమైన అధికారిగా విధులు నిర్వహించేవారు. రాష్ట్ర విభజన నేపథ్యంలో ఆ పోస్టును ఏపీకి కేటాయించారు.కానీ ఈ పదేళ్లలో కొత్తగా అదనపు రవాణా కమిషనర్ పోస్టును ఏర్పాటు చేయలేదు. దీంతో కొందరు అధికారులు పదోన్నతులు లేకుండా పని చేయవలసి వస్తుంది. అదనపు కమిషనర్‌గా పదోన్నతి పొందవలసిన అధికారి జేటీసీగానే ఉన్నారు. అలాగే జేటీసీలుగా పదోన్నతి పొందవలసిన వాళ్లు డీటీసీలుగానే ఉండిపోయారు.కొత్తగా బాధ్యతలు చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వమైనా 'అదనపు రవాణా కమిషనర్' పోస్టును ఏర్పాటు చేయాలని అధికావర్గాలు కోరుకుంటున్నాయి.

ప్రక్షాళన చేయండి..

ఇలా గతంలో చేపట్టిన ఆన్ డిప్యూటేషన్ బదిలీల కారణంగా నెలకొన్న గందరగోళాన్ని తొలగించేందుకు ఆర్టీఏను పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేయాలని కొంతమంది ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. చాలామంది ఎంవీఐలు చెక్‌పోస్టులను ఎంపిక చేసుకొని వెళ్లడం వల్ల ఆర్టీఓ కేంద్రాల్లో, డ్రైవింగ్ ట్రాక్‌లలో పౌరసేవలను అందజేసేందుకు అధికారుల కొరత ఏర్పడింది. దీంతో ఒకరిద్దరిపైనే ఎక్కువ పనిభారం పడుతోంది. 'కొంతమంది స్వార్థానికి చాలా మంది ఎలాంటి బదిలీలకు, పదోన్నతులకు నోచక దారుణంగా నష్టపోయారు.ఈ ప్రభుత్వమైనా రవాణాశాఖపైన సీరియస్‌గా దృష్టి సారించాలి.' అని ఒక ఎంవీఐ ఆవేదన వ్యక్తం చేశారు.సాధారణంగా ఎంవీఐలు రెండు రకాల విధులను నిర్వహిస్తారు. వాహనదారులకు అందజేసే లెర్నింగ్ లైసెన్సులు, డ్రైవింగ్ లైసెన్సులు, వాహనాల రిజిస్ట్రేషన్‌లు, బదిలీలు వంటి పౌరసేవలతో పాటు రాష్ట్రానికి నలువైపులా సరిహద్దుల్లో ఉన్న చెక్‌పోస్టుల్లో తనిఖీలు నిర్వహిస్తారు. వీటితో పాటు రహదారి భద్రత నిబంధనల అమలు బాధ్యత ఉంటుంది. నిబంధనలు పాటించని వాహనాలపైనా చర్యలు తీసుకొనేందుకు కూడా ఎంవీఐలకు అధికారం ఉంటుంది. ఇలా అనేక రకాల విధులు నిర్వహించేందుకు అవకాశం ఉన్నప్పటికీ కొంతకాలంగా చెక్‌పోస్టులకే ఎక్కువ మంది మొగ్గు చూపడం గమనార్హం.

ఇంజినీరింగ్ విద్యార్థిని ఆత్మహత్య

శంషాబాద్: హాస్టల్ గదిలో ఇంజినీరింగ్ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆర్‌జీఐఏ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ వెంకటేష్ తెలిపిన మేరకు.. ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం నల్లగుంట గ్రామానికి చెందిన రమణారెడ్డి కుమార్తె నిశ్విత (22) శంషాబాద్‌లోని వర్ధమాన్ కళాశాలలో బీటెక్ నాల్గో సంవత్సరం చదువుతోంది. పట్టణంలోని ఆర్‌బీనగర్ శ్రీజ మహిళ హాస్టల్‌లో ఉంటూ శ్రీజ గది తలుపులు వేసుకుని ఉండడంతో హాస్టల్ యజమాన్యం, స్థానికులు పోలీసులకు సమాచారం అందించింది. దీంతో తలుపులు విరగ్గొట్టి లోపలికి వెళ్లారు. అప్పటికే చున్నీతో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఉండడంతో మృతదేహాన్ని కిందికి తీసి పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. ఆత్మహత్యకు ప్రేమవ్యవహారం కారణమని పోలీసులు గుర్తించారు. తన క్లాస్ మెట్ దేవరాజు ప్రేమించి మోసం చేసిన కారణంగా తన కూతురు మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడిందని కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారు.

దివిలో దివ్యంగా క్రిస్మస్ ట్రీ!





బెంగళూరులో దేశంలోనే పెద్దదైన క్రిస్మస్ ట్రీ

ఆకాశం అనే కాన్వాస్ అద్భుత చిత్రాలకు వేదిక. తాజా అద్భుతం విషయానికి వస్తే... అమెరికా అంతరిక్ష పరిశోధన కేంద్రం 'నాసా' ఒక చిత్రాన్ని 'ఎక్స్'లో పోస్ట్ చేసింది. నాసా వారి 'చంద్ర ఎక్స్-రే అబ్జర్వేటరీ' కాప్చర్ చేసిన ఈ ఫోటోలో అంతరిక్షంలో క్రిస్మస్ ట్రీ కనువిందు చేస్తోంది. భూమికి 2,500 కాంతి సంవత్సరాల దూరంలో ఉన్న నక్షత్ర సమూహం తాలూకు ప్రకాశవంతమైన ఆకుపచ్చ రంగు కాంతి క్రిస్మస్ ట్రీ ఆకారంలో దర్శనమిస్తోంది. పాలపుంత లోపల ఉన్న ఈ నక్షత్ర సమూహాన్ని 'ఎన్‌జీసీ 2264' అని పిలుస్తారు.

దేశంలోనే పెద్దదైన క్రిస్మస్ ట్రీ బెంగళూరులో ఉంది. వంద అడుగుల ఎత్తులో ఉన్న ఈ క్రిస్మస్ చెట్టు సత్రీ నగర్‌లోని 'ఫినిక్స్ మాల్ ఆఫ్ ఏషియా' పరిసరాల్లో ఉంది. 'సెంటర్ ఆఫ్ ఎట్రాక్షన్'గా మారింది.

మరో విశేషం ఏమిటంటే మూడుసార్లు గ్రామీ అవార్డ్ గెలుచుకున్న మ్యూజిక్ కంపోజర్ రిక్కీ కేజ్ ఈ ట్రీ గ్రాండ్ ఓపెనింగ్ సెర్మనీ సందర్భంగా లైవ్ మ్యూజిక్ షో చేశాడు.

క్రిస్మస్ ఎనర్జీ



క్రిస్మస్ సెలబ్రేషన్స్‌కు సంబంధించి బాలీవుడ్ సెలబ్స్ సందడి సోషల్ మీడియాలో కనిపిస్తోంది. పాత, కొత్త అనే తేడా లేకుండా తారల క్రిస్మస్ సెలబ్రేషన్స్ ఫోటోలు హల్‌చల్ చేస్తున్నాయి. తారలలో కొందరు తమ క్రిస్మస్ జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటున్నారు. క్రిస్మస్ తన ఫేవరెట్ ఫెస్టివల్ అని చెబుతోంది బాలీవుడ్ కథానాయిక జాక్వెలిన్ ఫెర్నాండెజ్. 'క్రిస్మస్‌కు సంబంధించి బాల్యజ్ఞాపకాలు ఎన్నో ఉన్నాయి. పిల్లలకు బాగా నచ్చే పండగ ఇది. నా క్రిస్మస్ సెలబ్రేషన్స్ ఎక్కువగా బహ్రెయిన్‌లో జరిగాయి. ఎందుకంటే నేను పుట్టి పెరిగింది అక్కడే. చిన్నప్పుడు క్రిస్మస్‌కు ముందురోజు రాత్రి బొమ్మల దుకాణంలో అందమైన బార్బీ బొమ్మను చూశాను. అది నాకు బాగా నచ్చింది. అదేరోజు అర్ధరాత్రి ప్రార్థనల తర్వాత శాంటా క్లాజ్ నుంచి అచ్చం అలాంటి బొమ్మే అందింది. ఓ మై గాడ్, శాంటా ఈజ్ సో కూల్ అనుకున్నాను' అంటూ గత జ్ఞాపకాల్లోకి వెళ్లింది ఫెర్నాండెజ్. 'క్రిస్మస్ ఎనర్జీ' పేరుతో క్రిస్మస్ జ్ఞాపకాల ఫోటోలను సోషల్ మీడియా లో షేర్ చేయడంలో ముందుంటుంది శ్రద్ధా కపూర్.

వైరల్

బుల్లెట్ బాబా టెంపుల్

మన దేశంలో జాతీయ రహదారుల పక్కన ఆలయాలు కనిపిస్తుంటాయి. అయితే జోధ్‌పూర్-అహ్మదాబాద్ జాతీయ రహదారి పక్కన ఉన్న ఆలయం మాత్రం ఆసక్తికరం. ఆదిత్య కొంద్వార్ అనే



రచయిత ఈ ఆలయానికి సంబంధించి విషయాలను 'ఎక్స్'లో షేర్ చేశాడు. చాలా సంవత్సరాల క్రితం...'బుల్లెట్ బాబా' గా పిలుచుకొనే ఓమ్ సింగ్ రాథోడ్ నడుపుతున్న రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్ అదుపు తప్పి చెట్టును ఢీ కొట్టడంతో ఆయన అక్కడికక్కడే చనిపోయాడు. బైక్‌ను పోలీస్‌స్టేషన్‌లో పెట్టారు. అయితే మరుసటి రోజు ఈ బైక్ కనిపించలేదు. అందరూ ఆశ్చర్యపోయేలా ప్రమాదం జరిగిన స్థలంలో కనిపించింది. దీంతో స్థానికులు ఈ 'బుల్లెట్ బైక్'కు పూజలు చేయడం మొదలుపెట్టారు. తరువాత ఒక ఆలయాన్ని కట్టి ఈ బుల్లెట్ బైక్‌ను విగ్రహంలా ప్రతిష్ఠించారు. కాలక్రమంలో ఇది 'బుల్లెట్ బాబా టెంపుల్'గా ప్రసిద్ధి పొందింది. రోడ్డుపై ప్రయాణం చేసేవారు ఈ ఆలయం దగ్గర ఆగి 'ఎలాంటి ప్రమాదం జరగకూడదు' అని మొక్కుకుంటూ వెళుతుంటారు.

చాయ్ సుట్ట సహృదయం

ప్రముఖ చాయ్ కంపెనీ 'చాయ్ సుట్ట' పెయిడ్ మెనుస్ట్రుయేషన్ లీవ్‌ను అమలు చేస్తోంది. ఈ సెలవు గురించి కంపెనీ ఫౌండర్ అనుభవ్ దూబే మహిళా ఉద్యోగులతో నిర్వహించిన చర్చా కార్యక్రమం తాలూకు విషయాలు ఇంటర్‌నెట్‌లో వైరల్ అయ్యాయి. చర్చలో పాల్గొన్న వారి నుంచి భిన్నమైన అభిప్రాయాలు వినిపించాయి. కొందరు 'సెలవు అనివార్యం కాదు' అన్నట్లుగా మాట్లాడారు. 'ఆ రోజుల్లో అసౌకర్యంగా ఉంటుంది కాబట్టి సెలవు తప్పనిసరి' అని కొందరు మాట్లాడారు. చర్చ మొత్తాన్ని దృష్టిలో పెట్టుకొని ఇండోర్‌కు చెందిన ఎంటర్‌ప్రెన్యూర్, చాయ్ సుట్ట ఫౌండర్ అనుభవ్ దూబే లింక్డ్‌ఇన్‌లో ఇలా రాశారు... 'భిన్నమైన అభిప్రాయాలు వ్యక్తం అయినప్పటికీ ఆరోగ్యకరమైన చర్చ నడిచింది. మెనుస్ట్రువల్ లీవ్ ఇవ్వాలి అనుకోవడం కఠినమైన నిర్ణయం కాదు. కొన్ని విషయాలను స్త్రీలు మాత్రమే అర్థం చేసుకోగలరు'





దయాగుణ సంపన్నుడు

పేదింటి భార్యాభర్తలు, వారి ముగ్గురు పిల్లలు ఆకలితో ఉన్నారు. 'పిల్లలు ఆకలితో ఉన్నారు. మా దగ్గర డబ్బులు లేవు. సహాయం చేయండి' అని ఆశిష్ అనే యువకుడిని అడిగారు ఆ దంపతులు. పదో పరకో వారి చేతిలో పెట్టి తన దారిని తాను వెళ్లిపోలేదు ఆశిష్. దగ్గరలో ఉన్న రెస్టారెంట్‌కు తీసుకువెళ్లి వారు కోరిన పదార్థాలు తినిపించాడు. ఆ తరువాత వారిని ఆటో ఎక్కించి డ్రైవర్‌కు తానే డబ్బులు ఇచ్చాడు.

ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన ఈ వీడియోకు సోషల్ మీడియా యూజర్‌ల నుంచి భారీ స్పందన లభించింది. పోస్ట్ చేసిన రెండు రోజుల్లోనే పదిలక్షలకు పైగా వ్యూస్ వచ్చాయి.

'ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం అంటే వారి ఆకలి తీర్చడం మాత్రమే కాదు మీ ప్రయాణంలో మీరు ఒంటరి వారు కాదు అని ధైర్యం చెప్పడం కూడా' అని రాశాడు ఆశిష్. 'దయాగుణానికి ఉన్న గొప్పదనం ఏమిటంటే వినికిడి శక్తి లేని వారు కూడా వినగలరు. కంటిచూపు లేని వారు కూడా చూడగలరు. దయాగుణాన్ని మించిన సంపద లేదు' అని ఒక యూజర్ రాశాడు.

● ముగ్గు ముచ్చట



బలుపాల సునిత సుధాకర్
పెబ్బేరు గ్రామం, వనపర్తి జిల్లా

21 చుక్కలు, 11 వరకు, మధ్య చుక్క







పల్లిపాటి గాయత్రి
బాలాయపల్లి
తిరుపతి జిల్లా

19 చుక్కలు,
3 వరకు,
సరి చుక్క
3 వచ్చేవరకు

ముగ్గులకు ఆహ్వానం

ముగ్గులు పంపవలసిన చిరునామా: ముగ్గు-ముచ్చట, సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్, రోడ్ నెం.1, బంజారాహిల్స్, హైదరాబాద్-34. ఈ మెయిల్: muggulu.sakshi@gmail.com

హెల్త్

కాలితో పోలిస్తే... చేయి అన్ని దిశల్లోనూ ఎటుపడితే అటు కదిలేలా గుండ్రంగా తిరిగేలా, అనేక విధాలుగా పని చేయగలిగేలా ఉంటుంది. ఈ పనులన్నింటినీ చేసేందుకు వీలుగా భుజం దగ్గర ముంజేతి చివరి 'బంతి' వంటి భాగం... ఒక సాకెట్ (గిన్నె)లో అమరి, చేయి అన్ని దిశల్లోనూ ఫ్రీగా తిరిగేలా ఉంటుంది. భుజం కీలు ప్రాంతంలో ఏదైనా సమస్య వస్తే... తుంటి ఎముక ఆపరేషన్ మాదిరిగానే ఇక్కడా 'రీప్లేస్‌మెంట్' శస్త్రచికిత్స చేస్తారు. కొంతకాలం కిందట అందుబాటులోకి వచ్చిన 'రివర్స్ షోల్డర్ రీప్లేస్‌మెంట్ సర్జరీ' అనే సరికొత్త ప్రక్రియ వల్ల గతంతో పోలిస్తే ఇప్పుడు ఈ తరహా శస్త్రచికిత్సలు మరింత సమర్థంగా, మరింత ఉపయోగకరంగా చేయడం సాధ్యమవుతోంది. 'రివర్స్ షోల్డర్ రీప్లేస్‌మెంట్' శస్త్రచికిత్సపై అవగాహన కోసం ఈ కథనం.



రివర్స్ షోల్డర్ రీప్లేస్‌మెంట్ అంటే..?

తుంటి ఎముకలో ఉండే గిన్నె (సాకెట్) వంటి భాగంలో తొడ ఎముక చివరన ఉండే బంతి (బాల్) వంటి భాగం చక్కగా అమరినట్టే భుజంలోనూ ఇలాంటి అమరికే ఉంటుంది. భుజం శస్త్రచికిత్సతో పోలిస్తే తుంటిఎముక ఆపరేషన్ (హిప్ రీప్లేస్‌మెంట్ సర్జరీ) గురించి ప్రజల్లో కొంత ఎక్కువే అవగాహన ఉంది. కానీ భుజం దగ్గర కీళ్ల రీప్లేస్‌మెంట్‌పై అవగాహన తుంటితో పోలిస్తే తక్కువే.

భుజం దగ్గర కీలు నిర్మాణం ఇలా...

మన ముంజేయిలో కీలకమైన ఎముక ఉంటుంది. దీన్ని 'హ్యూమరస్' అంటారు. దీని చివర్న భుజం కీలు భాగంలో ఓ బంతిలాంటి నిర్మాణం ఉంటుంది. వీపు భాగంలో చూసినప్పుడు ఒక గొడ్డలి చివరన 'బ్లేడ్' మాదిరిగా కనిపించే ఎముక... చర్మం లోపలి నుంచి కనిపిస్తూ ఉంటుంది. దీన్ని 'స్కాప్యులా' అంటారు. ఈ స్కాప్యులాలో ఉండే 'గిన్నె' (సాకెట్) వంటి ఖాళీ ప్రదేశంలో... ముంజేతి ఎముక (హ్యూమరస్) చివరన ఉండే బంతిలాంటి నిర్మాణం చక్కగా ఇమిడిపోయి... చేయి ఎటుపడితే అటు, ఎలా పడితే అలా కదిలేలా అమరి ఉంటుంది. సంక్లిష్టమైన ఈ బంతిగిన్నె కీలు చుట్టూరా కీలకమైన కండరాలు, టెండన్లు, లిగమెంట్లు, ఎముక చివరన మెత్తగా ఉండే 'కార్టిలేజ్' (మృదులాస్థి)... ఇవన్నీ ఉండి... చేతి కదలికలకు దోహదపడుతుంటాయి.



టోటల్ షోల్డర్ రీప్లేస్‌మెంట్



రివర్స్ షోల్డర్ రీప్లేస్‌మెంట్

భుజం కీలు మార్పిడి చికిత్స ఎప్పుడు... ఎందుకు?

రోడ్డు ప్రమాదాల వంటి ఏవైనా ప్రమాదాల్లో క్షతగాత్రులకు చేతికి, భుజానికి గాయాలైనప్పుడు, క్రీడల్లో ఆటగాళ్లు గాయపడినప్పుడు, ఆర్థరైటిస్ బాధితుల్లో ఎముకలు అరుగుదల, కొందరిలో పటుత్వం తగ్గి ఎముక విరగడం, మృదులాస్థి బాగా అరిగి ఎముకల రాపిడితో నొప్పి తెలియడం... ఇలాంటి ఎన్నో సందర్భాల్లో...

తుంటి ఎముక మార్పిడి లాగే... అవసరాన్ని బట్టి భుజం దగ్గరి బ్లేడులోని గిన్నె (స్కాప్యులా)కు బదులు కృత్రిమ గిన్నెనూ... ముంజేయి చివరన ఉండే హ్యూమరస్ 'బంతి'కి బదులు కృత్రిమ బంతిని అమర్చుతారు. ఇలా బయట నుంచి అమర్చే భాగాల్ని 'ప్రోస్థెసిస్' అంటారు. ఈ శస్త్రచికిత్సలో ఎప్పటిలాగే గిన్నెలో బంతి లోపలివైపునకు చక్కగా అమరేలా చేస్తారు. ఇలా గిన్నెలో బంతి లోపలి వైపునకు ఉండేలా చేసేదే సంప్రదాయ పద్ధతిలో చేసే స్టాండర్డ్ శస్త్రచికిత్స.

'రివర్స్ షోల్డర్ రీప్లేస్‌మెంట్' అంటే ఏమిటి?

హ్యూమరస్ చివరన ఉండే బంతి వంటి నిర్మాణం లోపలి వైపునకు కాకుండా 'రివర్స్'లో బయటకు కనిపించేలా 'అమర్చి' చేసే శస్త్రచికిత్సనే 'రివర్స్ షోల్డర్ రీప్లేస్‌మెంట్' శస్త్రచికిత్స అంటారు. ఎక్స్-రేలో చూసినప్పుడు ఇలాంటి శస్త్రచికిత్స చేసిన వారిలో బంతి వంటి నిర్మాణం బయటకు కనిపిస్తుంటుంది. ఇలాంటి 'రివర్స్ షోల్డర్ రీప్లేస్‌మెంట్ శస్త్రచికిత్స'ను మొట్టమొదటిసారిగా 1980లో నిర్వహించారు. అయితే దీనికి ఉన్న ప్రయోజనాల దృష్ట్యా ఇప్పుడిది ప్రాచుర్యంలోకి వస్తోంది.

'రివర్స్ రీప్లేస్‌మెంట్' శస్త్రచికిత్స ఎందుకంటే...

వయసు గడుస్తున్న కొద్దీ ఎముకల సాంద్రత (డెన్సిటీ) తగ్గుతూ ఎముకల్లో బలం తగ్గడం మామూలే. పైగా ఆర్థరైటిస్‌తో బాధపడేవారిలో ఎముకలు పెళుసుబారడం, తేలిగ్గా విరగడం కూడా పరిపాటి. ఇదొక్కటే కాదు... సంక్లిష్టమైన భుజం కీలు దగ్గర 'రొటేటర్ కఫ్' అనే అత్యంత కీలకమైన కండరాలు భుజం కదలికలకు దోహదపడుతూ ఉంటాయి. ఈ 'రొటేటర్ కఫ్' కండరాలు ఏమాత్రం గాయపడ్డా భుజం కదలికలే మందగిస్తాయి. దాంతో చేతితో చేసే పనులన్నింటికీ తీవ్రమైన అంతరాయం కలుగుతుంది. 'రివర్స్ రీప్లేస్‌మెంట్' శస్త్రచికిత్సలో బంతి బయటకు ఉంచడం ద్వారా కీలకమైన ఈ 'రొటేటర్ కఫ్' కండరాల కదలికలకు ఏమాత్రం అంతరాయం కలిగించని విధంగా శస్త్రచికిత్సకులు అమర్చుతారు. సంప్రదాయ శస్త్రచికిత్సలో నొప్పి తీవ్రత, దాంతో భుజం కదలికలు మందగించడం వంటి సమస్యలకు అవకాశాలుంటాయి. కానీ... ఈ రివర్స్ రీప్లేస్‌మెంట్‌లో రొటేటర్ కఫ్ కండరాలకు ఇబ్బంది కలగకపోవడంతో నొప్పి తీవ్రత బాగా తగ్గిపోతుంది. అంతేకాదు... ఆ కండరాల కదలికలు సజావుగా ఉండటంతో సంప్రదాయ శస్త్రచికిత్సతో పోలిస్తే మరింత మెరుగైన ఫలితాలు ఉంటాయి.

శస్త్రచికిత్స తర్వాత ఫిజియో వ్యాయామాలు అవసరం...

అటు తర్వాత క్రమంగా ఫిజియోథెరపీ సహాయంతో చేతిని కదిలించడం, తగిన వ్యాయామాలు చేయించడం అవసరమవుతుంది. క్రమంగా 2 - 3 నెలల్లో చేతి కదలికలు సాధారణ స్థాయికి వస్తాయి. రివర్స్ రీప్లేస్‌మెంట్ చికిత్స నిర్వహించిన పేషెంట్లలో దాదాపు 90% మందిలో సంప్రదాయ శస్త్రచికిత్స కంటే మెరుగైన ఫలితాలు కనిపించాయని డాక్టర్లు చెబుతున్నారు. అంతేకాదు... ఈ తరహా సర్జరీలో నొప్పి గణనీయంగా తగ్గడమే కాకుండా... సత్ఫలితాల కాల వ్యవధి సంప్రదాయ చికిత్స కంటే ఎక్కువ కాలం పాటు (దాదాపు 10 ఏళ్లు) కనిపిస్తున్నాయన్నది డాక్టర్ల మాట. అయితే సంప్రదాయ చికిత్స కంటే 'రివర్స్ రీప్లేస్‌మెంట్' శస్త్ర చికిత్సకు అయ్యే ఖర్చు ఒకింత ఎక్కువే.

శస్త్రచికిత్స ప్రక్రియ ఇలా...

సంప్రదాయ శస్త్రచికిత్సతో పోలిస్తే ఒకింత క్లిష్టమైన ఈ ప్రక్రియకు దాదాపు 90 నుంచి 120 నిమిషాల సమయం పడుతుంది. దీన్ని 'జనరల్ అనస్థీషియా' (సాధారణంగా శస్త్రచికిత్స సమయాల్లో ఇచ్చే మత్తు) ఇచ్చి నిర్వహిస్తారు. దీన్ని భుజం ముందు భాగంలో గాటు పెట్టి నిర్వహిస్తూ... అరిగిన లేదా గాయపడ్డ భాగం బయటపడగానే ఆ ప్రాంతాల్లో అరిగిన భాగాలను జాగ్రత్తగా తొలగించి, వాటిని కృత్రిమ కీళ్ల (ప్రోస్థెసిస్)తో భర్తీ చేస్తారు.



డా॥ సునీల్ అప్పింగీ
సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్

శారీరకంగా వ్యక్తమయ్యే మానసిక సమస్యలు!

కొన్ని మానసిక సమస్యలు శారీరక లక్షణాలతో వ్యక్తమవుతాయి. ఇక్కడ గుర్తుపెట్టుకోవాల్సింది ఏమిటంటే... ప్రతి శారీరక లక్షణమూ మానసిక సమస్య కారణంగా కాకపోవచ్చు. కానీ ఒక అంచనా ప్రకారం ఔట్ పేషెంట్ విభాగానికి వచ్చే బాధితుల్లో 15 శాతం మందికి అవి మానసిక సమస్యలతో వచ్చిన లక్షణాలు కావచ్చేమోనని వైద్యవర్గాల గణాంకాలు పేర్కొంటున్నాయి. మానసిక సమస్యలు ఇలా శారీరక లక్షణాలతో ఎందుకు కనిపిస్తాయి, అనేకసార్లు చికిత్స తీసుకున్న తర్వాత కూడా పదే పదే లక్షణాలు కనిపిస్తుంటే కొన్నిసార్లు అది మానసికమైన కారణాల వల్ల కావచ్చేమోనని ఎలా అంచనా వేయవచ్చు లాంటి అనేక అంశాలపై అవగాహన కోసం ఈ కథనం.



మానసిక సమస్యలు అనేక శారీరక వ్యవస్థలపై తమ ప్రభావాలను చూపవచ్చు. మానసిక సమస్యల కారణంగా కొన్ని దేహ వ్యవస్థల్లో కనిపించే లక్షణాలెలా ఉంటాయో చూద్దాం.

జీర్ణవ్యవస్థ పైన...

గట్ ఫీలింగ్ అనే మాటను చాలామంది ఉపయోగిస్తుంటారు. ఫీలింగ్స్ మనసుకు సంబంధించిన భావన కదా... మరి జీర్ణవ్యవస్థ అయిన శారీరకమైన అంశంతో దాన్ని ముడిపెట్టడం ఎందుకు అని అనిపించవచ్చు. ఒక చిన్న పరిశీలనతో దీన్ని తెలుసుకోవచ్చు. 'సెరిటోనిన్' అనే స్రావం మానసిక ఉద్వేగాలకు కారణమవుతుంది. నిజానికి మానసిక అంశాలకోసం స్రవించడం కంటే... సెరిటోనిన్ అనేది జీర్ణవ్యవస్థలోనే ఎక్కువగా కనిపిస్తుంటుంది. ఆందోళన, వ్యాకులత జీర్ణవ్యవస్థలో మార్పులకు దారితీస్తాయి. దాంతో ఎసిడిటీ, కడుపునొప్పి, కడుపు ఉబ్బరం, విరేచనాలు, మలబద్ధకం, ఇరిటబుల్ బవెల్ సిండ్రోమ్, ఆకలి వేయకపోవడం, వెంటనే మల విసర్జనకు వెళ్లాల్సి రావడం వంటి లక్షణాలు కనిపిస్తాయి.

రక్తప్రసరణ వ్యవస్థపై...

మనసుకు తీవ్రమైన దుఃఖం కలిగినప్పుడు అది గుండె, రక్తప్రసరణ వ్యవస్థ ప్రభావితం చేస్తుంది. తీవ్రమైన దుఃఖం, ఉద్వేగాలు కొందరిలో గుండెజబ్బులకు దారితీస్తాయి. ఒకసారి గుండెపోటు వచ్చినవారిలో మానసిక సమస్యలు ఉంటే అది మళ్లీ వచ్చేందుకు అవకాశాలు ఎక్కువ. మానసిక ఒత్తిడి కలిగినప్పుడు రక్తపోటులోనూ తేడాలు రావడం తెలిసిన విషయమే.

ఒళ్లునొప్పులు...

మానసిక సమస్యలు కొన్నిసార్లు ఒళ్లు నొప్పులు, కండరాల నొప్పుల రూపంలోనే వ్యక్తమవుతుంటాయి. మానసిక సమస్యలకూ, ఒంటినొప్పులకూ సంబంధమేమిటనే కోణంలో పరిశీలించినప్పుడు కొన్ని అంశాలు అబ్బురపరుస్తాయి. ఉదాహరణకు సెరిటోనిన్, అడ్రినలిన్ వంటి రసాయన స్రావాలు మానసిక సమతౌల్యతకు దోహదపడుతుంటాయి. ఈ రసాయనాలను 'కెమికల్ గేట్స్'గా పరిగణిస్తారు. గేట్ అనేది అనవసరమైన వాటిని రాకుండా నిరోధించడం కోసం అన్నది తెలిసిందే. అలాగే ఈ రసాయన గేట్స్... అనవసరమైన అనేక సెన్సేషన్స్‌ను నివారించి, అవసరమైన వాటినే మెదడుకు చేరవేసేలా చూస్తాయి. కానీ డిప్రెషన్ వంటి మానసిక సమస్యలు ఉన్నప్పుడు సెరిటోనిన్ వంటి ఈ ద్రవాలు తగ్గడంతో కెమికల్ గేట్స్ తమ కార్యకలాపాలను నిర్వహించలేవు. ఫలితంగా అవసరమైనవే కాకుండా అనవసరమైన సెన్సేషన్‌లు కూడా ఫిల్టర్ కాకుండా మెదడుకు చేరతాయి. దాంతో డిప్రెషన్ వంటి సమస్యలున్నప్పుడు... కొద్దిపాటి నొప్పి కూడా చాలా తీవ్రంగా ఉన్నట్లు తోచవచ్చు. చిన్న నొప్పి కూడా చాలా ఎక్కువగా అనిపించవచ్చు. ఇలాంటి ఈ పరిణామాన్నే 'అన్ ఎక్స్‌ప్లెయిన్‌డ్ పెయిన్ సిండ్రోమ్' అని అంటారు. ఇలాంటప్పుడు దీర్ఘకాలిక వెన్నునొప్పి (క్రానిక్ బ్యాక్ పెయిన్), శరీరంలోని అనేక భాగాల్లో నొప్పులు, మెడనొప్పి, కండరాల నొప్పి వంటివి కలిగే అవకాశముంది.

మానసిక సమస్యలు శారీరక లక్షణాలతో వ్యక్తమయ్యేదెందుకు?

మన సమాజంలో మానసిన సమస్యలను బయటకు చెప్పుకోలేని సమస్య (స్టిగ్మా)గా చూస్తుంటారు. మానసిక సమస్య అని చెప్పుకోవడం కష్టం కాబట్టి... మనసు వాటిని శారీరక లక్షణాలుగా మార్చి వ్యక్తం చేస్తుంటుంది. అయితే ఇది కాన్షియస్‌గా జరిగే ప్రక్రియ కాదు. బాధితులకూ / పేషెంట్లకూ ఇలా జరుగుతుందని తెలియదు. అధిక ఒత్తిడి వంటి కొన్ని మానసిక సమస్యలు ఉన్నప్పుడు రోగనిరోధక వ్యవస్థ పనితీరూ తగ్గి అది శారీరక లక్షణాలుగా వ్యక్తమవుతుంది. అందుకే పరీక్షల సమయంలో లేదా పరీక్షలకు ముందు పిల్లల్లో / పెద్దల్లోనూ జ్వరాలు, జీర్ణ సమస్యలు, తలనొప్పి, కడుపునొప్పి, నిద్రలేమి... వంటి సమస్యలు కనిపిస్తుంటాయి.

ఇక్కడ ఒక విషయం గుర్తుపెట్టుకోవాలి. శరీరానికి లాగే మనసుకూ జబ్బు వచ్చే అవకాశముందని గుర్తించి, అది ఏమాత్రం తప్పు కాదని గ్రహించి, తగిన మందులు తీసుకుంటే... ఈ సమస్యలు రావడం తగ్గిపోయి, మాటిమాటికీ డాక్టర్ షాపింగ్ చేస్తూ, డబ్బు, ఆరోగ్యం వృథా చేసుకునే అవస్థలూ తగ్గుతాయి.



డా॥ శ్రీనివాస్ ఎస్‌ఆర్‌ఆర్‌వై.
సీనియర్ సైకియాట్రిస్ట్

మెడి టిప్

చిన్నపిల్లల్లో చుండ్రు నివారణకు...



చిన్నపిల్లల్లో చుండ్రు రావడం కాస్త తక్కువే అయినా అప్పుడప్పుడు కనిపిస్తుండటం మామూలే. దీని నివారణకు పాటించాల్సిన జాగ్రత్తలివి... ● పిల్లలకు వారానికి 3-4సార్లు తలస్నానం చేయించాలి. ● తలకు తేమనిచ్చే ఆయిల్స్, లోషన్స్ వంటివి అప్లై చేస్తుండాలి. ఒకసారి పొట్టు రాలడం తగ్గిన తర్వాత హెయిర్ ఆయిల్స్, లోషన్స్ వాడుతూ మాటిమాటికీ మాడు పొడిబారకుండా చూసుకోవాలి. ● అన్ని విటమిన్లతో పాటు ప్రత్యేకంగా విటమిన్ బీ కాంప్లెక్స్ లభ్యమయ్యే ఆహారాలు తీసుకోవాలి. అందులో జింక్ మోతాదులు ఎక్కువ ఉండటం మరింత మేలు చేస్తుంది. ● ఒకసారి డాక్టర్ సలహా తీసుకుని కెటకెనజోల్, సాల్సిలిక్ యాసిడ్, జింక్ ఉన్న షాంపూలను వారానికి 2-3 సార్లు... అలా 4-6 వారాలపాటు వాడాల్సి ఉంటుంది. ● అప్పటికీ తగ్గకపోతే డాక్టర్‌ను సంప్రదించి తగిన మందులతో పాటు ఈ సమస్య చాలా తీవ్రంగా ఉన్నప్పుడు కొన్నిసార్లు సీబమ్ సెక్రిషన్స్ తగ్గించే మందుల్ని కూడా వాడాల్సి రావచ్చు.



నేటినుంచి 'అల్టిమేట్ ఖోఖో' లీగ్

రెండో సీజన్ 'అల్టిమేట్ ఖోఖో' లీగ్‌కు రంగం సిద్ధమైంది. కటక్‌లోని జవహర్ లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడియంలో నేడు ప్రారంభమయ్యే ఈ టోర్నీ జనవరి 13 వరకు సాగుతుంది. మొత్తం ఆరు జట్లు ట్రోఫీ కోసం తలపడుతున్నాయి. డిఫెండింగ్ చాంపియన్ ఒడిశా జాగర్‌నట్స్, రాజస్తాన్ వారియర్స్ మధ్య జరిగే మ్యాచ్‌తో లీగ్ మొదలవుతుంది. నేడు జరిగే తర్వాతి మ్యాచ్‌లో ముంబై ఖిలాడీస్‌తో తెలుగు యోధాస్ టీమ్ తలపడుతుంది. గుజరాత్ జెయింట్స్, చెన్నై క్విక్ గన్స్ టోర్నమెంట్ బరిలో ఉన్న మరో రెండు జట్లు. 21 రోజుల వ్యవధిలో మొత్తం 30 మ్యాచ్‌లు జరుగుతాయి. జీఎంఆర్ గ్రూప్ యాజమాన్యానికి చెందిన తెలుగు యోధాస్ టీమ్ గత ఏడాది రన్నరప్‌గా నిలవగా... ఈ సారి టైటిల్ సాధిస్తామని యోధాస్ కెప్టెన్ ప్రతీక్ వైకర్ విశ్వాసం వ్యక్తం చేశాడు. భారత ఖోఖో సమాఖ్య గత ఏడాది ఈ టోర్నమెంట్‌ను విజయవంతంగా నిర్వహించడంతో ఈ సీజన్ కోసం అభిమానుల్లో మరింత ఆసక్తి పెరిగింది. గత ఏడాది టీవీ, ఓటీటీలో కలిపి 164 మిలియన్ల మంది ప్రేక్షకులు టోర్నీని తిలకించారు. 'సోనీ నెట్‌వర్క్'లో మ్యాచ్‌లు ప్రసారం అవుతాయి.

'సెంచూరియన్' పేసర్లకు అనుకూలం!

తొలి రోజు మ్యాచ్‌కు వాన గండం



సెంచూరియన్: భారత్, దక్షిణాఫ్రికా మధ్య జరిగే తొలి టెస్టు పేస్ బౌలింగ్‌కు బాగా అనుకూలించే అవకాశం ఉంది. ఈ నెల 26నుంచి మ్యాచ్ జరిగే సూపర్ స్పోర్ట్ పార్క్ పిచ్ పేసర్లకు బాగా కలిసొస్తుందని పిచ్ క్యురేటర్ బ్రయాన్ బ్లాయ్ స్వయంగా వెల్లడించాడు. వాతావరణ శాఖ అంచనా ప్రకారం ఈ టెస్టుకు వాన అంతరాయం కలిగించవచ్చు. మ్యాచ్ మొదటి రోజు పూర్తిగా వాన బారిన పడవచ్చని సమాచారం. ఈ నేపథ్యంలో పిచ్‌పై క్యురేటర్ చేసిన వ్యాఖ్యలు ఆసక్తికరంగా మారాయి. 'మొదటి రోజు గనుక ఆట వాన బారినపడితే తర్వాతి రోజుల్లో పేసర్లకు మంచి అవకాశముంది. పిచ్‌పై కవర్లు ఎక్కువ సమయం ఉంచిన తర్వాత ముందుగా బ్యాటింగ్ చేయడం చాలా కఠినంగా మారిపోతుంది. దాదాపు 20 డిగ్రీలకు పడిపోయే చల్లటి వాతావరణంలో పేస్ బౌలర్లకే మేలు జరుగుతుంది. ఆపై కూడా మ్యాచ్‌లో స్పిన్నర్ల పాత్ర నామమాత్రంగా మారిపోతుంది. పిచ్‌పై ప్రస్తుతం పచ్చిక ఉంది. మ్యాచ్ సమయానికి కూడా దీనిని కొనసాగిస్తాం. నాలుగు రోజుల్లోనే టెస్టు ముగిసినా ఆశ్చర్యం లేదు' అని బ్లాయ్ వ్యాఖ్యానించాడు. 2021 సిరీస్‌లో సెంచూరియన్‌లోనే జరిగిన టెస్టులో భారత్ విజయం సాధించింది.

నేనూ 'పద్మశ్రీ' వెనక్కి ఇచ్చేస్తా

బధిర రెజ్లర్ వీరేందర్ సింగ్ ప్రకటన



న్యూఢిల్లీ: భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్‌ఐ) ఎన్నికల ఫలితాలపై నిరసనగా తీవ్రమైన నిర్ణయాలు తీసుకుంటున్న స్టార్ రెజ్లర్లకు బధిర రెజ్లర్ వీరేందర్ సింగ్ కూడా బాసటగా నిలిచాడు. తనకు లభించిన పౌరపురస్కారం 'పద్మశ్రీ'ని తిరిగి ప్రభుత్వానికి ఇచ్చేస్తానని ప్రకటించాడు. డెఫ్ ఒలింపిక్స్ (బధిర ఒలింపిక్స్)లో స్వర్ణ విజేతగా నిలిచిన వీరేందర్ 'గుంగా పహిల్వాన్'గా గుర్తింపు తెచ్చుకున్నాడు. 'భారత మానస పుత్రిక, నా సోదరి సాక్షి మలిక్ కోసం నేను నా 'పద్మ' పురస్కారాన్ని తిరిగి ఇచ్చేస్తా. గౌరవ ప్రధాని నరేంద్ర మోదీజీ... సాక్షిని చూసి నేనెంతో గర్వపడుతున్నాను. దేశంలోని దిగ్గజ క్రీడాకారులంతా దీనిపై స్పందించాలని నేను కోరుకుంటున్నాను' అని సోషల్ మీడియా 'ఎక్స్'లో వీరేందర్ ట్వీట్ చేశాడు. మరో వైపు డబ్ల్యూఎఫ్‌ఐ ఎన్నికల ఫలితాలు, తదుపరి స్టార్ రెజ్లర్ల నిరసన నిర్ణయాలపై స్పందించేందుకు కేంద్ర క్రీడాశాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్ నిరాకరించారు. బెంగళూరులోని 'సాయ్' సెంటర్‌లో ఆసియా క్రీడల్లో పతకాలు గెలిచిన అథ్లెట్లను అభినందించే కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ 'దీనిపై నేను ఇదివరకే చెప్పాల్సింది చెప్పా. ఇకపై ఎలాంటి వ్యాఖ్యలు చేయను' అని ఠాకూర్ అన్నారు.

'పాక్‌లో డేవిస్ కప్ ఆడాల్సిందే'

'ఐటా'కు స్పష్టం చేసిన ఐటీఎఫ్

న్యూఢిల్లీ: పాకిస్తాన్‌లో డేవిస్ కప్ పోరును మార్చే విషయంలో అఖిల భారత టెన్నిస్ సంఘం (ఐటా)కు ఎదురు దెబ్బ తగిలింది. పాక్ గడ్డపై డేవిస్ కప్ వరల్డ్ గ్రూప్–1 ప్లేఆఫ్ 'టై' పోటీలు ఆడాల్సిందేనని అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) శనివారం స్పష్టం చేసింది. పాక్‌లో కాకుండా మరో తటస్థ వేదికపై ఆడేందుకు అనుమతించాలని 'ఐటా' గతంలో అప్పీలు చేసుకుంది. దీన్ని విచారించిన ఐటీఎఫ్ ట్రిబ్యునల్ గురువారం తమ నిర్ణయాన్ని వెలువరించింది. 15 మంది సభ్యులు గల డేవిస్ కప్ కమిటీ (డీసీసీ) 'ఐటా' అప్పీల్‌ను తోసిపుచ్చింది. 'పాకిస్తాన్‌లో డేవిస్ కప్ టై పోటీలు నిర్వహించాలనే డీసీసీ నిర్ణయానికి బలమైన ఆధారాలున్నాయి. డీసీసీ ఎంపిక చేసిన వేదికపై ఆడటం అన్ని దేశాలకు వర్తిస్తుంది' అని ట్రిబ్యునల్ వెల్లడించినట్లు పాకిస్తాన్ తెలిపింది. పాక్‌లో డేవిస్ కప్ పోటీలు విజయవంతంగా జరిగాయని, అలాంటపుడు భారత్ అక్కడ ఆడటానికి విముఖత చూపడం అర్థరహితమని డీసీసీ అభిప్రాయపడింది. 'భద్రత ఏర్పాట్లు ఆతిథ్య దేశం చూసుకుంటుంది. కట్టుదిట్టమైన భద్రత కల్పిస్తున్నప్పుడు తప్పించుకోవాలనుకోవడం సబబు కాదు' అని డీసీసీ వర్గాలు తెలిపాయి. దీనిపై 'ఐటా' ప్రధాన కార్యదర్శి అనిల్ ధూపర్ స్పందిస్తూ 'క్రీడాశాఖతో ఈ విషయంపై చర్చిస్తాం. ఆ తర్వాతే జట్టును పంపడంపై మార్గదర్శకాలు వస్తాయి' అని అన్నారు. భారత్ వెళ్లకపోతే పాక్‌నే విజేతగా ప్రకటిస్తారు.



మెక్‌గ్రాత్
మెక్‌గ్రాత్‌ను బౌల్డ్ చేసిన ఆనందంలో కెప్టెన్ హర్మన్ సంబరాలు...

ఆసీస్ పోరాడినా... భారత్ చేతుల్లోనే..!

- రెండో ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా 233/5
- తహీలా మెక్‌గ్రాత్ అర్ధ సెంచరీ
- మహిళల టెస్టుకు నేడు చివరి రోజు

ముంబై: భారత్, ఆస్ట్రేలియా మహిళల మధ్య ఏకైక టెస్టు మ్యాచ్ ఆసక్తికరంగా సాగుతోంది. మూడో రోజు ఆట ముగిసే సమయానికి ఆసీస్‌కు స్వల్ప ఆధిక్యం లభించినా...టెస్టు ఇంకా భారత్ చేతుల్లోనే ఉంది. చివరి రోజు ఆసీస్‌ను తొందరగా ఆలౌట్ చేయగలిగితే స్వల్ప లక్ష్యాన్ని భారత్ ఛేదించేందుకు అవకాశం ఉంటుంది. తొలి ఇన్నింగ్స్‌తో పోలిస్తే రెండో ఇన్నింగ్స్‌లో ఆసీస్ కాస్త మెరుగైన బ్యాటింగ్ ప్రదర్శన కనబర్చగా...శనివారం ఆట చివర్లో భారత్‌కు మళ్లీ పట్టు చిక్కింది. ఆట ముగిసే సమయానికి ఆస్ట్రేలియా తమ రెండో ఇన్నింగ్స్‌లో 90 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 233 పరుగులు చేసింది. తహీలా మెక్‌గ్రాత్ (177 బంతుల్లో 73; 10 ఫోర్లు) అర్ధసెంచరీ సాధించగా...ఎలైస్ పెరీ (91 బంతుల్లో 45; 5 ఫోర్లు), బెత్ మూనీ (33), కెప్టెన్ అలీసా హీలీ (32) కీలక పరుగులు జోడించారు. భారత బౌలర్లలో హర్మన్‌ప్రీత్ కౌర్, స్నేహ్ రాణా చెరో 2 వికెట్లు పడగొట్టారు. ప్రస్తుతం ఆసీస్ 46 పరుగుల ఆధిక్యంలో ఉంది. అంతకు ముందు ఓవర్‌నైట్ స్కోరు 376/7తో ఆట కొనసాగించిన భారత్ మరో 30 పరుగులు జోడించి తమ తొలి ఇన్నింగ్స్‌లో 406 పరుగులకు ఆలౌటైంది. దీప్తి శర్మ (78)ను గార్త్ బౌల్డ్ చేయగా...పూజ వస్త్రకర్ (47), రేణుకా సింగ్ (8)లను గార్డ్‌నర్ వెనక్కి పంపించింది. దాంతో భారత్‌కు 187 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది.

కీలక భాగస్వామ్యాలు...

రెండో ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియాకు మెరుగైన ఆరంభం లభించింది. మూనీ, లిచ్‌ఫీల్డ్ (18) తొలి వికెట్‌కు 49 పరుగులు జోడించారు. అయితే మూనీ స్వయంకృతంతో రనౌట్ కావడంతో భారత్‌కు తొలి వికెట్ దక్కింది. రాణా బౌలింగ్‌లో మూనీ ముందుకొచ్చి డిఫెన్స్ ఆడగా చురుగ్గా ఉన్న సిల్లీ పాయింట్ ఫీల్డర్ రిచా వెంటనే బంతికి వికెట్లపైకి విసిరింది. సరైన సమయంలో వెనక్కి వెళ్లలేక మూనీ వెనుదిరిగింది. లిచ్‌ఫీల్డ్‌నూ రాణానే అవుట్ చేశాక మెక్‌గ్రాత్, పెరీ కలిసి జట్టును ఆదుకున్నారు. భారత స్పిన్నర్లను వీరు సమర్థంగా ఎదుర్కొన్నారు. 15 పరుగుల వద్ద మెక్‌గ్రాత్ ఇచ్చిన క్యాచ్‌ను రాణా వదిలేయడం ఆసీస్‌కు కలిసొచ్చింది. మెక్‌గ్రాత్, పెరీ మూడో వికెట్‌కు 84 పరుగులు జత చేశారు. అయితే ఆ తర్వాత హీలీతో కలిసి మెక్‌గ్రాత్ ఇన్నింగ్స్‌ను నడిపించింది. 119 బంతుల్లో ఈ మ్యాచ్‌లో రెండో అర్ధసెంచరీ పూర్తి చేసుకున్న మెక్‌గ్రాత్...రేణుక ఓవర్లో వరుసగా 3 ఫోర్లతో ఆసీస్‌ను ఆధిక్యంలోకి తీసుకెళ్లింది. ఆసీస్ బ్యాటర్లు పాతుకుపోగా, వరుసగా 28.2 ఓవర్ల పాటు భారత్ వికెట్ తీయడంలో విఫలమైంది. ఈ దశలో కెప్టెన్ హర్మన్ తానే స్వయంగా బౌలింగ్‌కు దిగింది. తొలి ఓవర్లోనే చక్కటి బంతితో మెక్‌గ్రాత్‌ను బౌల్డ్ చేసి 66 పరుగుల పార్ట్‌నర్‌షిప్‌కు తెర దించింది. ఆ తర్వాత కొద్ది సేపటికే హీలీని వికెట్ల ముందు దొరకబుచ్చుకొని హర్మన్ మ్యాచ్‌ను మళ్లీ భారత్ చేతుల్లోకి తెచ్చింది. అంతకు ముందు బంతికే హర్మన్, హీలీ మధ్య 'అబ్‌స్ట్రక్టింగ్ ద ఫీల్డ్'కు సంబంధించి తీవ్ర వాదోపవాదన జరిగిన తర్వాత ఈ వికెట్ దక్కడం విశేషం. ఆ తర్వాత 62 బంతుల పాటు జాగ్రత్తగా ఆడి మరో వికెట్ పడకుండా సదర్లాండ్ (12 నాటౌట్), గార్డ్‌నర్ (7 నాటౌట్) ఆటను ముగించారు.

స్కోరు వివరాలు

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్ 219; **భారత్ తొలి ఇన్నింగ్స్** 406; **ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్:** మూనీ (రనౌట్) 33; లిచ్‌ఫీల్డ్ (బి) రాణా 18; పెరీ (సి) యస్తిక (బి) రాణా 45; తహీలా మెక్‌గ్రాత్ (బి) హర్మన్ 73; హీలీ (ఎల్బీ) (బి) హర్మన్ 32; సదర్లాండ్ (నాటౌట్) 12; గార్డ్‌నర్ (నాటౌట్) 7; ఎక్స్‌ట్రాలు 13; **మొత్తం (90 ఓవర్లలో 5 వికెట్లకు)** 233. **వికెట్ల పతనం:** 1–49, 2–56, 3–140, 4–206, 5–221. **బౌలింగ్:** రేణుకా సింగ్ 8–3–22–0, పూజ వస్త్రకర్ 8–0–36–0, స్నేహ్ రాణా 17–3–54–2, దీప్తి శర్మ 19–5–30–0, రాజేశ్వరి 27–10–42–0, జెమీమా 2–0–13–0, హర్మన్‌ప్రీత్ 9–0–23–2.

తలైవాస్‌పై పాంథర్స్ గెలుపు



చెన్నై: ప్రొ కబడ్డీ లీగ్‌లో హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ జైపూర్ పింక్ పాంథర్స్ 25–24తో తమిళ్ తలైవాస్‌పై గెలిచింది. అర్జున్ దేశ్వాల్ (7 పాయింట్లు), రెజా మిర్‌బగెరి (5), సునీల్ కుమార్ (4), అజిత్ (3) రాణించారు. తలైవాస్ తరఫున హిమాన్షు నర్వాల్ 8 పాయింట్లు సాధించాడు. అనంతరం జరిగిన రెండో మ్యాచ్‌లో గుజరాత్ జెయింట్స్ 38–30తో యూపీ యోధాస్‌పై విజయం సాధించింది. గుజరాత్ విజయంలో రెయిడర్ రాకేశ్ (14) కీలకపాత్ర పోషించాడు.

పాయింట్ల పట్టిక PKL

జట్టు	ఆ	గె	ఓ	టై	పా
పుణేరి పల్టన్	6	5	1	0	26
జైపూర్ పింక్ పాంథర్స్	7	4	2	1	25
గుజరాత్ జెయింట్స్	7	4	3	0	23
బెంగాల్ వారియర్స్	6	3	1	2	21
హరియాణా స్టీలర్స్	6	4	2	0	21
పట్నా పైరేట్స్	6	3	3	0	17
యు ముంబా	5	3	2	0	16
యూపీ యోధాస్	7	2	4	1	15
బెంగళూరు బుల్స్	7	2	5	0	14
దబంగ్ ఢిల్లీ	5	2	3	0	12
తమిళ్ తలైవాస్	6	2	4	0	11
తెలుగు టైటాన్స్	6	1	5	0	7

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు

బంగ్లా చేతిలో కివీస్ చిత్తు

నేపియర్: న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్‌ను ఇప్పటికే చేజార్చుకున్న బంగ్లాదేశ్‌కు ఊరట విజయం దక్కింది. శనివారం జరిగిన చివరి వన్డేలో బంగ్లా 9 వికెట్ల తేడాతో కివీస్‌ను చిత్తు చేసింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్ 31.4 ఓవర్లలో 98 పరుగులకే కుప్పకూలింది. బంగ్లాపై ఆ జట్టుకు ఇదే అత్యల్ప స్కోరు. యంగ్ (26) టాప్ స్కోరర్ కాగా, 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' తన్‌జీమ్ హసన్ (3/14), సౌమ్య సర్కార్, షరీఫుల్ తలా 3 వికెట్లు తీశారు. అనంతరం బంగ్లా 15.1 ఓవర్లలో వికెట్ నష్టానికి 99 పరుగులు చేసింది. నజ్ముల్ హుస్సేన్ (51 నాటౌట్), అనాముల్ హక్ (37) రాణించారు. కివీస్ గడ్డపై బంగ్లాదేశ్‌కు ఇదే తొలి గెలుపు కావడం విశేషం. తొలి రెండు మ్యాచ్‌లు నెగ్గిన న్యూజిలాండ్ 2–1తో సిరీస్ సొంతం చేసుకుంది.

సినిమా

స్వదేశానికి కన్నప్ప



మోహన్ బాబు

విష్ణు మంచు టైటిల్ రోల్ చేస్తున్న చిత్రం 'కన్నప్ప'. ఈ చిత్రంలో ప్రభాస్, మోహన్‌బాబు, బ్రహ్మానందం, మోహన్‌లాల్, శివరాజ్‌కుమార్, శరత్‌కుమార్, బ్రహ్మాజీ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ముఖేష్ కుమార్ దర్శకత్వంలో 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ, అవా ఎంటర్‌టైన్మెంట్స్ పతాకాలపై విష్ణు మంచు నిర్మిస్తున్న ఈ సినిమా తొలి షెడ్యూల్ 3 నెలల క్రితం న్యూజిల్యాండ్‌లో మొదలైంది. ''న్యూజిల్యాండ్‌లో 600 మంది హాలీవుడ్, భారతదేశంలోని అతిరథ మహారథులైన నటీనటులతో 90 రోజుల మొదటి షెడ్యూల్ చేశాం. అక్కడి అద్భుతమైన లొకేషన్స్‌లో దిగ్విజయంగా షూటింగ్ పూర్తి చేసి, భారతదేశానికి తిరిగి వస్తున్నాం. ఈ సినిమాకు థాయ్‌ల్యాండ్, న్యూజిల్యాండ్ సాంకేతిక నిపుణులు పని చేస్తున్నారు'' అని 'ఎక్స్'లో పోస్ట్ చేశారు మోహన్‌బాబు. శివభక్తుడు కన్నప్ప జీవితం ఆధారంగా ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు.

ఇక స్పీడ్‌గా సినిమాలు చేస్తాను

- దర్శకుడు రవికాంత్ పేరేపు


రోషన్ కనకాల, మానసా చౌదరి జంటగా రవికాంత్ పేరేపు దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'బబుల్‌గమ్'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీతో కలిసి మహేశ్వరి మూవీస్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 29న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా శనివారం విలేకర్ల సమావేశంలో రవికాంత్ పేరేపు చెప్పిన విశేషాలు.



● ప్రేమకథ ప్రధానంగా సాగే రిలేషన్‌షిప్ డ్రామా 'బబుల్‌గమ్'. ఈ చిత్రంలో ఆది పాత్రలో రోషన్, జాన్వీ పాత్రలో తెలుగు అమ్మాయి మానస నటించారు. కొత్తవారితో చేయాల్సిన సినిమా ఇది. రోషన్ హీరోగా పరిచయమవుతున్నాడని తెలిసి, ఈ కథ చెప్పాను. కాలేజీ చదువు పూర్తి చేసుకున్న తర్వాత యువకుల కెరీర్‌లో కొంత కన్‌ఫ్యూజన్ ఉంటుంది. మనకు ఇష్టమైనది చేయాలా? సంపాదన కోసం ఏ ఉద్యోగమైనా చేయాలా? అనే అయోమయంలో ఉంటారు. అలాంటి ఓ కన్‌ఫ్యూజన్‌లో ఉన్న ఓ కుర్రాడు ప్రేమలో పడితే ఏం జరుగుతుంది? అన్నదే ఈ సినిమా కథాంశం. రోషన్‌కు ఇది తొలి సినిమా అయినా అతని తల్లిదండ్రులు సుమ, రాజీవ్ కనకాల ఈ సినిమాలో జోక్యం చేసుకోలేదు. ● 'ప్రేమ బబుల్‌గమ్ లాంటిది. మొదట్లో తీయగా ఉంటుంది. ఆ తర్వాత చప్పగా ఉంటుంది. ఆ నెక్ట్స్ అతుక్కుంటే వదలదు' అనే డైలాగ్ ఉంటుంది. కథానుసారం ఈ సినిమాకు 'బబుల్‌గమ్' టైటిల్ పెట్టాం. ఇక నా 'క్షణం', 'కృష్ణ అండ్ హిజ్ లీల' ఇప్పుడు 'బబుల్‌గమ్' సినిమాలకు శ్రీ చరణ్ సంగీతం ఇచ్చాడు. మేమిద్దరం ఒకే ఊరివాళ్లం కాబట్టి కంఫర్ట్ కుదిరింది. 'బబుల్‌గమ్' ట్రైలర్‌ను చిరంజీవిగారికి చూపించాం. ఈ సినిమాలోని 'ఇజ్జత్..' సాంగ్ ఆయనకు బాగా నచ్చింది. ● 'క్షణం' మంచి విజయం సాధించింది. ఎందుకో కానీ ఆ సినిమా సక్సెస్ క్రెడిట్ నాకు అంతగా రాలేదు. దర్శకత్వంలో అడివి శేష్ ఇన్‌వాల్వ్‌మెంట్ ఉందనే ప్రచారం జరిగింది. నిజానికి 'అడివి' శేష్, శ్రీచరణ్ పాకాల 'క్షణం' క్రెడిట్ నాకే ఇస్తారు. ఓ అవుట్ సైడర్‌గా ఇండస్ట్రీ పరిస్థితులను పూర్తిగా అర్థం చేసుకోవడానికి నాకు కొంత టైమ్ పట్టింది. ఇకపై దర్శకుడిగా స్పీడ్‌గా సినిమాలు చేస్తాను.

యానిమల్ తర్వాత హిందీలో అవకాశాలు వస్తున్నాయి

- సంగీతదర్శకుడు హర్షవర్ధన్ రామేశ్వర్



కల్యాణ్ రామ్ హీరోగా నటించిన చిత్రం 'డెవిల్: ది బ్రిటిష్ సీక్రెట్ ఏజెంట్'. సంయుక్తా మీనన్ హీరోయిన్‌గా, మరో హీరోయిన్ మాళవికా నాయర్ కీలక పాత్రలో నటించిన ఈ సినిమాను అభిషేక్ నామా స్వీయ దర్శకత్వంలో నిర్మించారు. ఈ నెల 29న ఈ చిత్రం విడుదల కానుంది. ఈ సందర్భంగా శనివారం విలేకర్ల సమావేశంలో ఈ చిత్ర సంగీత దర్శకుడు హర్షవర్ధన్ రామేశ్వర్ మాట్లాడుతూ– ''డెవిల్ సినిమాలో మూడు పాటలు ఉన్నాయి. ఇది పీరియాడికల్ ఫిల్మ్ కాబట్టి ప్రత్యేక వాయిద్యాలను వాడాం. 'దూరమే..' పాటను బుడాపెస్ట్‌లో షూట్ చేశాం. అలాగే 'దిస్ ఈజ్ లేడీ రోజ్..' పాటను ర్యాపర్ రాజకుమారితో పాడించాం. ఈ పాట సినిమాకు స్పెషల్ ఎట్రాక్షన్‌గా నిలుస్తుంది. అలాగే నేపథ్య సంగీతం చాలా బాగుంటుంది. అయితే సంగీత దర్శకులు, నటీనటులు ఎంత ఎఫర్ట్ పెట్టినా విజువల్ సపోర్ట్ ఉండాలి. ఈ విషయంలో ఈ చిత్రం కెమెరామేన్ సౌందర్ రాజన్ గారు ప్రాణం పెట్టి అద్భుతంగా వర్క్ చేశారు. సెకండాఫ్‌లోని ఓ ముఖ్యమైన యాక్షన్ సీక్వెన్స్‌లో కల్యాణ్‌రామ్ గారి నట విశ్వరూపాన్ని ఆడియన్స్ చూస్తారు. ఈ సినిమాకు జాతీయ స్థాయిలో అవార్డులు రావొచ్చని నాకనిపిస్తోంది'' అని అన్నారు. ఇంకా మాట్లాడుతూ– ''భవిష్యత్‌లో డైరెక్షన్ చేసే అవకాశం ఉంది. ఇద్దరు గిటారిస్ట్స్ మాత్రమే ఉండేలా ఓ సినిమా, డ్రమ్స్ శివమణిగారి బయోపిక్ తీయాలని ఉంది. 'యానిమల్' తర్వాత బాలీవుడ్‌లో చాలా అవకాశాలు వస్తున్నాయి. అవి చర్చల దశలో ఉన్నాయి. ప్రభాస్‌తో సందీప్‌రెడ్డి వంగాగారు చేయనున్న 'స్పిరిట్' సినిమాకు సంగీతం అందించనున్నాను'' అన్నారు.

స్నేహితుల కథ



● 'రోటీ కపడా..' పోస్టర్

హర్ష నర్రా, సందీప్ సరోజ్, తరుణ్, సుప్రజ్ రంగా, సోనూ ఠాకూర్, నువ్వేక్ష, మేఘా లేఖ, ఖుష్బూ చౌదరి హీరో హీరోయిన్లుగా విక్రమ్ రెడ్డి దర్శకత్వంలో రూపొందుతున్న యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ మూవీ 'రోటి కపడా రొమాన్స్'. బెక్కెం వేణుగోపాల్‌తో కలిసి సృజన్ కుమార్ బొజ్జం ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఫస్ట్ డోస్ అంటూ ఈ సినిమా పబ్లిసిటీ వీడియోను శనివారం విడుదల చేశారు మేకర్స్. ''నలుగురు స్నేహితుల కథే ఈ చిత్రం. వారి స్నేహం, ప్రేమ, వారి లైఫ్ జర్నీ ఈ సినిమాలో ఉంటుంది. యూత్‌కు ఈ సినిమా ఓ పండగలా ఉంటుంది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: హర్షవర్ధన్ రామేశ్వర్–ఆర్ఆర్ ధ్రువన్–వసంత్ .జి, కెమెరా: సంతోష్ రెడ్డి.

సి. కృష్ణవేణి నూరవ పుట్టినరోజు ప్రత్యేకం

కృష్ణమణి

మణిలాంటి నటి... మణిలాంటి గాయని... మణిలాంటి నిర్మాత... కృష్ణవేణి చిత్రసీమకు ఒక అమ్మూల్యమైన మణి. మంచి నటీమణిగా తెరపై తన అభినయాన్ని కనబర్చారు. మంచి గాయనీమణిగా తన గాత్రాన్ని వినిపించారు. 'మన దేశం' వంటి చిత్రంతో అభిరుచి గల నిర్మాత అనిపించుకున్నారు. నేడు నూరవ వసంతంలోకి అడుగు పెడుతున్నారు సి. కృష్ణవేణి. ఈ సందర్భంగా కృష్ణ'మణి' జీవిత విశేషాలు కొన్ని తెలుసుకుందాం.



● సి. కృష్ణవేణి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పశ్చిమ గోదావరి జిల్లా పంగిడి గ్రామంలో 1924 డిసెంబరు 24న జన్మించారు కృష్ణవేణి. తండ్రి యర్రంశెట్టి కృష్ణారావు డాక్టర్. పాఠశాల నాటకాల్లో ప్రహ్లాదుడు, ధ్రువుడు వంటి వేషాలు వేసి బహుమతులు అందుకున్నారు కృష్ణవేణి. ఆ తర్వాత వెండితెరపైనా ప్రేక్షకులను మెప్పించారు. ప్రముఖ దర్శక–నిర్మాత సి. పుల్లయ్య బాల నటీనటులతో 'సతీ అనసూయ' చిత్రానికి సన్నాహాలు చేశారు. ఆ సమయంలో రాజమండ్రి వెళ్లినప్పుడు ఆయన 'తులాభారం' నాటకం చూశారు. అందులో కృష్ణవేణి నటన నచ్చి, సినిమాలో నటించమని అడిగారు. అలా 'సతీ అనసూయ' (1936) సినిమాలో తొలి అవకాశం అందుకున్నారు కృష్ణవేణి. ఆ చిత్రం తర్వాత మళ్లీ నాటకాల్లో నటించారు. ఆ సమయంలో తండ్రి కృష్ణారావు మృతి చెందడంతో అమ్మమ్మ, బాబాయిల వద్ద పెరిగారు కృష్ణవేణి. ఆ తర్వాత 'తుకారాం' (1973) సినిమా కోసం చెన్నైలో అడుగుపెట్టారు. ఆ సినిమా సరిగ్గా ఆడలేదు. కృష్ణవేణి హీరోయిన్‌గా నటించిన తొలి చిత్రం 'కచదేవయాని' (1938) విజయం సాధించడంతో మంచి గుర్తింపు, పేరు వచ్చాయి. ఆ తర్వాత 'మహానంద' చిత్రంలో నటించేందుకు చెన్నైలోనే స్థిరపడ్డారు.

ఆ సమయంలోనే ప్రముఖ దర్శక–నిర్మాత, మీర్జాపురం రాజాతో (మేకా రంగయ్య) కృష్ణవేణి వివాహం 1940లో విజయవాడలో జరిగింది. వివాహం తర్వాత బయటి సంస్థల్లో పని చేయడం ఇష్టం లేక సొంత ప్రొడక్షన్ జయా పిక్చర్స్–శోభనాచల స్టూడియోస్ నిర్మించిన చిత్రాల్లో నటించారామె. మీర్జాపురం రాజా నిర్మించిన తొలి సాంఘిక చిత్రం 'జీవన జ్యోతి'లో (1940) హీరోయిన్‌గా చేశారు. ఆ చిత్రంతో సీహెచ్ నారాయణరావు హీరోగా పరిచయమయ్యారు. ఆ తర్వాత పలు చిత్రాల్లో నటించారు కృష్ణవేణి. నటిగా ఆమెకు 'గొల్లభామ, లక్ష్మమ్మ' వంటి చిత్రాలు బాగా పేరు తెచ్చాయి. 'కచదేవయాని, గొల్లభామ, అనసూయ' వంటి పలు చిత్రాల్లో పాటలు పాడారు కృష్ణవేణి. 'తిరుగుబాటు' సినిమాలో ఆమె చేసిన వ్యాంప్ క్యారెక్టర్‌పై ప్రేక్షకులు పెదవి విరిచారు. 1942లో రాజా–కృష్ణవేణి దంపతులకు కుమార్తె రాజ్యలక్ష్మి అనూరాధ జన్మించడం.. భర్త రాజా సినిమాల నిర్మాణంలో బిజీగా ఉండటంతో స్టూడియో వ్యవహారాలు చూసుకోవాల్సి రావడం ... వంటి కారణాలతో నటనకు స్వస్తి పలికారు కృష్ణవేణి. కుమార్తె పేరుపై 'ఎంఆర్‌ఏ' ప్రొడక్షన్ స్థాపించి, తొలి ప్రయత్నంగా ఎల్వీ ప్రసాద్ దర్శకత్వంలో 'మన దేశం' (1949) సినిమా తీసి, విజయం అందుకున్నారు. ఈ చిత్రం ద్వారా ఎన్టీఆర్‌ని వెండితెరకు పరిచయం చేశారు కృష్ణవేణి. కాగా 'వరూధిని' సినిమా తర్వాత ఊరు వెళ్లిపోయిన ఎస్వీ రంగారావుని పిలిపించి, 'మన దేశం'లో ఓ పాత్రకు అవకాశం ఇచ్చారామె. తన అభిరుచి మేరకు నిర్మించిన ఆ సినిమా ఎంతో సంతృప్తి ఇచ్చిందని పలు సందర్భాల్లో కృష్ణవేణి పేర్కొన్నారు. ఇక ఆ రోజుల్లో ఎక్కువ పారితోషికం తీసుకున్న హీరోయిన్‌గానూ తన ప్రత్యేకత చాటుకున్నారామె. 'ధర్మాంగద'కి రూ. నలభై ఐదు వేలు పారితోషికం తీసుకున్నారు. ఆమె నిర్మించిన 'గుడ్ ఈవెనింగ్, లేడీ డాక్టర్' వంటి కొన్ని చిత్రాలు పరాజయం కావడం, 'కుమ్మరి మొల్ల' వంటి మరికొన్ని సినిమాలు మధ్యలోనే ఆగిపోవడంతో అసంతృప్తికి గురయ్యారు కృష్ణవేణి. ఆమె హీరోయిన్‌గా నటించిన ఆఖరి చిత్రం 'సావాసం' (1952). మహారాష్ట్ర గవర్నర్‌గా చేసిన కోన ప్రభాకరరావు ఆ చిత్రంలో హీరోగా నటించడం విశేషం. కృష్ణవేణి నిర్మించిన చిత్రాల్లో 'భక్త ప్రహ్లాద' (1942) ఒకటి. నిర్మాతగా 1957లో విడుదలైన 'దాంపత్యం' కృష్ణవేణి చివరి సినిమా. నటిగా, నిర్మాతగా, గాయనిగా చిత్ర పరిశ్రమలో ప్రత్యేకత చాటుకున్న ఆమె 2004లో ప్రతిష్ఠాత్మక రఘుపతి వెంకయ్య అవార్డు అందుకున్నారు. గత ఏడాది 'సాక్షి ఎక్స్‌లెన్స్' అవార్డుల్లో భాగంగా 'జీవిత సాఫల్య పురస్కారం' అందుకున్నారు కృష్ణవేణి.



● భర్త మీర్జాపురం రాజాతో కృష్ణవేణి



● కృష్ణవేణి



● 'కచదేవయాని'లో ఓ దృశ్యం

తల్లి బాటలో కుమార్తె

కృష్ణవేణి బాటలో ఆమె కుమార్తె ఎన్ఆర్ అనురాధా దేవి నిర్మాణ రంగంలోకి ప్రవేశించారు. ముందు పలు అనువాద చిత్రాలు విడుదల చేసి, లక్ష్మీ ఫిలింస్ కంబైన్స్‌పై ఆమె కన్నడంలో తన తొలి చిత్రం 'భక్త కుంబారా' (1974)ని నిర్మించారు. ఇందులో రాజ్ కుమార్ హీరో. తెలుగులో అనురాధ నిర్మించిన తొలి చిత్రం 'చక్రధారి' (1977). అక్కినేని నాగేశ్వర రావు, వాణిశ్రీ, జయప్రద కాంబినేషన్‌లో ఈ చిత్రం రూపొందింది. నిర్మాతగా మొత్తం 17 చిత్రాలు నిర్మించారు అనురాధ. ఆమె నిర్మించిన చివరి చిత్రం 'మా పెళ్లికి రండి' (2000). జేడీ చక్రవర్తి, సాక్షి శివానంద్ కాంబినేషన్‌లో ఈ చిత్రం రూపొందింది. ప్రపంచంలో అత్యధిక చిత్రాలు నిర్మించిన మహిళా నిర్మాతగా అనురాధా దేవి 2001లో లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌ని సొంతం చేసుకున్నారు.



● అనురాధా దేవి

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

బీజేపీ నేత శ్రీరామోజు షణ్ముఖచారి కన్నుమూత

- ఎమర్జెన్సీలో అరెస్టై 9 నెలలు పైగా జైలు జీవితం అనుభవించిన షణ్ముఖచారి



షణ్ముఖచారి

చైతన్యపురి (హైదరాబాద్): బీజేపీ సీనియర్ నేత, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీరామోజు షణ్ముఖ చారి(68) అనారోగ్యంతో శనివారం తెల్లవారుజామున చైతన్య పురి ప్రభాత్‌నగర్‌లోని స్వగృహంలో కన్నుమూశారు. నల్లగొండ పట్టణానికి చెందిన షణ్ముఖచారి (జన్నన్న) చిన్నప్పటి నుంచే సంఘ పరివార్ సిద్ధాంతాల పట్ల ఆకర్షితుడై అప్పట్నుంచి ఆర్‌ఎస్‌ఎస్, ఏబీవీపీ, హిందూవాహిని, బజరంగ్‌దళ్, బీజేపీలో బలోపేతానికి తన వంతుగా కృషి చేశారు. ప్రధాని మోదీ, బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డా, పలువురు కేంద్ర మంత్రులు, పలు రాష్ట్రాల గవర్నర్లు ఆయన సమకాలీకులు. ఇందిరాగాంధీ ప్రకటించిన ఎమర్జెన్సీని వ్యతిరేకించిన షణ్ముఖ చారి 1976లో జైలుకు వెళ్లి తొమ్మిది నెలలకు పైగా జైలు జీవితం గడిపారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ ఆహ్వానం మేరకు 2007లో టీఆర్‌ఎస్‌తో పనిచేసి అనంతరం మాతృసంస్థ బీజేపీలో చేరి 2018లో నల్లగొండ ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయారు. షణ్ముఖకు భార్య శోభారాణి, కూతరు తేజస్వి ఉన్నారు. షణ్ముఖచారి మరణ వార్త తెలుసుకుని మాజీ మంత్రి ఈటల రాజేందర్, మాజీ మంత్రి సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కర్నెప్రభాకర్, రాంచందర్‌రావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామరంగారెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు దాసోజు శ్రవణ్‌కుమార్ తదితరులు ఆయన పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. షణ్ముఖచారి మరణం బాధాకరం, తీరని లోటని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, పార్లమెంటు సభ్యుడు బండి సంజయ్ ఓ ప్రకటనలో తెలిపారు. .

తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు



ఆలయం వెలుపల కుటుంబ సభ్యులతో సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ హిమాకొహ్లి, జస్టిస్ సూర్యకాంత్, మాజీ సీజేఐ జస్టిస్ ఎన్వీ రమణ



తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నందా



అలహాబాద్ హైకోర్టు జస్టిస్ ఎన్‌కే జోహారి




మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దుప్పల వెంకటరమణ



మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నాగార్జున్



మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గోవిందరాజ్



ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఏవీ శేష సాయి



సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్వీ భట్టి



ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుబ్బారెడ్డి



ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాజశేఖర్



ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్యాంసుందర్



ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జయసూర్య



తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీనివాసరావు



ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీనివాసరెడ్డి



ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.సుజాత



ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రవీంద్రబాబు



తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఈవీ వేణుగోపాల్

935 కిలోల డ్రగ్స్ స్వాధీనం

- కెమికల్ పరిశ్రమ నిర్వాహకుడిపై కేసు
- డీసీఏ డీజీ కమలాసన్‌రెడ్డి వెల్లడి

సాక్షి, హైదరాబాద్/ తల్లాడ: ఖమ్మం జిల్లా తల్లాడ మండలం అన్నారుగూడెంలోని ఓ ఫ్యాక్టరీలో శుక్రవారం డ్రగ్స్(మత్తు కోసం ఉపయోగించే మాత్రలు) స్వాధీనం చేసుకోగా, వీటి తయారీ ప్రధాన సూత్రధారి అయిన సతీష్‌రెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈమేరకు డీసీఏ (డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్) డైరెక్టర్ జనరల్ వీబీకే.రెడ్డి, డీఏసీ డైరెక్టర్ జనరల్ వీబీ కమలాసన్‌రెడ్డి శనివారం వివరాలు వెల్లడించారు. ఖమ్మం జిల్లా తల్లాడ మండలం అన్నారుగూడెం టీఎస్ఐఐసీ ఇండస్ట్రియల్ పార్క్‌లోని ఆస్పెన్ బయోఫార్మాలో జరిపిన సోదాల్లో 935 కిలోల వాల్సర్టన్, క్లోపిడ్రోల్ డ్రగ్స్‌ను గుర్తించారు. ఈ ఔషధ అక్రమ తయారీ కేంద్రం ఉపేందర్‌రెడ్డి అనే వ్యక్తికి చెందినదిగా గుర్తించినట్టు వెల్లడించారు. ఈనెల 4న హైదరాబాద్ మాచబొల్లారంలో రూ.4.50 కోట్ల విలువైన యాంటీ కేన్సర్ నకిలీ మందులు స్వాధీనం చేసుకున్న కేసులో కీలక నిందితుడు కడారి సతీశ్‌రెడ్డి ఉపేందర్‌రెడ్డికి దగ్గరి బంధువు అని గుర్తించినట్టు తెలిపారు. పరారీలో ఉన్న సతీశ్‌రెడ్డినే అక్రమ ఔషధ తయారీ కేంద్రం వెనుక కీలక నిందితుడిగా పేర్కొన్నారు. స్వాధీనం చేసుకున్న డ్రగ్ శాంపిళ్లను విశ్లేషణ కోసం పంపామని, నివేదిక వచ్చిన తర్వాత నిందితులపై చర్యలు తీసుకుంటామని కమలాసన్‌రెడ్డి వెల్లడించారు. కాగా, స్వాధీనం చేసుకున్న డ్రగ్స్ విలువ రూ.కోట్లలో ఉంటుందని తెలిసింది. సతీశ్‌రెడ్డిపై కేసు నమోదు చేసి, ఆయనతో పాటు ఉపేందర్‌రెడ్డి, తదితరులను విచారిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

గొప్ప పాలనాదక్షుడు పీవీ: డిప్యూటీ సీఎం భట్టి

తెలంగాణ భవన్‌లో ఘనంగా మాజీ ప్రధాని పీవీ వర్ధంతి



పీవీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న భట్టి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రం కోసం, దేశం కోసం ఎన్నో కీలక నిర్ణయాలు తీసుకున్న పాలనాదక్షుడు పీవీ నరసింహారావు అని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క కొనియాడారు. శనివారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావు 19వ వర్ధంతి కార్యక్రమం ఘనంగా జరిగింది. రెసిడెంట్ కమిషనర్ డా.గౌరవ్ ఉప్పల్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి మల్లు భట్టి విక్రమార్క ముఖ్య అతిథిగా హాజరై పీవీ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘన నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ పీవీ నరసింహారావు భారత దేశ ప్రధానిగా, దేశ ఆర్థిక వ్యవస్థను గాడిన పెట్టారని, అలాంటి పీవీ తెలంగాణలో పుట్టడం గర్వంగా భావిస్తున్నానన్నారు.

పీవీ కీర్తి అజరామరం: సీఎం

- పీవీ జ్ఞాన భూమిలో వర్ధంతి కార్యక్రమాలు
- నివాళులర్పించిన గవర్నర్లు, సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు

సాక్షి, హైదరాబాద్, రాంగోపాల్‌పేట్: దివంగత ప్రధానమంత్రి పీవీ నరసింహారావు 19వ వర్ధంతి కార్యక్రమాన్ని శనివారం నెక్లెస్‌రోడ్డులోని పీవీ జ్ఞాన భూమిలో నిర్వహించారు. తెలంగాణ, హరియాణా గవర్నర్లు తమిళిసై సౌందర్‌రాజన్, బండారు దత్తాత్రేయతో పాటు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, సీతక్క, జూపల్లి కృష్ణారావు పీవీ ఘాట్ వద్దకు చేరుకుని ఘనంగా నివాళులర్పించారు. మాజీ మంత్రి కేటీఆర్, బీజేపీ నాయకులు ఈటల రాజేందర్, ఐఏఎస్ అధికారులు దాన కిశోర్, ఆమ్రపాలి, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తదితరులు కూడా పీవీకి నివాళులు అర్పించి ఆయన సేవలను కొనియాడారు. అదేవిధంగా పీవీ కుమార్తె ఎమ్మెల్సీ వాణిదేవి, కుమారుడు ప్రభాకర్‌రావు, బంధువులు, స్నేహితులు ఆయనకు శ్రద్ధాంజలి ఘటించారు.

పీవీ కీర్తిని పెంచేలా ప్రభుత్వ పనితీరు : సీఎం

పరిపాలనలో సమూల మార్పులు తెచ్చి, దేశ కీర్తిని ప్రపంచానికి చాటిన మేధావి మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావు అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. పీవీ కీర్తి అజరామరమని, ఆయన స్ఫూర్తితో ఈ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. పీవీకి నివాళులర్పించిన అనంతరం సీఎం రేవంత్ మాట్లా డుతూ ఆర్థిక వ్యవస్థ ప్రశ్నార్థకంగా మారినప్పుడు సాహసోపేత నిర్ణయాలు తీసుకున్న వ్యక్తి పీవీ అని గుర్తుచేశారు. భూ సంస్కరణల ద్వా రా పేదలకు భూములు పంచడానికి పీవీ బలమైన పునాదులు వేశారని కొనియాడారు. పీవీ ఘాట్, జైపాల్ రెడ్డి ఘాట్‌లను అభివృద్ధి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందనీ, వారిద్దరూ తెలంగాణకు లంకె బిందెల్లాంటి వారని వ్యాఖ్యానించారు.







పీవీ సమాధి వద్ద నివాళులర్పిస్తున్న గవర్నర్ తమిళిసై, సీఎం రేవంత్ రెడ్డి, మాజీ మంత్రి కేటీఆర్

పీవీకి భారతరత్న ఇవ్వాలి: కేటీఆర్

దివంగత ప్రధాన మంత్రి పీవీ నరసింహారావుకు భారతరత్నను ఇచ్చి గౌరవించాలని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. అలాగే నాడు కాంగ్రెస్ పార్టీ చేసిన తప్పును సవరించి ఢిల్లీలో ఆయన ఘాట్‌ను నిర్మించాలని తాము డిమాండ్ చేస్తున్నామన్నారు. పీవీకి నివాళులు అర్పించిన అనంతరం ఆయన మాట్లాడుతూ నాడు అప్పుల్లో కూరుకుని పోయిన దేశానికి దిశా నిర్దేశం చేసిన మహానుబావుడు తెలంగాణ బిడ్డ పీవీ అని గుర్తు చేశారు. గతంలో తాము పీవీ కీర్తిని గుర్తుండిపోయేలా శత జయంతి ఉత్సవాలను నిర్వహించామనీ, ఆయన విగ్రహాలు విదేశాల్లో కూడా ఏర్పాటు చేసి ఆయన ఆదర్శాలు, త్యాగ నిరతిని చాటి చెప్పామని చెప్పారు.

పీవీ గొప్ప ఆధ్యాత్మికవేత్త కూడా: దత్తాత్రేయ

పీవీ గొప్ప ఆర్థిక వేత్తే కాకుండా గొప్ప ఆధ్యాత్మిక వేత్త కూడా అని హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. నాటి నిజాం నిరంకుశ విధానాలను వ్యతిరేకంగా పోరాటాలు చేసిన యోధుడు అని కొనియాడారు. సంక్షోభ సమయంలో సాహసోపేత నిర్ణయాలు, ఆర్థిక సంస్కరణలతో దేశాన్ని గట్టెక్కించారని అన్నారు. నేడు దేశం అన్ని రంగాల్లో ప్రగతి సాధిస్తుందంటే, సంపద సృష్టించి ఆ సంపద పేద, బడుగు బలహీన వర్గాలకు అందిస్తుందంటే అదంతా పీవీ చలవేనని దత్తాత్రేయ వ్యాఖ్యానించారు.

క్లుప్తంగా...

30న జాతీయ లోక్ అదాలత్

సాక్షి, హైదరాబాద్: నెగోషియబుల్ ఇన్స్ట్రుమెంట్స్ యాక్ట్ (ఎన్ఐ) కేసులు, ఎక్సైజ్ కేసులు, కార్మిక వివాదాలు, మ్యాట్రిమోనియల్, సివిల్ కేసుల్లో రాజీ కోసం ఈ నెల 30న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ(టీఎస్ఎల్ఎస్ఏ) సభ్య కార్యదర్శి ఎస్.గోవర్ధన్‌రెడ్డి శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. జాతీయ న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని ప్రత్యక్షంగాను, ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. హైకోర్టుతో పాటు తాలూకా కోర్టుల్లోనూ ఈ లోక్ అదాలత్ నిర్వహించడం జరుగుతుందన్నారు. కేసులను పరిష్కరించుకోవాలనుకునే వారు జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, న్యాయసేవా సదన్, మండల న్యాయసేవా కమిటీలను సంప్రదించాలని సూచించారు.

పలు మార్గాల్లో ప్రత్యేక రైళ్లు

సాక్షి, హైదరాబాద్: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా పలు మార్గాల్లో ప్రత్యేక రైళ్లు నడుపనున్నట్లు దక్షిణమధ్య రైల్వే సీపీఆర్వో సీహెచ్ రాకేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్–తిరుపతి (07489/07490) స్పెషల్ ట్రైన్ ఈ నెల 29వ తేదీ సాయంత్రం 6.15 గంటలకు బయలుదేరి మరుసటిరోజు ఉదయం 7.50 గంటలకు తిరుపతి చేరుకోనుంది. తిరుగు ప్రయాణంలో 30వ తేదీ రాత్రి 8.25కు బయలుదేరి ఉదయం 8.50కి హైదరాబాద్ చేరుకుంటుంది. హైదరాబాద్–తిరుపతి (07449/07450) మరో స్పెషల్ ట్రైన్ ఈ నెల 27వ తేదీ సాయంత్రం 6.10కు బయలుదేరి మరుసటిరోజు ఉదయం 6.45కు తిరుపతి చేరుకుంటుంది. తిరుగుప్రయాణంలో 28వ తేదీ సాయంత్రం 5.15కు బయలుదేరి మరుసటిరోజు ఉదయం 7.30కు హైదరాబాద్ చేరుకుంటుంది. హైదరాబాద్–కాకినాడ (07451/07452) స్పెషల్ ట్రైన్ ఈ నెల 29న రాత్రి 8.30కు బయలుదేరి మరుసటిరోజు ఉదయం 8 గంటలకు కాకినాడ చేరుకుంటుంది. తిరుగుప్రయాణంలో 30వ తేదీ రాత్రి 9 గంటలకు బయలుదేరి మరుసటిరోజు ఉదయం 9కి హైదరాబాద్ చేరుకుంటుంది.

పలు రైళ్లు రద్దు...: నిర్వహణ కారణాల దృష్ట్యా ఎంఎంటీఎస్‌తోపాటు పలు ప్యాసింజర్ రైళ్లను రద్దు చేసినట్లు దక్షిణమధ్య రైల్వే సీపీఆర్వో సీహెచ్ రాకేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం నగరంలోని లింగంపల్లి–ఫలక్‌నుమా స్టేషన్ల మధ్య నడిచే 12 ఎంఎంటీఎస్ సర్వీసులను రద్దు చేసినట్లు పేర్కొన్నారు. ఈ నెల 24న నగరానికి చేరుకోవాల్సిన కర్నూల్ సిటీ– హైదరాబాద్(17028), మహబూబ్‌నగర్– కాచిగూడ (07790), కాచిగూడ–కర్నూల్ సిటీ(174350), కర్నూల్–కాచిగూడ(17436) రైళ్లను కూడా రద్దు చేయనున్నట్లు తెలిపారు.

త్వరలో రాజకీయ పార్టీలో చేరుతా

- ఏ పార్టీలో చేరేది త్వరలో ప్రకటిస్తా
- ముద్రగడ పద్మనాభం



రౌతులపూడి: తాను ఏదో ఒక రాజకీయ పార్టీలో చేరుతానని, ఏ పార్టీలో చేరేది త్వరలో స్పష్టత ఇస్తానని కాపు ఉద్యమనేత, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం చెప్పారు. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గంలోని పోతులూరు, రౌతులపూడిలో శనివారం ఆయన పర్యటించారు. రౌతులపూడిలో మాజీ సర్పంచ్ వాసిరెడ్డి వేంకటేశ్వర్లు(దేవుళ్లు), మాజీ కరణం ఆచంట వెంకట సుందర సుబ్బరామయ్యను మర్యాదపూర్వకంగా కలిసి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ముద్రగడను కొందరు విలేకరులు కలిసి మళ్లీ రాజకీయ అరంగేట్రంపై ప్రశ్నించగా... రాజకీయాలు మాట్లాడేందుకు ఇది సమయం కాదని చెప్పారు.

ఇండియా కూటమిలోకి టీడీపీని ఆహ్వానించాం

సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

సాక్షి, న్యూఢిల్లీ: ఏపీలో జగన్‌ను ఎదుర్కొనేందుకు టీడీపీ, జనసేన, కాంగ్రెస్, లెఫ్ట్ పార్టీలు కలసి ఎన్నికల్లో పోటీ చేయాలనేది తమ ఉద్దేశమని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ తెలిపారు. పోల్ మేనేజ్‌మెంట్‌కు భయపడి టీడీపీ.. బీజేపీ పొత్తు కోసం తహతహలాడుతోందని విమర్శించారు. ఇండియా కూటమే తెలంగాణలో విజయం సాధించిందని గుర్తు చేశారు. వచ్చే ఎన్నికల్లో ఇండియా కూటమితో అనుకూలంగా ఉండేవారితోనే తమ పొత్తులు ఉంటాయన్నారు. ఈ మేరకు నారాయణ శనివారం ఢిల్లీలోని ఆంధ్రా భవన్‌లో మీడియాతో మాట్లాడారు. తెలుగు రాష్ట్రాలకు అన్యాయం చేసిన పార్టీ ఏదైనా ఉందా అంటే.. అది బీజేపీయేనని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీతో అనుబంధంగా ఉండే పార్టీలకు ప్రజలు ఓటు వేయరన్నారు. మోదీని వ్యతిరేకిస్తే తమకు ఎక్కడ ఇబ్బందులు వస్తాయో అనే భయంలో రాజకీయ పార్టీలు ఉన్నాయన్నారు. ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వకుండా బీజేపీ మోసం చేసిందని మండిపడ్డారు. పార్లమెంట్‌ని కాపాడలేని బీజేపీ దేశాన్ని ఎలా కాపాడుతుందని నిలదీశారు. పార్లమెంట్‌పై దాడి ఉద్దేశపూర్వకంగా జరిగిందనేది తన అనుమానమన్నారు. దీనిపై ప్రశ్నించిన ఎంపీలను సస్పెండ్ చేయడం దారుణమన్నారు. ఇండియా కూటమికి ఆదరణ పెరుగుతుంది కాబట్టే ఎన్నికల గిమ్మిక్‌లో భాగంగా పార్లమెంట్‌పై దాడి అనే గేమ్ ఆడారని ఆరోపించారు.

ఇంటర్‌లోనే ఇలా ఎందుకు?



పరీక్ష ఫలితాల్లో 70శాతం కూడా కష్టమే

ప్రభుత్వ కాలేజీల్లో మరీ దారుణం

సిలబస్ పూర్తి కాక...రివిజన్ జరగక...

ఇదే ప్రధాన కారణమని గుర్తించిన ఇంటర్ బోర్డు

సాక్షి, హైదరాబాద్: ఇంటర్ ఫలితాల్లో ఉత్తీర్ణత శాతం ఎందుకు తక్కువగా ఉంటుందనే విషయంపై విద్యాశాఖ ఉన్నతాధికారులు దృష్టి సారించారు. 2024లో జరిగబోయే పరీక్షల్లో దీనిని అధిగమించేందుకు చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. ఎక్కువగా ఏ సబ్జెక్టుల్లో ఫెయిల్ అవుతున్నారు? వారికి రివిజన్ చేయడం ఎలా? అనే అంశాలపై జిల్లాల వారీగా నివేదికలు కోరారు. రెసిడెన్షియల్, గురుకులాల్లో మంచి ఫలితాలు వస్తున్నా, ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ఆశించిన ఫలితాలు రావడం లేదు. కోవిడ్ తర్వాత 70 శాతం రిజల్ట్ కష్టంగా ఉందని గుర్తించారు. మెరుగైన ఫలితాలు సాధించే సిబ్బందిని ప్రోత్సహించాలని నిర్ణయించారు.

కారణాలేంటి?

2023లో ఇంటర్ ఫస్టియర్ ఎగ్జామ్స్ 4,33,082 మంది విద్యార్థులు రాయగా, వీరిలో 2,72,280 మంది ఉత్తీర్ణులయ్యారు. 63 శాతం రిజల్ట్ వచ్చింది. ద్వితీయ సంవత్సరంలో 4,19,267 మంది పరీక్ష రాస్తే, 2,65,584 (63 శాతం) పాసయ్యారు. కొన్ని జిల్లాల్లో ఇంటర్ సెకండియర్‌లో కనీసం 50 శాతం కూడా పాసవ్వలేదు. జగిత్యాల (23శాతం), సూర్యాపేట (30శాతం), సిద్దిపేట (34శాతం), నిర్మల్ (49శాతం) జిల్లాలు ఈ కోవలో ఉన్నాయి. పెద్దపల్లి, నల్లగొండ, వరంగల్, మహబూబ్‌బాద్, కరీంనగర్, వనపర్తి, జనగాం, జిల్లాల్లో 48 శాతం లోపే ఫలితాలొచ్చాయి. నారాయణపేట (100శాతం) మినహా మరే ఇతర జిల్లాలోనూ 75 శాతం ఫలితాలు కనిపించలేదు. 68 శాతం ఫలితాలు ప్రైవేటు కాలేజీల్లో ఉంటుంటే, ప్రభుత్వ కాలేజీల్లో 32 శాతం మించడం లేదు. ఈ పరిస్థితికి గల కారణాలపై ఇంటర్ అధికారులు దృష్టి పెట్టారు. సకాలంలో సిలబస్ పూర్తి కాకపోవడమే దీనికి ప్రధాన కారణంగా గుర్తించారు. రివిజన్ ఏమాత్రం జరగడం లేదని తెలుసుకున్నారు. జనవరి రెండోవారంలో సిలబస్ పూర్తి చేసి, మిగతా రోజుల్లో రివిజన్ చేపట్టాలని అధికారులు భావిస్తున్నారు.

సీఈసీ...హెచ్ఈసీలోనే ఎక్కువ

విద్యార్థులు ఎక్కువగా ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లోనే చేరుతున్నారు. సీఈసీ, హెచ్ఈసీ గ్రూపుల్లో తక్కువగా చేరినా, వారిలోనూ చాలామంది ఫెయిల్ అవుతున్నారు.


గత ఏడాది సీఈసీలో 98 వేల మంది విద్యార్థులు పరీక్ష రాస్తే అందులో 37 వేల మంది (37 శాతం) మాత్రమే 2023లో ఉత్తీర్ణులయ్యారు.

బైపీసీ గ్రూపులో లక్ష మంది పరీక్ష రాస్తే, 64 వేల మంది (64.14) పాసయ్యారు.

హెచ్ఈసీలో 11,294 మంది పరీక్ష రాస్తే, 3,408 మంది (30.18 శాతం) ఉత్తీర్ణులయ్యారు. ఫస్టియర్ రిజల్ట్స్ ఇలా ఉంటే.. సెకండియర్‌లో ఫలితాలు మరీ తగ్గుతున్నాయి.

ఎంపీసీలో గరిష్టంగా 72 శాతం, బైపీసీలో 67 శాతం ఫలితాలు ఉంటే, హెచ్ఈసీలో 46 శాతం సీఈసీలో 47 శాతం ఉంటోంది. హెచ్ఈసీ, సీఈసీ గ్రూపుల్లో ఫస్టియర్‌లో సరిగా బోధన జరగడం లేదని బోర్డు అధికారులు గుర్తించారు. ఈ రెండు గ్రూపులు ఎక్కువగా ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లోనే ఉంటున్నాయి. ఈసారి మెరుగైన ఫలితాల దిశగా క్షేత్రస్థాయిలో పక్కా ప్రణాళిక రూపొందిస్తున్నట్టు అధికారులు తెలిపారు.

2018 నుంచి ఇంటర్ ఫస్టియర్, సెకండియర్ ఫలితాలు ఇలా..



ఎక్కడంటే అక్కడ ఆపాలంటూ!

రాయచూర్ వెళ్లే నాన్‌స్టాప్ ఎక్స్‌ప్రెస్ బస్సు ఇమ్లీబన్‌లో బయలుదేరింది.. బస్సు కిక్కిరిసిపోయి ఉంది.. బహదూర్‌పుర రాగానే తాము దిగుతామని, బస్సు ఆపాలంటూ ముగ్గురు మహిళలు డ్రైవర్ వద్దకు వచ్చి నిలబడ్డారు. అలా మరికొంత దూరం వెళ్లాక, మరో ఇద్దరు మహిళలు బస్సు ఆపాలంటూ అడిగారు. వాస్తవానికి ఆ బస్సు ఎక్కడా ఆగకుండా రాయచూరుకు వెళ్లాల్సి ఉండగా, ఇలా మహిళల వాదనలు, డిమాండ్లతో పదిహేను చోట్ల ఆపాల్సి వచ్చింది.



- ఎక్స్‌ప్రెస్ బస్ డ్రైవర్లపై మహిళా ప్రయాణికుల ఒత్తిడి
- ఫలితంగా ఆ బస్సులను ఆర్డినరీ సర్వీస్ తరహాలో తిప్పాల్సిన దుస్థితి
- అలాగైతే దిగి పోతామంటూ ఇతర ప్రయాణికుల గొడవ
- ఎండీ దృష్టికి తీసుకెళ్లిన సిబ్బంది
- ఎక్స్‌ప్రెస్ బస్సులను ఎక్కడపడితే అక్కడ ఆపొద్దని ఆదేశం

సాక్షి, హైదరాబాద్: మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు ఎక్స్‌ప్రెస్, ఆర్డినరీ బస్సుల్లో ఉచిత ప్రయాణ వసతి అందుబాటులోకి వచ్చాక, ఆర్టీసీకి కొత్త చిక్కులు వచ్చి పడ్డాయి. ఉచితంగా ప్రయాణించే వెసులుబాటును కొందరు మహిళలు దుర్వినియోగం చేస్తున్నారన్న వాదనలు వెల్లువెత్తుతున్నాయి. తాము ఎక్కడ ఆపమంటే బస్సును అక్కడ ఆపాలంటూ ఒత్తిడి చేస్తున్నారు. ఆ బస్సులకు స్టాప్ లేని చోట్ల, సాధారణ పాయింట్ల వద్ద ఆపాలంటూ డ్రైవర్, కండక్టర్‌తో వాగ్వాదానికి దిగుతున్నారు. ఫలితంగా ఎక్స్‌ప్రెస్ బస్సులు ఆర్డినరీ బస్సుల్లాగా చాలా చోట్ల ఆగుతూ వెళ్లాల్సి వస్తోంది. ఈ పథకం ప్రారంభమైన కొత్తలో, ఓ మహిళ నుంచి టికెట్ రుసుము వసూలు చేశారంటూ ఆ మహిళ తాలూకు వ్యక్తి ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. సదరు మహిళ తరపున పురుష వ్యక్తి టికెట్ తీసుకోవటంతో, మహిళ కూడా ఉందన్న విషయం తెలియక కండక్టర్ జీరో టికెట్‌కు బదులు సాధారణ టికెట్ ఇచ్చాడు. ఫిర్యాదు నేపథ్యంలో ఆర్టీసీ ఉన్నతాధికారులు తీవ్రంగా స్పందించి ఆ కండక్టర్‌పై చర్యలకు ఉపక్రమించారు. దీంతో ఇప్పుడు కొందరు మహిళలు తాము కోరిన చోట బస్సు ఆపకుంటే ఫిర్యాదు చేస్తామని డ్రైవర్, కండక్టర్లను బెదిరిస్తున్నారు. దీంతో బస్సులను వారు ఆపుతున్నారు.

మరోవైపు ఇతర ప్రయాణికుల అభ్యంతరం

ఎక్కడపడితే అక్కడ బస్సులను ఆపేస్తుండటంతో ఇతర ప్రయాణికులు తీవ్ర అసహనానికి గురై కండక్టర్లు, డ్రైవర్లతో వాగ్వాదానికి దిగుతున్నారు. ఇలా రెండు వైపుల నుంచి ఒత్తిళ్లు వస్తుండటంతో భరించలేక సిబ్బంది శుక్రవారం ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌కు ఫిర్యాదు చేశారు. శుక్రవారం ఆయన నిర్వహించిన గూగుల్‌మీట్‌లో ఈమేరకు మొర పెట్టుకున్నారు. దీనికి సజ్జనార్ స్పందించారు.

ఎవరు ఒత్తిడి చేసినా ఆపొద్దు: సజ్జనార్

ఇకపై ఎక్స్‌ప్రెస్ బస్సులను నిర్ధారిత స్టాపుల్లో మాత్రమే ఆపాలని, తక్కువ దూరం వెళ్లాల్సిన మహిళా ప్రయాణికులు పల్లె వెలుగు, ఆర్డినరీ బస్సుల్లోనే వెళ్లాలని సజ్జనార్ సూచించారు. స్టాపు లేనిచోట ఎవరు ఒత్తిడి చేసినా ఆపొద్దని స్పష్టం చేశారు.

సమస్యల పరిష్కారంలో న్యాయవాదుల పాత్ర కీలకం

హైకోర్టు జస్టిస్ లక్ష్మీనారాయణ అలిశెట్టి



బంజారాహిల్స్ (హైదరాబాద్): ప్రజాస్వామ్యంలోని నాలుగు స్తంభాలలో న్యాయవ్యవస్థ ఒకటని, సమాజంలోని సమస్యలను పరిష్కరించడంలో న్యాయవాదుల పాత్ర కీలకమని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ లక్ష్మీనారాయణ అలిశెట్టి అన్నారు. శనివారం బంజారాహిల్స్‌లోని సుల్తాన్ ఉల్ ఉలూం న్యాయ కళాశాల ఆధ్వర్యంలో అంజద్ అలీఖాన్ మెమోరియల్ నేషనల్ మూట్ కోర్టు కాంపిటేషన్– 2023 ముగింపు వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథి, జస్టిస్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, న్యాయ విద్యార్థులకు చట్టానికి సంబంధించిన ప్రాథమిక అంశాలు, కేసులోని వాస్తవాలు రెండూ బాగా తెలిసి ఉండాలని చెప్పారు. గౌరవ అతిథి, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ, ప్రతిఒక్కరికీ న్యాయ పరిజ్ఞానం ముఖ్యమని, ఇది తనకు ఐపీఎస్‌గా దోహదపడిందని చెప్పారు. రెండు రోజులపాటు జరిగిన నేషనల్ మూట్ కోర్టు పోటీలలో దేశంలోని వివిధ రాష్ట్రాల నుండి 28 జట్లు పాల్గొన్నాయి.






ఇదేంటి.. యోగాసనాలు వేస్తున్న యువతుల మధ్య ఇలా కుక్క పిల్లలు సందడి చేస్తున్నాయేంటని అనుకుంటున్నారా? ఫ్రాన్స్ రాజధాని పారిస్‌లో నడుస్తున్న సరికొత్త ట్రెండ్ ఇది.. దీన్ని 'పప్పీ యోగా' అని పిలుస్తున్నారు. యోగాసనాలతో కలిగే శారీరక ఆరోగ్యానికి తోడు మానసిక ఉల్లాసాన్ని పెంపొందించేందుకు పారిస్‌లోని యోగా కేంద్రాలు ఇలా కుక్క పిల్లలను అద్దె కింద అందిస్తున్నాయి. ఈ కేంద్రాల్లో గంట యోగా సెషన్‌లో పాల్గొనాలను కొనే వారు 20 నిమిషాలపాటు ఆసనాలు వేశాక మరో 40 నిమిషాలు కుక్క పిల్లలతో సరదాగా ఆడుతూ సేదతీరొచ్చు. ఇందుకోసం వారానికి సుమారు రూ. 3,200 వసూలు చేస్తున్నాయి. తమ కేంద్రంలో గోల్డెన్ రిట్రీవర్ జాతి కుక్క పిల్లలతోపాటు పిల్లి కూనలను కూడా అద్దెపై అందిస్తున్నామని 'పప్పీ యోగా పారిస్' వ్యవస్థాపకురాలు ఎల్లా రూబిన్‌స్కీ తెలిపారు.

టుడేస్ గ్రాఫిక్

కూల్ డ్రింకులు ఎక్కువగా తాగేది ఇక్కడే...

(ఏడాదికి సగటున తాగే లీటర్లు)







వరుస సెలవులు.. కిక్కిరిసిన బస్సులు

వరుసగా మూడు రోజులు సెలవులు రావడంతో శనివారం సిద్దిపేట మోడ్రన్ బస్టాండ్ ప్రయాణికులతో కిక్కిరిసిపోయింది. బస్సుల్లో సీట్ల కోసం జనం ఎగబడ్డారు. పిల్లలను కిటికీలో నుంచి బస్సుల్లోకి పంపిస్తున్నారు. ఇక్కడి నుంచి వేల మంది ప్రయాణికులు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు తరలివెళ్లారని ఆర్టీసీ అధికారులు పేర్కొంటున్నారు.
–సాక్షి స్టాఫ్‌ఫొటోగ్రాఫర్, సిద్దిపేట

నృత్యం చేస్తున్న మధులత, మధుమిత తదితరులు



1955 టు 2021

ఘనంగా కోఠి మహిళా విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థినుల సమ్మేళనం

సుల్తాన్‌బజార్ (హైదరాబాద్): కోఠి మహిళా విశ్వవిద్యాలయంలో శనివారం రాత్రి పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా కళాశాల రోజుల్లో చేసిన అల్లరి పనులను పూర్వ విద్యార్థులు గుర్తు చేసుకున్నారు. ఎన్నో ఏళ్ల తర్వాత కలిసిన పాత దోస్తులను ఆలింగనం చేసుకుంటూ భావోద్వేగానికి లోనయ్యారు. 1955 నుంచి 2021 వరకు చదివిన పూర్వ విద్యార్థులు గ్లోబల్ అల్యుమినీ మీట్– 2023 పేరిట కలిశారు. ఈ కార్యక్రమానికి ఇదే కళాశాలలో చదువుకున్న సినీ నటి మధుమిత, విరించి ఆసుపత్రి చైర్‌పర్సన్ మధులత, డాక్టర్ శైలజ, మాజీ వైస్ ప్రిన్సిపాల్ సునీత, ప్రత్యేక అధికారి సరస్వతమ్మలతో పాటు పూర్వ విద్యార్థులు హాజరయ్యారు. ఎంతో హుషారుగా విద్యార్థులు ఒకరినొకరు కలుసుకుని తమ మధుర స్మృతులను గుర్తు చేసుకున్నారు. ఇందులో భాగంగా ట్రెడిషనల్ ఫ్యాషన్ షోను నిర్వహించారు. వయసు తేడాలు లేకుండా ఈ ఫ్యాషన్ షోలో అందరూ పాల్గొన్నారు. సినీ నటి మధుమిత, విరించి ఆసుపత్రి చైర్‌పర్సన్ మధులతలు సినీ గీతాలకు స్టెప్పులు వేయడం పూర్వ విద్యార్థుల్లో జోష్ నింపింది. కాలేజీ డేస్‌లో ఉన్న ఉత్సాహం, జోష్ మళ్లీ కాలేజీలో అడుగుపెట్టగానే వచ్చిందని మధుమిత ఆనందం వ్యక్తం చేశారు.

ఒక్క రోజులో 12 కరోనా కేసులు

- హైదరాబాద్‌లోనే 9 మందికి వ్యాప్తి.. జీనోమ్ సీక్వెన్స్ కోసం 40 నమూనాలు
- ఫ్లూ జ్వరాలతో ఎక్కువ కేసులు
- సీఎస్ఆర్ నిధులపై నివేదిక కోరిన మంత్రి



సమీక్షలో మంత్రి రాజనర్సింహ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో రోజురోజుకూ కరోనా కేసులు పెరుగుతున్నాయి. శనివారం 1,322 మందికి నిర్ధారణ పరీక్షలు చేయగా, అందులో 12 మందికి కరోనా పాజిటివ్ వచ్చినట్లు ప్రజారోగ్య సంచాలకులు డాక్టర్ రవీంద్ర నాయక్ వెల్లడించారు. ఈ మేరకు కరోనా బులెటిన్ విడుదల చేశారు. నమోదైన కేసుల్లో తొమ్మిది హైదరాబాదులోనే ఉండటం ఆందోళన కలిగిస్తోంది. సంగారెడ్డి, రంగారెడ్డి, వరంగల్ జిల్లాల్లో ఒక్కో కేసు చొప్పున నమోదయ్యాయి. ప్రస్తుతం 38 మంది ఐసోలేషన్ లేదా ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. కోవిడ్ మొదలైనప్పటి నుంచి ఇప్పటివరకు రాష్ట్రంలో నమోదైన మొత్తం కేసుల సంఖ్య 8.44 లక్షలకు చేరింది. అందులో 8.40 లక్షల మంది రికవరీ అయ్యారు. చలికాలం కావడం, ఫ్లూ జ్వరాలు కూడా ఉండటం తదితర కారణాలతో కరోనా కేసులు నమోదవుతున్నట్లు చెబుతున్నారు.

పర్యాటకులకు తప్పనిసరి ఐసోలేషన్

తాజాగా రాష్ట్రంలోకి వచ్చే పర్యాటకుల కోసం తప్పనిసరి ఐసోలేషన్‌ను ప్రారంభించాలని రాష్ట్రానికి చెందిన ప్రభుత్వ వైద్యుల ప్యానెల్ వైద్య ఆరోగ్య శాఖకు సూచించింది. పొరుగు రాష్ట్రాల్లో ముఖ్యంగా కేరళ, గోవా, మహారాష్ట్రలలో కోవిడ్ పరిస్థితిని రాష్ట్ర ప్రభుత్వం పర్యవేక్షించాలని కోరింది. జేఎన్.1 వేరియంట్ పై స్పష్టమైన అవగాహనకు రావాల్సి ఉందని పేర్కొంది. కేరళ లేదా ఇతర ప్రభావిత ప్రాంతాలకు వెళ్లి వచ్చేవారు ఎవరైనా వ్యాధి బారిన పడే అవకాశం ఉంది. పైగా చాలా మందిలో వైరస్ లక్షణాలు కనిపించడం లేదని డాక్టర్ల బృందం అభిప్రాయపడింది.

సమావేశంలో మంత్రి ఆదేశాలిలా..

- పని చేయని పీఎస్ఏ ప్లాంట్ల సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించాలి.
- ఆక్సిజన్ కాన్సంట్రేటర్లను సరిగ్గా వినియోగించాలి.
- అన్ని వెంటిలేటర్లను అందుబాటులోకి తీసుకురావాలి.
- వైద్య పరికరాలు, డ్రగ్స్, డయాగ్నస్టిక్స్ మొదలైన వాటి అవసరాలను ఆసుపత్రులు తెలియజేయాలి.
- మొత్తం 34 ప్రభుత్వ ఆర్టీపీసీఆర్ ల్యాబ్‌లు రోజుకు 16,500 నమూనాలను పరీక్షించగల సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయి.
- 34 ప్రభుత్వ ఆర్టీపీసీఆర్ ల్యాబ్‌లతో పాటు, రాష్ట్రంలో 84 ప్రైవేట్ ఆర్టీపీసీఆర్ ల్యాబ్‌లు ఉన్నాయి.
- ఆర్టీపీసీఆర్ కిట్‌లు మొదలైన వాటిని టీఎస్ఎంఎస్ఐడీసీ సేకరించి సరఫరా చేస్తుంది.
- గత 2 వారాల్లో మొత్తం 6,344 నమూనాలు సేకరించారు.
- నెలాఖరు నాటికి పరీక్షలను వేగవంతం చేయాలి. రోజుకు 4,000 పరీక్షలు నిర్వహించాలి.
- గాంధీ హాస్పిటల్‌లోనూ జీనోమ్ సీక్వెన్సింగ్ కోసం నమూనాలను పంపాలి.
- కోవిడ్ రోజువారీ నివేదికను ప్రతిరోజూ సాయంత్రం 4 గంటలలోపు సమర్పించాలి.
- కరోనాను ఎదుర్కొనేందుకు వివిధ సంస్థల నుంచి గత నాలుగేళ్లుగా అందిన సీఎస్ఆర్ విరాళాల జాబితాపై నివేదిక అందజేయాలి.

జీనోమ్ సీక్వెన్సింగ్ కోసం 40 నమూనాలు..: రాష్ట్రంలో కరోనా కేసులు ఏ వేరియంట్ అనేది తెలుసుకునేందుకు జీనోమ్ సీక్వెన్సింగ్ చేస్తున్నారు. గత వారం మొత్తం 40 నమూనాలను జీనోమ్ సీక్వెన్సింగ్ కోసం పంపించినట్టు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. ఆయన ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. జీనోమ్ సీక్వెన్సింగ్ కోసం 4–5 రోజుల సమయం పట్టే అవకాశం ఉందన్నారు.

సీఐఎస్ఎఫ్ సిబ్బంది విన్యాసాలు



దేశరక్షణలో సీఐఎస్ఎఫ్ కృషి కీలకం

- సీఐఎస్ఎఫ్ అడిషనల్ డైరెక్టర్ జనరల్ జగ్బీర్‌సింగ్
- ఎన్ఐఎస్ఏలో 317 మంది అసిస్టెంట్ కమాండెంట్లు,
- అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ల పాసింగ్ అవుట్ పరేడ్
- ఆకట్టుకున్న విన్యాసాలు



ప్రసంగిస్తున్న జగ్బీర్‌సింగ్

జవహర్ నగర్: విద్రోహశక్తుల నుంచి దేశాన్ని కాపాడుకునే క్రమంలో సీఐఎస్ఎఫ్ చేస్తున్న కృషి కీలకమని సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్ఎఫ్) అడిషనల్ డైరెక్టర్ జనరల్ (ఏడీజీ) జగ్బీర్‌సింగ్ పేర్కొన్నారు. శనివారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా హకీంపేట పరిధిలోని సీఐఎస్ఎఫ్‌కు చెందిన నేషనల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ అకాడమీ (ఎన్ఐఎస్ఏ)లో 16వ బ్యాచ్‌కు చెందిన 19 మంది అసిస్టెంట్ కమాండెంట్లు, 1వ బ్యాచ్‌కు చెందిన 298 మంది అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ల పాసింగ్ అవుట్ పరేడ్ (దీక్షాంత్ పరేడ్) జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన జగ్బీర్‌సింగ్ మాట్లాడుతూ ఉగ్రవాదం, చొరబాటు వాదం వంటి సవాళ్లకు ఎదురొడ్డి శత్రువులపై పైచేయి సాధించడం కోసం సీఐఎస్ఎఫ్ అధికారులు తమను తాము సన్నద్ధం చేసుకోవాలని పిలుపునిచ్చారు. 3 బెటాలియన్‌లతో ప్రారంభమైన సీఐఎస్ఎఫ్ ప్రస్తుతం దేశరక్షణ కోసం బలంగా తయారైందన్నారు. అనంతరం ఇండోర్, అవుట్‌డోర్, తుపాకీ కాల్పులతో పాటు ఆల్ రౌండ్ బెస్ట్ విభాగాల్లో అగ్రగామిగా నిలిచిన ట్రైనీలకు బహుమతులను జగ్బీర్‌సింగ్ అందజేశారు. పాసింగ్ అవుట్ పరేడ్ చేస్తున్న అసిస్టెంట్ కమాండెంట్లు, అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ల నివేదికను ఎన్ఐఎస్ఏ డైరెక్టర్ కె.సునీల్ ఇమ్మాన్యూయేల్ సమర్పించారు.

ఆకట్టుకున్న జవాన్ల విన్యాసాలు..: ఎన్ఐఎస్ఏ దీక్షాంత్ పరేడ్‌లో జవాన్ల విన్యాసాలు చూపరులను ఆకట్టుకున్నాయి. వివిధ విన్యాసాలు చేస్తూ గాలిలో కాల్పులు జరపడం, ఆయుధాలను గాలిలోకి ఎగురవేసి తిరిగి అందుకునే విన్యాసాలు అబ్బురపరిచాయి.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.